
6H138

నడుం నొప్పి నుండి విముక్తి పొందండి. నిబ్బరంగా ముందుకు సాగండి.



స్త్రీ జీవితం అంటేనే సంతోషం, దాంతోటే బాధ కూడా... ఈ బాధల ఒకటైతేనా. ప్రత్యేకించి వెన్నునొప్పి, పట్టుకుంటే వదలకుండా, పీడిస్తూ, విసుగెత్తిస్తూ ఉంటుంది. అది పురుడు పోసుకున్న తర్వాతేగానీ, లేదా ప్రతిరోజూ ఇంటి పనుల ఒత్తిడీ, శ్రమానేగానీ ధైర్యంగా ఉండండి. మీ అందుబాటులోనే నిజమైన ఉపశమనం ఉంది. ''మూవ్'' – దీనిలోని ప్రకృతి సహజమైన ఆవిరిగా మారే నూనెలూ, దాంతోబాటే మాన్పే గుణంగల కషాయాలూను, రాయగానే లోపలికి చొచ్చుకుపోయి, త్వరగా పనిచేసి, నిలిచి ఉండే ఉపశమనమూను దాంతో మీకిక. అవును, ఇది నిజంగా పనిచేస్తుంది. మీకోసం ఒక ట్యూబ్‌ని తెచ్చికోండి. వెన్నునొప్పి మర్చిపోండిక. నిబ్బరంగా ముందుకు సాగండి.



మూవ్

కీళ్ళ నొప్పుల నుంచి ఉపశమనం

సరియైన ఉపశమనం ఇచ్చే వాగ్దానం

PARAS PHARMACEUTICALS PVT. LTD.
Jitendra Chambers, Ashram Road, AHMEDABAD 380 014

వీక్లీ పోస్ట్

సహస్రచంద్ర దర్శనోత్సవం

ఆంధ్ర సచిత్ర వారపత్రిక సహస్ర పున్నమి చంద్ర దర్శనోత్సవం జరుపుకొనే వయసు (83) వస్తూంది. ఆ సందర్భంగా, ఆ శుభ సమయంలో అభిమానులకు సాహితీ విందు చేయగల ప్రత్యేక సంచిక వేస్తే సమయోచితంగా వుంటుందని మేము భావిస్తున్నాం. పత్రిక క్రమం తప్పకుండా యిప్పుడు వెలువడుతున్నందుకు థాంక్స్.

-శ్రీమతి అండ్ శ్రీ పొన్నాడ కుమార్,
బరంపురం (ఒరిస్సా)

(పై సంచికే జన్మ దిన ప్రత్యేక సంచిక -ఎడిటర్)

ఇష్టం

పత్రిక అంటే మా కుటుంబ సభ్యులందరికి చాల ఇష్టం. ఎప్పుడు పత్రిక వస్తుందా అని ఎదురు చూస్తుంటాము. మీ పత్రికలో ఇప్పుడు ప్రచురిస్తున్న సీరియల్స్ అంటే చాలా ఇష్టం. ముఖ్యంగా నన్ను ఆకర్షించినది లవ్‌గేమ్ చాల బాగుంటుంది.

-కొచ్చుర్ల శ్రీదేవి
కాకినాడ ○



పదండి తోపనికి

ముఖచిత్రం:

సిరిమువ్వల సింహనాదం ఆలకిస్తున్న
మాధవీమాల

ఈ వారం ప్రత్యేకం :-

ఈ అగస్టు 15 ఏమంటున్నది! (సంపాదకీయం)-6, స్వాతంత్ర్య సమర కవితలో 'రాట్నం'-15, విఘ్ననాయకుని పూజాఫలం-36, సుందర రెడ్డికి డి లిట్-55, పాక్‌లో మళ్ళీ చీకటి రోజులు (తాజాకాలమ్)-59, శ్రీ సరస్వతి నిత్య పూజావిధానం-60.

కథలు :–

క్విట్ ఇండియా-18, నిమజ్జనమ్-30, ఆడమనసు-50.

సీరియల్ నవలలు :–

మన్నెం శారద- సూపర్‌హీరో-8, అడివి సూర్యకుమారి- సాగరమథనం-24, చల్లా సుబ్రహ్మణ్యం- లవ్‌గేమ్-42, ఎం. హరా- కెరటాలు కేరింతలు-56, అమరేశ్వరరావు- హిట్‌లిస్ట్-63.

వ్యాసాలు శీర్షికలు :–

వీక్లీపోస్ట్-4, యువతా కవితా-17, ప్రశ్నావళి-28, ఈవారంలో మీ యోగం-35, హలో డాక్టర్ నేనేం చెయ్యాలి?-41, పాఠకులే సెక్సు కథలు కావాలంటున్నారా?-49, న్యాయచట్టం ప్రశ్నలు- జవాబులు-54, సినిమా సినిమా-71, అవీ-ఇవీ-అన్నీ-74.

పైవారం:
"డి. డి. లవల" (పూర్తి నవల)

ఒరులేయవి యొనరించిన నరవర యప్రియము తనమనంబునకగు దా నొరులకునవి సేయకునికి పరాయణము పరమధర్మపథములకెల్లన్

THE ANDHRA PATRIKA GROUP OF MAGAZINES

ఆంధ్ర సచిత్ర వారపత్రిక

వ్యవస్థాపకులు:
దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావుపంతులు

సంపుటము 82 సంచిక 52

17-8-1990

విడిప్రతి వెల నాలుగు రూపాయలు

శక సం. 1912 శ్రావణ మాసం 26వ తేదీ

PRINTER, PUBLISHER & SANCHALAKUDU:
CHAKRAPANI

EDITORS:
VEERAJI
M. MADHAVA RAO

ASSOCIATE EDITORS:
POTLURI VENKATA RAO
Dr. GUMMANURU RAMESH BABU

SUB-EDITORS:
P. PRAMEELA
K. S. B. TILAK
BHISETTY LAXMANA RAO

ARTISTS:
KASI
CHALAM

PRODUCTION & ADMINISTRATIVE MANAGER:
M. THYAGARAJ

CIRCULATION MANAGER:
S. APPADORAI

ADVERTISEMENT MANAGER:
A. NANDAKUMAR

Printed and Published for
Nageswara Rao Estates Ltd., by
VAMARAJU CHAKRAPANI at the
Andhra Patrika Press, Gandhinagar,
Vijayawada-520 003,
Editor: VEERAJI
Phones: Business: 61247, 61248,
Editorial: 75667.

ఈ ఆగస్టు-15 ఏమంటున్నది?

1947 ఆగస్టు 14 అర్ధరాత్రి భారత దేశంలో నలు దిశలా సూర్యోదయమైంది "భళ్లున" తెల్లవారింది. త్రివర్ణ పతాకం రెపరెపలు భారతీయుల హృదయాలను డోలానందంలో ముంచెత్తిన ఆ శుభఘడియల మధుర స్మృతులతో- నలభై నాలుగోసారి మనం యీ ఆగస్టు పదిహేనునాడు జెండా పండుగ చేసుకుంటున్నాము. పోయినేడాదికీ యీ ఏడాదికి దేశ రాజకీయ రంగంలో వచ్చిన చిత్రవిచిత్ర రంగురంగుల మార్పులు- సగటు భారతీయునికి ప్రత్యేకంగా ఒనగూర్చిన మేలు యేమీ లేకపోయినా మనం ఒక పరి సింహావలోకనం చేసుకోవలసిన రోజు యిది. గత ఆగస్టులో పార్లమెంటు చరిత్రలో అపూర్వ సంఘటన ఒకటి జరిగింది. ప్రతిపక్ష సభ్యులంతా (106 మంది) మూకుమ్మడిగా రాజీనామా సమర్పించారు. మొండివాడు రాజు కన్న బలవంతుడు- మొండి వాడే రాజైతే చెప్పేందుకేమున్నది? అని కూడా మే మా నాటి సంపాదకీయంలో వ్యాఖ్యానించాము. ప్రతిపక్షాలు వి.పి.సింగ్ నాయకత్వంలో బోఫోర్స్ "గన్"ని దట్టించి ప్రేల్చ లేకపోయినా, అటు తరువాత వచ్చిన సార్వత్రిక ఎన్నికలలో- రణ భేరిగా వాడుకొని- అనితర సాధ్యమైన మెజారిటీలో వున్న రాజీవ్ గాంధీని ఉత్తర భారతంలో ఓడించగలిగారు. మూతి మీదకు నూనూగు మీసాలు వస్తున్న తరుణవయస్కులు- సిగ్గు దొంతర్ల అందాల యువతులు- 18 సం.లు నిండిన వారంతా- ఎన్నికల కేంద్రాలలో బారులు తీరి నిలబడి- ఢిల్లీ కోటమీద కాంగ్రెస్ "కబ్జా"కి అంతిమ గీతిక లాలాపించారు- నేషనల్ ఫ్రంట్ అవతరించింది- భారతదేశంలో కుడిఎడమలుగా వుండి పరస్పరం ద్వేషించుకుంటున్న రెండు- అందులో ఒకటి మతవాద పార్టీగా ముద్రగలది- పార్టీలు వి.పి.సింగ్‌కు పట్టంగట్టడానికి ముందుకు వచ్చినవి. ఇది అపూర్వ సంఘటనవినా "ఫ్రంట్" పార్టీలకు ఉప ప్రధానమంత్రి పదవిని సృష్టించక తప్పలేదు. దేవీలాల్‌గారు "కింగ్‌మేకర్"గా చెలామణీ అయ్యారు కూడా. కాని యీ ఆగస్టు 15నాడు ఎర్రకోట మీద వి.పి.సింగ్ జాతీయ పతాకావిష్కరణ చేస్తున్నప్పుడు శ్రీ దేవీలాల్ ఆయన సరసన- ఆయన మంత్రివర్గ సహచరుల వరుసన కూడా వుండటం లేదు. ఈ పరిణామాలన్నీ కూడా దేశ ప్రజలపాలిట- కేవలం తలకాయ నొప్పులు గానే ఘనీభవిస్తూ వచ్చాయి- పదవులు కాపాడుకోడం కోసమే "ఫ్రంట్" గవర్నమెంటులో పదవులను అలంకరించిన ప్రముఖులంతా రాజకీయ చదరంగం ఆట మొదలుపెట్టారు. ధరలను తగ్గు ముఖం పట్టిస్తామని తన మొట్టమొదటి పత్రికా సమావేశంలోనే హామీ యిచ్చిన శ్రీ వి.పి. సింగ్- దేశ సమస్యల మీద ఏకాగ్రతనే ప్రదర్శించలేని విషవలయంలో చిక్కుకున్నారు. కాశ్మీర్‌లో పోయిన ఏడాది స్వాతంత్ర్య దినోత్సవాన్ని "చీకటి రోజుగా" చేసిన ఆకతాయి మూకలు మరింతగా విజృంభించి- యీ ఏడాదినాటికి అక్కడి పరిస్థితి మరింత దిగజారిపోయింది. పంజాబ్‌లో గవర్నర్‌లు మారారుకానీ హింస, రక్తపాతం- ఆగనేలేదు. కాశ్మీర్‌లో రాష్ట్రపతిపాలన, పంజాబ్‌లో రాష్ట్రపతిపాలన ప్రస్తుతం కొనసాగుతూ వున్న ఎర్రకోట మీద నుంచి యీ రెండు రాష్ట్రాల అల్లకల్లోలం గురించి శ్రీ వి.పి. సింగ్ తమ ప్రభుత్వం చేసినట్లుగా- అంతకు మించి చెప్పుకోడానికి ఏమీ మిగల్లేదు. కాశ్మీర్‌లోని దుండగులకు "క్షమాభిక్ష" యివ్వగలమని ఆయుధాలు అప్పగించి లొంగిపోయినట్లయితే- జీవన సదుపాయం యిస్తామని కేంద్రం చేసిన ప్రతిపాదన ఫలితాలు- మేము యీ వ్యాఖ్యలు రాస్తున్నప్పటికి వూహాకి అందని రీతిలోనే వున్నాయి- పాకిస్తాన్‌తో చర్చలలో- తాము కూడా ఒక పక్షంగా పాల్గొనే అవకాశం కల్పించాలంటూ టెర్రరిస్టు దళాలు బుకాయించే స్థితికి కాశ్మీర్ వచ్చింది. ఈ "విప్లవ కుంపట్లకు" తోడుగా దక్షిణాదిన మద్రాసు రాష్ట్రంలోకి శ్రీలంక నుంచి ప్రవాహంగా శరణార్థులు చేరిపోతున్నారు! ఇటువంటి విపత్కర స్థితిలో కూడా భారత ప్రజానీకం ప్రాంతీయ దృక్పథాలను మరిచి దేశంలో ప్రజాస్వామ్య విధాన సుస్థిరతను కాపాడటం కోసం- రాజకీయ పార్టీలు పెడుతున్న యిబ్బందులను గంగిగోవుల్లాగ సహిస్తున్నారు- దేశం ఛిన్నాభిన్నం కాకుండా ప్రజాస్వామ్యయుత విధానాలకు దోహదిస్తున్న సామాన్య ప్రజానీకం నుంచి ప్రత్యక్ష పరోక్ష పన్నుల ద్వారా కొల్లగొట్టుకుంటున్న ధనాన్ని ఎన్నికలలో యిటీవలే ఖర్చు పెట్టింది కేంద్ర ప్రభుత్వం. తిరిగి మధ్యంతర ఎన్నికల కోసం నిధులు కేటాయించి రంగంలోకి దిగాలని కొన్నిపార్టీలు- పదవీ వ్యామోహంతో ఉవ్విళ్ళూరుతున్నప్పటికీ- ప్రజల ధన ప్రాణహానికి ప్రగతికి గొడ్డలిపెట్టుగా వుంటున్న ఎన్నికలను ఏడాది తిరగకుండా భరించటానికి దేశంలో చాలా మంది సిద్ధంగా లేరు. ప్రస్తుతం దేశాన్ని యెదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి- మధ్యంతర ఎన్నికలు సమాధానం- పరిష్కారం రెండూ యివ్వలేవు- ఏ పార్టీ అయినా సరే యీ సమస్యల మీద తమ తమ ప్రణాళికలు, తరుణోపాయాలు లిఖిత పూర్వకంగా ప్రజల ముందువుంచి అటు తరువాత మధ్యంతర ఎన్నికల గురించి మాట్లాడటం మంచిది- అంతేగాని తమ తమ పార్టీలలో కలతలు-అసమ్మతి వర్గాలు-స్వార్థ సంకుచిత శక్తులు పెచ్చరిల్లంగానే ప్రజలను తీర్పు చెప్పమంటూ "ఎన్నికలంటూ" మాట్లాడటం- బాధ్యతాయుతమైన పనికాదు. దేవీలాల్ సమస్య-గాని మరో అసమ్మతి వర్గ పేచీ గాని- లేదా పదవీ వ్యామోహ పీడితుల "యిక్కట్లు"గాని ప్రజల సమస్యలు కావు- ఆయా పార్టీలు వాటిని ప్రజల నెత్తిన రుద్దడం- 43 సంవత్సరాల స్వతంత్ర దేశ ప్రజలు గమనించలేరనుకోడం అవివేకమే అవుతుంది.

ధరలను అదుపుచేయలేని గవర్నమెంటు- వాగ్దానాల ప్రవాహానికి అడ్డుకట్ట కట్టలేని రాజకీయ పార్టీలు మునుపటివలే యీ దేశంలో ప్రజలను మభ్యపెట్టి బ్రతకలేవుగాక బ్రతకలేవు! కనుక "ఎడం చేయి తియ్యి పుర్రచేయి పెడతా" బాపతు ప్రణాళికలతో గాకుండా నిర్దుష్టమైన చిత్తశుద్ధిగల ప్రణాళికలతో ప్రజల ముందుకు- రమ్మని యీ స్వతంత్ర భారతదేశం యీ ఆగస్టు 15నాడు రాజకీయ పార్టీల నన్నింటినీ సవాలుచేస్తున్నది. అందరికీ జేజేలు! "జెండా ఊంఛా రహే హమారా!"- అంటూ మేము కూడా ప్రజలతో గొంతు కలుపుతున్నాము.

8/8/90.



సీరియల్

సూపర్ హీరో



మన్నెం శారద

"ఎంతమంది దోషులు తప్పించుకు తిరిగినా ప్రమాదం లేదు కాని ఏ ఒక్క నిరపరాధి శిక్షకు గురికాకూడదన్నది మన ప్రజాస్వామ్య ఆదర్శం.

అనుమానితునిపై నేరాన్ని నిరూపించాల్సిన బాధ్యత ప్రాసిక్యూషన్ వారికున్నట్లే తా నా నేరం చేయలేదని రుజువు చేసుకొనే అవకాశం నిందితుడికుంది. అంతేకాదు రాజ్యాంగంలోని 21వ అధికరణం ఏ వ్యక్తి ప్రాణాన్నయినా వ్యక్తిగత స్వేచ్ఛనైనా హరించడానికి వీల్లేదని చెబుతోంది. విజయేంద్ర అరెస్టయిన దగ్గర్నుండి ఈ కేసుని నేను ఆసక్తిగా గమనిస్తున్నాను. ఈ కేసులో నిజం లేదన్న విషయం మొదట అతను వుత్త తెల్లకాగితాలపై సంతకాలు పెట్టడంలోనే తెలుస్తోంది. అతను విద్యాధికుడు. ఇంగ్లీషు, హిందీ, తెలుగు తెలిసినవాడు. స్టేట్మెంటు పూర్తిగా అతనెందుకు రాయలేకపోయేడు. పోతే చాదర్‌ఘాట్ చంచల ఒక ప్రొఫెషనల్ ప్రాస్టిట్యూట్. అనేక పోలీసు రెయిడింగుల్లో ఆమె అరెస్టు కాబడి పెనాల్టీ కట్టుకొని బయటపడింది. ఆమెను పనికట్టుకొని విజయేంద్ర కారులో తీసుకెళ్ళి మత్తుమందు ఇచ్చి బ్లూ ఫిల్మ్ తీయాల్సిన

(గత సంచిక తరువాయి)

అగత్యం లేదు. ఇక కోకిల. వేషాలకోసం ఇంట్లోంచి పారిపోయివచ్చి ఈ నగరంలో అనేక అవతారాలెత్తి చూడటానికే భయంకరంగా వుండే ఆమెని విజయేంద్ర ఒక పథకం ప్రకారం పట్టుకెళ్లి వివస్త్రని చేసి ఫోటోలు తీసేడన్నది నమ్మరాని విషయం. ఈ కేసు నిలవదు. దీన్ని నేను సవాల్‌గా తీసికొని అతన్ని విడుదల చేయించగలనని హామీ ఇస్తున్నాను" అన్నాడు జగన్నాథ నాయకర్ శ్యామసుందర్ వైపు చూస్తూ.

శ్యామసుందర్ మొహం సంతోషంతో విప్పారింది.

"అయితే ఇంత హడావుడి చేస్తున్నారు. నిజంగా ఈ కేసు నిలవదంటారా?" అన్నాడు.

జగన్నాథ నాయకర్ కళ్ళద్దాలు తీసి పక్కన బెట్టి కుర్చీ వెనక్కి జారబడి నవ్వుతూ "నిలబడదు కనుకే ఇంత హడావుడి చేస్తున్నారు. అతను పబ్లిక్ ఫిగర్. తాము ఆరాధించే హీరో అతను వేసిన సినిమాల్లోలానే సకల గుణాభిరాముడై వుండాలని ఆశిస్తారు ప్రేక్షకులు. అతని నిజజీవితంలో మచ్చలున్నాయని అతనొక దగుల్బాజీ అని తెలిస్తే అతన్ని ఏవగించుకొని అతని సినిమాలు తిప్పికొడ్తారు. ఆ విధంగా అతని భవిష్యత్తుని నాశనం చేయడమే ఈ కేసు లక్ష్యం. ఉదాహరణకి మా ఇంటి పక్కన ఓ అమ్మాయి ఒకతన్ని ప్రేమించింది. వారిద్దరూ "చెట్టాపట్టాలేసుకొని స్కూటర్‌మీద తిరగడం అందరూ చూసిన సంగతే. తీరా పెళ్ళివరకూ వచ్చేసరికి అతను వివాహితుడని తెలిసింది. ఆమె "నల్లుల మందు తాగి చనిపోయింది. తండ్రి ఎంత మొత్తుకొని ఏడ్చినా ఆ కేసు నిలవలేదు. ప్రేమించడానికి పెళ్ళయినవాడే దొరికేడా అని అందరూ అతగాడిపట్లే సింపతీ చూపించేరు. నిజానికి అతను ఛీట్. కాని హాయిగా నిరపరాధిగా సంఘంలో దర్జాగా తిరుగుతున్నాడు. ఇలాంటి ఎంతోమంది దౌర్భాగ్యులు పెద్ద మనుషుల్లా చెలామణి అవుతుంటే ఇతని మీద కేసేమిటి? డబ్బుకోసం లాయర్ లయ్యర్ కానంతకాలం నిర్దోషులు శిక్షింపబడరు. మీరెళ్ళిరండి. అతనికి ధైర్యం చెప్పండి" అన్నాడు.

శ్యామసుందర్ లేచి నిలబడి బయల్దేరబోతుండగా ఫోను రింగయింది.

నాయకర్ రిసీవర్ ఎత్తి "హలో జగన్నాథ నాయకర్ స్పీకింగ్" అన్నాడు.

అవతలి విషయం వినగానే అతని భ్రుకుటి ముడివడింది.

"ఎందుకని?" అన్నాడు సీరియస్‌గా.

"నెవ్వెర్ నెవ్వెర్ ఈ నాయకర్ డబ్బుకోసం గడ్డితినే మనిషికాదు. విజయేంద్ర కేసు నేను టేకప్‌చేసి తీరుతున్నాను" అంటూ రిసీవర్ పెట్టి శ్యామసుందర్‌వైపు చూసి చిరునవ్వు నవ్వేడు.

"రాయుడా సర్!" అనడిగేడు శ్యామసుందర్.

ఇంతవరకూ సాగిన కథ-22: ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు నిఖిలేశ్వరి తన కొడుకు విజయేంద్రకు చిత్రసీమలో వస్తున్న పేరు ప్రఖ్యాతులు చూసి ఆనందిస్తుంటుంది. వ్యభిచార నేరం క్రింద అరెస్టయిన దమయంతి అవమానభారంతో ఆత్మహత్య చేసుకుంటుంది. బ్లూఫిల్ములు తీస్తున్నాడన్న నేరంపై అరెస్టయిన కొడుకు దుస్థితిని చూసి నిఖిలేశ్వరి మనసు కలత చెందుతుంది. దమయంతి హత్య జరిగిన తీరును అనకాపల్లి వ్యాపారస్థుడి ద్వారా శ్యామసుందర్ రాబడతాడు. పీయూష గృహ నిర్బంధంలో వున్నట్లు రజనికి, నిఖిలేశ్వరికి తెలుస్తుంది. జైలులో తనతో వున్న పిల్లై ఇన్‌స్పెక్టర్ జేమ్స్ తన కుటుంబానికి చేసిన అన్యాయాన్ని విజయేంద్రకు వివరిస్తాడు.

"రాముడో, గాంధీయో కాదు. ఒక షహా నటుడు. విజయేంద్రని బయటికి రాకుండా చేస్తే పది లక్షలు ఇస్తాడట."

శ్యామసుందర్ భయంగా నాయకర్ వైపు చూశాడు.

నాయకర్ అతని భయాన్ని అర్థం చేసుకొన్నట్లుగా నవ్వి "మీరేం వర్రీ అవ్వనవసరం లేదు. నేను నాయకర్‌ని. నన్నెవ్వరూ కొనలేరు. మైండిట్!" అన్నాడు.

శ్యామసుందర్ తేలిగ్గా గాలి పీల్చుకొని బయటికి వచ్చేడు.

****

వెంకటస్వామి తను పట్టుకెళ్ళిన న్యూస్‌పేపర్లు పీయూష ఎదురుగా పెట్టి నిలబడ్డాడు.

పీయూష అతనికేసి చూసి చిరునవ్వు నవ్వడానికి ప్రయత్నించింది. అయినా కళ్ళలో నీళ్ళు తొంగి చూశాయి.

"స్వామీ!" అంది ఆర్తిగా.

స్వామి పీయూష వైపు వాత్సల్యం నిండిన చూపులతో చూసేడు.

"నాన్నగారు నిన్ను వదిలేసారా!" అంది ఆశ్చర్యంగా.

వెంకటస్వామి అవునన్నట్లుగా తల వూపేడు.

"నేను చాలా భయపడ్డాను స్వామీ! నిన్నేం చేస్తారోనని!" అంది పీయూష కన్నీళ్ళతో.

"నాన్నగారు నువ్వనుకొన్నంత కఠినులు కారమ్మా. విధి నిర్వహణలో ఆయన జాలి చూపించని మాట వాస్తవం. కాని నేను ఆయన దగ్గర చాలా సంవత్సరాలుగా పనిచేసేను. నన్ను తన సబార్డినేట్‌గా ఎన్నడూ చూడలేదు. పెదవులకి తేనె పూసుకొని కత్తుల్లా ప్రవర్తించే చాలమంది కన్నా ఆయన హృదయం చాల మిన్న!" అన్నాడు వెంకటస్వామి డగ్గుత్తికమైన కంఠ స్వరంతో.

పీయూష హేళనగా నవ్వి "నువ్వు చాల నమ్మినబంటువి కదా! మళ్ళీ



"ఏ విషయం మోసుకొచ్చేవు విన్నవించ డానికి?" అంది వెటకారంగా.

వెంకటస్వామి ఓ నిముషం తటపటాయించినట్లు నిలబడ్డాడు.

సుందరమ్మ లోపల్నుండి వచ్చి "ఎలా వున్నావు వెంకటస్వామీ!" అనడిగింది.

స్వామి ఆమెకు నమస్కరించి "బాగానే వున్నాను తల్లీ! అయ్యగారు ఈ పేపర్లు ఇచ్చిరమ్మంటే వచ్చేను" అన్నాడు.

అప్పుడు పడింది పీయూష దృష్టి ఆ పేపర్లమీద.

ఆమె వెంకటస్వామి వైపు అదోలా చూసి నవ్వి "దయా హృదయులు తండ్రిగారు మళ్ళీ ఏదో శుభవార్త పంపినట్లున్నారు కదూ, వెంకటస్వామీ!" అంటూ వాటిని అందుకొంది.

ఆమె పేపర్లు తిప్పుతుంటే, వెంకటస్వామి, సుందరమ్మలు ఆందోళనగా చూశారు.

అయితే ఈసారి పీయూష మాత్రం ఇదివరకులా విజయేంద్ర ఫోటోలు చూసి డీలా పడిపోలేదు.

టేబుల్ డ్రాలోని రెడ్ ఇంక్ స్కెచ్ పెన్ తీసుకొని ఆ ఫోటోల క్రిందనే "మీకు కాబోయే అల్లుడు బాగున్నాడు. మీ సెలక్షన్‌కి నా కృతజ్ఞతలు" అని రాసి "స్వామీ తిరిగి వీటన్నిటినీ మీ అయ్యగారికి జాగ్రత్తగా ఇవ్వు! నా వంట్లో ఎక్కువ ఆయన రక్తమే ప్రవహిస్తోందని చెప్పు!" అంది ఎర్రబడిన కళ్ళతో.

"పీయూషా! ఏమిటా తొందరపాటు?" అంది సుందరమ్మ హెచ్చరిస్తున్నట్లుగా.

పీయూష తల్లివైపు నిరసనగా చూసి

సూపర్ హీరో

"ఇంతవరకూ వచ్చేక దీన్ని తొందరంటున్నావా, నీ కన్నకొడుకునే అధికార మదంతో ఎవరైన ఇలా మానసికంగా రాచిరంపాన పెడితే నువ్వు సహించగలవా! ఈ ఫోటోలు చూడు, ఎవరమ్మ కన్నకొడుకోలే అని నిరసనగా చూడకు. సంస్కారం, చదువు రెంటిని పుణికిపుచ్చుకొన్న ఒక ఆదర్శ స్త్రీమూర్తి ఏకైక తనయుడిగా పుట్టి అరడజను భాషలు అనర్గళంగా మాట్లాడగల్గి, క్రమశిక్షణగా పెరిగి ప్రతిభ, అందంతో సినీ పరిశ్రమలో పైకొచ్చిన ఇతన్ని కేవలం నీ కూతుర్ని ప్రేమించిన నేరానికి, లేని నేరాలు మోపి అభాసుపాలు చేయడం ధర్మంగా వుందా! ఇంతటి అందగాడికి సినిమాకి పదిహేను లక్షలు తీసుకొంటున్న ఇతనికి డబ్బుకి కక్కుర్తి పడి బ్లూ ఫిల్మ్సులో నటించే ఖర్మ ఎందుకు పడుతుందో ఆలోచించు! చూడగానే రంభ కూడ మోహించగల ఈ అందగాడికి, సినిమా వేషాలకోసం వచ్చి అవి రాక టచప్ గర్ల్‌గా బ్రతికే గారపళ్ళ సుందరిని రేప్ చేయాల్సిన దురదృష్టం ఏమిటి? ఇదంతా నీ భర్తగారి ఘనత! చట్టాన్ని చేతుల్లోకి తీసుకొని బ్రేకుల్లేని బండిలా పరిగెత్తు తున్నాడాయన! తాళి కట్టించుకొని అర్ధాంగినని మురిసిపోవడం కాదు. భర్త తప్పుదారిన నడుస్తున్నప్పుడు కాదని వారించడం భార్య బాధ్యత!"

కూతురి సుదీర్ఘ ఉపన్యాసం విని తెల్లబోయి చూసింది సుందరమ్మ. చివరి రెండు మాటలు ఆమె గుండెలో గుచ్చుకున్నాయి.



స్వామికూడ పీయూష వైపు ఆశ్చర్యంగా చూశాడు.

పీయూష మాత్రం వారి హావభావ చేష్టల్ని గమనించలేదు. "వెళ్ళు వెంకటస్వామీ! ఈ పేపర్లన్నీ తిరిగి ఆయన కివ్వు. మీ కమీషనర్‌గారు ఇలాంటి బెదరింపులతో నా మనసు మార్చలేరని చెప్పు. ఆయన నా మనసుని మాత్రం ఏ రకంగానూ బంధించలేరు" అంది కఠినంగా.

వెంకటస్వామి పేపర్లన్నీ తీసుకొని మౌనంగా బయటికి నడిచేడు.

****

విజయేంద్ర ఫోంచేస్తుండగా జరిగిందా సంఘటన!

పిల్లై అకస్మాత్తుగా విజయేంద్రమీదకి లంఘించి మొహంమీద గుద్దేడు. ఊహించని ఆ ఆకస్మిక చర్యకి విజయేంద్ర నిశ్చేష్టుడయిపోయేడు. అతని ముక్కు అదిరి రక్తం కారడం మొదలెట్టింది.

అయినా అతను తెల్లబోతూనే "పిల్లై, ఏంటిది?" అన్నాడు.

"ఏంటంటావురా బద్మాష్? చంపేస్తాను" అంటూ మళ్లీ మీదికి వచ్చేడు పిల్లై.

ఆ గొడవకి రాకా లేచి కూర్చుని "ఏంటి?" అన్నాడు కంగారుగా.

పిల్లై బదులు చెప్పలేదు.

మళ్లీ విజయేంద్రని కాలితో తన్నేడు.


ఈసారి విజయేంద్ర లేచి నిలబడి "పిల్లై! నీకు పిచ్చి పట్టిందా. నేను కొడితే చచ్చిపోతావు తెలుసా?" అన్నాడు లేని శాంతం కొని తెచ్చుకొని.

"నన్ను చంపేస్తానంటావురా!" అంటూ పిల్లై తిరిగి విజయేంద్ర మొహంమీద గుద్దేడు. బదులుగా విజయేంద్ర పెదవి చిట్లింది. విజయేంద్ర సహనం కోల్పోయి అరచేతితో పిల్లై మొహంమీద చరిచేడు.

పిల్లై కళ్లు తిరిగి పడిపోయేడు. అంతా అయిదు క్షణాల్లో జరిగిపోయిందిది. వెంటనే కానిస్టేబుల్స్ పరిగెత్తుకొచ్చేరు.

క్షణాలమీద వారిద్దరికి రక్తం చాల పోవడం వలన గవర్నమెంటు ఆసుపత్రికి తరలించేరు. పోలీసు కావలాతో వారిద్దర్ని హాస్పిటల్లో ఎడ్మిట్ చేసుకున్నారు. ఇద్దరికీ కుట్లు పడ్డాయి.

అర్ధరాత్రి దాటింది. హాస్పిటలంతా నిద్రావస్థలో వుంది. పిల్లై లేచి చూచేడు.



ప్రవేశ పెడ్తున్నారు
సరికొత్త
'ఫ్రూట్ సలాడ్ ఆహారం'
ఫారెక్స్-ఫ్రూట్స్ పాలూ గోధుమల్లోని
పోషకత్వం నోరూరిస్తూ ఇట్టే అరిగి పోయే
రుచికరమైన ఏపిల్, మామిడి, అరటి పళ్ళతో
తయారైనది..
Farex-fruits®
WITH CEREAL, FRUITS AND MILK
DELICIOUS
500 గ్రా.ల ప్యాక్
రెగ్యులర్ ప్యాక్ కన్నా
100 గ్రా.లు ఎక్కువ.
ఫారెక్స్-ఫ్రూట్స్
పెరుగుదలకు రుచికరమైన విధానం
ఏ దుకాణంలోనైనా
పొదుపైన ఒకే ధరలో దొరుకుతోంది.
ప్రస్తుతం ఎన్నుకోబడిన చోటుల్లో మాత్రమే లభ్యం.

తన దగ్గర కాపలావున్న కానిస్టేబుల్ గోడకి చేరబడి నిద్రపోతున్నాడు.

విజయేంద్ర దగ్గర కానిస్టేబుల్ వరండాలో కబుర్లు చెబుతున్నాడు.

పిల్లె మొదట బాత్రూంకి వెళ్లొచ్చేడు. తిరిగి వస్తూ అతను విజయేంద్ర దగ్గర నిలబడి చిన్నగా దగ్గేడు.

విజయేంద్ర కళ్లు తెరచి చూశాడు.

"దెబ్బలు గట్టిగా తగిలాయా?" అన్నాడు పిల్లె మెల్లిగా.

విజయేంద్ర అతనివైపు ఆశ్చర్యంగా చూసి "అసలెందుకు నన్ను కొట్టేవు పిళ్లే?" అనడిగాడు అమాయికంగా.

"ష్! గట్టిగా మాట్లాడకు! మనం పారిపోదాం! అందుకే యీ ఎత్తు వేసేను" అన్నాడు మెల్లిగా.

"పారిపోవడమా?" ఆశ్చర్యపోయేడు విజయేంద్ర.

"అవును. వీళ్లు నేరస్థుల్ని శిక్షించరు. మనలాంటి అమాయకుల్నే బంధిస్తారు. మనం పారిపోయి వీళ్లమీద కక్ష తీర్చుకుందాం. లేకపోతే నాకు పిచ్చెక్కుతుంది!" అన్నాడు పిల్లె.

విజయేంద్ర శుష్కంగా నవ్వి "ఎక్కడికని పారిపోతాం? ఎన్నాళ్లని దాక్కుంటాం. తిరిగి పట్టుబడితే రెట్టింపు శిక్ష అనుభవించాలి! న్యాయబద్ధంగానే చట్టంతో పోరాడుదాం. వెళ్లి పడుకో!"అన్నాడు.

"నాకా ఓపిక లేదు. న్యాయం జరుగుతుందన్న ఆశ కూడ లేదు. నా చెల్లెలి జీవితం నాశనం చేసినవాణ్ణి నా చేతులతోనే శిక్షించాలి. తిరిగివచ్చి ఎంత శిక్షయినా అనుభవించడానికి నేను సిద్ధమే!" అన్నాడు పిల్లె స్థిరంగా.

"బెస్టాఫ్‌లక్!"అన్నాడు విజయేంద్ర.

పిల్లె అతనివైపు సజల నయనాలతో చూసి "వస్తాను బ్రదర్! జాగ్రత్త! నీకంతా మంచి జరగాలని ఆశిస్తున్నాను. నేను జైలుకొచ్చేసరికి నీవా జైల్లో వుండకూడదు. ఇదే నా కోరిక!" అంటూ విజయేంద్రతో చెయ్యి కలిపి వడివడిగా తన బెడ్ వైపు వెళ్లిపోయేడు.

మరో పావుగంట గడిచింది.

విజయేంద్ర టెన్షన్‌గా పిల్లె బెడ్‌వైపు చూస్తున్నాడు. వార్డులోని నర్సు కునికిపాట్లు పడుతోంది.

పిల్లె మెల్లిగా లేచి బెడ్స్‌లేక క్రింద పడుకొనివున్న ఒక అనాధ వృద్ధుణ్ణి తట్టి లేపేడు.

అతను గాభరాగా లేచి "ఏంటి బాబూ!" అన్నాడు.

"చలిగా వుంది. క్రింద పడుకోలేవు. నువెళ్లి ఆ బెడ్‌మీద పడుకో. నేనిక్కడ పడుకుంటాను" అన్నాడు.

వృద్ధుడు ఆనందంగా వెళ్లి అతని బెడ్ మీద పడుకున్నాడు. పిల్లె అతనికి నిండా రగ్గు కప్పి తాను క్రింద పడుకున్నాడు.

అతని దగ్గర నిద్రపోతున్న కాన్‌స్టేబుల్ మెలకువ వచ్చి రెండు బెడ్స్ వైపు చూసి ఇద్దరూ వున్నారన్న నిర్ధారణతో మళ్లీ నిద్రలోకి జారుకున్నాడు.

జరుగుతున్న తతంగమంతా విజయేంద్ర గమనిస్తూనే వున్నాడు. తప్పించుకోవడంలో పిల్లె విజయం సాధిస్తాడా, లేక దొరికిపోతాడా అని అతని గుండె పీచుపీచుమంటోంది.

టైము మూడు గంటలు దాటింది.

ఎంతటివారికన్నా నిద్ర ముంచుకొచ్చే టైమది!

హాల్లో బయట హస్కేసిన కానిస్టేబుల్ కూడ లోపలికొచ్చి విజయేంద్ర బెడ్ పక్కగా గోడకి జేరబడి కళ్లు మూసుకొన్నాడు. వెంటనే నిద్ర ఆవరించేసింద తన్ని!

పిల్లె ధైర్యం చేసి నిలబడి తలకి గుడ్డ చుట్టుకొని వృద్ధుడు కర్ర ఆసరాగా ముందు బాత్రూం వైపు నడిచేడు. మరికొద్ది నిముషాల్లో అతను వార్డునిదాటి నిర్మానుష్యంగా వున్న పెద్ద పెద్ద కారిడార్లు దాటుకొని గేట్‌మన్‌కి టీ తాగుతానని చెప్పి బయట ప్రపంచంలోకి అడుగు పెట్టేడు.

బాగా తెల్లవారి పిల్లె పారిపోయిన ఉదంతం హాస్పిటలంతా తెలిసేసరికి అతను ఈ రాష్ట్రపు సరిహద్దుల్నే దాటేసేడు.

* * * * *

సుందరమ్మ రిసీవర్ అందుకొని ఇంటికి డయల్ చేసింది.

కరంచంద్‌గాంధీ ఫోనెత్తి "హలో!" అన్నాడు.

"నేను సుందరమ్మని మాట్లాడుతున్నాను"

అతను ఆశ్చర్యపోతూ "ఎక్కణ్ణుంచి?" అన్నాడు.

"బయట ఒక షాపునుండి. మీరు మాకు ఫోను కూడ లేకుండా చేసేరుగా!" అంది.

తన భార్య అంత స్థిరంగానూ, నిష్ఠూరంగానూ మాట్లాడటం అతని కిదే ప్రథమం.

"ఏం జరిగింది?"అన్నాడు లోలోపల కంగారుగావున్నా బయటకి గాంభీర్యంగా.

"అది ఫోంచేయడంలేదు"

"మంచిది. ఎవరిని ఉద్ధరిస్తుందట! పేపర్లనిండా ఏం రాసి వంపిందో చూశారుగా!" అన్నాడు కోపంగా.

"అప్పుడయినా దాని నిర్ణయం మీ కర్థం కాకపోవడం మన ఇద్దరి దురదృష్టమూనూ!" అంది సుందరమ్మ నిష్ఠూరంగా.

"సుందరమ్మా!" అతను కోపంగా ఘర్జించేడు.

"మీ అరుపులు నాకు కొత్తవికావు. నావరకు నేను మీ పెత్తనాన్ని భరిస్తాను. కాని అది ఈ తరంలో పుట్టిన పిల్ల. దాని భావాలు దాని కుంటాయి. కాదనడానికి, మనం అన్నదే అవుననడానికి మన కెక్కడిదండీ అధికారం! చేజేతులా చంపేసుకోవడానికా మనం దాన్ని కన్నది!" అంది సుందరమ్మ వేదనగా.

"బందిఖానాలో నీకు మాట్లాడ్డం బాగా చేతనయినట్లుందే! ఇదంతా నీ కూతురి బ్రెయినింగా?" అన్నాడతను వెటకారంగా.

13 శుక్రవారం

13 మంచిదికాదు 13 శుక్రవారం కలిసొస్తే అది 'గుడ్‌ఫ్రైడే' అయితే తప్ప పరమదుర్దినం కాని- అదేమి దురదృష్టమో 13, శుక్రవారాలే, క్యాలండర్‌లలో ఎక్కువగా వస్తాయి- గత 400 సం.ల కాలంలోను 13, శుక్రవారాలు 688సార్లు వచ్చేయి. 13 ఆదివారాలు మాత్రం 687 మాత్రం తగిలాయి!

"కాము, పరిస్థితుల ప్రభావం. అసహాయతనుండి పుట్టుకొచ్చిన అగ్ని."

"మాటలు బాగా నేర్చేవు. కథలు రాయి. నేను కరంచంద్ గాంధీని. అంత తొందరగా కరిగిపోను. వళ్లు జాగ్రత్త పెట్టుకొని కూతుర్ని కాపలా కాయి! నాకు నీతులు చెప్పడానికి ప్రయత్నించకు" అంటూ అతను ఫోను పెట్టేసేడు.

సుందరమ్మ అసహాయంగా వుండిపోయింది కొద్దిసేపు.

కరవమంటే కప్పకి కోపం - విడవమంటే పాముకి కోపం అన్నట్లయింది తన పరిస్థితి. ఇన్ని రోజుల్లో భర్త ఎదుట పెదవి విప్పి ఎరుగని తను గేట్‌మన్‌ని బ్రతిమాలి ఫోను చేసేందుకు బయటికి రావాల్సి వచ్చింది. అయినా ఏం ప్రయోజనం! తన భర్తకి హృదయం లేదు. కన్న కూతురు తిండి తినక చచ్చిపోతుందన్న కంగారు లేదు. అతనికి కావాల్సింది నల్గురూ తనని గొప్పవాడనుకోవడం. తన పరువు కాపాడుకోవడం.

తన కళ్లెదుట తన కూతురు క్షీణించి చచ్చిపోవడం తను చూడాల్సిందేనా! ఆమె కళ్లు వర్షాకాలపు వాగులై ప్రవహించసాగేయి.

వెంటనే ఆమె ఏదో గుర్తొచ్చినట్లుగా మళ్లీ ఫోను చేసింది.

"హలో! నేనమ్మా పీయూష తల్లిని! రజనియేనా మాట్లాడేది!" అంది గాభరాగా.

"అవును. ఏంటాంటీ! మీరు ఊరినుండి ఎప్పుడొచ్చేరు?" అనడిగింది రజని ఆత్రంగా.

"అసలు ఊరెక్కడెళ్లేం!" అంటూ జరిగిందంతా క్లుప్తంగా చెప్పింది సుందరమ్మ.

రజని అంతా విని నివ్వెరపోయి "ఇప్పుడు మీరెక్కడున్నారు?" అనడిగింది.

సుందరమ్మ చెప్పి "జాగ్రత్త! ఇంటి చుట్టూ పోలీసు బందోబస్తు వుంది. నేనే ఆయనతో మాట్లాడాలని వాళ్లని బ్రతిమలాడి బయటికి రావాల్సి వచ్చింది" అంది.

"ఇప్పుడేం చేద్దామంటారు? కేసు నేను కూడా క్షుణ్ణంగా చదువు తున్నాను. అసలేం జరగబోతుందో అనూహ్యంగా వుంది!"

"నువ్వోసారి ఎలాగైనా వచ్చి దానికి ముందు మానసిక ధైర్యం కల్గించు. తర్వాత దేవుడే వున్నాడు" అంది సుందరమ్మ వేదనగా.

"నన్ను రానిస్తారా ఆంటీ!" అనుమానంగా అడిగింది రజని.

"నాకేం తెలీదు. నువ్వే ఉపాయం ఆలోచించు. నా కూతుర్ని రక్షించుకోవాలనే ఇన్నాళ్లకు ఇంత ధైర్యం చేసేను" అంది సుందరమ్మ ఫోను పెట్టేస్తూ.

ఆమె తిరిగి రాగానే పీయూష "ఎక్కడికెళ్లేవమ్మా!" అనడిగింది.

బదులుగా సుందరమ్మ భోరున ఏడ్చింది.

తల్లి దుఃఖాన్ని చూసి పీయూష కదిలిపోయింది.

"ఎందుకమ్మా ఏడుస్తున్నావ్, ఏం జరిగింది?" అంది పీయూష ఆందోళనగా తల్లి భుజాలు పట్టుకొని.

"ఇంకా ఏం జరగాలి తల్లీ! అటు కట్టుకొన్న భర్తగాని, ఇటు కన్న కూతురుగాని వారి పోరాటంలో నేను మానసికంగా ఎలా నలిగి పోతున్నానో అర్థం చేసుకోలేక పోతున్నారు. నా కసలు మనసే లేదనుకొంటున్నారు. ఆయన పట్టుదల ఆయనది. నీ మంకుతనం నీది! తిండి మానేసి ఏం సాధించగలరో ఈ తరం పిల్లలు నాకు తెలీదు. చాతనయితే పారిపోయి అతనికి సాక్ష్యాలు సంపాదించి అతన్ని జైల్లోంచి విడుదలయ్యేట్లు చూడు.

నీ మూలంగా నీ తల్లి కూడ ఛోంచేయడం లేదన్న విషయం నువ్వెప్పటికి అర్థం చేసుకో గలవు?" అందామె దుఃఖాన్ని అపుకొంటూ.


"అమ్మా!" అంది పీయూష ఆందోళనగా.

సుందరమ్మ శుష్కించిన కూతురి మొహాన్ని పుణికి పుచ్చుకొని "బాధంతా నా తిండి గురించి కాదమ్మా! నువ్వు తిండిలేక మాడి చచ్చిపోయే దృశ్యం చూడకుండానే నేను చచ్చిపోవాలని నిర్ణయించు కొన్నాను. మనిషి బ్రతికి సాధించాలి. తిని ఆలోచించాలి! ఈ సంగతి మీ యువతరం తెలుసుకొంటే ఎంతయినా మంచిది!" అంది.

వెంటనే పీయూష అర్థమయిన దానిలా లేచి డైనింగ్ టేబుల్ దగ్గరకి నడిచి కంచాల్లో అన్నం వడ్డించింది.

సుందరమ్మ ఆ దృశ్యాన్ని చూస్తూ నిలబడితే పీయూష కూరలు వడ్డిస్తూ "రామ్మా, భోంచేద్దాం" అంది.

సుందరమ్మ ద్రవించిన మనస్సుతో డైనింగ్ టేబుల్ దగ్గరకి నడిచింది.



పీయూష అన్నం కలిపి ఒక ముద్ద బలవంతంగా తల్లి నోట్లో పెడుతుంటే సుందరమ్మ పూర్తిగా కదిలిపోయి కూతుర్ని కౌగలించుకొని కూర్చోబెట్టి కంచం లాక్కుని చాల సంవత్సరాలు తర్వాత కూతురికి గోరు ముద్దలు తినిపించింది.

ఏ అధునాతనమైన కంప్యూటర్‌కి అందని ఆ ప్రేమైక దృశ్యాన్ని గుమ్మంలో నిలబడి చూస్తున్న రజని కనులు చెమ్మగిల్లేయి.

"నువ్వు... నువ్వెలా వచ్చేవు!" ఆశ్చర్యంగా స్నేహితురాలి వైపు చూస్తూ అడిగింది పీయూష.

"నన్ను లోనికి రానివ్వక పోవడానికి వాళ్లకెన్ని గుండెలు! నేను సారా కాంట్రాక్టర్ రాజన్న కూతుర్ని!" అంది రజని

సగర్వంగా నవ్వుతూ లోనికొస్తూ.

"అద్సరే! డాడి అంతకన్నా కఠినం కదా! వీళ్లు ఎలా ఒప్పుకొన్నారా అని!"

రజని కూర్చుని సుందరమ్మ అందించిన మంచినీళ్లు తాగి బ్యాగ్ తెరచి ఒక కాగితం పీయూష చేతికిచ్చింది.

పీయూష దాన్ని తెరచి చూసింది.

రజనిని లోనికి రానివ్వడానికి గాంధీ స్వయంగా రాసిచ్చిన అనుమతి పత్రం అది.

పీయూష దాన్ని చూసి తెల్లబోయింది.

"అయన ఒప్పుకొన్నారా?"

"అవును. ఆంటీ ఫోను చెయ్యగానే నేను వెంటనే మీ ఇంటి కెళ్లేను. అంకుల్ ఒక్కరే కూర్చొని వున్నారు. నేను నీ సంగతి మాట్లాడేను. నువ్వు భోంచేయడం లేదన్న విషయం ఆయన్ని కొద్దిగా కదిలించినట్లని పించింది. నీ మనస్సు మార్చి నీచేత అన్నం తినిపిస్తానని ప్రామిస్ చేసి ఈ ఉత్తరం తీసుకొచ్చేను. కాని నీవు నాకాశ్రమ తప్పిస్తూ లక్షణంగా భోంచే

యడం చూసి సంతోషపడుతున్నాను" అంది రజని.

"అయన... అయనెలా వున్నారమ్మా! భోంచేస్తున్నారా?" అని ఆత్రంగా అడిగింది సుందరమ్మ.

"ఎలా భోంచేస్తారాంటీ! ఒక పక్క రాజకీయ వత్తిడులు, మరో పక్క భార్యా కూతుర్ల గురించి వేదన! ఇంకోపక్క తెలుసా, పిల్లె అనే ప్రిజనర్ జైలునుండి తప్పించుకొని పారిపోయేడట! అదొక టెన్షన్! అదిగాక రాష్ట్రంలో నక్సల్స్ గొడవ ఒకటి చాల ఎక్కువగా వుంది. హోం మినిస్టర్‌కి వాళ్లకి అసలు పడటం లేదు. రాకాని వదలమని వాళ్లు చాల పట్టు బడుతున్నారు. ఈ విషయంలో అంకుల్ మీద కూడ వాళ్లు పగగా వున్నారు మరి!" అంది రజని.

సుందరమ్మ దిగులుగా చూసింది.

"ఏం ఫర్వాలేదులే ఆంటీ! తొందరలోనే అన్నీ చక్కబడతాయి. విజయేంద్ర కేసు కూడ హియరింగ్‌కి వచ్చింది. నిఖిలేశ్వరి పెట్టుకొన్న లాయరు ఉద్దండుడు. అతని దగ్గర ఎవరి ఆటలూ సాగవట. నాన్నగారు అంటుంటే విన్నాను" అంది రజని.

రజనిని చూశాక పీయూష ప్రాణం లేచి వచ్చినట్లయింది.

"విజయ్‌ని చూశావా?" అంది మెల్లిగా.

"ఉహూ! ఎలా చూస్తాను. రేపు కోర్టుకి వెళ్లినప్పుడు చూడాలను కొంటున్నాను. ఆ సంగతులు తర్వాత చెబుతాను. న్యాయం ఓడిపోయినట్లు కనిపించినా అంతిమ విజయాన్ని పొంది తీరుతుంది. కాబట్టి ధైర్యంగా వుండు. నేను రోజూ వస్తుంటాను" అంటూ లేచింది రజని.

స్నేహితురాలు వెళ్తోంటే కనిపించినంత దూరం చూస్తూ నిలబడింది పీయూష.

(ఇంకా వుంది)

స్వాతంత్ర్య సమర కవితలో 'రాట్నం'

– ద్వా. నా. శాస్త్రి

"బానిసత్వపు బంగారపు పంజరం కన్న స్వాతంత్ర్యపు టడవి మిన్న" అన్న వీరసావర్కార్ సూక్తికి నిదర్శనంగా మన జాతీయోద్యమం విజయవంతమైంది. మాతృ భూమిని స్వరాజ్యంగా, సురాజ్యంగా చెయ్యాలని ఎందరో తహతహ లాడారు– ఆత్మార్పణ కావించుకొన్నారు. ఇంటినీ– ఒంటినీ గుల్ల చేసుకున్నారు. పరాయి పాలకుల పద ఘట్టనల క్రింద తన జాతి నికృష్టంగా జీవిస్తున్నప్పుడు కవి చేతులు ముడుచుకొని కూర్చోలేదు. గళం విప్పి చైతన్యవంతమైన సమాజాన్ని తీర్చి దిద్దటంలో తన వంతు కర్తవ్యాన్ని పాటించాడు తెలుగు కవి.

జాతి విముక్తికోసం సలిపిన పోరాటంలో ప్రతి అంశమూ, ప్రతి సన్నివేశమూ స్ఫూర్తినిస్తాయి. ఆ విధంగా స్వాతంత్ర్య సమరంలో ఖద్దరు, జెండా, రాట్నం, ఉప్పు మొదలైనవి ప్రధాన పాత్రలు వహించి జనాన్ని జాగృతం చేశాయి. పరాయి పాలనలో దేశీయ పరిశ్రమలు అడుగంటి పోయాయి. విదేశీ వస్తువులపై ఆధారపడే దుర్గతి దాపురించింది. మన దేశ ఆర్థిక దుస్థితి ఛిన్నాభిన్నమై పోయింది. చేనేత పనివారికి జీవనం

పాడవే రాట్నమా
ప్రణవ భావ గీతి

లేకుండా పోయింది. విద్యావంతులు విదేశీ వస్త్రధారణలపై మక్కువ ఎక్కువైంది. మన ధనం విదేశాల పాలయ్యేది. ఆంగ్లేయుల ప్రధానమైన ధ్యేయం కూడా అదే! అందుకే మహాత్మాగాంధీ విదేశీ వస్తు బహిష్కరణోద్యమం ప్రారంభించారు. ఖద్దరు ఉద్యమ వ్యాప్తికి అహర్నిశలూ పాటు బడ్డారు. చేనేత పరిశ్రమకు జీవం పోయాలని 'రాట్నం వడకటం' జాతీయోద్యమంలో ఒక పవిత్ర కార్యంగా రూపొందించారు. అందువల్ల చేనేత పనివారికి జీవనోపాధి ఏర్పడు తుంది. దేశం స్వయం పోషకం అవటానికి ఒక సాధనం అవుతుంది. విదేశీ వస్త్ర వ్యామోహం పోయి స్వదేశాభిమానం ఏర్పడు తుంది. 'ఖద్దరు' ఆంగ్లేయుల



గుండెల్లో గుబులు పుట్టించింది. ఇంతటి ప్రాధాన్యం వహించిన 'రాట్నం' గురించి తెలుగు కవులు- కవయిత్రులు ఎలా స్పందించారో తెలుసుకుందాం;

ఏకులు కావలెనా?

జాతీయ గీతాలు గాలికి పోకుండా ఓర్పుగా సేకరించి ప్రచురించిన స్వాతంత్ర్య సమర యోధులు, జాతీయ కవిశేఖరులు అయిన గురజాడ రాఘవశర్మ గారు-

"వడుకుమురా- వడుకుమురా
నీ దేశోద్ధారణకు- తెరగిదిరా
కలిమి బలిమి- యీ కదురే గదరా
క్రమ్మర రాజ్యం బొసగు సూత్రమురా"

-అని రాట్నం వడకటం వల్ల కలిగే ప్రయోజనాన్ని వెల్లడించారు. విదేశీ వస్త్ర వ్యామోహం వల్ల ఆనాడు ఏటా ఇరవై కోట్ల రూపాయలు విదేశాలకు వెళ్ళేదట!ఆ ఆవేదన చెందుతూ-

నా తల్లి రాట్నమా- నా పాలి
భాగ్యమా
నా దేశమును వీడ- న్యాయమా
చెప్పుమా

-అని రాట్నాన్ని సంబోధిస్తూ మా దారిద్ర్యాన్ని కడతేర్చమని విన్నవించుకుంటూ ప్రజలకి హితవు చెప్పిన కవి శ్రీ

పాడవే రాట్నమా ప్రణవభావ గీతి


నెల్లూరు వెంకట రామానాయుడు. స్వాతంత్ర్యోద్యమంలో దేశ భక్తుల్ని జాగృతం చేసే వీర గీతాలు కొల్లలుగా ఉన్నాయి. ఓ సుకవి-

"ఏకులు కావలెనా?
దాస్యపు మోకులు కావలెనా?
కదురులు కావలెనా?
కొరడా బెదురులె కావలెనా?"

-అని సవాలు చేస్తున్నట్టుగా- బుజ్జగిస్తున్నట్టుగా రాట్నపు విలువను గుర్తు చేశాడు. చెరుకువాడ నరసింహం పంతులు గారిని "ఆంధ్రభీష్మ" అనేవారు. ఆయన ఉపన్యాసం అపూర్వమని ప్రతీతి. ఆయన కూడా గాంధీ పిలుపుకు స్పందించి-

"మా పాలి మహాలక్ష్మి
మా యన్న పూర్ణ
మా సరస్వతీ దేవి
మా రాజ్యలక్ష్మి"

-అని రాట్నాన్ని కీర్తిస్తూ "రాట్నం త్రిప్పుతాము- రాజ్య సూత్రము వడి వడుకుతాము" అని శపథం చేశారు.



ఇల వేలుపు

కాటూరి వెంకటేశ్వర రావుగారు రాట్నం వచ్చి తన గోడును విన్నవించుకొని మనల్ని ఉత్తేజితుల్ని చేస్తున్న ప్రక్రియలో ఇలా రాశారు-

"నేను మీ యిలవేల్పునే చెల్లీ
నాతో డ నాడు కొనవే
నేను మీ గృహలక్ష్మి నే తల్లీ
నను మరిచి పోతివటవే"

బసవరాజు అప్పారావు గారి గేయాలు సుకుమారంగా భావశ బలితంగా వుంటాయి. అయితే ఆ కవిత్వం వేరు. స్వాతంత్ర్యం సమర కవిత్వం వేరు. ఇక్కడ ఆవేశం అత్యవసరం. ఉత్తేజితుల్ని చెయ్యటం మరీ అవసరం. అందుకే రాట్నం వడకని వార్ని, ఖద్దరు ధరించనివార్ని బసవరాజు వారు-

"సిగ్గులేదా, నీకు శరము లేదా
అన్నమైనా లేక బీదలల్లాడుతుంటేను

సీతాకోక చిలుకలాగ
సీమగుడ్డ కట్టి తిరుగ"

-అని కసురుతారు- ఆ రోషం- దేశాభిమానాన్ని రేకెత్తించాలని! పంగ నామముల రామచంద్రరావు గారి రాట్నపు కవిత్వపు తీరు వేరు. ఆయన రాట్నాన్ని ప్రశంసిస్తూ దాని ప్రాధాన్యతను గుర్తు చేశారు. కవయిత్రులు కూడా సమరగీతాలు అల్లగలరని ఎందరో నిరూపించారు. శ్రీమతి కల్పటపు రుక్మిణమ్మ గారు 'రాట్నపు పాట'లో ఇలా ప్రబోధిస్తారు-

"రాటము ఒడకరమ్మ! ఓ అమ్మలార
గాంధీకిజయమనుచు దారము తీయరే
ఏకుల రాటమ్ము ఇంటి కందమ్ము
మహాత్మాగాంధి ప్రజల కందమ్ము"

స్వాతంత్ర్యోద్యమంలో రాట్నం పార తంత్ర్యమునకు ఇనుప కవాటంగా భావించ బడింది. స్వరాజ్య పీఠంగా ఆరాధించ బడింది. సంపదలకు నిలయంగా కొనియాడ బడింది. రాట్నాన్ని గృహలక్ష్మిగా, స్వరాజ్యలక్ష్మిగా ప్రస్తుతించ బడింది. అందుకే కవులు- కవయిత్రులు కూడా రాట్నపు గీతాలతో ప్రజల్ని స్వాతంత్ర్య సమరోన్ముఖుల్ని చేశారు.

o

యువతా! కవితా!!

నిద్ర- కల

నిద్రలో
ప్రతీ కదలికా ఓ కల అవుతుంది.
నిజానికి...
ప్రతీ కలా బండరాయిని తాకిన
అల అవుతుంది.
బతుకు రహదార్లో
కల కుందేలైతే తాబేలు గెలుస్తుంది.
నిద్ర
మనసులోకి కలల్ని
స్పిన్ బౌలింగ్ చేస్తుంది.
వాస్తవం బ్యాట్‌తో ఎదుర్కోక పోతే
జీవితంలో
'డక్కవుట్' అవక తప్పదు!

-భగ్వాన్

అడవికాచిన వెన్నెల

ఎవరన్నారోగాని,
అడవి కాచిన వెన్నెల అని,
పిచ్చివాళ్లు
వాళ్లకేం తెలుసు
అడవి కాచిన అందాలు!

నగరం నియాన్ లైట్ల కాంతిలో
వెన్నెల సోయగాల్ని
ఎవరు పట్టించుకుంటారు
అంతా కృత్రిమ అందాలు!

అదే అడవిలోనైతే?
చక్కని చిక్కని చెట్ల మధ్యగుండా
తెలిమబ్బుల చాటు వెన్నెల
దోబూచులాట,
కమ్మని కువకువ రాగాల
సరాగాల మధ్య కోయిల రాగం!

తనువు పులకించే చల్లని
మలయ మారుతం... ఓహో...
అడవి కాచిన వెన్నెల అందం
కనలేదా కవి హృదయం!

-పి. సుమిత్ర

ఓ! నేస్తమా

ఓ నేస్తమా!!
నీతో చెలిమి చేశాను!
నా ఎదలో నిన్ను పదిలంగా
దాచుకున్నాను!!
ఓ నేస్తమా!!
మన ఇర్వురి చెలిమి
చిరకాలం వీడని బంధంగా
కలకాలం నిలవాలని ఆశించాను!

ఓ నేస్తమా!!
మన చెలిమి ప్రత్యక్షంగా
తరతరాలకు చరిత్రగా
ఎల్లప్పుడూ ఉండాలి!
నా
గుండెగుడిలో
దీపమై వెలగాలి!
ఓ నేస్తమా!!
ఓ నేస్తమా!!

-కంకటి శంకర్‌రావు

నాంది

ఆడిట్, ఆడిట్టంటూ
అడ్జెట్టాను బోగసు బిల్లులకు
కష్టం, నష్టమంటూ,
కథనుతొక్కారు కంట్రాక్టర్లు!

చూస్తాం చూస్తామంటూ,
చేయి జాచారు చైర్మెన్లు!
ఇచ్చాం ఇచ్చామంటూ,
ఇచ్చకాలాడారు ఇంజినీర్లు!
ఆర్బిట్రేషన్ మాటున అందాయి
అనూహ్యమైన కానుకలు!

ఎస్టిమేటుకు అగ్రిమెంటుకు
పొంతన లేదంటే పిచ్చోణ్ణన్నారు!
కొల్యూజివ్ టెండర్లంటే
కొట్టి పారేసారు కసిగా!

బూస్టెడ్ రేట్లతో ఎస్టిమేట్లంటే
బ్లో అప్ అయ్యారు బుసలు కొడుతూ!
స్టాండర్డు బ్యాంకు సరిలేవంటే
రాడికల్ నన్నారు రాబందులు!

నా ఆడిట్ రిపోర్ట్సంతా ట్రాష్ అంటూ
యిచ్చారు ట్రాన్స్ఫరు ఆర్డర్లు పైవాళ్ళు
నానవచైతన్యానికి నాంది పలికిందేమో
గాని,
నొచ్చుకుంటూ సగం విరిగిన నడుముతో
బయలు దేరాను నగరికి!

-బనగాని భాస్కరరావు


ఆలోచన

దోమలు చీమలు
నిన్ను కుడుతున్నాయి
అబ్బా! అమ్మా!
గుర్తు కొచ్చాయి!
అవినీతి స్వార్థం
అక్రమం దౌర్జన్యం
దేశాన్ని కుడుతున్నాయి
ఎవరు గుర్తుకు రావాలి?
నొప్పి, బాధ నీకే కాదు!

-చివుకుల వాసుదేవమూర్తి

క్విట్ ఇండియా

దేవినేని శ్రీహర్ష



దీప్తి చక్కగా సర్దిన ఇల్లే మరో మారు సర్దుతోందన్న మాటే గాని ఆమె దృష్టంతా బయటే ఉంది కారు వచ్చే శబ్దం వినపడుతుందేమోనని ఎదురు చూస్తోంది. ఆమె ఆలోచనలన్నీ ఇంకొద్ది సేపట్లో రాబోయే నరేస్ చుట్టూతా పరిభ్రమిస్తున్నాయి. అతన్ని ఎప్పుడెప్పుడు చూస్తానా అని ఉందామెకు

"దీప్తీ' లోపలి నుండి వినవచ్చిన తల్లి పిలుపుకు "వస్తున్నా" అంటూ ఆమె దగ్గరకు వెళ్ళింది.

"నాన్నగారు అంకుల్ వాళ్ళను ఎయిర్‌పోర్ట్ నుండి తీసుకు వచ్చే వేళవుతోంది. ఆ చీరేమిటి, నువ్వేమిటి. ఏం లేనట్టు అది కట్టుకోకపోతే నాన్నగారు మొన్న కొనుక్కొచ్చిన చీర కట్టుకోకూడదూ" మందలిస్తున్నట్టుగా అంది వైజయంతి.

"ఫరవా లేదులే అమ్మా, వచ్చే వాళ్ళు మనకేమన్నా తెలియని వాళ్ళా ఏం. అయినా అసలు ఈ చీరకేమయ్యింది. బాగానే ఉందిగా".

వైజయంతి కూతుర్ని అలా మందలించినా లోలోపల అనుకుంది 'నా తల్లికేం కుందనపు బొమ్మ. ఎంత ఇష్టపడకపోతే దీప్తే తమ ఇంటి కోడలిగా రావాలని అంతగా తాపత్రయ పడతారు బలరామ్‌గారు కొంతకాలం ప్రక్క ప్రక్క పోర్షన్లలో కలసి ఉన్నప్పటి స్నేహం. ఆ స్నేహాన్ని బంధుత్వంగా మార్చుకోవాలని తమ కెంతగా ఉన్నా అబ్బాయి తమ కందుబాట్లో లేడన్నట్టుగా భావించి తమంత తాము అడగలేకపోయినా, అదేం పట్టించుకోకుండా "అబ్బాయి స్టేట్స్ నుండి అనుకోకుండా వచ్చాడు. నెల రోజుల్లో వెళ్ళిపోవాలంటున్నాడు. మళ్ళీ ఇప్పట్లో ఇండియాకు రావడం కుదరదట. వాడికి కూడ దీప్తినే చేసుకోవాలనుంది. మేము ముగ్గురం బయలుదేరి వస్తున్నాం. అన్ని విషయాలు మాట్లాడుకోవచ్చు" అని ఉత్తరం వ్రాసారు....

ఆమె ఆలోచనలు తెగకుండానే కారు వస్తున్న శబ్దం వినపడింది. దాంతో చేస్తున్న పనిని ఆపి సింక్‌లో చేయి కడుక్కుని గబగబా బయటకు వచ్చింది కారు దిగిన వాళ్ళకు ఎదురు వెళుతూ. "రండి అన్నయ్యగారూ, రండి వదినా" అంటూ భ్రమరాంబ చేతిని సాదరంగా అందుకుని ఆహ్వానించింది. నరేన్ కారు నుండి దిగకపోవడం గమనించి, కారులో అతనితో పాటు కూర్చున్న కమల్‌ను పిలుస్తూ "కమల్, బావగారిని లోనికి తీసుకురా" అంది వైజయంతి.

"రారంట. దీపక్క వచ్చి పిలిస్తేనే వస్తారంట. లేకపోతే వెనక్కి వెళ్ళిపోతానంటున్నారు" కమల్ మాటలకు నవ్వుకుంటూ మిగతా వాళ్ళను అనుసరించి ంది ఆమె.

వంటింట్లో లేని పని కల్పించుకుని చేస్తున్నట్టు నటిస్తున్న కూతురిని చూసి నవ్వొచ్చింది వైజయంతికి. "చాల్లేగాని, బయటకు వెళ్ళి నరేన్‌నట లోపలికి రమ్మని ఆహ్వానించు. కార్లోనే ఉన్నాడింకా. నువ్వు వెళ్ళి స్వయంగా పిలవకపోతే అటునుంచటే వెళ్ళిపోతానంటున్నాడు"

దీప్తి మొహం సిగ్గుతో ఎర్ర బడింది. అమ్మతో మళ్ళీ చెప్పించుకోకుండా వంటింట్లో నుండి బయటకు వస్తూ తనకెదురొస్తున్న భ్రమరాంబను "బావున్నారా అత్తయ్యా" అంటూ పలకరించి, డ్రాయింగ్ రూంలోకి అడుగుపెట్టి "నమస్తే అంకుల్" చేతులు జోడించి బలరామ్ గారిని విష్ చేసి "ఇప్పుడే వస్తా"నని ఆయనకు చెప్పి బయటకు వచ్చింది.

అలా వెళుతున్న దీప్తి వంక తృప్తిగా చూసింది భ్రమరాంబ. దీప్తి చాల అందంగా ఉంటుంది. చక్కని కనుముక్కుతీరు, అందచందాలకన్నా దీప్తిలో భ్రమరాంబను అయస్కాంతంలా ఆకర్షించే అంశం ఒకటుంది. అది ఆమె జడ. పొడుగ్గా ఉన్న జడ ఉన్నవాళ్ళు ఆమెకు బజార్లో ఎక్కడ కనిపించినా వాళ్ళు తనకు కనపడినంతమేరా అలా చూస్తుంటుందామె వాళ్ళను. అలాంటిది ఇంతవరకు తను చూసిన జడ లన్నింటికన్నా అందంగా, దాదాపు మోకాళ్ళ వరకు పొడుగ్గా ఉన్న జడ ఉన్న అమ్మాయి తన కోడలిగా వస్తోందన్న ఆలోచనే ఆమె కెంతో ఆనందాన్ని, అంతకుమించిన తృప్తిని కలిగిస్తోంది. అదీగాక దీప్తికన్నా ఎక్కువ చదువుకున్నవాళ్ళు, తను ఊహించనంత కట్న కానుకలు తెచ్చేవాళ్ళు తనకు దొరకవచ్చేమో కాని ఆమెలా బేలన్స్‌డ్‌గా ఆలోచించే మనిషి, మంచీ-చెడు, మర్యాదా-మన్ననా తెలిసిన వ్యక్తి తనకు దొరకకపోవచ్చు. అందుకే తమకు అంతగా తెలియని వ్యక్తిని కోడలిగా తెచ్చుకుని, ఒకవేళ మనస్తత్వాలు కలవక, ఆ వచ్చే వ్యక్తికి సర్దుకుపోయే స్వభావం లేకపోతే బాధపడే ఛాన్సును ఏమాత్రం తీసుకోదలచుకోలేదామె.

కొంగు భుజం చుట్టూ లాక్కుని, చిరునవ్వుతో కారు దగ్గరకు వచ్చి లోపలికి చూస్తూ అంది దీప్తి "బావున్నావా నరేన్. లోపలికి రా."

ఆ మాటలకేం జవాబు చెప్పకుండా ఆమె వంకే కళ్ళార్పకుండా చూస్తున్న నరేన్‌కు తన చేతిని అడ్డంపెట్టి "పద బావా... నాకు ఆకలవుతోంది. మా దీపక్కను అంతగా చూడాలనుకుంటే ఎదురుగా కూర్చుని భోంచేస్తూ చూద్దువుగాని" అన్న కమల్ మాటలకు ఇద్దరికీ నవ్వొచ్చింది.

అతను కారు దిగిన తర్వాత ఆమె వెనుదిరిగి ముందుకు వెళ్ళబోతుంటే ఆపి "ఇది నీకు" అంటూ చేతిలో ఉన్న గులాబీని ఆమె కందించాడు నరేన్.

తనకోసం తెచ్చిన ఆ గులాబీని అందుకుని, "థాంక్స్ నరేన్, గులాబీని ఇచ్చినందుకు కాదు. దానిని నా కోసం ప్రత్యేకంగా తెచ్చినందుకు" మనస్ఫూర్తిగా అంది దీప్తి.

"అసలు నేను వచ్చిందే నీ కోసం దీప్తీ" అభిమానంగా అన్నాడు నరేన్ ఆమె వంక ఆరాధనా పూర్వకంగా చూస్తూ.


కళ్ళముందు అసలు సిసలు తెలుగు సినిమాలో హీరో హీరోయిన్ల మధ్య జరిగే సంఘటనలా, సంభాషణల్లా అనిపించి అబ్బురంగా చూస్తున్నాడు కమల్ వాళ్ళిద్దరినీ.

అతని మాటలు ఆమెకు ఆనందాన్ని, సిగ్గునూ కలిగించాయి. వాటిని కప్పిపుచ్చుకుంటూ కమల్ చేయి పట్టుకుని "పద కమల్" అంటూ ముందుకు నడిచింది.

ఆ తర్వాత అందరికీ గంటలు నిముషాల్లా, నిముషాలు క్షణాల్లా గడిచాయి. కమల్ కోసం తను అమెరికానుండి తెచ్చిన రక రకాల వీడియో గేమ్స్, డ్రెస్‌లు ఇచ్చాడు నరేన్. భోజనాలయిన తర్వాత పెద్దవాళ్ళు కబుర్లలో పడ్డారు. కమల్, నరేన్ తెచ్చిన ఆట వస్తువులను తీసుకుని దగ్గర్లో ఉన్న ఫ్రెండ్సింటికి వెళ్ళాడు. వాళ్ళకు చూపించడానికి.

డ్రాయింగ్ రూంలో ఒక ప్రక్కన నిలబెట్టిఉన్న కేరమ్ బోర్డును చూస్తూ అన్నాడు నరేన్, "మనిద్దరం కేరమ్స్ ఆడుకుందామా దీప్తీ?"

అతని భయం అతనిది-తనను పెద్ద వాళ్ళతో వదిలేసో, లేకపోతే పడుకుని విశ్రాంతి తీసుకోమని చెప్పి దీప్తి వెళ్ళి వాళ్ల అమ్మా వాళ్లతో కూర్చుంటుందేమోనని. నరేన్‌కు ఆమెను వదిలి పెట్టాలని లేదు. సాధ్యమైనంత ఎక్కువసేపు ఆమెతో గడపాలని అతని ప్రయత్నం. దానిని తాను గమనించినట్టుగా అతనివంక చూసి చిన్నగా



నవ్వుతూ అంగీకరించింది దీప్తి.

ఆట ఆడుతున్నంతసేపు నాజూగ్గా కదులుతున్న ఆమె చేతి వేళ్ల అందాన్ని, కాయిన్స్‌ను కొట్టబోయేముందు దీక్షగా చూస్తున్న ఆమె కళ్ల అందచందాల్ని ఆస్వాదించాడతను.

పూర్తి బోర్డు ఆడారు. ఓడిపోయిన తర్వాత, తన ఓటమిని అంగీకరిస్తూ ఆమె ఆటను మెచ్చుకుంటూ అన్నాడతను "నువ్వు చాల బాగా ఆడుతున్నావు దీప్తీ"

"నువ్వు మాత్రం చిన్నప్పుడు తక్కువాట ఆడేవాడివా, నీకు ఇప్పుడు ప్రాక్టీసు లేదుగా. అయినా ఇవాళ నేను లేచినవేళ చాల మంచిది. నీ చేతుల్లో తన్నులు తినలేదు. చిన్నప్పుడు నువ్వొకసారి నాతో ఓడిపోయిన తర్వాత ఉక్రోషంతో నన్ను కొట్టావు గుర్తుందా?"

అతను నవ్వేడు. "ఓడిపోయినందుకు కాదు, ఆ రోజు నిన్ను కొట్టింది. నన్ను ఏమైనాసరే ఆటలో ఓడించాలన్న పంతంతో బోర్డుమీద ఉన్న నీ కాయిన్‌ను నాకు తెలియకుండా తీసి ప్రక్కన పెట్టి, అది అంతకుముందే వేసేసానని అబద్ధం చెప్పి రెట్టించినందుకు.

తనూ నవ్వేసి, "నువ్వారోజు కొట్టడం మంచిదే అయ్యింది నరేన్. అప్పట్నుండి ఇప్పటివరకు కనీసం అర అబద్ధమయినా ఆడలేదన్నది నిజంగా నిజం" అతని వంక అభిమానంగా చూస్తూ అంది దీప్తి.

టైమ్ చూసుకున్నాడతను. "నాలుగు కావస్తోంది. అలా బయటకు వెళ్దామా?" తలూపింది దీప్తి తనకేం అభ్యంతరం లేదన్నట్టు. అరగంటలో రెడీ అయ్యి ఇంట్లో చెప్పి బయలుదేరారు.

కారు దగ్గరకు వస్తూ అడిగాడు నరేన్ "నీకు డ్రైవింగ్ వచ్చా దీప్తీ? రాకపోతే నేను నేర్పుతాను."

"ఆ అవకాశం నాకు లేదులే. ఎప్పుడయినా అవసరం వచ్చుని నాన్నగారు నేర్పించారు. చూడు నా డ్రైవింగ్ ఎలా ఉంటుందో" తనే డ్రైవింగ్ సీట్లో కూర్చుంటూ అంది దీప్తి.

ఆమెనే పరీక్షగా చూస్తూ అన్నాడు నరేన్, "నీకు జీన్స్, షర్ట్ బాగుంటాయి దీప్."

"నాకు చీరలో ఉండేనే ఇష్టం. మిగతావన్నీ చాల కష్టం. అదిసరే ఆ పిలుపేమిటి చక్కగా దీప్తీ అని పిలవక. లేకపోతే చిన్నప్పుడు నన్నేడిపిస్తూ పిలిచేవాడివే 'దీపీ' అని అలా పిలువు"

"అమెరికాలో ఇలా స్లోగా డ్రైవ్ చేస్తే ఫైన్ వేస్తారు"

"ఇది ఇండియాకదా! ఇక్కడ ఫాస్ట్‌గా వెళితే ఫైన్ వేస్తారు" నవ్వుతూ అందామె. "సరే ఎక్కడకు?"

"నీ ఇష్టం"

"నా ఇష్టం సరే... నీ ఇష్టం కూడ చెప్పు"

"ఎక్కడకయినా సరే కొంచెం తీరిగ్గా కూర్చుని మనం ఒకళ్ళ కళ్ళలోకి ఇంకొకళ్ళు చూసుకుంటూ మాట్లాడుకోవడానికి వీలుండే చోటుకు. పోనీ ఏదయినా హోటల్‌కు వెళదాం ముందు. అక్కడ అరగంట గడిపి ఆ తర్వాత మళ్ళీ ఆలోచిద్దాం

క్విట్ ఇండియా

ఎక్కడకు వెళ్దాలో."

"సరే" క్షణం మౌనంగా ఉండి అడిగింది దీప్తి "అమెరికన్ లైఫ్ ఎలా ఉంది నరేన్?"

"ఇక్కడకన్నా చాల బాగుంది. అక్కడి జీవితంతో పోలిస్తే ఇదో నరకం."

"మరి ఈ నరకాని కెందుకొచ్చావు?" కొంచెం సీరియస్‌గానే అడిగిందామె.

"ఇక్కడొక అమ్మాయుంది. ఆ అమ్మాయి అక్కడ రోజూ నా కలల్లోకి వస్తోంది. తనను ఇక్కడ్నుంచి తీసుకు వెళదామని."

"ఆ అమ్మాయికి అక్కడకు రావడం ఇష్టం లేకపోతే?"

అతను ఉలిక్కిపడి, అది ఆమెకు తెలియకుండా సర్దుకుని అన్నాడు.

"తను అలా అంటుందని నేననుకోవడం లేదు. నాకు తనంటే ఎంత ఇష్టమో, తనకూ నేనంటే అంత ఇష్టం ఉంటుందని నా నమ్మకం."

ఆమె ఏదో అనాలనుకుని, మళ్ళీ అంతలోనే ఆగిపోయి కొన్ని క్షణాలు మౌనంగా ఉండిపోయింది. తర్వాత ఆ మౌనాన్ని తనే భగ్నం చేస్తూ అడిగింది.

"అంటే ఎప్పటికీ అమెరికాలోనే స్థిరపడాలనుకుంటున్నావా నరేన్?"

కళ్ళు

కలల కౌగిళ్ళు
వలపు వాకిళ్ళు!
కోర్కెల నెగళ్ళు
వయసు పరవళ్ళు!
సైగల సవాళ్ళు
ఆశల చివుళ్ళు!
ఊహల ఉయ్యాళ్ళు
ప్రేమ పొదరిళ్ళు!
కన్నీటి పుట్టిళ్ళు
బంధించు సంకెళ్ళు!
మనసు సవ్వళ్ళు
భావావేశ ఆనవాళ్ళు!
పాటల పందిళ్ళు
వినిపించు గజళ్ళు!
మరపించు నా ఒళ్ళు
మురిపించు నీ కళ్ళు!

-పుల్లాపంతుల వేంకటసుబ్బారావు

"ఊఁ"

"ఇండియాకు తిరిగి రావాలని లేదా నీ కసలు?"

"ఏముంది ఇక్కడ?"

"ఏమీలేదా?" సాలోచనగా అంది దీప్తి.

"అఫ్‌కోర్స్, నువ్వొకదానివి కనపడుతున్నావు"

కారు హోటల్‌లోకి తిరిగింది. పార్క్ చేసి దిగి లోనికి నడిచారిద్దరూ. బేరర్ వచ్చిన తర్వాత ఆమె నడిగి ఆర్డరిచ్చాడతను.

"చికాగో బాగుంటుందా నరేన్?" ఆసక్తిగా అడిగింది దీప్తి. "నాకు చాల ఇష్టం."

ఆమె మాటలకు నవ్వాడతను అర్థమయినట్టుగా. దీప్తి నరేన్ వంక సూటిగా చూస్తూ అంది "నువ్వుంటున్నావని కాదులే"

"నువ్వుండబోతున్నందుకా?"

దానికామె సమాధానం చెప్పలేదు. నవ్వి ఊరుకుంది. ఇంతలో బేరర్ వచ్చాడు. తర్వాత దీప్తి వాటిని తింటూ మౌనంగా ఉండిపోయింది.

అతనే అడిగాడు "ఏం మాట్లాడటం లేదేం?"

"ఏదో ఆలోచిస్తున్నాను."

"అదేమిటో నేను తెలుసుకోకూడదా?"

"తెలుసుకోకూడదా అని కాదు అడగాల్సింది. తెలుసుకోవచ్చా అని"

"ఎలాగయితేనేంలే నా భావం నీకు అర్థమయ్యిందికదా!"

"తర్వాత ఎక్కడకు వెళదామా అని. గుడికి వెళ్దామా?"

"నీ ఇష్టం"

నరేన్ బిల్ పే చేసాడు. బయటకు వచ్చిన తర్వాత అతను కారు వైపు వెళ్ళబోతుండగా అంది దీప్తి, "ఎదురుగా మేగజైన్ షాపుంది. అక్కడికి వెళ్దాం."

తలూపాడతను. రోడ్ క్రాస్ చేసి ఆ షాప్ కెళ్ళారు. అక్కడ తమకు కావాల్సినవి తీసుకున్నారిద్దరూ. అక్కడ్నుండి తిరిగి వస్తుండగా అడిగింది దీప్తి తనను వేధిస్తున్న ప్రశ్నను "ఇండియాకు వచ్చి స్థిరపడటం నీకు సాధ్యపడదా నరేన్?"

"నువ్వెందుకంత పట్టుదలగా ఉన్నావో నా కర్థం కావడం లేదు దీప్తీ. వై యు ఆర్ సో పర్టిక్యులర్ అబౌట్ ఇట్? యు కెన్ ఎంజాయ్ లైఫ్ యిన్‌స్టేట్స్. అయినా నాతో జీవితాన్ని పంచుకోవడానికి ఇదో పెద్ద ఇష్యూలా కనపడుతోందా నీకు? డోంట్ బాదర్ అబౌట్ సచ్ థింగ్స్, దీపీ, నువ్వంటే నాకు...."

అతను ఇంకా ఏదో చెప్పబోతున్నాడు. ఇంతలో వాళ్ళ దారికి అడ్డంగా ఒక అవిటి వ్యక్తి కర్ర సాయంతో ఎదురు వచ్చాడు. "బాబూ! రెండు రోజుల్నుండి అన్నం లేదు. కొంచెం ధర్మం చేయండయ్యా."

నరేన్‌కు ఆపుకోలేనంతగా కోపం వచ్చింది. "డర్టీ పీపుల్స్, డర్టీ కంట్రీ" అని అతడ్నించి తప్పించుకుంటూ, తనను దాటి కొంచెం ముందుకెళ్ళిన దీప్తి చేతిని తన చేతిలోకి తీసుకుని వస్తున్న వాహనాలను తప్పించుకుంటూ రోడ్‌ని క్రాస్ చేసాడు.



తెలుగు చిత్రంలో టి.వి. అర్జునుడు

ఇటీవల సినీ నిర్మాతలు కొంత మంది తమ చిత్రాల్లో టి.వి. నటీనటులను బుక్ చేసుకోవటంలో మోజు చూపుతున్నారు. 'రామాయణ్' ద్వారా సీతగా పేరొందిన దీపికను 'యమపాశం' చిత్రం తొలిసారిగా తెలుగు తెరకు పరిచయం చేసింది. అదే విధంగా 'మహాభారత్'లో అర్జునుడి పాత్రధారి అర్జున్ కూడా తెలుగు చిత్రంలో నటిస్తున్నాడు.

గతంలో కిలాడీకృష్ణుడు వంటి చిత్రాలను నిర్మించిన ఎం.ఎ. అజీజ్ తనస్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్న 'అగ్నిసాక్షి'లో అర్జున్‌కు హీరోగా అవకాశం కల్పించాడు. అర్జున్ సరసన శాంతిలత హీరోయిన్‌గా నటిస్తోంది. తెలుగు అసలేరాని అర్జున్ హిందీలో డైలాగ్స్ వ్రాసుకొని చెప్పాడట. మరి ఈ చిత్రం అర్జున్‌కు ఏమాత్రం పేరు తెస్తుందో వేచిచూడాలి!

తర్వాత గుడికి వెళుతుండగా అంది దీప్తి "ఇంకేమన్నా చెప్పు నరేన్, అదిసరే ఫోర్త్ జనరేషన్, ఫిఫ్త్ జనరేషన్ కంప్యూటర్స్ అని చదివాను ఎక్కడో. అవేమిటసలు?"

ఆమె మామూలుగా మాట్లాడటంతో అతను కుదుట పడ్డాడు. అతను కూడ మామూలుగా అయ్యి ఆమె కర్థమయ్యేలా చెప్పసాగాడు.

గుడికి చేరుకున్న తర్వాత ఆమె గుడి చుట్టూ తిరిగి మూడుసార్లు ప్రదక్షిణం చేసింది. ఆమె చేతులు రెండూ జోడించి భక్తితో తిరిగితే, అతడు ఆమెతోపాటు గుడి గోడలపై పెయింట్ చేసిన దశావతారాల బొమ్మలను చూస్తూ తిరిగాడు.

తర్వాత ఆమె నరేన్ బయట తీసుకున్న కొబ్బరికాయను పూజారికిచ్చి అతను లోపల పూజ చేస్తుండగా, కళ్ళు మూసుకుని చేతులు జోడించి నాలుగైదు నిముషాలు ఏకాగ్రతతో, భక్తితో దేముడ్ని ధ్యానించింది. నరేన్ తన అలవాటు ప్రకారం ఒక నిముషం కళ్ళు మూసుకుని చేతులు జోడించి చెంప లేసుకుని ఆ తర్వాత ఆమెనే గమనించ సాగాడు. ఆ సమయంలో దీప్తి మొహంలో కదలాడుతున్న ప్రసన్నత అతడ్ని ముగ్ధుడ్ని చేసింది.

బయటకు వచ్చిన తర్వాత "ఈసారి నువ్వే డ్రైవ్ చేయి నరేన్. కాని 'బెటర్ లేట్ దేన్ నెవర్' అన్న విషయం గుర్తుంచుకో" అతడు అంతకు ముందు తన డ్రైవింగ్ గురించి అన్న మాటలు గుర్తుకొచ్చి అంది దీప్తి నవ్వుతూ. అతనూ నవ్వేసాడు.

ఇంటికి చేరుకున్న తర్వాత దీప్తి లోపలికి వెళ్ళి, ఐదు నిమిషాల తర్వాత మళ్ళీ తిరిగి కారు వైపు వెళ్ళటం చూసి అడిగింది వైజయంతి, "మళ్ళీ ఎక్కడకు దీప్తీ? అంకుల్ వాళ్ళు బజారు నుండి వచ్చేస్తారు."

"ఇప్పుడే ఓ గంటలోపు వచ్చేస్తానమ్మా. కొంచెం పనుంది. మోహన వాళ్ళింటికే వెళ్ళేది. నరేన్ ప్లీజ్ ఎక్స్క్యూజ్ మి. తప్పని సరై వెళుతున్నాను."

"ఇట్సాల్ రైట్ దీప్తీ. కాని తొందరలో ఇందాక నువ్వు నాకు చెప్పిన విషయం మరచిపోకు. బెటర్ లేట్ దేన్ నెవర్" నవ్వుతూ అన్నాడు నరేన్.

అన్నట్టు గంటలోపే తిరిగి వచ్చింది దీప్తి. తరువాత బలరామ్ గారితోను, భ్రమరాంబతోను నవ్వుతూ, వాళ్ళను నవ్విస్తూ మాట్లాడింది. వాళ్ళ ముగ్గురికి తను గీసిన పెన్సిల్ స్కెచెస్, వేసిన పెయింటింగ్స్ చూపించింది. కాలేజ్‌లో తనకు మొదటి బహుమతి సాధించి పెట్టిన 'జాతీయ సమైక్యత' అన్న విషయం మీద వేసిన పెయింటింగ్స్‌లో తను చెప్పాలనుకున్న దాన్ని ఏవిధంగా రంగుల కలయిక ద్వారా తెలియ చేసానో అర్థమయ్యేటట్టు చెప్పింది.

ఇదంతా అయిన తర్వాత కమల్ తను వేసిన బొమ్మలను తీసుకొచ్చి చూపించేసరికి వాళ్ళందరికీ ఆపుకోలేనంతగా నవ్వొచ్చింది. "మా బొండాం టీచర్" అన్న టైటిల్‌తో నవ్వొచ్చే విధంగా గీచిన ఆమె కేరికేచర్, "స్త్రీ చేసే ఇస్త్రీ" అన్న టైటిల్‌తో ఒక స్త్రీ తన భర్తను ఉతుకుతున్నట్టు గీచిన బొమ్మ అవి తమకు ఎప్పుడు గుర్తుకొచ్చినా నవ్వొచ్చి తీరుతుంది అనిపించాయి వాళ్ళకి. ఆ నవ్వులు ఆగినతర్వాత కమల్ కూల్‌గా చెప్పాడు. "ఇప్పుడు మీ అందరికీ నేనో రహస్యం చెప్పేస్తున్నాను. అంకుల్, ముందు మీరు ఆ తలుపు దగ్గర అడ్డం లేవండి. చెప్పంగానే నన్ను నేను రక్షించు కోవడానికి పారిపోవాలి. మీరెంతగానో ఎంజాయ్ చేసిన "స్త్రీ చేసే ఇస్త్రీ"కి ప్రేరణ నూటికి నూరుపాళ్ళూ మా అమ్మే."

ఆ తర్వాత ఆ ఇంట్లో దద్దరిల్లిన నవ్వు సద్దు మణగడానికి చాల టైమ్ పట్టింది.

భోజనాలయిన తర్వాత అసలు విషయం ప్రస్తావనకు తీసుకొచ్చారు దీప్తి నాన్నగారు. విషయం చెప్పి, "నేను అవసరం లేదు తనకు సరేనంటే ఇష్టమే అని చెప్పినా అంకుల్ వినడం లేదు దీప్తీ. నీ ఇష్టా ఇష్టాల్ని ఆయన స్వయంగా తెలుసుకోవా లనుకుంటున్నారు. నీ మనసులో ఏముందో చెప్పు."

దీప్తి రెండు మూడు క్షణాలు మాట్లాడ లేదు. ఆ తర్వాత నెమ్మదిగా లేచి లోపలి గదిలోకి వెళ్ళి టేప్ రికార్డర్ తీసుకొచ్చి ప్లగ్ పెట్టి "నా మనసులో ఏముందో ఇప్పుడు మీరందరూ వినండి అంకుల్. నేను చెప్పాలను కున్నది మామూలుగా చెప్పలేనేమోనని పించి సాయంకాలం రికార్డ్ చేసాను. అయితే నేను రికార్డ్ చేయని విషయం ఒకటి ఇప్పుడు చెపుతున్నాను అంకుల్. నేను రికార్డ్ చేసింది మీకు వినిపించడానికి నాదో కండిషన్ ఉంది. అది– అదంతా విన్న తర్వాత మీరు మీ మీ ఎమోషన్స్‌ను కంట్రోల్ చేసుకోవాలి. మీ అందరికీ నేనంటే ఉన్న ఇష్టం వల్లే ఈ విషయం గురించి ఇప్పుడిక్కడున్నారని తెలుసు. అలాగే ప్రతి ఇష్టానికి కొన్ని పరిమితులు, కొన్ని అవధులు ఉంటాయనీ తెలుసు. 'ఇది' విన్న తర్వాత మీరు మీ మీ ఎమోషన్స్ కంట్రోల్ చేసుకున్న దాన్ని బట్టి "నేనంటే మీకు ఇష్టం" అన్న విషయం మీద నేనేర్పరుచుకున్న నమ్మకానికి పునాదులు గట్టివో కాదో తెలుసుకుంటాను. అవి గట్టివి కావని తెలిసే పక్షంలో బహుశ మీకు నేనింక కనపడక పోవచ్చు. గట్టివే అని రుజువయితే ఈ టేప్‌లో మీరు వినే నా నిర్ణయానికి సడలింపు ఉంటుంది. అయితే ఇందుకు ఏ వ్యక్తి మనస్తత్వం వల్ల, ప్రవర్తన వల్ల నేను ఈ నిర్ణయానికి వచ్చానో ఆ వ్యక్తిలో పశ్చాత్తాపం వల్ల పూర్తి మార్పు– అదీ ఈ దేశానికి ఉపయోగపడే మార్పు రావాలి."

అందరూ ఆశ్చర్యంగా దీప్తి వంక చూస్తున్నారు– తాము ఎన్నడూ చూడని మనిషిని చూస్తున్నట్టు, ఎప్పుడూ చూసే మనిషిలో తాము ఎన్నడూ ఎరగని మనసును కనుగొన్నట్టు. దీప్తి నాన్నగారు దీప్తిని వారించ బోతుంటే బలరామ్ గారు అడ్డుపడ్డారు ఆయన భుజం తట్టి.

ఒకసారి భార్యవంక, నరేన్ వంక చూసి దీప్తి వంక వాత్సల్యంగా చూస్తూ "టేప్‌ను ఆన్ చేయి తల్లీ" అన్నారు నవ్వుతూ బలరామ్ గారు.

నరేన్‌కు ఏదో కొంచెం అర్థమయినట్టుగాను, చాల అర్థం కానట్టుగాను ఉంది. ఎందుకో తెలియని టెన్షన్‌ను ఫీలవుతున్నా, అతనూ తండ్రి మాటలకు తన అంగీకారాన్ని సూచిస్తున్నట్టు తల ఊపాడు. దీప్తి చాల రిలాక్సింగ్‌గా ఫీలయ్యింది. టేప్‌ను ఆన్ చేసి వచ్చి కుర్చీలో కూర్చుంది.

అక్కడంతా నిశ్శబ్దం అలుముకుంది. జడత్వానికి ప్రతీకలా ఉన్న ఆ నిశ్శబ్దాన్ని చీలుస్తూ వస్తున్న నవ చైతన్యానికి మరోపేరులా టేప్ నుండి వినవస్తున్నాయి దీప్తి మాటలు.

"నరేన్,

నిన్న రాత్రంతా నాకు నిద్ర లేదు. అందరూ పడుకుని నిద్రపోతుంటే గదిలో లైటు తీసేసి కిటికీలోంచి బయట మసక వెలుతురులో తీలగా

క్విట్ ఇండియా

కనపడుతున్న చెట్లను, వాటిపై తన కాంతిని ప్రసరింప చేస్తున్న చంద్రుడ్ని చూస్తూ నిలుచున్నాను చాలసేపు. నా కళ్ళు చూస్తున్నది వాటినే అయినా నామనసంతా ఆక్రమించుకున్నది నువ్వూ, మనం ఎక్కువగా కలసి మెలసి ఉన్న మన బాల్యం.

మనం కలసి స్కూల్‌కు వెళ్ళడం, సాయంకాలం పూట రకరకాల ఆటలు ఆడటం, నీతో లెక్కలు చెప్పించు కోవటం, అలా చెప్పించుకుంటూ మధ్య మధ్యలో నీతో మొట్టించు కోవటం. అసలు నీకు తెలుసా నరేన్, ఒకోసారి నాకు లెక్క అర్థమయినా అర్థం కానట్లు నటించే దాన్ని. నువ్వడిగినపుడు కావాలని జవాబు తప్పు చెప్పేదాన్ని. నీతో అలా మొట్టించు కోవడం నాకు బాగుండేది. ఒకోసారి నొప్పి అనిపించి ఏడుపొచ్చి ఏడ్చేస్తే నువ్వు గడ్డం పట్టుకుని బ్రతిమాలడం నాకు ఇంకా బాగుండేది.

ఇవాళ నువ్వు వచ్చిన దగ్గర్నుండి మనం సాయంకాలం బయటకు వెళ్ళేవరకు నాకు నీతో ఉన్న ప్రతిక్షణం అపురూపంగా అనిపించింది. ఆ తర్వాత జరిగిన రెండు విషయాలు నా సంతోషాన్ని ఆవిరి చేసేసాయి.

నీకు గుర్తుండే ఉంటుంది. సాయంకాలం కేవలం కాలం గడపడం కోసం మనకు ఆకలిగా లేకపోయినా హోటల్‌కు వెళ్ళాం. మనం మేగజైన్స్ తీసుకుని వచ్చేటప్పుడు రెండు రోజుల నుండి తిండి లేదని ఒక అవిటి వ్యక్తి ధర్మం చేయమని ప్రాధేయపడ్డా బేరర్‌కు టిప్‌గా ఐదు రూపాయల నోటు ప్లేట్‌లో వదిలిన నువ్వు కనీసం ఐదు పైసలు అతనికివ్వ లేకపోయావు.

కష్టంలో ఉన్న సాటి మనిషి మీద ఆ మాత్రం దయ, జాలి, సానుభూతి, ప్రేమ చూపలేకపోతే మనుషులుగా మనకు విలువెక్కడుంటుంది నరేన్? మనిషి జన్మకు సార్థకత ఎక్కడుంది? నువ్వు నన్నడగొచ్చు. నన్ను ఇలా ప్రశ్నిస్తున్న నువ్వు అప్పుడే అతనికి ఎందుకు సాయం చేయలేక పోయావని. నీతో కలసి బయటకు వెళుతున్నప్పుడు నాకు డబ్బుతో అవసరం ఉండదని అనుకోవడం నా పొరపాటే అని ఒప్పుకుంటున్నాను.

అసలు ఏమిటి నీ గొప్ప నరేన్? విధి ఆ వ్యక్తిని చిన్న చూపు చూడకుండా ఉండి, నీకున్న అవకాశాలే అతనికి అందుబాటులో ఉంటే అతను నీ స్థితిలో ఉండేవాడుకాదా? ఇటీజ్ సోహాపెన్స్ దట్ హి ఈజ్ యిన్ దట్ పొజిషన్ అండ్ యుఆర్ యిన్‌దిస్ పొజిషన్. దీనిని కాదనగల ధైర్యం నీకుందా?

అతనికి సాయం చేయకపోగా 'డర్టీ పీపుల్, డర్టీ కంట్రీ' అని ఈసడించుకున్నావు. నువ్వు ఈ కంట్రీలో కాదా పుట్టింది నరేన్? మాతృభూమి కన్న తల్లి లాంటిదే. అలాంటిది ఈ మాటలు నువ్వు ఎలా అనగలిగావు? నీకు సిగ్గువేయడంలేదా నరేన్? 'ఏ దేశమేగినా, ఎందుకాలిడినా... పొగడరా నీ తల్లి భూమి భారతిని' అని చిన్నప్పుడు మనం మనస్కూల్లో గొంతెత్తిపాడాం, గుర్తులేదా నరేన్?

ఈ దేశపు గడ్డపై పుట్టి, ఈ దేశపుగాలి పీల్చి పెరిగి, ఈ దేశ ప్రజలతోనే ఈ మాటలు నువ్వన గలిగావంటే నీ సంస్కారం, నీ విజ్ఞత నాకు చాల బాగా అర్థమయ్యాయి. ఈ దేశపు సంస్కృతి నాకు ఉగ్గుపాలతో నేర్పిన శాంతి, సహనం నువ్వు ఈ మాటలన్న క్షణంలో నశించిపోయి నా రక్తం ఉడుకెత్తినా నా బాల్య స్నేహితుడి నుండి, నాకు తెలిసిన వ్యక్తి నుండి, అందులోను నా జీవిత భాగస్వామిగా ఎవరినయితే ఎంచుకోవాలనుకున్నానో ఆ వ్యక్తి నోటి నుండే విన్నందువల్ల కలిగిన దిగ్భ్రమలో నిన్నేమీ చేయలేక పోయాను. ఆ సమయంలో నా హేండ్‌బేగ్‌లో నువ్వు ఏ దేశంతో అయితే నా దేశాన్ని నాతో ఉన్న ఆ కొద్దిసేపు పోల్చి ఎగతాళిగా మాట్లాడావో ఆ దేశపు స్త్రీలకుమల్లే తమ ఆత్మరక్షణార్థం ఒక రివాల్వర్ ఉంచుకున్నట్లయితే, ఆ క్షణంలోనే మరేమీ ఆలోచించకుండా దాంతో నిన్ను షూట్‌చేసి చంపేసేదాన్నేమో!

నీ మీద నాకు చాల ఇష్టం ఉండటానికి ఇంకో ముఖ్యకారణం ఉంది. నీకు తెలుసా నరేన్!

అది నీ పేరు న... రే... న్. ఈ మూడు అక్షరాల కలయికతో ఏర్పడ్డ ఆ పేరన్నా, ఆ పేరుగల వ్యక్తి (వివేకానందుడు) ఈ దేశానికి గడించిన ఖ్యాతి, ప్రపంచదేశాల్లో ఈ దేశానికి పునః ప్రతిష్ఠించిన ఔన్నత్యం, గౌరవం గుర్తుకు తెచ్చుకున్నా నామేను సంతోషంతో, ఆనందంతో పులకరిస్తుంది.

అలాంటి గొప్పవ్యక్తి పేరు పెట్టుకున్న నువ్వు నా దేశాన్ని నా ముందు అవమానించినట్లే, నువ్వు ఇష్టపడే ఆ దేశానికి తిరిగి వెళ్ళిన తర్వాత ఆ దేశ ప్రజల ముందు కూడ తూలనాడితే వివేకానందుడి గురించి చూచాయగా విన్న ఏ వ్యక్తయినా నిన్ను పిచ్చివాడ్ని చూసినట్లు చూస్తాడు.

నరేన్ ఈ దేశపు గడ్డపై పుట్టిన నువ్వు ఇంత నీచంగా మాట్లాడటానికి సిగ్గుపడక పోయినా, నీలాంటి పుత్రుల్ని కన్నందుకు ఈ దేశమాత సిగ్గుపడుతోంది.

ఇది నీకు చిన్న విషయంలా కనిపించవచ్చు. కాని నాకలా కాదు. అందుకే నరేన్ నేను ఈ నిర్ణయం తీసుకుంటున్నది. ఇది నీకు కోపం కలిగించవచ్చు. నా మీద ద్వేషం రగిలించవచ్చు. మన కుటుంబాల మధ్య ఇన్ని సంవత్సరాలుగా ఉన్న స్నేహం, సఖ్యత, సుహృద్భావం అంతరించి పోవచ్చు. వీటన్నిటికీ నేను సిద్ధమే. కారణం నా అంతరాత్మను నేను మభ్యపెట్టుకోలేక పోవడం, నా మనసును నేను సమాధాన పరచుకోలేక పోవడం, ఇప్పటి వరకు సజీవంగా ఉన్న మన చిన్ననాటి స్నేహం, నాకు తెలియకుండానే నేను నీ మీద పెంచుకున్న అభిమానం, మమకారం ఇవేమీ నా నిర్ణయం మీద తమ ప్రభావాన్ని చూపించలేక పోవడాన్నిబట్టే ఈ సంఘటన నన్నెంతగా గాయపరిచిందో, మరెంతగా బాధపెట్టిందో నువ్వర్థం చేసుకోవచ్చు. నా నేస్తంగా నిన్నెప్పటికీ నేను అభిమానిస్తాను. కాని నా జీవితకాలం నాకు తోడు నిలచే వ్యక్తిగా నిన్ను అంగకరించలేను.

ఇదంతా ఇలా అందరి ముందు చెప్పడం, నిన్ను ఈ విధంగా నిలదీయడం నువ్వు అవమానంగా భావించవచ్చు. కాని దానికి లక్షల కోట్ల రెట్లు నీ వల్ల నా మాతృభూమికి అవమానం జరిగింది.


నువ్వు ఎప్పుడయితే ఆ మాటలన్నావో ఆ క్షణంలోనే ఈ దేశపు గాలిని పీల్చే హక్కు, ఈ దేశపు గడ్డపై నిలచే అర్హత కోల్పోయావు.

అందుకే అంటున్నాను–


గెటవే ఫ్రమ్ దిస్ హోలీలాండ్'

క్విట్ ఇండియా నరేన్, క్విట్ ఇండియా''

○



వెన్నెల



చివురుటాకులమీద గోరుముద్ద
పరువం పత్రికమీద చిలిపి కేరింత
వెన్నెల వెన్నెల
ఏటి పొడుగునా ముగ్ధల తొలి చాపల్యంలా
గట్ల పొడుగునా ప్రణయకలహం నటించే
అనుకూలవతి నిరీక్షణలా-
సస్యక్షేత్రాలమీద సాధ్వీమణి ప్రౌఢమౌనంలా
వెన్నెల - వెన్నెల
బృందావనం నుంచి వచ్చిన వెన్నెల
పూలమొక్కల మధ్య కూర్చుని
పాదు చేస్తుంది
అప్పుడా మొక్కలు
మల్లెల్ని, జాజుల్ని పూస్తాయి.
రాత్రి కొమ్మల్లో ఇరుక్కున్న
వెన్నెల చుక్కల తీరులు
ఆడపిల్లల పారవశ్యాందోరులు
జీవనదీ తీరాలపై వెన్నెల
సజీవదృశ్య గాంధర్వం.
పద్యాలు పాడుతూ
నదుల్ని జోకొడుతుంది 'వెన్నెల'
నిఖ్ఖుకుసు కేయగానే
నిరామయంగా వెళ్ళిపోతుంది 'వెన్నెల'

తాజ్‌మహల్ ఉపరితలం
త్రిప్పిపంపిన కిరణ సమస్తం
భగ్నజీవులకి ప్రత్యేకం!
మిత్రుల తోటీ
శత్రుల తోటీ
ఏకకాలం
బంతి భోజనాలు చేస్తుంది 'వెన్నెల'
ఒక్కోసారి
మొగ్గవేసిన గులాబి మొక్కదగ్గర
చిత్రంగా ఆగిపోతుంది 'వెన్నెల'
ఏ అల్లరి మొగ్గో
చల్లగా తెల్లగులాబీలా విచ్చుకుంటే
వెలవెలబోతూ నవ్వేస్తుంది.
ఎంత చెప్పినా
ఎలా చెప్పినా
అనుభవిస్తేకాని తెలియందీ 'వెన్నెల'
వెన్నెల్లో గడిపే క్షణాలు
వెన్నెల్తో గడిపిన క్షణాలు
మనవే - వెన్నెలైపోయే క్షణాలు!

- పురాణపండ శ్రీనివాస్

కొత్త సీరియల్ ప్రారంభం!

సాగరమథనం

అడివి సూర్యకుమారి

(గత సంచిక తరువాయి)

శ్రీలంక రాజధాని నగరమైన కొలంబో ప్రపంచంలోని అతి సుందరమైన ప్రకృతికి ఒక సజీవ ఉదాహరణ.

కొలంబో వీధుల గుండా నడుస్తుంటే ఆకుపచ్చని పందిరి కింద నడుస్తున్నట్లుంటుంది.

ఈ సహజ దీవిలో కొలంబో ఒక్కటే కాస్త పట్టణం అనిపించేట్లుగా వుంటుంది.

మిగతాప్రాంతాలన్నీ గ్రామ + పట్టణ వాతావరణాన్ని పోలి వుంటాయి.

మన ఆంధ్రప్రదేశ్ కంటే తక్కువ విస్తీర్ణం గలది ఈ దీవి.

కాఫీ, టీ తోట లెక్కువ. కాఫీ, టీ ఎగుమతి చేస్తూ కావలసిన వస్తువులు దిగుమతి చేసుకుంటారు. తీరాల్లోని ప్రజలు చేపలు పట్టి జీవిస్తుంటారు.

ఈ ద్వీపానికి సౌందర్యాన్ని తెచ్చేవి, వన్నెనిచ్చేవి చుట్టూతా వున్న దట్టమైన అడవులు.

మన ఆదిలాబాద్ అడవులకంటే ఘోరమైనవి.

కాకులు దూరని కారడవి, చీమలు దూరని చిట్టడవి లాంటి అడవులు ఇక్కడి ప్రకృతి సౌందర్యానికి ఆటపట్టులు.

ఆరేళ్ళుగా పోలీసులకి చిక్కకుండా, టెర్రరిస్టుల్ని, ఉద్యమకారుల్ని, విమోచన దళాల్ని కాపాడుతున్నాయి.

నిజానికి రణసింఘెని కాపాడింది ఈ అడవులే.

ఇప్పుడు రణసింఘె విషయంగానే కొలంబోలోని పోలీసు హెడ్ క్వార్టర్స్‌లో మీటింగ్ జరుగుతోంది. డి.జి.పి. స్థిత బోధి చుట్టూ సీనియర్ పోలీసు అఫీషియల్స్ కూర్చొని వున్నారు.

అందరి మొహాల్లో సీరియస్‌నెస్, గాంభీర్యం తాండవిస్తోంది.

రణసింఘెలాంటి వ్యక్తి పట్టుబడ్డాడన్న ఆనందం వాళ్ల మొహాల్లో మచ్చుక్కూడా లేదు.

మిడుకు మిక్కిలి మిన్నువిరిగి మీద పడబోతున్న వాళ్ళలా అసహనంగా ఉన్నారు. దారుణమైన నిశ్శబ్దం అలముకుందక్కడ.

ఆ సమయంలో.

ఆ ఎయిర్ కండిషన్డ్ గదిలో.

డి.జి.పి. గొంతు ఖంగు ఖంగుమని మోగుతోంది.

"ఐదు లక్షలకాశపడి ప్రాణాలకి తెగించి రణసింఘె లాంటి నరరూప రాక్షసుణ్ణి చంపిన ఆ వ్యక్తి, ఇంకా ఎక్కువ డబ్బిస్తామని ఏ సంస్థ అయినా అంటే మనల్ని కూడా చంపడానికి వెనుకాడడని నా ఉద్దేశం. మనల్నే కాదు ఉన్నత పదవుల్లో వున్న వ్యక్తుల్ని సైతం అతడు డబ్బు కోసం చంపటానికి వెనుదీయడు. కాబట్టి మనం ముందు 'అజ్ఞాత వ్యక్తి' ఎవరో కనుక్కోవాలి. మనం ఇచ్చిన ఐదు లక్షల రూపాయలు ఎవరు తీసుకొన్నది ఇంతవరకూ కనుక్కోలేకపోయారు." అంటూ ఆయన తన క్రింది అధికారుల వైపు కోపంగా చూశారు. వారిలో సీనియర్ లేచి "ప్రయత్నిస్తున్నాం సర్. నెంబర్లన్నీ నోట్ చేసుకున్నాం కాబట్టి తప్పకుండా దొరికిపోగలరు. బస్, రైల్వే, విమాన, నేవీ - అన్ని సంస్థలకి, బ్యాంక్స్‌కి, షాప్స్‌కి, దేశంలోని అన్ని వ్యాపార సంస్థలకి, ఈ నెంబర్లు పంపించటం జరిగింది. అందుకే అన్నీ రిజర్వ్ బ్యాంక్ నోట్లు కొత్తవి, అదీ వంద రూపాయలవే అన్నీను ఇవ్వటం జరిగింది. ఎక్కడైనా ఒక్కనోటైనా కన్పించిందా! వాడు చిక్కినట్టే.'

'గట్టిగా ప్రయత్నించండి. ఇప్పుడు అదే మనకాధారం'

'ఎస్.సర్' అని కూర్చున్నాడాయన.

'రోగానికంటే రోగి కేసిన మందు

> **ఇంతవరకూ సాగిన కథ-1:** శ్రీలంక ఉగ్రవాదులను అరికట్టటంలో తన వంతు కర్తవ్యాన్ని నెరవేర్చి స్వదేశం తిరిగి వెళ్తున్న భారతశాంతిసేనకు వీడ్కోలిచ్చేందుకు వచ్చిన ముగ్గురు అధికారులు దుండగుల బుల్లెట్లకు బలి అవుతారు. ఈ సంఘటనకు కారకుడిగా అనుమానించే రణసింఘెను పట్టిచ్చినవారికి ప్రభుత్వం 5 లక్షల రూపాయలు ప్రకటిస్తుంది. ఒక అజ్ఞాతవ్యక్తి రణసింఘెను హతమారుస్తాడు. అధికారులు అతని శవాన్ని స్వాధీనం చేసుకుంటారు.

రాగి ప్రాణం తీసేట్టుగా వుంది' అన్నట్లుంది మనపని. ఈ పరిస్థితుల్లో మనకి ఈ విద్రోహ చర్యలు జరిపే సంస్థలన్నీ ఒక ఎత్తు [illegible] వ్యక్తి ఒక్కడూ ఒక ఎత్తు. ఇతణ్ణి తొందరగా కనిపెట్టే ఏర్పాట్లు చూడండి. అది ఎంత వేగంగా జరిగితే అంత... ..." అంటుండగానే ఫోన్ మోగింది. ఆయన ఫోన్ ఎత్తి 'ఎస్ డి.జి.పి. స్థితబోధి స్పీకింగ్' అన్నారు.

ఫోన్‌లో ఆయన వింటున్న విషయం ఆయన మొహంలో రంగులొచ్చేట్టు చేసింది. కోపంతో అతని కళ్ళెర్రబడ్డాయి. టేబుల్ మీది అతని చేయి గుప్పిటగా బిగుసుకుంది.

సాంతం విని "ఆ! ఆ! అలాగే! ఇప్పుడే.....ఇప్పుడే...పంపిస్తున్నాను. మీరేమీ వర్రీ కావద్దు" అని ఫోన్ పెట్టేసి అధికారులకేసి తిరిగి 'మొరదీవా డిస్ట్రిక్ట్ హెడ్‌క్వార్టర్స్‌లో ఆ జనతా విముక్తి పెరమున వాళ్ళు ఇండస్ట్రియల్ హౌసెస్ లూటీ చేస్తున్నారట. త్వరగా వెళ్లండి' అన్నాడాయన.

సంబంధిత అధికారులు సెల్యూట్ చేసి హుటా హుటిన వెళ్లిపోయారు.

ఇది జరిగిన రెండు గంటలకి డి.జి.పి.కి ఫోన్ వచ్చింది. ఆయన ఫోన్ ఎత్తి పట్టుకొని అందులోంచి విన్పించే విషయాలని కోపంగా, అసహనంగా వింటున్నాడు.

"ఆ డిస్ట్రిక్ట్ సూపరెంటెంట్ ఆఫ్ పోలీసు, స్పెషల్ ఫోర్స్‌తో వెళ్లి పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు ప్రయత్నించారు. అయితే అప్పటికే అడ్డం వచ్చిన సెక్యూరిటీ గార్డ్స్‌ని ఉద్యమకారులు కాల్చేసి ఇండస్ట్రియల్ హౌసెస్ లూటీ చేశారు. అంతేకాదు అక్కడి ఎలక్ట్రికల్ ట్రాన్స్‌ఫారమ్స్ తగలబెట్టేశారు. బస్సులన్నింటిని ఊరిబైట నిలబెట్టేశారు. ట్రైన్స్ ఎక్కడివక్కడ ఆగిపోయాయి. ప్రజలు ప్రాణభీతితో రైళ్లు బస్సులు దిగి సమీప గ్రామాల్లో తలదాచుకున్నార్ట".

'అక్కడి స్పెషల్ ఫోర్స్ ఏం చేస్తోంది?' ఆ బిల్డింగ్ కదిలేచేంత బిగ్గరగా అడిగాడు డి.జి.

'పోరాడుతునే ఉన్నారు సర్'.

'ఇంకొంత మంది స్పెషల్ రిస్క్ ఫోర్స్‌ని పంపండి వాళ్ళని నామరూపాల్లేకుండా సప్రెస్ చేయండి. బస్సుల్ని రైళ్లని



పోలీసుల సాయంతో నడిపించండి' అని ఆర్డర్స్ యిచ్చాడాయన.

ఆయన ఎదురుగా కూర్చున్న ఐ.జి.పి. మిత్రా విచారంగా మొహం పెట్టి "ఇలా ఎంత కాలమో చేయలేము. ఐ.పి.కె.ఎఫ్.ని పంపించటం మనం చేసిన పొరపాటు పనుల్లో మొదటిది" అన్నాడు.

స్థితబోధి ఆయన వైపు తిరిగి 'వాళ్లు ఉన్నన్ని రోజులు వాళ్లేదో శ్రీలంక ప్రభుత్వాన్ని స్వాధీనం చేస్కోవడానికి వచ్చారన్నట్లుగా స్టేట్‌మెంట్ల మీద స్టేట్‌మెంట్లిచ్చేది. వాళ్లని సాధ్యమైనంత త్వరలో పంపించమని రాజకీయ నాయకుల గొడవ. వెంటనే ఐ.పి.కె.ఎఫ్. శ్రీలంకని విడిచి వెళ్లాలని జనతా విముక్తి పెరుమున బెదిరింపులు, వాళ్లక్కడ ఉన్నన్ని రోజులు మా తీవ్రవాద చర్యలు సాగుతూనే ఉంటాయంటూ ఉద్యమకారుల బెదిరింపులు - ఎంత సంకటస్థితిలో పడ్డామప్పుడు! అందుకేగా వారిని సాగనంపింది' అన్నాడు.

'వాళ్లు వెళ్లాక ప్రశాంత స్థితి ఏర్పడుతుందని పంపారన్నారు. మరి ఏది! మళ్లీ గొడవలు మొదలుపెట్టారుగా. ఐ.పి.కె.ఎఫ్. అడ్డు తొలగించుకోవటానికలా బెదిరించారు గాని...నిజంగా ఈ అల్లర్లు అరాచకాలు చేసే వాళ్ళకి దేశం మీద ప్రేమ వుందంటారా! వట్టిది! తమిళుల్ని అడ్డుపెట్టుకొని దేశంలో అరాచకం సృష్టించడమే ఈ ఉద్యమకారుల ప్రధాన ధ్యేయం అని నాకన్పిస్తోంది అన్నాడు మిత్రా.

'మీ అభిప్రాయాన్ని ఔననలేను. కాదన లేను. చూద్దాం...ఐ.పి.కె.ఎఫ్. వెళ్లింది గదా! క్రమేణా ప్రశాంతత ఏర్పడుతుందేమో! వేచి చూద్దాం! ఇంత సంకట పరిస్థితుల్లో వెంటనే ప్రశాంతత ఏర్పడటం కష్టమే' అన్నాడు స్థితబోధి.

సాయంకాలానికి మొరటువా ప్రాంతంలో పరిస్థితి అదుపులో కొచ్చినట్లు ఫోన్ రావటంతో ఆయన 'హమ్మయ్య! ఈ రోజుకీ గండం గడిచింది' అనుకున్నారు.

అయితే మర్నాడు ఉదయం పది గంటలకి ఉరుములేని పిడుగులాంటి ఫోన్ డి.జి.పి.ని కుదిపివేసింది. ఆ ఫోన్‌లో వార్త వింటూ ఆయన కనుబొమలు ముడుచుకున్నాయి.

"మా లీడర్స్ ఇద్దరిని మీ స్పెషల్ రిస్క్ ఫోర్స్ తీస్కెళ్లారు. వాళ్లిద్దరినీ మాకు వెంటనే ప్రాణాలతో అప్పగించకపోతే నిన్న జరిగిందానికి నూరింతలు ఘోరాలు జరుగుతాయి. 24 గంటలు టైమిస్తున్నాం."

బియ్యపుగింజపై 337 అక్షరాలు

ఢిల్లీలోని దీపక్ అనే వ్యక్తి బియ్యపు గింజమీద 337 అక్షరాలు వ్రాసి ప్రపంచ రికార్డు నెలకొల్పారు. గతంలో జపాన్‌కు చెందిన టోస్టాయో ఇషైల్ బియ్యపుగింజమీద 184 అక్షరాలు వ్రాసి గిన్నీస్ బుక్‌లోకి ఎక్కాడు. అతని రికార్డును యిప్పుడు దీపక్ అధిగమించాడు. దీపక్ వ్రాసిన 337 అక్షరాలలోను 85 దేశాల పేర్లు, గాంధీ, నెహ్రూ, ఇందిరాగాంధీ మొదలైన నాయకుల బొమ్మలు కూడా చిత్రించాడు. తల వెంట్రుకను కుంచెగా తయారుచేసి ఈ సాహసానికి పూనుకున్నాడట దీపక్.

'ఎవరు మీరు! మీ లీడర్స్ ఎవరు? మేం ఎవరినీ అరెస్ట్ చేయలేదు. మాకేం సంబంధం లేదు' అన్నారాయన కఠినంగా.

'స్థితబోధి! నువ్వెవరితో మాట్లాడ్తున్నావో తెలుసా! ప్రాణాల మీద నీ కాశలేదా! జాగ్రత్త! ఒళ్లు దగ్గర పెట్టుకొని మాట్లాడు. ఇది సరిగ్గా విను. మౌంటేలవీనా బీచ్ ఒడ్డున ఉన్న 'విమల ధర్మసూర్య' విగ్రహం దగ్గర సరిగ్గా సాయంకాలం 6 గంటలకి మా లీడర్స్ ఇద్దరినీ మాకప్పగించాలి.'

ఫోన్ కట్ అయింది.

తనకసలు మాట్లాడ్డానికే అవకాశం యివ్వకుండా ఫోన్ పెట్టేయడంతో డి.జి.పి. కోపంతో బుసలుగక్కుతూ "రాస్కెల్స్" అంటూ ఫోన్ పెట్టేశాడు.

స్పెషల్ రిస్క్ ఫోర్స్‌ని కాంటాక్ట్ చేశాడు.

'హలో! నిన్న జనతా విముక్తి పెరుమున లీడర్స్ ఎవరినైనా అరెస్ట్ చేశారా?'

'నో..సర్..ఎవరూ ప్రాణాలతో పట్టుబడలేదు. చనిపోయిన వ్యక్తులు పెరుమున లీడర్స్ కాదు. పెరుమున సభ్యులు మటుకు పదిమంది చనిపోయారు. కాని మన వాళ్లు నూట ఇరవై మందికిపైగానే చనిపోయారు.'

'మరణించిన వాళ్ల సంఖ్యగాదయ్యా నేనడిగేది! లీడర్స్‌ని ఎవరినైనా అరెస్ట్ చేశారా! లేదా?'

ఆ కంఠంలోని తీవ్రతకి జంకిదవతలి గొంతు. 'నో...సర్...ఎవరూ అరెస్ట్ కాలేదు.'

డి.జి.పి. ఫోన్ పెట్టేసి సాలోచనగా టేబుల్ నానుకొని నిలబడ్డాడు.

'ఇదేదైనా ట్రిక్ ప్లే చేస్తున్నారా వీళ్లు!'

'కావచ్చు. తమ అటెన్షన్‌ని డైవర్ట్ చేయటానికలా చేసుండవచ్చు' అనుకొంటూ-

హ్యాట్ తీసి పెట్టుకుంటూ బైటికి నడిచాడాయన. ప్రఖ్యాత ఇండస్ట్రియలిస్టు మహావీర దూతని పరామర్శించటానికి బైలుదేరాడు.

మహావీర దూత ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో టెక్స్‌టైల్ మిల్స్ కొంతభాగం తగలబెట్టబడింది. అతని మనుషులకి, ఉద్యమకారులకి మధ్య జరిగిన కాల్పుల్లో దాదాపు నూటయాభైకి పైగా చనిపోయారు. ఆ తర్వాత వచ్చిన స్పెషల్ రిస్క్ ఫోర్స్ పరిస్థితి నదుపులోకి తెచ్చేందుకు చాలా అవస్థపడింది.

ఇదంతా ఎవరికి తెలుస్తుంది.

"మీకు రక్షణ కల్పించటానికే మేం ఉన్నాం. మీరు, మీ గూండాలు, వాళ్ల మనుషులు కాల్చుకుంటుంటే మేం చూస్తూ ఊరుకోవటానిక్కాదు ఉన్నది. నేరస్తుల్ని మేం శిక్షిస్తాం. చట్టాన్ని మీ చేతుల్లోకి తీసుకొంటే ఎలా?" అంటే.

"మీరొచ్చే సరికి మా ప్రాణాలుండొద్దూ! అందుకే మాసెక్యూరిటీ ఏర్పాట్లు మేం చేసుకుంటున్నాం" అంటున్నారు వాళ్లు.

ఎవర్నీ ఏమీ అనలేని, చేయలేని నిస్సహాయ స్థితి అయింది పోలీసు డిపార్టుమెంటుది.

మహావీరదూత శ్రీలంకలోని ధనవంతుల్లో కెల్లా గొప్పవాడు. రెండు ఫైవ్ స్టార్ హోటళ్లు సగం ఇండస్ట్రీస్ శ్రీలంకలో అతనివే ఉన్నాయి. అతడు సింహళ తమిళుడు. రాజకీయంగా ప్రముఖమైన కీలక పాత్రధారి. ఈ రోజు ఆయనకే తలనొప్పి తెప్పించింది పెరుమున.

'అతణ్ణే స్వాంతన పరచకపోతే తన ఉద్యోగం ఊడటం ఖాయం' అనుకున్నాడు స్థితబోధి. అందుకే ఇప్పుడతనింటికి బైలుదేరాడు. కానీ.....మనసులో పెరుమున వాళ్ల బెదిరింపు మెదుల్తూనే వుంది.

మర్నాడు వుదయం హెడ్‌క్వార్టర్స్‌లో డి.ఐ.జి., డి.జి.పి.లు ఏం చెయ్యాలో తోచని స్థితిలో ఉండగా-

డి.జి.పి.కి అడ్రెస్ చేసిన కవరొకటి

సాగరమథనం

తెచ్చిచ్చారు. అందులో ఇలా వ్రాసి వుంది.

'స్నేహబోధి, అన్న ప్రకారంగా టైముకి మా వాళ్లనందించావు... కానీ..నీ ఆఫీసర్లు మా వాళ్ల బ్రెయిన్స్ వాష్ చేశారు. దీనికి మటుకు ఫలితం చూస్తావ్. ప్రాణాలతో పంపినందుకు థాంక్స్. ఇంకనైనా బుద్ధిగా ప్రవర్తించండి'.

ఇది చదివి అయన మండిపడ్డాడు.

'ఎంత ధైర్యం?' పళ్లు పటపటలాడాయి.

విత్ ది సేమ్ టైమ్ ఆశ్చర్యపోయాడు కూడా.

'తను వాళ్లని రిలీజ్ చేయటమేమిటి'!

ఆ లెటర్ ఐ.జి.పి.కి అందించాడు చదవమన్నట్లు అయన చదివి ఆశ్చర్యంగా చూస్తూ.

"వాళ్ల లీడర్స్‌ని అసలు పట్టుకుందెవరు? తిరిగి ఒప్పగించిందెవరు? బ్రెయిన్ వాష్ చేయటమేమిటి? నాకంతా అయోమయంగా, అగమ్యగోచరంగా వుంది" అన్నాడు ఐ.జి.పి.

డి.జి.పి. ఆ లెటర్ మళ్లీ చదివాడు. చదివి...

'అంటే మనకు తెలియకుండానే ప్యారలల్‌గా మరో గవర్నమెంటు రన్ అవుతోందా?'

*** *** *** *** ***

జాఫ్నా తీరంలో బెస్తలు చేపలుపడుతున్నారు. ఇంతలో కొద్ది దూరాన ఓడ వస్తున్న సూచనలు కన్పించాయి. అది 'తానామలై' ఉన్న దిక్కు నుండి వస్తోంది. బెస్తలలో నల్గురు 'తానామలై' వైపు చూస్తున్నారు. ఆ ఓడ రామేశ్వరం నుండి తానామలై మీదుగా వస్తోంది. దాదాపు తీరానికి దగ్గరగా వస్తున్నట్లే....

ఇంతలో-

బెస్తల్లో ఉన్న ఆ నల్గురూ మినీ పవర్‌ఫుల్ బాంబ్స్ తీశారు. సేఫ్టీ పిన్స్‌లాగి బలంగా వస్తున్న షిప్ మీదికి విసిరారు. సముద్రంలో పిడుగుపడ్డ ధ్వని.

పెద్ద ప్రేలుడుతో షిప్ ముక్కలైంది. మంటలు లేచాయి. స్త్రీ, పురుష, బాల, వృద్ధులంతా ఉన్నారందులో ఏడుపులు, వెర్రికేకలు-భయాందోళనలతో కూడిన చావు అరుపులు -

ఆ ప్రదేశమంతా అతిభయానకంగా, భీభత్సంగా తయారైంది.

చావగా, మిగిలిన - మునిగిపోతున్న జనం చేతులెత్తుతూ రక్షించండంటూ అరుస్తున్నారు.

ప్రేలుళ్లు చప్పుళ్లు రాగానే -

కోస్ట్‌గార్డ్స్, బార్డర్ పోలీసులు, హుటాహుటిన ప్రజల్ని బైటికి తెచ్చే ఏర్పాట్లు చేయసాగారు. డైవర్స్ ఏభైమంది దాకా నీళ్లలోకి దూకారు. బోట్స్ గబగబ ప్రమాదస్థలానికి బైలుదేరాయి. పోలీసులు తీరం వెంబడి వున్న బెస్తలందరిని అరెస్ట్ చేశారు.

'మాకేం తెలియదు' అన్నారు బెస్తలు.

"ఇటు వైపు నుండే బాంబింగ్ జరిగింది. ఇక్కడ మీరు తప్ప ఎవరున్నారు?"

'నిజమే కాని. దుండగులు నీళ్లలో దాక్కొని వుండి ఈ ప్రమాదాన్ని కల్పించవచ్చుగా'

'దాక్కొని ప్రమాదం కల్గించే వాళ్లు సముద్రంలో ఎక్కడైనా ఆ పని చేయొచ్చు. ఇక్కడే ఎందుకు చేయాలి?'

'ఇదిగో మీరిలా మమ్మల్ని పట్టుకోవాలని' వెక్కిరింపుగా అన్నారు బెస్తలు.

పోలీసులు బెస్తవారి నుండి సరైన సమాధానం రాబట్టలేకపోయారు.

వాళ్లకి తెలుసు - ఈ బెస్తల్లో ఒకడికైనా అసలు విషయం తెలుసునని.

కానీ.....వాళ్లని చీల్చినా నిజం చెప్పరు.

మిలిటరీ రంగంలోకి దిగింది.

జాఫ్నా తీరాన్నంతా కవర్ చేసింది. అనుమానితులందరినీ అరెస్ట్ చేశారు. అంబులెన్స్‌లు వేగంగా వచ్చి నిలబడ్డాయి.

చచ్చిపోయిన వాళ్లని తీరాన పడుకోబెట్టారు. గాయపడిన వారిని స్ట్రెచ్చర్ల మీద అంబులెన్స్‌ల్లోకి ఎక్కిస్తున్నారు.

దాదాపుగా నాల్గురోజులు పట్టింది జనాల్ని బైటికి తీసేసరికి.

అసలు కొందరి జాడే లేకుండా పోయింది. దొరికినంత వరకూ బైటపడేశారు.

అయితే.....ఆ షిప్పు నిండా ఉంది తమిళులు. ఈ పని 'సింహళ ఈలం' చేసిందని టి.వి.పి. (తమిళ విమోచన పార్టీ) తలచటంతో గొడవలు బైలుదేరాయి.

"సింహళ ఈలంని సపోర్టు చేసే రాజకీయ నాయకులని ప్రభుత్వం వెంటనే అరెస్ట్ చేయాలి. వారే ఈ దారుణానికి కారకులు"

అని టి.వి.పి. తెల్లవారే సరికి పెద్ద పెద్ద పోష్టర్లు అంటించింది.

పత్రికా ప్రకటనలిచ్చింది.

తమిళ విమోచన పార్టీలో రెండు రకాలున్నాయి. ఒకటి-అహింసావాద టి.వి.పి. రెండు ఉగ్రవాద టి.వి.పి. అహింసావాద టి.వి.పి. ఆరోజు బ్రహ్మాండమైన ర్యాలి నిర్వహించింది.

తమిళులెక్కువగా వున్న ట్రింకోమాలి, జాఫ్నా సిటీల్లో ఆరోజు బంద్ జరిగింది.

ఈ ర్యాలి నాయకులు కొలంబో చేరుకొని పార్లమెంటు ఎదురుగా ధర్నాలు, నిరాహారదీక్షలు చేయాలని నిర్ణయించారు.

(ఇంకా వుంది)

ప్రశ్నావళి కె.రామలక్ష్మి

జ్యోషి శ్రీధరాచార్య, అయిజ

యస్టర్‌డే, టుడే, టుమారో కామెంట్ ప్లీజ్?

* నిన్న వెళ్లింది. మరిచిపో
నేడు జరుగుతుంది - జీవించు.
రేపు - తెలియనిది - అంచనా వెయ్యకు!

ఎమ్.వి. మూర్తి, హైదరాబాదు

'కలకాలం బ్రతుకు' అని దీవిస్తారు, జరిగే పనా?

* కాదు. జీవితం సుదీర్ఘం. పెద్ద గొప్పేం కాదు. మంచి బ్రతుకు - చాలు సుదీర్ఘం అనిపించడానికి - కలకాలం బ్రతికి ఎవరికీ జ్ఞాపకం వుండనివాళ్లు కొద్ది కాలమే బ్రతికి శాశ్వతంగా జ్ఞాపకం వుండేవాళ్లు లేరా మనకి??!

కాజ హానిత, ఏలూరు

ఈ పృధ్విలో ఏ బంధం శాశ్వతం కాదు. అసలు మనిషే శాశ్వతం కానప్పుడు బతికిన రెండు రోజులు ఉన్నతంగా బ్రతకక ఎందుకండీ అర్థంలేని పోరాటాలు?

* ఎందుకేమిటి? ఒకరి కంటే ఒకరు వున్నంతలో ఉన్నతంగా బ్రతకాలని.


నేటి సాహిత్యంలో అటు చలన చిత్రాలలో స్త్రీ పాత్ర చిత్రీకరణ అసహ్యమైన విధంగా చిత్రీకరింపబడుతూంది. అనూహ్యమైన విధంగా చిత్రీకరింపబడుతూంది. ఈ మార్పులు చూస్తూంటే స్త్రీ గౌరవం నానాటికీ తరిగిపోతున్నదేగాని పెరగడం లేదు అనిపిస్తూంది. ఆరోగ్యకరమైన మార్పు కోరడం అత్యాశే అంటారా?

* కాక! పూర్తి పతనం తరవాతే కద కొత్త పుట్టుక?!

జి.వి.రాఘవేంద్రరావు, మచిలీపట్నం

వివాహాది శుభ కార్యాలలో బంధుమిత్రులు నగదు రూపంలో కట్నం చదివించేప్పుడు నూట, అర్థనూట పదహార్లు అని యిస్తుంటారు, ఇవెలా వాడుకలోకి వచ్చాయి?

* అలవాట్లే సంప్రదాయాలు....చివరసున్న బాగుండదని కాబోలు - నూట ఒకటి పదకొండు కూడా యిస్తుంటారు. అభిమానంతో యిచ్చేవి ఒకటీ అరా అయినా వేలకి వేలు విలువ చేస్తాయని సూక్ష్మార్థంగా మనం గ్రహించాలి. అంతే.



న్యాయపతి రమేష్‌బాబు, హైదరాబాదు

ఒక్కొక్కసారి మనసు చాలా దిగులుగా వుంటుంది - మనుషులు కొందరు కడుపు నిండా తిండి తినలేకపోతున్నారే అని. ప్రతి మనిషికీ కడుపునిండా తిండితినే రోజు వస్తుందంటారా?

* వచ్చే అవకాశం లేదు - తిండికీ - జనాభా పెరుగుదలకీ పొంతన మన దేశంలో కుదిరేపని కాదు. తిండిగింజల పంట పెంచుతున్నకొద్దీ - తినేవాళ్ల సంఖ్య అంతకు రెండింతలు అయితే - ఈ రేసు గెలిచేదెలా?

చాలామంది నల్లధనం దొంగతనంగా దాచుకుంటారు కదా! సడెన్‌గా ఆ వ్యక్తి చనిపోతే ఆ డబ్బు బూడిదపాలు కావలసిందేనా?

* ఎవరిదగ్గరైనా దాస్తే - అతగానిపాలు. లేదా బూడిదపాలు. వినలేదా రాజుల సొమ్ము రాళ్లపాలని. గోడల్లో, నేలలో, మంచాల్లో ఎక్కడ వీలైతే - అక్కడంతా డబ్బు దాచుకోవడం ఎందుకు? కష్టాలు కొనితెచ్చుకోవడం ఎందుకు?

డబ్బున్నవాడే ఆకలి గురించి ఉపన్యసిస్తాడు. పదవిలో వున్నవాడే వాగ్దానాలు ఇస్తున్నాడు. మొత్తానికి నలిగిపోవలిసినది సామాన్యుడేనా?

* అంతేకద మరి. ఓటరి డబ్బుల రంగడు - పొగిడితే - ఉబ్బిపోతాడు. ఏం చెప్పినా సమ్మోహనపరచినట్లు నమ్మడానికి సిద్దంగా వుంటాడు....తీరా ఓటేసి గెలిపించాక తిరిగి చూడకపోతే - 'ఎప్పుడూ ఇంతే - ఎప్పుడుమటుకు ఏం చేశారు కనుక?' అని మూలిగి వూరుకుంటాడు. చిత్రమేమిటంటే - మళ్లీ ఎన్నికలు రావడం - వాళ్లు వేడుకోడం - వీరు తలూపడం - పునరపి! పునరపి!

శ్రీకొండ నవీన, గూడూరు

ఐదువేల సంవత్సరాల పూర్వంనుండి వివిధ రకాల రాళ్లకు, చెట్లకు, పుట్టలకు మానవుడు దైవం ప్రత్యక్షమవుతాడని పూజిస్తున్నాడు. నేటికి వారి వాంఛ నెరవేరలేదు. మతాల పేర వివిధ దినాలకి ప్రభుత్వం సెలవులు ప్రకటించడం ఆశ్చర్యం కాదా?

* మనిషి ఆశాజీవి అనడానికి నిదర్శనం అతని తీరని కోరికలేనని మనం గ్రహించాలి. ఐదువేల ఏళ్లలో జరగనిది - ఏమో మరుక్షణంలో జరిగితే?! ఇక ప్రభుత్వం అంటారా - ఏ ఎండ కా గొడుగే కాదు - ఏ పుట్టలో ఏ పాముందోనని కూడ జాగ్రత్త పడుతూవుంటుంది!

జి.వి. రావు, విశాఖపట్నం

అంతులేనిఆలోచనలుఎందుకు? అంగుళం ముందుకు సాగనప్పుడు?


* మనిషి ఆలోచనలే - మనిషి తుది విజయానికి దారి అని మీరు వినలేదా? ఆలోచించక పనిచేసి ఫలితాలకి తలఒగ్గే తత్వం - అజ్ఞానానికి చిహ్నం మాత్రమే.

అతి తెలివికి అర్థం ఏమిటి?

* తెలివి తేటలని అవహేళనగా చూసేదే అతి తెలివి!


జీవితం పూవైతే?

* ప్రేమ దానిలోని మధువు.


he Largest Circulated Telugu Fort Nightly
మీకేం
ఫెర్ఫెక్ట్‌గా
వున్నారు సగం దాకా
'కలువబాల'తో
నేస్తం కట్టండి
మిగతా సగం పూర్తి అయి
పరిపూర్ణ యువతి
అవుతారు!
ఆంధ్రపత్రిక వారి
వనితాభ్యుదయ
పక్షపత్రిక-
చదివించండి! చదవండి!
కలువబాల

నిమజ్జనేకం

ఎక్.భద్రేశ్వర రావు



"గోవిందా... గోవింద....
ఏడుకొండల వాడా...
వెంకటరమణా....
గోవిందా.... గోవింద"
భూషయ్య వేంకటేశ్వరుడి పటం ముందు కూర్చుని నెమరేసు కుంటున్నాడు.

నెమరేసుకోటం అంటే లోలోన కాదు. బిగ్గరగా, అదీ చుట్టూరా దడిలా నిలుచున్న ముప్పయ్ మంది జనానికి వినపడేలా. అసలా ముప్పయ్ మందీ ఎందుకక్కడ పోగైందీ, అట్లా భూపయ్య అరిగిపోయిన గ్రామ్‌ఫోన్ రికార్డులా "గోవింద" కొట్టటం గురించీ చెప్పనే లేదు కదూ!

అది భూషయ్య ఇంట్లో వీధి గుమ్మం వైపు గది.

ఆ రోజు విదియ.

క్రొత్తపని ప్రారంభించటానికి బహు భేషైన రోజట. ఆ విషయం సాక్షాత్తూ ఆ పేట శాస్త్రులు గారే సెలవిచ్చారు. భూషయ్యకు మొదట్నుంచీ ఆ శాస్త్రులు గారన్నా, ఆయన మాటన్నా మాంచి గురి. అందుకే శాస్త్రులు గారు పెట్టించిన ముహూర్తానికే ఆ శుభకార్యం కాస్తా జరిపించేస్తున్నాడు.

శివం పని నేర్చుకోవటం పూర్తయింది. అంటే పనిమంతుడయ్యాడన్న మాట. ఇదేమిటి హనుమంతుడిలా అనుకునేరు. హనుమంతుడు కాకపోతే అతగాడి తమ్ముడనుకోండి. శివం నేర్చుకున్నది ఆపనీ, ఈపనీ అనుకునేరు. అందరూ చేసే అల్లాటప్పా పని కాదది.

రోజులు కవిసొస్తే ఒక రాష్ట్ర ముఖ్యమంత్రి కూడా సంపాదించలేనంత సంపాదించే బంగారప్పని! ఇది శివం తండ్రి భూషయ్యలో చిరకాలంగా (శివాన్ని ఆ పనిలో పెట్టిందగ్గర్నుంచీ) వేరూనుకొని వున్న ఒకానొక దురభిప్రాయం.

ఆడబిడ్డ ముక్కు పుడక చేసిమ్మంటే అవగింజంత దొబ్బేసే బంగారప్పని!

తాకట్టు గాళ్ళనీ, తాగుబోతుల్నీ తన చుట్టూరా త్రిప్పుకునే బంగారప్పని!

బంగారాన్ని రహస్యంగా తరలించేందుకని రకరకాల మూసల్లో పోసే బంగారప్పని!

శివం పని నేర్చుకున్నది ఒన్‌టౌన్‌లో. అదీ "ది గ్రేట్ గోల్డ్‌స్మిత్ ఆఫ్ ఒన్‌టౌన్" పాపారావు దగ్గర. మొత్తం పదేళ్ళు పన్జేశాడు. పదేళ్లలోనూ పదీ ఇంటూ పది రకాల ఆభరణాల్ని చెయ్యటంలో గొప్ప నేర్పును సంపాదించాడు.

ఒక సంవత్సరంగా శివం స్వంతంగా కొట్టుపెట్టు కోవాలనుకుంటున్నాడు. కానీ అతని కోరిక ఫలించటం లేదు. దాన్ని అటు పాపారావూ, ఇటు భూషయ్యా కలిసికట్టుగా సమాధి చేస్తూ వస్తున్నారు.

మంచి వర్కరును అప్పుడే వదులుకోటం సుతరామూ ఇష్టంలేదు పాపారావుకు.

కొడుకు చేత స్వంత కొట్టు పెట్టించే ఆర్థిక స్తోమత లేదు భూషయ్యకు.

ఎట్లాగో ఉగ్గబట్టి ఒక్క సంవత్సరం గడిపేశాడు శివం. భోజనానికి రాత్రి వచ్చినప్పుడల్లా తన విషయమై తండ్రితో ప్రస్తావించేవాడు శివం.

"సరే..... చూద్దాం లేరా!" అంటూ ఎప్పటికప్పుడు తప్పించుకునేవాడు భూషయ్య.

చిట్టచివరకు శివమే జయించాడు. దాని ఫలితమే ఈ స్వంత కొట్టు ఆవిర్భావం. దాని తాలూకుదే ఈ తతంగమంతా.

నిజానికి శివం ప్రయోజకుడు కావటం, స్థానిక బ్యాంకు సహాయంతో చిన్నపాటి మిషనరీతో కొట్టు పెట్టుకోటం భూషయ్యకూ, కాంతమ్మకూ నమ్మశక్యం కాకుండా వుంది. ఒకర్నొకరు గిల్లి చూసుకున్నారు కూడా. నిజానికి బ్యాంకు వ్యవహారాలన్నీ పాపారావే దగ్గరుండి స్వయంగా జరిపించాడు.

ఎందుకంటే ఆవూరికి భూషయ్యా, కాంతమ్మలు కట్టుబట్టల్తో వచ్చారు. వచ్చిన అయిదేళ్లకు శివం పుట్టాడు. తర్వాత పదిహేనేళ్లకు చిట్టి పుట్టింది. ఇరవై అయిదేళ్లకు ఏదో తినీతినక ఒక చిన్న ఇంటిని సమకూర్చుకున్నాడు భూషయ్య. అదీ శివం చేతికంది వచ్చాకనే.

చిట్టికైతే ఈతతంగమంతా మూడు చాక్లెట్లూ, ఆరు ఐస్‌క్రీంల్లా వుంది.

నిజానికి శివం శివంగా వుండేది చాలా అరుదుగానే. శివమెత్తిందా చిందులు త్రొక్కుతాడు. ఆ చిందుల్లో మనక్కనపడేది హనుమంతుడే కానీ పరమ శివుడు కాదు. లేకలేక పుట్టిన వాడు కాబట్టి అల్లారు ముద్దుగా శ్రీరామచంద్రుడిలా పెంచారు. కానీ వాడిలో పెరుగుతున్న కొద్దీ హనుమంతుడి లక్షణాలే అధికం కాసాగాయి. అది టూకీగా శివం మనఃప్రవృత్తి.

ఈ ఒక్క లక్షణం నుంచీ వేరు చేసి చూస్తే శివం మంచివాడే!

చిన్నప్పుడు హైస్కూలు చదువు చెప్పించే స్తోమతు లేక భూషయ్య శివాన్ని బంగారప్పనిలో పెట్టించాడు. మొదట్లో ఒక సంవత్సరం పని ఎగ్గొట్టి ఎక్కడెక్కడో గోలీకాయలూ, గోడంబిళ్లా ఆడుతూ తిరిగేవాడు. అది రెండో సంవత్సరాని కొచ్చేసరికి సినిమాపిచ్చిగా మారి సంవత్సరం సంవత్సరానికీ షుగర్ వ్యాధిలా శరీరమంతా వ్యాపించిపోయింది. దానికి తోడు ఇటీవల తాజాగా అమ్మాయిల వేటొకటి! ఇవి భూషయ్యకు పాపారావు అందజేసిన దఫదఫాల శివం ప్రోగెస్ రిపోర్టులు!

"దాన్దేముంది.... వయసు ప్రభావం లెమ్మని" భూషయ్య తనకు తాను సర్ది చెప్పుకున్నాడు. కాంతమ్మ "చిన్నపిల్లాడు లెద్దూ.... పెద్దయితే వాడే తెలుసుకుంటా"డన్నది.

అయితే శివంలో ఒక సుగుణం కూడా వుంది.

అది అతను పేకాట, త్రాగుడూ జోలికి ఎప్పుడూ పోకపోవటం!

స్వంతంగా కొట్టు పెట్టుకుంటే ఆతర్వాత కొడుక్కి మంచి మంచి పెళ్ళి సంబంధాలొస్తాయనీ, దాంతో పాటు కట్నకానుకలు కూడా దండిగా ముడతాయనీ కన్నవాళ్ల ఆలోచన.. ఆశ...

అదిగో అప్పట్నుంచి సతాయిస్తూ వుంది.


శివం ఇంట్లో వున్నప్పుడు మంచం మీదకో, కంచం ముందో మాత్రమే ఉండేవాడు. వీధిన పడితే కాలుగాలిన పిల్లే! కానీ పాపారావు దగ్గర కొలువుకు కుదిరిన తర్వాత అదీ ఈ అయిదేళ్ల దగ్గర్నుంచీ కట్టు కొయ్యకు కట్టేసిన దున్నలా, మెడకు గుదిబంత తగిలించిన మొకరి కోడెలా ఫీలవుతున్నాడు పూర్ ఫెలో!

శివం స్వంత కొట్టు ప్రారంభోత్సవానికి పాపారావుగారు ప్రత్యేక ఆహ్వానితుడు. పైగా అతని రాకలో ఒక విశేషం కూడా దాగి వుంది. అది శివం కొట్టు ప్రారంభోత్సవం చెయ్యాల్సిన పని. డాక్టర్ కాకపోయినా పాపారావు 'హస్తవాసి' చాలామంచిదని నమ్ముతారు అతని దగ్గర పనిచేసే కుర్రాళ్లంతా. సరిగ్గా ఇట్లాంటి అభిప్రాయమే కొంతమంది కస్టమర్లకూ ఉంది.

అతని షాపులో తయారైన ఏ వస్తువైనా సరే నాలుగు కాలాలపాటు మన్ని తీరవలసిందే. ఇదిగో ఇది వూడిపోయిందనో, అదిగో అది తెగిపోయిందనో వగైరా రిమార్కులు పాపారావు ముప్పయ్యేళ్ల సర్వీసులో ఎరగడు.

పాపారావు, శివం తల్లిదండ్రులు స్వయంగా వచ్చి తనను ప్రారంభోత్సవం చెయ్యమంటే కాదనలేక పోయాడు. తన చేత్తో తన దగ్గర పన్జేస్తున్న కుర్రాళ్ల కొట్లను ఎన్ని ప్రారంభం చెయ్యలేదు గతంలో. అందులోనూ పాపారావుకు శివం అంటే వల్లమాలిన అభిమానం. ఎట్లా కాదనగలడు మరి!

శివం కాస్త పోకిరీ అయినా పని విషయంలో చాకులాంటి కుర్రాడని పాపారావుకో స్థిర అభిప్రాయం చాన్నాళ్ళుగా వుంది.



శివం స్వంతంగా కొట్టు పెట్టుకునే స్థాయికి ఎదిగి, ప్రయోజకుడవుతున్నందుకు భూషయ్యా, కాంతమ్మా ఎంతగానో ఉబ్బి తబ్బిబ్బయ్యారు.

వచ్చిన ఆ వీధి వాళ్ళూ, చుట్టు ప్రక్కల బాగా ఎరిగున్నవాళ్ళూ శివాన్ని నోళ్లతో మెచ్చుకున్నారు. అక్షింతలతో ఆశీర్వదించారు.

శివం చెల్లెలు చిట్టి పట్టు పరికిణిలో ఎంతో ముద్దొస్తోంది.

ఆ ప్రారంభోత్సవానికే చిట్టి ఒక ప్రత్యేక ఆకర్షణగా అందర్నీ ఆకుట్టుకుంది.

కార్యక్రమం ప్రారంభమైంది.

పాపారావు చిన్న వ్రాత బల్ల ముందు బాసింపట్టు వేసుక్కూర్చున్నాడు. ఆ ప్రక్కనే శివం, భూషయ్యా, కాంతమ్మా కూర్చున్నారు. చిట్టి కాంతమ్మ వళ్లో ఎంచక్కా కూర్చుంది.

ఆ వ్రాత బల్ల మిద లక్ష్మీదేవి, వేంకటేశ్వరస్వామి విఘ్నేశ్వరుడూ వున్న పటాలు అదే వరుసలో ప్రక్క ప్రక్కనే గోడకు ఆనించి నిలుచోబెట్టి ఉన్నాయ్. ముగ్గురి దేవుళ్లకూ కుంకుమా, గంధం బొట్లూ, పూలమాలలూ, పటాల మూలలందు గ్రుచ్చిన అగరొత్తులూ సమంగానే ఉన్నాయ్. దేవుళ్ల ముందర ధూపం, దీపం, నైవేద్యం కొబ్బరికాయలు కూడా సమానంగానే ఉన్నాయ్!

స్తోత్రం మాత్రం శ్రీ వేంకటేశ్వరుడికే ప్రత్యేకం.

అది భూషయ్య భక్తి తత్వం!

అట్లాగని ఆయనకు 'శ్రీ వేంకటేశ్వర సుప్రభాతం' అంతా కంఠతా వచ్చునుకునేరు. ఒక్క శ్లోకమూ, చివరికి 'కౌసల్యా సుప్రజా రామా' అన్నది కూడా నోటికి రాదు. ఎంతవరకూ మొదట్లో చెప్పానే అదే ఆయన నోటికొచ్చిన స్తోత్ర పాఠం. భూషయ్య చదువు అక్షరాలతోనే కొండెక్కటంతో చదవనూ, రాయనూ కూడా కొడిగట్టిపోయాయి.

అంతెందుకు ఏడు కోట్ల ఆంధ్రులకూ కంఠతా వచ్చిన పదాలు ఏమన్నా ఉన్నాయంటే (నాస్తికులు క్షమించాలి) అవే!

అక్కడే ఉంది శ్రీ వేంకటేశ్వరుడి గొప్పతనమంతా!

పాపారావు లౌక్యం తెలిసినవాడు కాబట్టి మొ దట విఘ్నేశ్వరుణ్ని స్తుతించాడు. ఆ తర్వాత అక్కడ కొలువైయున్న దేవతనీ, దేవుణ్నీ స్తుతించాడు. ఓ కొబ్బరికాయ అదీ విఘ్నేశ్వరుడి ముందు కొట్టి బంగారప్పనికి శ్రీకారం చుట్టాడు.

పాపారావు వస్తూ వస్తూనే అయిదు తులాల బంగారాన్ని కరిగించి మరీ తెచ్చాడు. ఆ తెచ్చిన బంగారం ముద్ద నెత్తిన నాలుగు సుత్తి దెబ్బలు వేసి, మచ్చు చూసి, దాన్ని శివానికి చూపించి ప్రారంభోత్సవం కాస్తా అయిందనిపించాడు.

ఆశీర్వచనాలు పలికిం తర్వాత సదరు బంగారాన్ని శివం చేతుల్లో పెట్టి "శివం! దీన్తో రెండు పేటల నాంతాడు చెయ్యాలి. క్రొత్తగా ప్రారంభించావు కాబట్టి కొంచెం ఆలస్యమైనా ఫరవాలేదు. మొదటిసారి కాబట్టి నీకు పని నేనే యిస్తున్నా!" అన్నాడు పాపారావు తన వంతు సంతోషాన్ని

నిమజ్జనమ్

వ్యక్తపరుస్తూ.

రెండు పేటల్లో నాంతాడు ఎట్లా చెయ్యాలో, కొలతలూ, నికర తూకం చెప్పి అందరి వద్దా సెలవ్ తీసుకొని పాపారావు వెళ్ళిపోయాడు.

ప్రారంభోత్సవానికి వచ్చిన వాళ్లంతా దాదాపుగా తలొకవస్తువూ ఇస్తామని వాగ్దానం చేశారు శివానికి.

ఎవరో ఒకావిడ పట్టీలు చేసి పెట్టమని అప్పుడే నాలుగొందలు బయానాగా శివం చేతిలో పెట్టింది. అంతే! ఆ వెంట వెంటనే నాలుగైదు వెండి ఆర్డర్లూ వాటి వెంట కొంత సొమ్మూ శివం చేతిలో వచ్చి పడ్డాయి.

శివం చేతిలో వున్న డబ్బు తీసుకుని దేవుళ్ల ముందర బల్ల మీదుంచింది కాంతమ్మ.

"దేవుడా! ఇట్లాగే నా కొడుక్కి రోజుకి మూడు నాంతాళ్ళూ, ఆరు నల్లపూసల గొలుసుల పని ఇప్పించు సామీ! దేవుడా....!" అంటూ మనసులోనే మొక్కుకుంది. కాంతమ్మ 'దేవుడా!' అని అన్నదే కానీ నిజానికామె మొక్కుకుంది ముక్కోటి దేవతలకూ.

భూషయ్య మళ్లీ బిగ్గరగా "గోవిందా.... గోవింద.... ఏడకొండలవాడా.... వెంకటరమణా.... గోవిందా.... గోవింద...." అంటూ ఓ కొబ్బరికాయని దెబ్బకు సగానికి పగలేశాడు. ఆ తర్వాత కాంతమ్మా, తర్వాత శివం చెరో కొబ్బరికాయా కొట్టారు. కానీ అవి సమంగా పగల్లేదు. ముగ్గురూ ముగ్గురి దేవుళ్లకూ 'మార్చింగ్'లా ఒకేసారి నమస్కరించారు.

వాళ్లను చూసిన చిట్టి, చిట్టి చేతులతో తనూ ఓ నమస్కారం పెత్తింది.

భూషయ్య వచ్చిన వాళ్లందరికీ తాంబూలం, పంచదార కలిపిన కొబ్బరి ముక్కలూ పంచాడు. వాళ్లంతా శివానికి 'శుభం' పలికి వచ్చిందారి పట్టారు.

భూషయ్యకు బాగా తెలిసిన ముగ్గురు మాత్రం చెరో అయిదూ, ఒకరు పదీ నోట్లను శివాన్ని ఆశీర్వదిస్తూ అతని చేతిలో పెట్టారు.

పనేమీ మొదలు పెట్టకుండానే పదిహేన్రూపాయలు అదీ కొట్టు ప్రారంభంనాడే కొడుకు కళ్ల జూట్టం శుభంగానే అన్పించింది కాంతమ్మకు. ఆ ఆనందంలో కాంతమ్మ కాసేపు గాల్లో తిరిగొచ్చింది. భూషయ్యా కూడా కాసేపు గాల్లో తేలిపోయాడు కానీ ఎక్కడ పడిపోతానో అని చెప్పేసి చప్పున భూమ్మీద కొచ్చేశాడు.

కాంతమ్మ మాత్రం అవకాశం వచ్చిందే చాలని చాలాసేపు గాల్లోనే విహరించింది.

అయిదేళ్ల చిట్టి కూడా నాలుగు అక్షింతలు పడ్డంతో అదో పెళ్లి తంతులా అన్పించింది చిట్టికి.

నిజానికి ఇంటిల్లిపాదీ పెళ్లి భోజనాలే చేశారా పూట!

సాయంత్రం శివం అట్లా బయటికెళ్లి స్నేహితులతో చక్కర్లు కొట్టి కాస్త పొద్దు పోయాక గానీ ఇంటికి రాలా. గతంలో అయితే భూషయ్యా కాంతమ్మలు కేకలేసేవారు. కానీ ఇప్పుడు కొడుకు సంపాదనాపరుడు. అందుకే కిక్కురు మన్లేదు.

సహజంగా మధ్యతరగతి కుటుంబాల్లో సంపాదనాపరుడైన కొడుకు ఎంత తప్పు చేసినా తల్లిదండ్రులు గట్టిగా మందలించలేరు. గట్టిగా మందలించటం మాట అటుంచి పన్నెత్తి మాట కూడా అనరు.

ఆ సంపాదన అంత గొప్పది. కొడుక్కీ, తండ్రికీ మధ్య అది సరిహద్దుల్ని నిర్ణయిస్తుంది. ముఖ్యంగా ఈ దేశంలో అయితే ఇది మరీను. అట్లా మందలించటం జరిగిన ఏ వృద్ధ తల్లికీ, తండ్రికీ సహజమైన చావు రాదు.

వస్తే గిస్తే ఆకలిచావో...? బలవంతపు చావో...? అంతే...!

భూషయ్య, కాంతమ్మలు కలలుగన్న రాత్రి వాళ్ల జీవితంలో ఏదన్నావుంటే అది ఆ రాత్రే. శివం మాత్రం ఎప్పట్లా గుర్రుపెట్టి మొద్దు నిద్రే పోయాడు.

తెల్లవారింది.

తొమ్మిదింటికల్లా శివం కాఫీ ఫలహారాన్ని లాగించేశాడు.

భూషయ్య అప్పటికే తనపనైపోయిందని ... ... నిమగ్నమై బయటికి పోయాడు.

శివం ...

అపరాజితకు మళ్ళీ అవకాశం

'రామాయణం'లో మండోదరి పాత్రను ఒక సవాల్‌గా తీసుకొని ఆ పాత్రకు న్యాయం చేకూర్చిన 36 సంవత్సరాల అపరాజితకు మళ్ళీ మరో అవకాశం వచ్చింది. నటీనటులు భరత్‌భూషణ్-రేత్నాభూషణ్‌ల కుమార్తె అయిన అపరాజితకు అనుకోకుండా టి. వి. పరిశ్రమలో అవకాశం వచ్చింది. కళాకారుల యింట పుట్టినా ఆమె నటనకు దూరంగా వుండాలనుకుంది కాని 'రామాయణ్'లో రామానంద్‌సాగర్ అవకాశం కల్పించాడు. డబ్బింగ్, అడ్వర్‌టైజ్‌మెంట్ చిత్రాల్లో కూడా అపరాజిత నటిస్తోందట. ఆమె భవిష్యత్తు ఆశాజనకమే నను కుంటున్నారు తల్లిదండ్రులు. అనుకోరా మరి!

కూర్చున్నాడు. అగరొత్తి ఒకటి వెలిగించి ఎదురుగా గోడకు వ్రేలాడుతోన్న శ్రీ వేంకటేశ్వరుడికి ఒక దణ్ణం పెట్టి పని ప్రారంభించబోయాడు.

నిన్న తల్లి తనకు చెప్పిన విషయం గుర్తుకు రావటంతో బంగారప్పని ఆ రోజుకు వాయిదా వేసుకున్నాడు.

పట్టీలు చేసేందుకని మిషనుమీద తీగలాగే కార్యక్రమం చేపట్టాడు. మధ్యాహ్నానికల్లా చక్కగా, నాజూగ్గా తీగలాగటం పూర్తయింది. లాగిన తీగను ఒకటికి రెండు సార్లు చూసుకుని శివం తెగ మురిసిపోయాడు. ఆ మురిపాలలో చెప్పొద్దూ! కాంతమ్మ కూడా పాలు పంచుకుంది.

శివం భోంచేసిన వెంటనే మళ్ళీ పనిలో నిమగ్నమైపోయాడు. అట్లా సాయంత్రానికల్లా జత పట్టీల్ని సునాయాసంగా తయారు చేశాడు శివం. షాపులో పని చేసేటప్పుడైతే రెండు జతల పట్టీల్ని సాయంత్రానికల్లా యజమాని కిచ్చేసేవాడు. తొలి రోజు కావటంవల్లా, ఎవరి సాయమూ లేనందువల్లా కాస్త టైమ్ తీసుకుంది శివానికి.

తెల్లవారితే వినాయకచవితి.

దగ్గర్లోవున్న థియేటరులో రేపు రద్దీగా వుంటుందేమోనని సాయంత్రమే శివం ఫస్ట్‌షో 'పాతాళభైరవి' సినిమాకి చెక్కేశాడు. తీరా చిత్రం చూశాక పాతాళభైరవి బొమ్మ తనకే లభ్యమైనట్టు ఫీలయ్యాడు శివం.

వేకువకు ముందె వినాయకచవితి వచ్చేసింది.

ఎనిమిదో ప్రపంచ వింతలా శివం తెల్లవారుజామునే లేచాడు.

ఇరుగు పొరుగు స్నేహితులతో కలిసి సైకిలుమీద ఊరు బైటి కెళ్ళాడు. తోరణాలకు మామిడాకులూ, విఘ్నేశ్వరుడి పూజకు పత్రిగట్రా పట్టుకొచ్చాడు.

కాంతమ్మ ముందు శివానికీ, తర్వాత చిట్టికీ తలంటిపోసింది. క్రొత్త బట్టల్ని తీసి ఇచ్చింది శివానికీ, చిట్టికి. తనే తొడిగి ముస్తాబు చేసింది. దిష్టి తగులుతుందేమోనని బుగ్గకు చుక్క కూడా పెట్టింది. చెప్పొద్దూ! చిట్టి చూట్టానికి తొడపెళ్ళికూతుర్లా చూడ ముచ్చటగా ఉంది.

తర్వాత భూషయ్యా, కాంతమ్మా ఇద్దరూ తలారా స్నానం చేసి దాపుడు బట్టలు కట్టుకున్నారు.

గతంలో వినాయక చవుతుల్ని చాలానే చూశారు వాళ్ళు. ఈ వినాయకచవితి మాత్రం ఆ ఇంటికి వస్తూనే ఎంతో ఆనందాన్ని మూటకట్టి తెచ్చింది. ఈ పండక్కి శివం చాలా ఎత్తుకు ఎదిగి పోయాడని మురిసిపోయారా తల్లీ తండ్రీ.

చిట్టికయితే ఎంతో ఆనందంగా వుంది. ముందు ముందు అన్నయ్య తనకెన్ని నగలు చేసిస్తాడో అని తల్చుకుంటే ఎంతో సంబరపడిపోయింది. ఆ మాటే తన జట్టీలోని నేస్తాలతో అంది కూడా. వాళ్ళలో కొంతమంది సంతోషిస్తే మరికొంతమంది ఉడుక్కున్నారు.

విఘ్నేశ్వరుడి ముందు చిట్టి పలకా, బలపం శివం తాలూకు సుత్తీ శానం వగైరాలూ, తండ్రి బట్టలమూట తాలూకు మిటరుబద్దా, చిట్టా పుస్తకం, కాంతమ్మ కొత్తగా పేనుకున్న పుస్తెల తాడు, నల్లపూసలూ ఇంకా చాలానే చోటు చేసుకున్నయ్! వాటన్నింటికీ పేరు పేరునా పసుపు, కుంకుమా, గంధంబొట్లూ పెట్టింది కాంతమ్మ.

పూజ ముందు కూర్చున్న కాంతమ్మ ఏదో గుర్తు వచ్చినదాన్లా "ఒరే! శివం...!" అంటూ కేకేసింది.

"ఏమిటమ్మా! పిలిచావ్...?" అంటూ వచ్చాడు శివం.

"దేవుడి దగ్గర పెడదాం గానీ... మొన్న పాపారావుగా రిచ్చిన బంగారం పట్టా... కావిడిపెట్టి సొరుగులో పెట్టా... పట్రారా...?" అంటూ శివానికి పని పురమాయించింది.

"అట్లాగే" అంటూ శివం లోపలికెళ్ళి బంగారంతో సహా తిరిగొచ్చాడు.

కాంతమ్మ దాన్నందుకుని విఘ్నేశ్వరుడి ముందున్న పత్రిలో ఒక వెడల్పాటి మామిడాకు మీదుంచింది.

పసుపు రంగుతో మెరిసిపోతున్న దానికింత పసుపు రాసి కుంకుమ గంధం కలిపి బొట్టు పెట్టింది అది చాలదన్నట్టు తర్వాత దానిమీద నాలుగు అక్షింతలు కూడా వేసింది. దాంతో బంగారం ముద్ద తన పూర్వపు నిగనిగల్ని కోల్పోయింది.

"స్వామీ! సంవత్సరం తిరిగొచ్చేకల్లా నా కొడుకు ఇంతకు రెండింతలు బంగారం సంపాదించాలి స్వామీ! నా కొడుకు... తప్పకుండా సంపాదించాలి స్వామీ! మళ్ళీ చవితినాటికి నీకు ఉండ్రాళ్ళు రెండింతలు పెడతా స్వామీ!" మనసులోనే మొక్కుకుంది కాంతమ్మ అమ్మ మనసు.

భూషయ్య "గోవిందా..." అని నాలిక్కరుచుకుని అక్కడే ఆగిపోయాడు.

ముగ్గురూ మూడు కొబ్బరికాయలు కొట్టి దణ్ణాలు పెట్టుకున్నారు. చిట్టి కూడా తన వంతుగా చిట్టి చేతుల్ని జోడించి దణ్ణం పెట్టుకుంది.

'అయితే ఆ ఇంట్లో నాలుగింట మూడొంతుల మంది మాత్రమే దేవుణ్ణి అది కావాలి, ఇది కావాలి అని అడగటం జరిగింది.

ఉండ్రాళ్ళతో పాటు కాంతమ్మ ఆరోజు స్పెషల్‌గా గారెలూ, పాయసం చేసింది. చిట్టి పాయసం ఎప్పుడు తిందామా అని పొద్దుట్నుంచీ అనుకుంటుందేమో వినాయకుడు చప్పునే అనుగ్రహించాడు.

కాంతమ్మ పూజ కాగానే అందరికీ గారెలూ, పాయసం వడ్డించింది. అందరూ ముందు గారెలు తింటుంటే చిట్టి పాయసం లాగించేసింది. ఆ హుషారులో గారెల్ని మరిచిపోయి తన నేస్తాన్ని కలిసేందుకని మూతి కూడా తుడుచుకోకుండా వీధిలోకి దౌడు తీసింది.

ఆ రోజుకు శివం పంచె తొడుక్కున్నాడు.

భూషయ్య చాలా సంవత్సరాల తర్వాత పగటిపూట ఓ కునుకు తీశాడు.

మర్నాడు-

లేస్తూనే వినాయకుడి దగ్గరుంచిన వస్తువుల్ని తసి ఎక్కడి వక్కడ పెట్టాడు శివం. సర్దటంలో చిట్టి కూడా శివానికి సహకరించింది. వినాయకుణ్ణీ, పత్రినీ వేరుకాకుండా జాగ్రత్తగా ప్లాస్టిక్ వైరు బుట్టలో పెట్టింది కాంతమ్మ. అట్లా వేరుచేస్తే పాపం చుట్టుకుంటుందని కాంతమ్మకు ఎప్పట్నుంచో ఉన్న ఒకానొక గుడ్డి నమ్మకం.

సర్దటంలో సహకరించినందుకూ, నిమజ్జనం చేసేటందుకు తోడుగా వచ్చేందుకూ అని చిట్టి చేతిలో 'వరహా' పెట్టాడు శివం. నాలుగు రూపాయి బిళ్ళలూ మొదటిసారిగా తన చేతిలో పడటంతో చిట్టి ఆనందంతో గెంతింది. గెంతులు పెడితే రూపాయి బిళ్ళలు పడిపోతాయని" తల్లి కేక వేయటంతో ఎక్కడ నిజంగా పడిపోతాయోనని చెప్పి చిట్టి వాటిని పిడికిట్లో గట్టిగా పట్టుకుని గెంతడం మానేసి పొందిగ్గానిల్చుంది.

జితేంద్ర ఇక్కట్లు



ఒకప్పుడు దక్షిణాది నిర్మాతల చిత్రాల ద్వారా వెలుగులోకి వచ్చిన జితేంద్రకు ఇప్పుడు ఆ అవకాశాలు సన్నగిల్లాయట. దేవానంద్‌లా ఎవర్‌గ్రీన్ హీరోలా వుందామనుకున్నాడు గాని వీలు కాలేదు. తన వయసులోనే వున్న హీరోయిన్లతో నటించమని ఆఫర్లు వస్తున్నాయట కాని, మనస్కరించటం లేదట. కారణం ధర్మేంద్ర కుర్ర హీరోయిన్లతో నటించటమే. ఈ విషయాలు స్నేహితులకు చెప్పకొని కన్నీరు మున్నీరవుతున్నాడు జితేంద్ర. పూర్ ఫెలో!

అన్నీ సర్వటంతో అక్కడి ప్రదేశమంతా ఏదో వెలితిగా ఉన్నట్లు అన్పించింది చిట్టికి. కాసేపు ఏదో అమూల్య వస్తువును పోగొట్టుకున్నట్లు ఫీలయ్యింది చిట్టి చిన్నారి మనసు

బుట్ట పట్టుకుని శివం ముందు నడుస్తుంటే చిట్టి వెనకాల చేతులూపుకుంటూ నడిచింది కాలువ వైపు. పత్రితో బుట్ట నిండిపోయి ఉంది. రూపాయి బిళ్లలు ఇంటి దగ్గర బయల్దేరేటప్పుడే తల్లి తీసేసుకోవటంతో అవి పోతాయన్న బెంగ ఎప్పుడో పోయింది చిట్టికి.

శివం, చిట్టి కాలువగట్టును సమీపించారు.

కాలువలో నీరు పల్చగా ప్రవహిస్తోంది.

రేవులో జనం లోపలికి దిగేందుకని అక్కడ నాలుగు చెక్కుడు రాళ్ల మెట్లున్నయి. అందరూ వినాయకుణ్ని నిమజ్జనం చేసే చోటు అదే కాబట్టి రద్దీగానే ఉంది రేవు. పిల్లలతో, తల్లులతో పరికిణీలూ, వోణీలూ వేసుకున్న అందమైన అమ్మాయిలతో ఆ ప్రదేశమంతా తిరనాళ్లలా ఉంది. అక్కడక్కడా పాతిక ముప్పయి మంది కుర్రాళ్లు రోమియోల్లా నిలుచుని ఉన్నారు. వాళ్ల పని వాళ్లు చేసుకు పోతున్నారు.

శివం మెట్లు దిగుతూ ఒక చేత్తో చిట్టి చేతిని పట్టుకుని జాగ్రత్తగా క్రిందికి నడిపించాడు. ఇద్దరూ చివరిమెట్టు మీద నిల్చున్నారు. రేవులోని నీళ్ళు కాళ్లకు తగుల్తున్నాయి. చిట్టి కాళ్లకు చల్లటి నీళ్లు తగలటంతో అరికాళ్లలో ఎవరో కితకితలు పెట్టినట్టు కలకలా నవ్వింది.

ఉన్నట్టుండి శివం కోప్పట్టంతో చిట్టి మూతి ముడుచుకుంది.

శివం బుట్టలో ఉన్న మట్టి వినాయకుణ్ని, ప్రతినీ కలిపి చిట్టి దోసిట్లో పెట్టి "ఇప్పుడు విడువ్... నీళ్లల్లో..." అన్నాడు ఆజ్ఞాపిస్తున్నట్టుగా.

ముద్దొస్తున్న మట్టి వినాయకుణ్ని నీళ్లపాలు చెయ్యాల్సి వచ్చిందేమో? అని విచారంగానే దోసిలిని నీళ్లలో వదిలేసింది చిట్టి. నీళ్లలో వదిలాక అవి నీళ్ల మీద తేలుతూ కొట్టుకు పోతుంటే ఎంతో ఆనందం వేసింది చిట్టికి. ఆ దృశ్యాన్ని చూస్తూ తన్మయత్వంలో కాసేపు అట్లాగే నిలుచుండి పోయింది చిట్టి.

"చూసింది చాల్లే! ఇంక రా...." అని శివం విసుక్కోవటంతో చిట్టి చదటానికి ఫుల్‌స్టాప్ పెట్టి అన్నతో పాటు గట్టు మీది కొచ్చింది. గట్టు మీద నిల్చుని చూస్తే కాలువలోని నీళ్లన్నీ ఆకూ అలంతో నిండిపోయి ఆ ప్రదేశమంతా పచ్చగా కన్పించింది. అక్కణ్నుంచి కొంత పత్రిమాత్రం దిగువకు కొట్టుకు పోతూ కన్పించింది.

ఎవరో పత్రితో పాటు పొరపాటున బుట్ట కూడా నీళ్ళల్లో వదిలేయటంతో అది కాసేపు పడవలా సాగి, తర్వాత బోల్తా కొట్టింది. బుట్ట పారేసుకున్న వాళ్ల తెలివి తక్కువకు శివం కాస్త పగలబడి నవ్వుకున్నాడు. కొట్టుకు పోతోన్న బుట్టను చూసిన చిట్టికేమో "పాపం!" అని జాలేసింది.

నిమజ్జనమ్

అన్నా చెల్లెళ్లిద్దరూ ఆ దృశ్యాన్ని పావుగంట తిలకించి ఆ తర్వాత తీరిగ్గా ఇంటి దారి పట్టారు.

వినాయక నిమజ్జనం కాస్తా జరిగి పోవటంతో శివం తన పనిముట్లన్నీ ఎక్కడ వక్కడ సర్దుకున్నాడు.

పాపారావు గారి పని చేసేందుకు బల్లముందు కూర్చున్నాడు.

అగరొత్తి ఒకటి వెలిగించి ఎదురుగా ఉన్న దేవుడికి దణ్ణం పెట్టుకున్నాడు. ముందున్న బల్ల సొరుగు లాగి ఒకసారి చూశాడు. చిన్న చిన్న పనిముట్లు తప్పితే 'అసలు పదార్థం' అందులో లేదు.

గబగబా లేచి వెళ్లి ప్రక్క గదిలో వున్న కావిడపెట్టి తెరిచాడు. వెయ్యి కళ్లతో సొరుగంతా గాలించాడు. అందులోనూ లేదు.

శివం మనసు ఏదో కీడును శంకించింది.

వేసె వేసె సుత్తి దెబ్బ ఒక్కసారి ఆగిపోయినట్టు శివం గుండె క్షణకాలం ఆగిపోయింది. అట్లా ఆగిపోయినా బాగుండేది. లేదే? మళ్లీ కొట్టుకోటం మొదలైంది. అయితే మునుపట్లా మాత్రం కాదు? మరింత వేగంగా....! అతి వేగంగా....!!

అప్పటికే శివం ఒళ్లంతా చెమటలు పట్టాయి.

భయం, ఆందోళన, కంగారు ముప్పిరిగొనగా "అమ్మా...." అని అరిచాడు శివం.

వంట గదిలో మండని కట్టెలతో సతమతమౌతున్న తల్లి పాలిట ఆ కేక పిడుగుపాటే అయ్యింది.

"ఏమిరా శివం....? అట్లా అరిచావ్....? ఏమైందిరా...?" అంటూ ప్రశ్నల వర్షం కురిపిస్తూ వచ్చిందామె వంటింట్లోంచి చేతనున్న గిన్నెతో సహా. ఆమె ప్రశ్నల్లో వరసగా ఆందోళన, భయం, కంగారు చోటు చేసుకున్నాయి.

"బంగారం.... కన్పించటం లేదే.... అదే... పాపారావు గారిచ్చింది...." "నువ్వు తీసి.... దాయలేదూ...?" శివం గొంతు పెగిలిరాక ఎట్లాగో ఒక్కోమాటా అనగలిగాడు. అదీ ఒంట్లోని సత్తువనంతా కూడదీసుకుని మరీ.

"బంగారమా...? నాకేం తెల్సురా...? నిన్న నువ్వేగా... పెట్లో నుంచి తీసింది...? మళ్లీ పెట్టలేదా దాన్లో...? ఒక్కో మాటనూ ఉచ్ఛరిస్తూ ఏడుపు లంఘించుకుంది కాంతమ్మ.

అప్పటికే విషయం పూర్తిగా అర్థం కావటంతో కాంతమ్మ ముఖమంతా పాలిపోయింది.

కాస్త తెలివి తెచ్చుకుని... "పొద్దున సర్దేటప్పుడు చిట్టిగానీ తీసిందేమో... అడిగావా...?" అన్నది కాంతమ్మ.

చిట్టి ప్రస్తావన రావటంతో శివం వీధిలోకి దూసుకు వెళ్లి అంతే వేగంగా చిట్టి రెక్క పుచ్చుకుని మరీ వచ్చాడు.

"చిట్టీ! నువ్ బంగారం తీశావా? అదే దేవుని దగ్గర పెట్టిందే..." ఇద్దరూ ఆత్రంగా కోరస్‌లా అడిగారు చిట్టిని.

"లేదమ్మా! నేనసలు చూళ్లేదే?" అంటూ తాపీగా జవాబు ప్రకటించింది చిట్టి.

ఆ మాట వింటూనే శివం కుప్పలా కూలిపోయాడు.

కాంతమ్మ నోట మాటరాక పిచ్చి చూపులు చూస్తూ నిలుచుండి పోయింది.

వీధిలోని తన జట్టంతా ఎక్కడ చెల్లాచెదరవుతుందోనని చిట్టి బయటికి పరుగు తీసింది.

పోనీ భూషయ్యగాని తీసి దాచాడనుకుందామా అంటే అతగాడు తెల్లారకట్టే బట్టల మూట నెత్తిన పెట్టుకుని కేగల్లో అంటూ పోయాడాయె!

ఆ ఇంట్లో ఆ పూట హాయిగా ఉన్న వాళ్లెవరన్నా ఉంటే అది పొరుగూరెళ్ళిన భూషయ్య, అన్నెం పున్నెం ఎరుగని చిట్టీనూ.

భూషయ్య బాగా ప్రొద్దుపోయిం తర్వాత వచ్చాడా రోజు.

భూషయ్యను చూస్తూనే కాంతమ్మ గుండె చెరువయ్యేలా విలపించింది. శివం పూర్తిగా ముఖం వాటేశాడు. ఎట్లాగో కాంతమ్మ గుండె దిటవు చేసుకుని ఆ దుర్వార్త కాస్తా భర్త చెవినేసింది.

తన రెండు కాళ్లు నెవరో ఒక్కసారిగా తెగేసినట్టు కుప్పలా కూలిపోయాడు భూషయ్య.

ఆ రాత్రి శివరాత్రి అయితే జాగరణ ఫలితం తాలూకు పుణ్యం ఆ ఇంట్లో ముగ్గురికి దక్కేది. గుర్రుపెట్టి నిద్రపోయిన పాపానికి చిట్టి పాపాన్ని మూటకట్టుకునేది.

తెల్లారకట్ట –

అది కాలువ గట్టు.

తండ్రి కొడుకు లిద్దరూ రేవు మెట్ల మీద కూర్చున్నారు.

ఇద్దరు గజ ఈతగాళ్లు రేవు రేవంతా గాలిస్తున్నారు. నీళ్లకోసే చూస్తున్నాయి మెట్లు ఆశగా. చుట్టూరా ఉన్న ప్రేక్షక జనాన్ని లెక్కేస్తే దాదాపు నూరుకు పైగానే ఉంటారు. కానీ లెక్కపెట్టే పరిస్థితుల్లోనే ఆ తండ్రీ లేడు... కొడుకూ లేడు...!

గజీతగాళ్ల ఒంట్లోని శక్తంతా ఏట్లో పిసికిన చింతపండు పిప్పయ్యింది. పోయిన బంగారం పోతూ పోతూ ఈతగాళ్ల కూలి రూపంలో రెండు పార్లమెంటు భవనాల్ని పెకలించుకు పోయింది.

భూషయ్య ఆ రాళ్లలో తనూ ఒక రాయయ్యాడు.

శివం ముఖం రేవులోని బురద నీరులా నల్లగా వుంది.

కాంతమ్మ పాకుడు బండమీద జారిపడిందాన్లా వెర్రిగా చూస్తూ వీధి గుమ్మం దగ్గిర కూలపడింది.

షరా మామూలే? ఇరుగు పొరుగు ఓదార్పులూ, పుల్ల విరుపు మాటలూనూ!

విఘ్నేశ్వరుడు వాళ్లకీపిడు రెట్టింపు బంగారం ప్రసాదిస్తాడో లేదో తెలియదు గానీ, పోయిన పసిడి మాత్రం ఆ ముగ్గురికీ ఆ రోజు రెండు పూటలా 'పస్తు'నే ప్రసాదించింది!

o

ఈవారం లో మీ యోగం

17-8-1990 శుక్రవారం మొదలు 23-8-1990 గురువారం వరకు

మేషం: ప్రభుత్వపరంగా రావలసిన పైక మున్నదా? అందుతుంది. అప్పులు వసూలు కావలెనా? అందుకోండి. పత్రికాభివృద్ధికై శ్రమించుట యోగదాయకమౌతుంది. స్త్రీలకు: నూతనమిత్రసమాగమం, బంధువులు శుభవర్తమానంతో రాక.

వృషభం: విలువగల వస్తువులు సేకరిస్తారు. వ్యాపారం అనుకూలంగా సాగిస్తారు. శుక్రుడు, కుటుంబానందానికి దోహదంచేస్తాడు. ఆనందదాయకవారం. పత్రికాధిపతులకు మేలు. వ్యవహారరంగాను కూలత, ఆదాయమందు వృద్ధి. స్త్రీలకు: ఇరుగుపొరుగు తగాదాలు రాకుండా చూచుకోండి, ఆదాయమున్నది.

మిధునం: ద్వితీయ 'గురుడు' యోగాధ్యుడు. అప్పులువసూలవుతాయి. సుఖశాంతులు, బంధువులవలన ఏదోమేలు చేకూరుట, ప్రభుత్వపరంగా అందవలసిన పైకం అందుట గ్రహింపదగిన ముఖ్యాంశం. స్త్రీలకు: స్వల్పాదాయం, వస్తుసేకరణ, పదిమందిలో ప్రతిష్ఠ.

కర్కాటకం: ప్రతివ్యవహారంలో జాగరూకత అవసరం. రాశియందు గురు, కేతువులున్నారుగా. ముందువెనుకలాలోచించి కార్యరంగాన దిగకపోతే యిబ్బందులు. ఒక చోటె నుండి మరొక ప్రాంతానికి అనవసరంగా వెళ్లవలసిరావచ్చు, ఆదాయం ఎంత ఉన్నా చాలదు. స్త్రీలకు: బంధువులు, శుభకార్యనిమిత్తం రానున్నారు.

సింహం: నూతనమిత్రులు చేరుతారు. అయినా లాభం? పూర్వపు బాకీల, పంపకాల, ఆస్తివ్యవహారాలను పైకి తోడుతారు. రాజకీయ వాదులకు, పత్రికారంగాన శ్రమించువారికి, 'ఎడిటర్లకు' ఆదాయం. స్త్రీలకు: శుభసమయం. ఉద్యోగాభివృద్ధి.

కన్య: 'శని' చతుర్థస్థితి, అందునా వక్రం పదిరీతుల పట్టి చూచేలాగున్నది. ముందు వెనుకలు ఆలోచించి, వ్యాపార వ్యవహార రంగాలకు దిగాలి. మిత్రులెవరో, శత్రువులెవరో గమనించి సంచరించుట శ్రేయం. స్త్రీలకు: అభివృద్ధి, ఆనందం, ఆదరణ, బంధువర్గీయుల ఆప్యాయత. ఇక యోగమేగా!

తుల: 'శని' అనుకూలుడు. కొంత కాలంవరకు మీకు ప్రతివారం యోగదాయకం. ఈ వారంలో మీ యోగం అధికమౌతుంది. ముందువెనుకలు ఆలోచించి సమయం మంచిదిగాన ముందుకు సాగండి. స్త్రీలకు: ఉద్యోగరీత్యా పెంపు, ప్రతిష్ఠ.

వృశ్చికం: సభామర్యాద యున్నది. రాబడి కలదు. వ్యాపారం సాఫీగా సాగటం నిశ్చయం. వస్తుసేకరణ నిమిత్తమై దూరప్రాంతాలకు వెళ్లగలుగుట గమనింపదగిన అంశం. స్త్రీలకు: ఉద్యోగమందు పెంపు, అధికంగా వ్యయించవలసిన నిర్బంధం.


ధనుస్సు: ఇది యోగదాయకమైన వారం. పాత్రికేయులకు, పంపిణీదారులకు. కవులకు, గాయకులకు సర్వానుకూలం, రచనా విధాన అవలోకనగల వారికి ఆనందం, స్త్రీలకు: నూతన వాహన నిమిత్తం శ్రమించువారికి అనుకూలం.

మకరం: పరిపరివిధాల మేలు చేయగలరు. 'సప్తమస్థితి' నందుకొన్న గురుడు. ఆదాయలోపం రాదని మీరే గ్రహించివుంటారు. ఉత్తమ మిత్ర సహాయమున్నది. పాత్రికేయులకు, పత్రికాధిపతులకు యోగం. స్త్రీలకు: సర్వవిధాలా అనుకూల వారం, యోగాఢ్యమని గ్రహించాలి.

కుంభం: శుభసమయం. మాటకు అధిక గౌరవం, పదిమందిలో ప్రతిష్ఠ. 'అనృతమాడనివారని' ఒకానొక విషయంలో రుజువుచేస్తారు. అధిక విద్యావేత్తలకు ప్రభుత్వపరంగా సదవకాశాలు. స్త్రీలకు: సుఖశాంతులు, ఆనందం, బంధువర్గీయులరాక.

మీనం: 'గురుడు' అనుకూలుడు. సుఖశాంతులకు దోహదం చేయగలడు. ఆదాయమున్నది. వాహనసౌఖ్యం, రాజకీయంగా మేలు, వ్యాపార వ్యవహారాలందు మేలైనవారం. యోగాఢ్యం. వస్తుసేకరణకు అనుకూలం. స్త్రీలకు: సర్వానుకూలం. ముఖ్యంగా ధనలబ్ధి.

-విద్వాన్ కోట సత్యరంగయ్యశాస్త్రి



విఘ్ననాయకుని పూజాఫలం

శ్లో॥ శుక్లాంబరధరం విష్ణుం శశివర్ణం చతుర్భుజమ్
ప్రసన్న వదనం ధ్యాయే త్సర్వ విఘ్నోపశాంతయే

సుముఖశ్చైకదంతశ్చ కపిలో గజకర్ణకః లంబోదరశ్చ వికటో విఘ్నరాజోగణాధిపః ధూమకేతుర్గణాధ్యక్షః ఫాలచంద్రో గజాననః వక్రతుండ శ్శూర్పకర్ణో హేరంబ స్కందపూర్వజః అష్టా వష్టౌ నామాని యఃపఠేచ్ఛృణు యాదపి విద్యారంభే వివాహే చ ప్రవేశే నిర్గమే తథా. సంగ్రామే సర్వ కార్యేషు విఘ్నస్తస్య న జాయతే.

శుభతిథౌ శుభేశోభనే ముహూర్తే అద్య బ్రహ్మణః ద్వితీయ పరార్థే శ్వేత వరాహకల్పే వైవస్వత మన్వంతరే కలియుగే ప్రథమపాదే జంబూద్వీపే భరత వర్షే భరత ఖండే మేరోః దక్షిణే పార్శ్వే (ఇత్యాది) ఏవం గుణ విశేషణ విశిష్టాయాం అస్యాం శుభ తిథౌ, అస్మాకం సహకుటుంబానాం క్షేమ స్థైర్య విజయాయురారోగ్యైశ్వర్యాభి వృద్ధ్యర్థం ధర్మార్థకామ మోక్ష చతుర్విధ ఫల పురుషార్థ సిద్ధ్యర్థం పుత్ర పౌత్రాభి వృద్ధ్యర్థం ఇష్టకామ్యార్థ సిద్ధ్యర్థం మనో వాంఛా ఫల సిద్ధ్యర్థం సమస్త దురితో ప శాంత్యర్థం సమస్త మంగళావాప్త్యర్థం వర్షే వర్షే ప్రయుక్త వర సిద్ధి వినాయక దేవతా ముద్దిశ్య వరసిద్ధి వినాయక దేవతా ప్రీత్యర్థం కల్పోక్త ప్రకారేణ యావచ్ఛక్తి ధ్యానా వాహనాది షోడశోపచార పూజాం కరిష్యే.

శ్లో॥ భవసంచిత పాపౌఘ విధ్వంసన విచక్షణమ్ విఘ్నాం ధకార భాస్వంతం విఘ్నరాజ మహం భజే, ఏకదంతం శూర్ప కర్ణం గజ వక్త్రం చతుర్భుజం పాశాంకుశ ధరం దేవం ధ్యాయే సిద్ధి వినాయకమ్, ఉత్తమం గణనాథస్య వ్రతం సంపత్కరం శుభం భక్తాభీష్ట ప్రదం తస్మాద్ధ్యాయేత్తం విఘ్న నాయకం, ధ్యాయేద్గజాననం దేవం తప్త కాంచన సన్నిభమ్, చతుర్భుజం మహాకాయం సర్వాభరణ భూషితమ్ మహా గణాధి పతయే నమః ధ్యాయామి. అత్రాగచ్ఛ జగద్వంద్య సురరాజార్చి తేశ్వర. అనాథనాథ సర్వజ్ఞ గౌరీగర్భ సముద్భవ, ఆవా హయామి. మౌక్తికైః పుష్యరాగైశ్చ నానారత్న విరాజితమ్, రత్నసింహాసనం చారు ప్రీత్యర్థం ప్రతిగృహ్యతామ్ ఆసనం సమర్పయామి. గౌరీపుత్త్ర నమస్తేస్తు శంకర ప్రియనందన గృహాణార్ఘ్యం మయాదత్తం గంధ పుష్పాక్షతైర్యుతం అర్ఘ్యం సమర్పయామి గజవక్త్ర నమస్తేస్తు సర్వాభీష్ట ప్రదాయక భక్త్యా పాద్యం మయాదత్తం గృహాణ ద్విరదానన, పాద్యం సమర్పయామి, అనాథనాథ సర్వజ్ఞ గీర్వాణ పరిపూజిత గృహాణాచమనం దేవతుభ్యం దత్తం మయాప్రభో, ఆచమ నీయం సమర్పయామి. దధిక్షీర సమాయుక్తం మధ్వా జ్యేన సమన్వితం మధుపర్కం గృహాణేదం గజవక్త్ర నమో స్తుతే మధుపర్కం సమర్పయామి. స్నానం పంచామృతైర్దేవ గృహాణ గణ నాయక అనాథనాథ సర్వజ్ఞ గీర్వాణ గణపూజిత, పంచామృత స్నానం సమర్పయామి. గంగాది సర్వతీర్థేభ్యః ఆహృతై రమరైర్జలైః స్నానం కురుష్వభగవన్నుపుత్త్ర నమో స్తుతే శుద్ధోదక స్నానం సమర్పయామి. రక్త వస్త్ర ద్వయం చారు దేవయోగ్యం చ మంగళం శుభప్రదం గృహాణ త్వం లంబోదర హరాత్మజ వస్త్రయుగ్మం సమర్ప యామి. రాజితం బ్రహ్మసూత్రం చ కాంచనం చోత్తరీయకమ్ గృహాణ దేవ సర్వజ్ఞ భక్తానామిష్టదాయక. ఉపవీతం సమ ర్పయామి. చందనాగరు కర్పూర కస్తూరీ కుంకుమాన్వితం విలేపనం సురశ్రేష్ఠ ప్రీత్యర్థం ప్రతిగృహ్యతాం గంధాన్ సమర్పయామి. అక్షతాన్ ధవళాన్ దివ్యాన్ శాలీయాం స్తండులాన్ శుభాన్ గృహాణ పరమానంద ఈశపుత్ర నమో స్తుతే అక్షతాన్ సమర్పయామి. సుగంధాని సుపుష్పాణి జాతీకుంద ముఖాని చ ఏకవింశతి పత్రాణి సంగృహాణ నమో స్తుతే పుష్పైః పూజయామి. అథాంగ పూజా, గణేశాయ నమః పాదౌపూజయామి, ఏకదంతాయ నమః గుల్ఫౌ. శూర్ప కర్ణాయ నమః జానునీ విఘ్న రాజాయ నమః రాజాయ నమః జంఘే-ఆఖువాహనాయ నమః ఊరూ-హేరం బాయ నమః కటిం- లంబోదరాయ నమః ఉదరం-గణనాథాయ నమః నాభిం- గణేశాయ నమః హృదయం-స్థూల కంఠాయ నమఃకంఠం-స్కందాగ్రజాయ నమః స్కంధౌ-పాశహస్తాయ నమః హస్తౌ- గజవక్త్రాయ నమః వక్త్రం-విఘ్నహంత్రే నమః నేత్రే శూర్పకర్ణాయ నమః కర్ణౌ-ఫాలచంద్రాయ నమః లలాటం సర్వే శ్వరాయ నమః శిరః విఘ్న రాజాయ నమః- సర్వాణ్యంగాని పూజయామి అథైకవింశతి పత్రపూజా - సుముఖాయ నమః మాచీపత్రం పూజయామి గణాధిపాయ నమః బృహతీపత్రం. ఉమా పుత్రాయ బిల్వపత్రం గజాననాయ దూర్వాయుగ్మం హరసూనవే దత్తూరపత్రం లంబోదబదరీపత్రం గుహాగ్రజాయ అపామార్గపత్రం, గజకర్ణాయ తులసీపత్రం, ఏకదంతాయ చూత పత్రం, వికటాయ కరవీరపత్రం, భిన్న దంతాయ విష్ణుక్రాంత పత్రం వటవే-దాడిమీపత్రం,సర్వేశ్వరాయదేవదారుపత్రం, ఫాల చంద్రాయ మరువకపత్రం, హేరంబాయ సింధువారపత్రం, శూర్పకర్ణాయ జాజీపత్రం, సురాగ్రజాయ గండకీపత్రం, ఇభవ క్త్రాయ శమీపత్రం. వినాయకాయ అశ్వత్థపత్రం సురసేవితాయ అర్జునపత్రం, కపిలాయ అర్కపత్రం, శ్రీ గణేశ్వరాయ ఏక వింశతి పత్రాణి పూజయామి.

అష్టోత్తర శతనామపూజా


క్రింది నామాలన్నింటికిముందు 'ఓం'అని చివర 'నమః' అనిచేర్చాలి

ఓం గజాననాయనమః, గణాధ్యక్షాయ, విఘ్నరాజాయ, వినాయకాయ, ద్వైమాతురాయ, ద్విముఖాయ, ప్రముఖాయ, సుముఖాయ, కృతినే, ప్రథమాయ, ప్రాజ్ఞాయ, విఘకర్త్రే, విఘ్నహంత్రే, విశ్వనేత్రే, విరాత్పతయే, శ్రీపతయే, వాక్ప తయే, శృంగారిణే, సర్వకర్త్రే, సర్వనేత్రే, సర్వసిద్ధిప్రదాయ,

సర్వసిద్ధయే, ప్రభవే, కుమారగురవే, అక్షోభ్యాయ, సుప్రదీపాయ, సుఖనిధయే, సురాధ్యక్షాయ, సురారిఘ్నాయ, మహాగణపతయే, మాన్యాయ, మహాకాలాయ, మహాబలాయ, హేరంబాయ, లంబజఠరాయ, హ్రస్వగ్రీవాయ, మహోదరాయ, మదోత్కటాయ, మహావీరాయ, మంత్రిణే, మంగళస్వరాయ, ప్రమధాయ, గంగాసుతాయ, గణాధీశాయ, అభీష్టవరదాయ, జ్యోతిషే, భక్తనిధయే, భావగమ్యాయ, మంగళప్రదాయ, అవ్యక్తాయ, అశ్రితవత్సలాయ, శివప్రియాయ, శీఘ్రకారిణే, శాశ్వతాయ, బలాయ, బలోత్థితాయ, భవాత్మజాయ, పురాణపురుషాయ, పూష్ణే, పుష్కరోత్క్షిప్తధారిణే, అగ్రగణ్యాయ, అగ్రపూజ్యాయ, అగ్రగామినే, మంత్రకృతే, చామీకరప్రభాయ, పరస్మై, పంచహస్తాయ, పార్వతీనందనాయ, ఓం సత్యధర్మిణే నమః, సఖైస్యరసాంబునిధయే, మహేశాయ, దేశాంగాయ, మణికింకిణీమేఖలాయ, సమస్త దేవతామూర్తయే, సహిష్ణవే, సతతోత్థితాయ, కుంజరాసుర భంజనాయ, ప్రమోదాయ, మోదక ప్రియాయ, శాంతిమతే, గంభీరనినదాయ, వటవే, ధృతిమతే, కామినే, కపిత్థపనసప్రియాయ, బ్రహ్మచారిణె, బ్రహ్మరూపిణే, బ్రహ్మవిద్యా విధాయకాయ, జిష్ణవే, విష్ణుప్రియాయ, భక్త జీవితాయ, జితమన్మధాయ, ఐశ్వర్యకారణాయ, జ్యాయసే, సర్వోపాస్యాయ, అప్రాకృత పరాక్రమాయ, యక్షకిన్నరసేవితాయ, విఘాతకారిణే, విశ్వదృశే, విశ్వరక్షాకృతే, కళ్యాణిగురవే, ఉన్మత్తవేషాయ, వరజితే, సమస్త జగదాధారయ, సర్వైశ్వర్యప్రదాయ, అక్రాంతచిదచిత్ప్రభవే, శ్రీ విఘ్నేశ్వరాయనమః

దశాంగం గగ్గులోపేతం సుగంధం సుమనోహరం! ఉమాసుత నమస్తుభ్యం గృహాణ వరదోభవ॥ ధూపమాఘ్రాపయామి॥ సాజ్యం త్రివర్తి సంయుక్తం వహ్నినాయోదితం మయా॥ గృహాణ మజ్గళం దీపమీశపుత్ర నమోస్తుతే దీపం దర్శయామి షుగన్ధాన్సు కృతాం శ్చైవమోదకాన్ ఘృతపాలితాన్॥ నైవేద్యం గృహ్యతాం దేవ చణముద్గైః ప్రకల్పితాన్॥ భక్ష్యం భోజ్యంచ లేహ్యంచ చోష్యం పానీయమేవ చ। ఇదం గృహాణ నైవేద్యం మయాదత్తం వినాయక॥ నైవేద్యం సమర్పయామి॥ సదానందద విఘ్నేశ పుష్కలాని ధనానిచ॥ భూమ్యాం స్థితాని భగవాన్ స్వీకురుష్వ వినాయక॥ సువర్ణ పుష్పం సమర్పయామి॥ పూగీఫలసమాయుక్తం నాగవల్లీ దళైర్యుతం॥ కర్పూరచూర్ణ సంయుక్తం తాంబూలం ప్రతిగృహ్యతామ్॥ తాంబూలం సమర్పయామి। ఘృతవర్తి సహస్రైశ్చ కర్పూరశకలై స్తథా॥ నీరాజనం మయాదత్తం గృహాణ వరదోభవ॥ నీరాజనం సమర్పయామి॥

అథ దూర్వాయుగ్మపూజా॥ గణాధిపాయ నమః దూర్వాయుగ్మం పూజయామి॥ ఉమాపుత్రాయ నమః దూర్వాయుగ్మం పూజయామి అఖువాహనాయ నమః దూర్వాయుగ్మం పూజయామి॥ ఈశపుత్రాయ నమః దూర్వాయుగ్మం పూజయామి॥ సర్వసిద్ధి ప్రదాయకాయనమః దూర్వాయుగ్మం



పూజయామి॥ ఏకదంతాయ నమః దూర్వాయుగ్మం పూజయామి॥ ఇభవక్త్రాయ నమః దూర్వాయుగ్మం పూజయామి! మూషక వాహనాయ నమః దూర్వాయుగ్మం పూజయామి॥ కుమార గురవే నమః దూర్వాయుగ్మం పూజయామి॥

గణాధిప నమస్తేఽస్తు ఉమాపుత్ర గజానన॥ వినాయకేశ తనయ సర్వసిద్ధి ప్రదాయక॥ ఏకదంతైక వదన తథా మూషక వాహనః కుమారగురవే తుభ్యం సమర్పయామి సుమాంజలిం॥ మంత్రపుష్పం సమర్పయామి॥

ప్రదక్షిణం కరిష్యామి సతతం మోదక ప్రియ నమస్తే విఘ్న రాజాయ నమస్తే విఘ్ననాశన॥ ప్రదక్షిణ నమస్కారాన్ సమర్పయామి॥

అర్ఘ్యం గృహాణ హేరంబ సర్వభద్రప్రదాయక॥ గన్ధ పుష్పాక్షతైర్యుక్తం పాత్రస్థం పాపనాశన। పునరర్ఘ్యం సమర్పయామి॥

వినాయకాయ నమః నమస్తుభ్యం గణేశాయ నమస్తే విఘ్ననాశన ఈప్సితం మే వరం దేహి పరత్రచ పరాం గతిం। ప్రార్థన॥

వినాయక నమస్తుభ్యం సతతం మోదకప్రియ॥ నిర్విఘ్నం కురుమే దేవ సర్వకార్యేషు సర్వదా, వాయనదానం॥

గణేశ ప్రతిగృహ్ణాతు గణేశో వైదదాతి చ॥ గణేశ స్తారకోద్వాభ్యాం గణేశాయ నమోనమః॥ ప్రతి గ్రహ మంత్రః॥

వినాయకస్య ప్రతిమాం వస్త్ర యుగ్మసమన్వితాం। తుభ్యం దాస్యామి విప్రేంద్ర యధోక్త ఫలదో భవ ప్రతిమాదానం॥

ప్రసీద దేవ దేవేశ ప్రసిద్ధ గణనాయక॥ ప్రదక్షిణం కరోమిత్వాం ఈశపుత్ర నమోఽస్తుతే॥ యానికానిచ పాపాని జన్మాంతర కృతాని చ తానితాని ప్రణశ్యంతి ప్రదక్షిణ పదే పదే-ప్రదక్షిణ నమస్కారాన్సమర్పయామి॥

యస్యస్మృత్యాచ నామోక్త్యా తపః పూజా క్రియాదిషు॥ న్యూనం సంపూర్ణతాం యాతి సద్యోవందే త మచ్యుతం-



ఇదీ పూజా విధానం

ఈ కథ విని అక్షింతలు వేసుకోవాలి!

సూతమహాముని శౌనకాది మునులకు విఘ్నేశ్వరోత్పత్తియు, చంద్రదర్శన దోషకారణంబును దాని నివారణమును చెప్పసాగెను.

పూర్వము గజరూపముగల రాక్షసుడు శివుని గూర్చి ఘోర తపము చేసెను. అతని తపస్సునకు మెచ్చి పరమశివుడు ప్రత్యక్షమై ఏదేని వరము కోరుకొమ్మనెను. గజాసురుడంత పరమేశ్వరుని స్తుతించి "స్వామీ! నీవు ఎల్లప్పుడు నా యుదరమునందే నివసించి యుండు"మని కోరెను. భక్త సులభుండగు పరమశివుడు అతని కోర్కె తీర్చుటకై యాతని యుదరమున ప్రవేశించి సుఖముగ వున్నాడు.

కైలాసమునందు పార్వతీదేవి పతిజాడ తెలియక పలుతెఱంగుల అన్వేషించి కొంతకాలమునకు తన పతి గజాసుర గర్భస్థుడగుట తెలిసికొని విష్ణుమూర్తిని స్తుతించి తన పతి వృత్తాంతమును తెలిపి "ఓ మహానుభావా! పూర్వము నా పతిని భస్మాసురుని బారినుండి రక్షించి నా కొసంగినటులనే యిపుడు కూడా ఏదేని యుపాయంబుచే రక్షింపు"మని వేడుకొన్నది. శ్రీహరి పార్వతి నూరడించి పంపివేసి పిదవ శ్రీహరి బ్రహ్మాదులను పిలిపించి గజాసుర సంహారమునకై గంగిరెద్దుల మేళమే సరియగునట్టి మార్గమని నిశ్చయించి నందిని గంగిరెద్దుగ నలంకరించి, బ్రహ్మాది దేవతలందరిచే తలకొక వాద్యమును ధరింపజేసి తానును చిరుగంటలు, సన్నాయియు దాల్చి గజాసురపురమున కేగి మనోహరముగా నాడించ సాగెను. అంత గజాసురుడు అది విని వారిని పిలిపించి తన భవనమునందు ఆడించమనెను. బ్రహ్మాది దేవతలు వాద్య విశేషములను వాయింపగ జగన్నాటక సూత్రధారి యగు శ్రీహరి గంగిరెద్దును చిత్ర విచిత్రముగ నాడించసాగెను. గజాసురుడు అది చూసి పరమ సంతుష్టుడై మీకేమి కావలెనో కోరుకొనుడు. ఇచ్చెద"ననెను. శ్రీహరి అంత "ఇది పరమశివుని వాహనమగు నంది; శివుని కనుగొనుటకై వచ్చెగావున శివునినొసంగు"మనెను. గజాసురుడా మాటకు నివ్వెరపడి అతనిని రాక్షసాంతకుడగు శ్రీహరి యని ఎఱింగి తనకు మరణమే నిశ్చయమని తలంచి తన గర్భస్థుండగు శివుని తలంచి 'నా శిరమును త్రిలోక పూజ్య మొనరించి నా చర్మమును నీవే ధరింపుమనెను' అని ప్రార్థించి, హరికి తన యంగీకారమును తెల్పెను. అంత విష్ణుమూర్తి నందిని ప్రేరేపించెను. నంది తన శృంగములచే గజాసురుని చీల్చి సంహరించ మహేశ్వరుడు గజాసుర గర్భమునుండి బహిర్గతుడై విష్ణుమూర్తిని స్తుతించెను. విష్ణువు దుష్టాత్ముల కిట్టి వరములీయవలదు ఇచ్చినచో పాముకు పాలుపోసినటుల యగును. అని యుపదేశించి బ్రహ్మాది దేవతలకు వీడ్కోలు చెప్పి తాను వైకుంఠమునకు వెళ్ళెను. అంత పరమేశ్వరుడు గూడ నంది వాహనుడై త్వరిత గతిని కైలాసమునకు వెళ్లెను.

వినాయకుని పుట్టుక


కైలాసమున పార్వతీదేవి దేవాదులవలన భర్త రాకను విని సంతోషమున అభ్యంగన స్నానమాచరించుచు నలుగుపిండితో నొక బాలుని చేసి ప్రాణమును పోసి సింహద్వారమున కాపుంచెను. అంత పరమశివుడు వచ్చి నంది నారోహించి లోనికి పోబోవ సింహద్వారము నందున్న బాలకు డడ్డగింప రోషావేశమున ఆ బాలుని తన త్రిశూలముచే కంఠము ఖండించి లోనికి వెళ్లెను.

అంత పార్వతీదేవి భర్తను చూసి ఎదురేగి అర్ఘ్యపాద్యాదుల పూజించెను. వారిరువురు పరమానందమున ప్రియభాషణములు ముచ్చటించుచుండ ద్వారమందలి బాలుని ప్రసంగము వచ్చెను. అంత మహేశ్వరుడు తానొనరించిన పనికి చింతించి తాను తెచ్చిన గజాసుర శిరంబు నా బాలుని కతికించి ప్రాణం బొసంగి "గజానను"డని నామం బొసంగెను. అతనిని పుత్రప్రేమంబున ఉమామహేశ్వరులు పెంచుకొనుచుండిరి. ఇతడు సులభముగా ఎక్కి తిరుగుటకు అనిందుడను నొక మూషికమును వాహనముగా చేసికొన్నాడు.

పార్వతీ పరమేశ్వరులకు కుమారస్వామి జనియించెను. అతని వాహనము నెమలి. అతడు దేవతల సేనానాయకుడై ప్రఖ్యాతి పొందెను.

విఘ్నేశ్వరాధిపత్యము

ఒకనాడు దేవతలు, మునులు, మానవులు పరమేశ్వరుని









సేవించి తమకు విఘ్నముల కధిపతిని ఒకనిని యిమ్మని కోరిరి. గజాననుడు తాను జ్యేష్ఠుడనుకాన తన కాధిపత్యము నొసంగుమనీ, గజాననుడు మరుగుజ్జు, అసమర్థుడుగాన అధిపత్యమును తనకొసంగుమని కుమారస్వామియు తండ్రిని వేడుకొన్నారు.

అంత మహేశ్వరుడు కుమారుల నుద్దేశించి మీలో ఎవరు ముల్లోకముల యందలి పుణ్య తీర్థముల యందు స్నానమాచరించి ముందు నన్ను చేరుదురో వారికి యాధిపత్యము నిత్తు ననెను. అంత కుమారస్వామి తన నెమలి వాహనము నధిరోహించి వాయువేగమున బయలు వెడలెను. దానిని చూచి గజాననుడు ఖిన్న వదనుడై తండ్రిని సమీపించి ప్రణమిల్లి "అయ్యా! తమరు నా అసమర్థత నెరింగియుండి కూడ నిట్లు అనతీయ తగునా? మీ పాదసేవకుడను. నాయం దను గ్రహించి తగు నుపాయము తెల్పి రక్షించండి" అని ప్రార్థించెను. అంత మహేశ్వరుడు దయాళుడై "కుమారా! నారాయణ మంత్రమును జపించిన మాత్రమున మూడు వందల కల్పంబులు పుణ్య నదులలో స్నానమాచరించిన వాడగును!" అని సక్రమముగా నారాయణ మంత్రమును ఉపదేశించెను.

ఆ మహామంత్ర ప్రభావమున అంతకు పూర్వము గంగా నదికి స్నానమాడ నేగిన కుమారస్వామికి గజాననుడు నదియందు స్నానమాచరించి ఎదురుగ వచ్చుచున్నట్లు కన్పింప అతడు మూడుకోట్ల ఏబది లక్షల నదులలోను కూడ నిటులనే చూచి ఆశ్చర్యపడుచు కైలాసమున కేగి తండ్రికి నమస్కరించి అచట గజానుని గాంచి తన బలమును నిందించుకొని "తండ్రీ! అన్నగారి మహిమ తెలియక అటులంటిని నన్ను క్షమింపుము. ఈ యాధిపత్యము నా అన్నగారికే యిమ్మని ప్రార్థించెను.



మహేశ్వరుడు అంత భాద్రపద శుద్ధ చవితి తిథియందు గజానునకు విఘ్నాది పత్యము నొసంగెను. ఆ దినమున సర్వదేశీయులు విఘ్నేశ్వరునకు తమ శక్తి కొలది కుడుములు, అపూపములు మున్నగు పిండివంటలు, టెంకాయలు, పాలు, తేనె అరటిపండ్లు, పానకము, వడపప్పు మున్నగునవి సమర్పించి పూజింప విఘ్నేశ్వరుడు, సంతుష్టితో వానిని తానారగించి, కొన్ని వాహనమునకిచ్చి, మరికొన్ని చేత ధరించి మెల్లగ సూర్యాస్తమయమునకు కైలాసమునకేగి తల్లిదండ్రులకు ప్రణమిల్లబోవ ఉదరము భూమికాని చేతులు అందవయ్యె బలవంతముగ చేతులానింప చరణిములాకాశము జూచె, ఇటు దండ ప్రమాణము చేయ గడుంగడు శ్రమ చెందుచుండ పరమశివుని శిరము నందలి చంద్రుడు జూచి వికటముగా నవ్వెను. అంత రాజ దృష్టి శోకిన రాలుగూడ నుగ్గగునను సామెత. విఘ్నేశ్వరుని ఉదరము పగిలి అందలి కుడుములు వెదజల్లబడెను. అతడు మృతుడయ్యెను.

అంత పార్వతీదేవి శోకించుచు చంద్రునిచూచి "పాపాత్మా? నీ దృష్టి తగిలి నా కుమారుడు మరణించెను. గాన నిన్ను చూచిన వారు పాపాత్ములై నీలాప నిందల పొందుదురు గాక"యని శపించెను.

నీలాపనిందలపాలైన ఋషి పత్నులు

ఆ సమయమున సప్తమహర్షులు యజ్ఞముచేయుచు తమ భార్యలతో అగ్నికి ప్రదక్షిణము చేయుచుండిరి. అగ్నిదేవుడు ఋషి పత్నులను మోహించి శాప భయమున అశక్తతతో క్షీణించుచుండ నయ్యది అగ్ని భార్యయగు స్వాహాదేవి గ్రహించి అరుంధతి రూపము దక్క మిగిలిన ఋషిపత్నుల రూపముల తానే దాల్చి పతికి ప్రియముచేసెను. దానిని చూచిన మహర్షులు అగ్నిదేవునితో నున్నవారు తమ భార్యలేయని శంకించి వారిని పరిత్యజించిరి. పార్వతీ శాపానంతరము ఋషిపత్నులు చంద్రుని చూచుటవలననే వారికిట్టి నీలాపనింద గల్గినది.

మునులును దేవతలును, ఋషిపత్నుల యాపదను పరమేష్టికిం తెల్ప నాతండు సర్వజ్ఞుడగుటం జేసి అగ్నిహోత్రుని భార్య స్వాహాదేవియే ఋషిపత్నుల రూపములు ధరించుటను సప్త ఋషుల సమాధాన పరచి వారితోగూడి బ్రహ్మకైలాసమున కేతెంచెను. ఉమామహేశ్వరులను సేవించి, మృతుడై యున్న విఘ్నేశ్వరుని బ్రతికించెను. అంత దేవాదులు "పార్వతీదేవీ! నీ విచ్చిన శాపవశమున లోకముల కెల్ల కీడు వాటిల్లెను. కావున దాని నుపసంహరింపుమని ప్రార్థించిరి. అంత పార్వతీదేవి సంతుష్టాంతరంగయై కుమార విఘ్నేశ్వరుని చేరదీసి ముద్దాడి "ఏ దినమున విఘ్నేశ్వరుని చూచి చంద్రుడు నవ్వెనో ఆనాడు చంద్రుని చూడరాదు" యని శాపావకాశము



నొసంగెను. బ్రహ్మాదులంత సంతసమున తమ గృహంబుల కేగి భాద్రపదశుద్ధ చవితినాడు మాత్రము చంద్రుని చూడక జాగరూకతతో సుఖంబున యుండిరి. ఇట్లు కొంతకాలము గడచెను.

శ మంతక మణి

ద్వాపర యుగమున ద్వారకావాసి శ్రీకృష్ణ పరమాత్ముని నారదుడు దర్శించి స్తుతించి ప్రియ సంభాషణ జరుపుచు "స్వామీ! సాయం సమయమాయెను. ఈనాడు విఘ్నేశ్వర చతుర్థి గాన శాపంబుచే చంద్రుని చూడరాదు. కాన నిజ గృహమునకేగెద శలవిం"డని పూర్వవృత్తాంత మంతయు విని శ్రీకృష్ణుడు ఆనాటి రాత్రి చంద్రునెవ్వరు చూడరాదని ద్వారకయందు చాటింపించెను. నాటి రాత్రి క్షీరప్రియుడ గుటం చేసి శ్రీకృష్ణుడు మింటికి చూడకనే గోష్ఠమునకు బోయి పాలుపిదుకుచు పాలలో చంద్ర ప్రతిబింబమును గాంచి "ఆహా! ఇక నాకెట్టి యపనింద రానున్నదో యని సంశయ మందెను. కొన్నాళ్లకు సత్రాజిత్తు సూర్యవంశమున శ్యమంతకమణిని సంపాదించి ద్వారకకు శ్రీకృష్ణ దర్శ నార్థము బోవ శ్రీకృష్ణుడు అతిధి సత్కారానంతరము ఆ మణి నిమ్మనికోరెను. అంత సత్రాజిత్తు యిది దినమునకు ఎనిమిది బారువుల బంగారమిచ్చునట్టిది. ఏ అప్తునికైనా సరే యివ్వను" అన్నాడు. ఒకనాడు సత్రాజిత్తు తమ్ముడు ప్రసేనుడా శ్యమంతకమణిని కంఠమున ధరించి వేట కడ వికిపోయెను. అట ఒక సింహము అతని కంఠమందలి యా మణిని చూచి మాంస ఖండమని భ్రమించి అతనిని జంపి ఆ మణి గొనిపోవ దారియందు ఒక భల్లూక మాసింగమును చంపి మణిని తీసికొనిపోయి తన కొండబిలయందు తొట్టి యందు పరుండియున్న తన కుమార్తె జాంబవతికి ఆట వస్తువుగ యిచ్చెను. మరునాడు సత్రాజిత్తు తమ్ముని మరణ వార్తవిని "శ్రీకృష్ణుడు మణి నీయనందులకు తన సోదరుని చంపి మణి నవహరించె"నని చాటెను. అది విని శ్రీకృష్ణుడు నాడు క్షీరమున చంద్రబింబ దర్శన దోష ఫలంబని తలంచి దానిని నివారించుకొనుటకు బంధు మిత్రాదులతో యరణ్యము చేరి వెతుకగా నొక చోట ప్రసేనుని కళేబరమును గాంచెను. పిదప సింగపు [illegible] భల్లూక చరణ విన్యాసంబును చూచెను. ఆ దారిని బట్టి పోనుపోను ఒక పర్వత గుహా ద్వారమున ప్రవేశించి పరివారము నటయుంచి శ్రీకృష్ణుడా గుహాంతర్భాగము చేరెను. అచట బాలిక ఉయ్యాలపై కట్టిప డియున్న శ్యమంతకమణిని చూచి అచటనుంచి దానిని చేత పుచ్చుకొని వచ్చుచున్నంత ఉయ్యాలలోని బాలిక రోదించెను. అంత దాది వింత మనిషియని కేకలు వేయసాగెను.

అంత జాంబవంతుడు కోపావేశమున ప్రవేశించి శ్రీకృ ష్ణునిపై బడి అరచుచు నఖంబుల గ్రుచ్చుచు క్రిందబడదోసి రాళ్ళచేత, వృక్షముల చేతను, ముష్టిఘాతముల చేతను ఎడతె రపిలేని రాత్రింబగళ్లు యిరువది ఎనిమిది రోజులు యుద్ధము చేసెను. జాంబవంతుడు క్షీణబలుడై భీతిచెందుచు, తన బలమును హరింపచేసిన యితడు రావణ సంహారి శ్రీరా మచంద్రునిగా భావించి, అంజలి ఘటించి "దేవాధి దేవా! ఆర్తజనపోషా, భక్తజనరక్షా! నిన్ను త్రేతా యుగమున రావ ణాధి దుష్ట రాక్షస సంహారణార్థమై అవతరించి భక్త జనులను పాలించిన శ్రీరామచంద్రునిగా ఎరింగితిని, అపుడు నా యందలి వాత్సల్యమున వరము కోరుమన నా బుద్ధి మాంద్యముచే మీతో ద్వంద్వ యుద్ధంబు చేయగోరుకొంటిని. కాలాంతరమున అది జరుగునని సెలవిచ్చితిరి. అది మొదలు నీ నామస్మరణ చేయుచు అనేక యుగములు గడుపుచు నిటయుండ తాము నా నివాసమునకు వచ్చి నా కోరిక తీర్చిరి. నా శరీరము శిథిలంబయ్యె నా అపరాధముల మన్నించి నన్ను కాపాడుము" అనుచు భీతిచే ప్రార్థించెను. శ్రీకృష్ణుడంత దయాళుడై జాంబవంతుని శరీరమంతయు తన హస్తముతో నిమిరి భయము పోగొట్టి యిట్లనెను. "భల్లూకేశ్వరా! శ్యమం తకమణి నపహరించి నాపై నారోపింపబడ్డ నింద బాపుకొనవ చ్చితి గాన, మణి నిమ్ము పోయెద" నని తెల్ప జాంబవంతుడు మణితో తన కుమార్తె జాంబవతిని శ్రీకృష్ణునకు కానుకగా యిచ్చెను. అంత తన యాలస్యమునకు పరితపించి బంధు మిత్రులతోను, కన్యారత్నముతోను, మణితోను శ్రీకృష్ణుడు ద్వారకచేరి యావద్వృత్తాంతమును తెల్పి శ్యమంతకమణిని సత్రాజిత్తునకిచ్చెను. అంత సత్రాజిత్తు యిది విని లేనిపోని నిందను మోపినందులకు మణిని తన కుమార్తె సత్యభా మతో కూడ కానుకగా శ్రీకృష్ణున కర్పించెను. శ్రీకృష్ణుడు సత్యభామను స్వీకరించి మణిని తిరిగి సత్రాజిత్తునకు యిచ్చి వేసెను. ఒక శుభముహూర్తమున శ్రీకృష్ణుడు జాంబవతి, సత్యభామల పరిణయమాడెను. అచటికి వచ్చిన మునులు, దేవాదులు స్తుతించి "మీరు సమర్థులు గాన నీలాపనిందలు బాపుకుంటిరి. మాకేమిగతి" అని ప్రార్థింప శ్రీకృష్ణుడు దయాళుడై భాద్రపద శుద్ధ చవితినాడు ప్రమాదవశమున చంద్ర దర్శనమయిన యెడల ఆనాడు గణపతిని యధావిధి పూజించి ఈ శ్యమంతకమణి కథను విని అక్షతలు శిరమున దాల్చువారు నీలాపనింద నొందకుందు గాక" యని అనతీయ దేవాదులు సంతసించి తమ నివాసములకు పోయి ప్రతివత్స రము దేవతలు మున్నగువారు తమ తమ శక్త్యానుసారము భాద్రపద శుద్ధ చవితినాడు గణపతిని పూజించి అభీష్టసిద్ధి గాంచుచు సుఖము నుండిరని శాపమోక్ష ప్రకారంబు శౌనకాది మునులకు వినిపించి వీడ్కొని నిజాశ్రమము చేరుకొన్నాడు.

సర్వేజనాః సుఖినోభవంతు!

హల్లో డాక్టర్ నేనేం చేయాలి?



డా. కొత్త రవీంద్రబాబు

కె.ఎం, నగరి.

ప్ర: మలబద్ధకం నీరసం, నిరాశా వాదం కృంగిపోయిన మానసికస్థితి, ఆదుర్దా భయం, నొప్పి భరించలేకపోవడం, వొంటరిగా వుండలేక పోవడం, గోరంత కొండంతలుగా మనసు వికలం చేసుకోవటం, వయసు 36 సంవత్సరములు.

జ: మీ నలభై పేజీల ఉత్తరం చదివాను. నిరుత్సాహం పోగొట్టుకుని ఏదైన వ్యాపకం కల్పించుకోండి- మీ ఉత్తరం ఒక క్రమపద్ధతిలో మీ మనోభావాలను మీ కుటుంబ సభ్యులు మీపట్ల అనుసరిస్తున్న తీరు ప్రవర్తనకు మీ ప్రతిస్పందన చక్కగా చెప్పారు. ఒక పేరు ప్రఖ్యాతి గల రచయిత కూడా అంత చక్కగా వ్రాయలేరేమో!

వివాహం చేసుకోండి, ఇష్టపడిన వ్యక్తిని- మీకు సంతోషం కలిగించే విధంగా- అంటే లలిత సంగీతం వింటూనో పుస్తకాలు చదువుతూనో తీరికకాలం గడపండి.

రచనా వ్యాసంగం చేపట్టటానికి ప్రయత్నించండి.

లిబోట్రిప్ బిళ్ల రాత్రి ఒకటి వేసుకోండి.

సంతోషంతోను తృప్తితోను మీ పనులు చేసుకుంటూ వుండండి!

మిమ్మల్ని ప్రోత్సహించే మనుష్యులు కావాలి- అదే ముఖ్య లోపంగా కనపడుతున్నది.

టి. లక్ష్మణరావు, బందరు.

ప్ర: వయసు 20 సంవత్సరములు పొడుగు పెరగాలి. తలలో చుండ్రు తగ్గాలి.

జ: సహజంగానే పొడుగు పెరిగే అవకాశం వుంది. మరో సంవత్సరం రెండు సంవత్సరాలు- క్లినిక్‌షాంపూతో వారానికి రెండుమార్లు తలంటుకుని బెట్నెసాల్ స్కాల్ప్ ఎప్లికేటర్ తలకు రాసుకోండి. వివరాలు మందుతో పాటు వుంటా-

వి. ఉమాశంకర్, ఇల్లెందు.

ప్ర: లావు తగ్గాలి.

జ: చాలా ఉత్తరాలు రాశారు. అన్నం తగ్గించండి. ఉడకబెట్టిన కూరలెక్కువగా తినండి. ఆహారంలో కొవ్వు పదార్థాలు తగ్గించండి. తీపి వస్తువులు తగ్గించి ఆకలయితే పల్చటి మజ్జిగ తాగండి.

డి. రావు, పొన్నూరు.

ప్ర: మీ నవలలు చదువుతాను. వివిధ సమస్యలు వివరించి పరిష్కారం చూపుతున్నారు. కృతజ్ఞతలు.

జ: రచయితలకు జీవంపోసి పోషించేది మంచి చెడూ చెప్పే పాఠకులే!

శ్రీ వల్లి, సత్తెనపల్లి.

ప్ర: నాకు మా అమ్మాయిలకి జుట్టు వూడిపోతున్నది.

జ: భోజనానంతరం కోఫర్ గొట్టం రోజుకొకటి చొప్పన నాలుగు నెలలపాటు వాడండి.

ఎస్. ఆర్. విజయవాడ.

ప్ర: వయసు 30 సంవత్సరములు జుట్టు వూడుతున్నది.

జ: జెబెక్స్ బిళ్ల రాత్రి భోజనానంతరం, మింటాప్ ఉదయం సాయంత్రం 1సిసి చొప్పన తలకు రాసుకోండి- నాలుగు నెలల పాటు-ఫలితం కనపడితే మరికొన్నాళ్లు వాడండి.

ఎస్. మురళి, అమ్మపాలెం.

ప్ర: ఎక్కువసార్లు మూత్రం విసర్జిస్తాను. జబ్బేమీలేదు. ఆత్రుత, భయం, ఆందోళన, బలహీనత, ఉద్రేకం నిద్రలేమి. నా వ్యాధి మానసికమా శారీరకమా?

జ: మీకు. ప్రమాదం కల్గించే మానసిక, శారీరక వ్యాధులేం లేవు. మూత్రం ఎక్కువైనందువలన నష్టం ఏం లేదు. మీ మనసుకు తృప్తినిచ్చే హాబీలను అభివృద్ధి చేసుకోండి.

రెండు నెలల పాటు లిబోట్రిప్ బిళ్ల రాత్రి పడుకోబోయే ముందు వేసుకోండి.

ఎన్. సాయిప్రసాద్, ఖర్గపూర్.

ప్ర: ముక్కుమీద కంటి కింద నల్లగా వుంటుంది.

జ: ఏస్కజిన్ గొట్టం రోజుకొకటి భోజనానంతరం వాడండి. బినోక్విన్ ఆయింట్‌మెంట్ రాత్రి పడుకోబోయే ముందు నల్లగా వున్నచోట-నెల పాటు రాసుకుంటే ఫలితం వుండవచ్చు.

జి.వి.రావు, పాయకరావుపేట.

ప్ర: 19 సంవత్సరములు గడ్డం రాలేదు.

జ: డాక్టరుగారికి చూపించుకోండి. శారీరకంగా ఏ లోపం లేదంటే పెరాండ్రెన్ బిళ్లలు రోజుకు రెండు చొప్పన మూడునెలలు వాడి చూడండి.

కె. రాజేందర్, మెట్‌పల్లి.

ప్ర: 18 సంవత్సరములు, బక్కగా వుంటాను.


జ: పళ్లు, పాలు, గుడ్లు, ఎక్కువగా తినండి. పెరిగే వయసులో బక్కగా వున్నవాళ్లు తర్వాత వళ్లు చేయవచ్చు.

○

మద్రాసులో దౌత్యాధికారిణి



దక్షిణభారత దేశానికి అమెరికన్ కాన్సలేట్ జనరల్‌గా ప్రప్రథమంగా ఒక మహిళ నియమింపబడ్డారు. ఆమె పేరు శ్రీమతి హెర్నెస్టిన్ ఎస్. హెక్. ఈమె కొలంబోలోని అమెరికన్ కాన్సలేట్‌లో రాజకీయ సలహాదారుగా పని చేశారట. 63లో అమెరికా విదేశాంగ శాఖలో చేరిన హెక్ గతంలో 7 సంవత్సరాలు మనదేశంలో పనిచేసిన అనుభవం వుంది.



లవ్ గేమ్



చల్లా సుబ్రహ్మణ్యం

(గత సంచిక తరువాయి)

క్షణం ఆలోచించి లేచి తలుపు తీశాడు.

సవ్యసాచి!!

అతని ముఖంలో కనిపిస్తున్న ఉద్విగ్నతను గమనించిన స్వాగత్ అతన్ని హాల్లో సోఫాలో కూర్చోబెట్టాడు.

"అసలేం జరిగింది?" అడిగాడు సవ్యసాచి.

పవన్‌కుమార్ ఇంటికి తాను వెళ్ళడం మొదలుకుని అంతా వివరించి, ఇంతకు ముందు వచ్చిన ఫోన్‌కాల్ విషయం కూడా చెప్పాడు.

సవ్యసాచి రెండు క్షణాలు తీవ్రంగా ఆలోచించి లేచి నిల్చుని అన్నాడు.

"వెల్- అసలిద్దరం కలిసి పవన్ ఇంటి కెళ్దామనుకున్నాను. కానీ నువ్వీ పరిస్థితుల్లో ఆమెను ఒంటరిగా వదిలి వెళ్ళడం ప్రమాదం. అందుకే- నేనొక్కణ్ణే వెళ్తాను. నువ్వు మాత్రం ప్రతిక్షణం ఎలర్ట్‌గా వుండు.

"అలాగే" అన్నాడు స్వాగత్.

సవ్యసాచి తలుపు దగ్గర కెళ్ళి హఠాత్తుగా వెనక్కి తిరిగి అడిగాడు.

"బైదిబై- నీ దగ్గర రివాల్వరుందా?"

"వుంది"

"అయితే దాన్ని నీ దగ్గరే పెట్టుకో- ఏక్షణమైనా హంతకుడు ఎటాక్ చేయొచ్చు. ఎందుకైనా మంచిది. ఫర్ హెవెన్స్ సేక్- కీపెట్ విత్ యూ"

"అలాగే థాంక్యూ"

సవ్యసాచి వెళ్ళిపోయాడు.

మెయిన్ డోర్ లాక్ చేసి తన గదిలోకి వెళ్ళి లాకర్‌లో నల్లగా మెరుస్తున్న రివాల్వర్ అందుకుని- జేబులో పెట్టుకుని- తిరిగి హాల్లోకి వచ్చిన స్వాగత్-

నవ్య గది వేపు చూసి

ఉలిక్కిపడ్డాడు!!

★ ★ ★ ★

జి. పి. ఓ. దగ్గర కారు స్లో చేసి- రియర్‌వ్యూ మిర్రర్ లోంచి చూశాడు సవ్యసాచి.

తన వెనుకే వస్తున్న తెల్ల మారుతీ కారు కూడా స్లో అయింది. సవ్యసాచి భ్రుకుటి ముడివడింది.

సరిగ్గా తను మాసాబ్ టాంక్ దగ్గర కొచ్చినప్పుడు- విజయనగర్ కాలనీ రోడ్ మీద నుంచి వేగంగా మలుపు తిరిగిన ఆ మారుతీ కారు అక్కడి నుంచీ తనను వెంటాడుతున్నట్టు అనుమానం. వసంత విహార్ హోటల్ ముందు కారాపి సిగరెట్ వెలిగించుకున్నాడతను. మారుతీ కారు అతని కారును దాటి- జె. డి. ఎలక్ట్రానిక్స్ ముందు ఆగింది. అప్పుడు చూశాడు ఆ కారులోని మనిషిని. అందంగా బాబ్డ్ చేయబడ్డ జుట్టుతో- ముదురు ఎరుపు రంగు చీర మీద అదే రంగు స్లీవ్‌లెస్ బ్లౌజ్ వేసుకుని చాలా అందంగా ఆధునికంగా ఉందామె.

డోర్ తీసుకుని పక్కకు కూడా చూడకుండా ఆ షాప్‌లోకి వెళ్ళిపోయింది.

సవ్యసాచికి తాను అనవసరంగా అనుమానిస్తున్నానేమోనని క్షణం అనిపించింది.

అయినా అతను రాజీ పడలేకపోయాడు.

క్రిమినల్ లాయర్‌గా పదేళ్ళ అనుభవం వున్న అతను ఇలాంటి సన్నివేశాల్ని ఎన్నో ఎదుర్కొన్నాడు. కారు స్టార్ట్ చేసి జె. డి. ఎలక్ట్రానిక్స్ మీదుగా వెళ్తూ లోపలికి చూశాడు.

ఆమె కౌంటర్లో వ్యక్తితో ఏదో మాట్లాడుతోంది. సవ్యసాచి కారు వేగం పెంచాడు.

ఉస్మానియా గోల్డెన్ జూబ్లీ బ్లాక్ దగ్గరకొచ్చా. ట్రాఫిక్ సిగ్నల్ లైట్ వెలగడంతో కారాపిన సవ్యసాచి ఉలిక్కిపడ్డాడు. సరిగ్గా అతని కారు వెనక

ఇంతవరకూ సాగిన కథ-*21*:తనను వ్యతిరేకిస్తున్న భార్య నవ్యను దారికి తెచ్చుకునే విషయంలో స్వాగత్‌కు మేనమామ భాగ్యరాజ్ సహకరిస్తాడు. శైలజ హత్యకేసులో చిక్కుకున్న నవ్యను విడిపించేందుకు పబ్లిక్ ప్రాసిక్యూటర్ స్వాగత్‌కు కొన్ని సలహాలిస్తాడు. ఆ సలహాల ఆధారంగా శైలజ యింట్లో స్వాగత్ కొన్ని సాక్ష్యాధారాలను సేకరిస్తాడు. కాని అవి గల్లంతవుతాయి. శైలజను గురించిన వివరాలు తెలుసుకుంటుండగా స్వాగత్ పి.ఆర్.ఒ. పవన్‌కుమార్ హత్యకు గురవుతాడు. ఆ హంతకుడు నవ్యను చంపబోతున్నట్లు స్వాగత్‌ను బెదిరిస్తాడు.

వున్న రెండు ఆటోల వెనుక- తెల్లరంగు మారుతీ కారు ఆగి వుంది!

* * * *

మూసి వున్న నవ్య గది తలుపులను కంగారుగా కొట్టాడు స్వాగత్. తలుపులు తెరుచుకోలేదు.

తాను రివాల్వర్ కోసం తన గదిలోకి వెళ్ళబోయే ముందు ఆమె గది తలుపు కొంచెం తెరిచే వుంది. ఇంతలో ఆమె తలుపు మూసుకోవలసిన అవసరం ఏవిటో అతనికర్థం కాలేదు. మామూలుగా అతి సహజం అనిపించే ఆ సన్నివేశం ప్రస్తుతం అతన్ని విపరీతమైన ఉద్విగ్నతకు గురి చేస్తోంది. మెయిన్ డోర్ తీసి- ఆమె గది కిటికీ దగ్గరకు పరుగెత్తి చూశాడు. కిటికీ కూడా మూసి కర్టెన్ పూర్తిగా వేసి వుంది. కిటికీ అద్దాల మీద బలంగా కొట్టి పిలిచాడు స్వాగత్. జవాబు లేదు.

అతను చుట్టూ చూశాడు.

అంతా నిర్మానుష్యంగా వుంది. అతని దృష్టి- దూరంగా తోటలో పడి వున్న ఇనుపరాడ్ మీద పడి- వేగంగా వెళ్ళి దాన్ని తీసుకుని వచ్చి కిటికీ అద్దాల మీద బలంగా కొట్టాడు.

భళ్ళున పగిలి ముక్కలయిందా కిటికీ.

చప్పున కర్టెన్ తొలగించి లోపలికి చూశాడు.


నవ్య బెడ్ ఖాళీగా వుంది.

"నవ్యా.... నవ్యా...."

కంగారుగా ఆదుర్దాగా పిలిచాడు జవాబులేదు.

అతనొక్షణం ఆలోచించాడు.





బాత్‌రూం కెళ్ళిందేమో– వణుకుతున్న చేతుల్తో సిగరెట్ వెలిగించుకున్నాడు.

ఒకటి– రెండు– మూడు–

క్షణాలు గడుస్తున్నాయి.

పది నిముషాలు అసహనంగా గడిపాడు స్వాగత్.

అతను– మెరుపు వేగంతో హాల్లోకొచ్చి తలుపుల్ని బలంగా కొట్టాడు. తలుపు తెరుచుకోలేదు.

ఇంతలో –

భాగ్యరాజ్– భార్గవీ– మీనాక్షీ – సావిత్రి మొదలైన వాళ్లంతా వచ్చి ఆవేశంతో తలుపు కొడుతున్న స్వాగత్‌ను చూసి నిశ్చేష్టులయ్యారు.

''ఏవిట్రా– ఏమైంది?'' కంగారుగా అడిగాడు భాగ్యరాజ్.

''నవ్య.... నవ్య....'' ఉద్విగ్నతతో అతనికి గొంతు పెగల్లేదు.

''ఊ....నవ్య.... ఏమైంది నవ్యకు...''

''ఏమో తెలీదు. ఎంత పిలిచినా పలకడం లేదు'' అన్నాడు స్వాగత్.

భాగ్యరాజ్ తలుపు తట్టి–

''అమ్మా నవ్యా – నేను భాగ్యరాజ్‌ని. తలుపు తీయి బేబీ'' అన్నాడు. తలుపు తెరుచుకోలేదు.

మీనాక్షి– సావిత్రి ఏడవడం మొదలు పెట్టారు.

మన్మథరావు వాళ్లను కసురుకునేసరికి– ఇద్దరూ నోటికి చెంగులడ్డు పెట్టుకున్నారు. సుందరమూర్తి కంగారుగా బయటకు పరుగెత్తి కిటికీలోంచి చూసి అరిచాడు.

''అమ్మా– నవ్యా... నవ్యా... ఏమైంది తల్లీ నీకు– తలుపు తియ్''

''మేమెళ్లాక మీరేమయినా గొడవపడ్డారా?'' సీరియస్‌గా అడిగింది భార్గవి.

''లేదు– అసలు మేము మాట్లాడుకోలేదు'' తల దించుకుని అన్నాడు స్వాగత్.

''అసలు బేబీని పిలవాలని నీకెందు కనిపించింది'' అడిగాడు భాగ్యరాజ్. అతన్ని అనుమానంగా చూస్తూ–

''ఎందుకంటే– ఇంతకుముందే ఫోన్...'' హఠాత్తుగా చెప్పడం ఆపి తలదించుకున్నాడు స్వాగత్.

అవును. ఆ విషయం చెప్పకపోవడమే మంచిది. అది తాను ఆడే వేరే నాటకమని– తననింకా అనుమానించే ప్రమాదముంది.

''ఊ- ఎవరు చేశారు ఫోన్?'' పెద్దగా అరిచాడు భాగ్యరాజ్.

''నవ్య ఫ్రెండ్... యస్... శ్రీమతి ఫోన్ చేస్తే పిలుద్దామని తలుపు తట్టాను. దాదాపు పది నిముషాల్నుంచీ పిలుస్తున్నాను- పలకలేదు. అనుమానమొచ్చి కిటికీ పగలగొట్టి చూశాను- అసలు నవ్య గదిలో లేదు''- హీన స్వరంతో చెప్పాడు స్వాగత్.

భాగ్యరాజ్ హాల్లో ఫోన్ వేపు చూశాడు. అది క్రెడిల్ చేసి వుంది.

''ఎందుకురా ఇన్ని అబద్ధాలు చెప్తావ్?'' తీవ్ర స్వరంతో అడిగాడు భాగ్యరాజ్.

చప్పున తలెత్తి చూశాడు స్వాగత్.

''అవున్రా- ఫోన్ చేస్తే- రిసీవర్ క్రెడిల్ చేసి నవ్యని పిలవడానికి వచ్చావా?'' అడిగాడు భాగ్యరాజ్.

స్వాగత్ ముఖం పాలిపోయింది.

యువనటీమణుల సెన్సేషన్

నటీనటుల పిల్లలు యిటీవల చిత్రరంగంలోకి ప్రవేశిస్తుండటం మనం చూస్తూనే వున్నాం. అంతవరకు బాగానే వుంది కాని వారు సెన్సేషన్ సృష్టిస్తున్నారట ఆ రంగంలో. మరి ఆ సెన్సేషన్ 'ఏ' విధంగానో చెప్పటం కష్టమే కాని పూజాబేడీ, ప్రోతిమా ఫ్లాప్ దర్శకుడు జగ్‌మోహన్ 'కమ్సా-సురాగ్?', 'విషకన్య' చిత్రాల్లో నటిస్తుండగా, మహేష్‌భట్ ముద్దుల కూతురు పూజాభట్ 'డాడీ' అనే టెలిఫిలింలో నటిస్తోంది. ఇదే మార్గాన్ని శత్రుఘ్నసిన్హా కూతురు మేఘనా, రాజేష్- డింపుల్ పుత్రిక ట్వింకిల్ కూడా అనుసరిస్తున్నారట. మరి వీళ్లందరూ 'ఏ' విధమైన సెన్సేషన్ సృష్టిస్తారో చూసి తీరాల్సిందే!

''సో- మీరిద్దరూ ఏదో గొడవపడ్డారు. నువ్వేదో ఆ అమ్మాయిని బాధపెట్టి వుంటావ్. కోపంతో- బాధతో తలుపులేసుకుని... యస్.... ఏ అఘాయిత్యానికైనా తలపడి ఉండొచ్చు. బేబీ అసలే డెలికేట్- నిజం చెప్పు....'' నిలదీశాడు భాగ్యరాజ్.

రోషంగా తలెత్తి అన్నాడు స్వాగత్-

''ఇట్సాల్ రైట్- మీ అనుమానమే నిజమైతే- ఇలా ఏమైందీ అని డిబేట్ పెట్టుకోవడం దారుణం కదూ- ముందు ఆమెకేమైందో చూడండి''-

''అవునండీ బాబూ- అవతల నవ్యకేమైందో ఆలోచించకుండా వాదన పెట్టుకుంటారేం?'' కంగారుగా అన్నాడు మన్మథరావు.

భాగ్యరాజ్ బలంగా తలుపులు కొట్టాడు.

కొంత సేపయ్యాక స్థిరంగా అన్నాడు స్వాగత్.

''నువ్వు తప్పుకో మావయ్యా-''

భాగ్యరాజ్ అతన్ని ఆశ్చర్యంగా చూస్తూ పక్కకి తప్పుకున్నాడు.

స్వాగత్ తలుపు దగ్గరకొచ్చి- నెమ్మదిగా జేబులోంచి రివాల్వర్ తీశాడు.

''మైగాడ్- అదెందుకుంది నీ జేబులో'' షాక్‌తో అడిగాడు భాగ్యరాజ్.

స్వాగత్ జవాబుచెప్పలేదు.

అతని వెనకున్న అందరూ- భయంగా అతన్ని హంతకుడిలా చూడసాగారు.

స్వాగత్ రివాల్వర్ డోర్ లాక్‌కు ఆనించి ట్రిగ్గర్ నొక్కాడు.

లాక్ ఊడిన శబ్దం వినిపించింది.

బలంగా నెట్టాడు తలుపును. విసురుగా తెరుచుకుంది. వేగంగా లోపలికెళ్లి గదంతా చూసి- బాత్‌రూం తలుపు నెట్టి- లోపలికి చూసిన స్వాగత్-

అతని వెనుకనే ఆశ్చర్యంగా చూస్తున్న అంతా- స్థాణువులై నిలబడిపోయారు.

అక్కడ-

బాత్‌రూంలో నవ్య బోర్లా నేలమీద పడివుంది. ఆమె నుదుట మీద నుంచి రక్తం కారి బాత్‌రూం నేలమీద నెమ్మదిగా పరుచుకుంటోంది!!

★ ★ ★ ★ ★

సవ్యసాచి వేగంగా డ్రైవ్ చేస్తున్నాడు.

అతనికి పది గజాల దూరంలో వెంబడిస్తూ వస్తోంది ఆమె. చాదర్‌ఘాట్ మీదుగా మలక్‌పేట దాటి- టీ.వి టవర్ దగ్గరకొచ్చింది కారు. అక్కడ్నుంచి రింగ్ రోడ్డును సమీపిస్తుండగా-

సరిగ్గాఅప్పుడు-

మెరుపు వేగంతో రివాల్వర్ తీసి- అదే వేగంతో- తెల్ల రంగు మారుతీ టైర్‌ను గురి చూసి షూట్‌చేశాడు సవ్యసాచి. కీచుమంటూ బ్యాలన్స్ తప్పి- పాములా మెలికలు తిరుగుతూ- ఉప్పల్ నుంచి అప్పుడే హైవే మీదికొస్తున్న ఓ లేలాండ్ లారీని బలంగా గుద్దుకుంది ఆ తెల్లరంగు మారుతీకారు.

యాక్సిలేటర్ బలంగా నొక్కాడు సవ్యసాచి.

స్పీడో మీటర్ డెబ్భై చూపిస్తోంది.

వెనక్కి తిరిగి చూశాడు. జనం కంగారుగా గుమికూడుతున్నారు. హాయిగా నిట్టూర్చి చిన్నగా నవ్వుకున్నాడు సవ్యసాచి.

ఇంకో గంటకు గాని పోలీసులు చేరుకోరు. తాను బుల్లెట్ పేల్చిన విషయం ఆమెకు తప్ప మరెవరికీ తెలిసే అవకాశం లేదు. ఆమె కూడా గమనించిందో లేదో అనుమానమే-

సరిగ్గాఅరగంట తర్వాత-

వనస్థలిపురం దాటి ఐదుకిలో మీటర్లు వెళ్లాక ఎక్కడో ఏకాంతంగా ఉన్న ఓ ఇంటి ముందు కారాపి దిగి- చుట్టూ చూశాడు. ఆ ఇంటికి చుట్టుపక్కల ఒక్క ఇల్లు కూడా లేదు. అత్యంత ఆధునికంగా నిర్మించిన ఆ భవనాన్ని చూస్తూ గేటు తీసుకుని లోపలికి వెళ్లిన సవ్యసాచి షాక్‌తో నిలబడి పోయాడు. స్వాగత్ తాను తలుపులు అలాగే వదిలేసి వచ్చానని చెప్పాడు- కానీ- ఆ ఇంటి మెయిన్ ఎంట్రన్స్‌కు తాళం వేసి వుంది.

ఇదెలా సాధ్యం?

తీవ్రంగా ఆలోచించాడు సవ్యసాచి. ప్యాంట్ జేబులోంచి కీ బంచ్ తీసి తాళాన్ని రుమాలుతో పట్టుకుని వేలిముద్రలు పడకుండా జాగ్రత్తగా ఒక్కో తాళంతో ప్రయత్నించసాగాడు. అలా ఎనిమిది తాళాలతో ట్రై చేశాడు.

తొమ్మిదో తాళం తీసి బలంగా తిప్పాడు.

'క్లిక్'మన్న సున్నితమైన శబ్దంతో తాళం ఊడింది. నెమ్మదిగా తాళం తీసి- బోల్టు లాగి- తాళాన్ని హుక్‌కి తగిలించి- తలుపు నెట్టి లోపలికెళ్లాడు.

గదంతా నీట్‌గా సర్ది వుంది.

అసలు కొంతసేపటి క్రితం ఆ గదిలో హత్య జరిగిందని చెబితే హంతకుడు సైతం నమ్మలేనంత శుభ్రంగా ఉందా గది. కార్పెట్ మీద ఎక్కడా నెత్తురు చుక్క లేదు. టీపాయ్ మీదున్న గ్లాస్ యాష్‌ట్రే నీట్‌గా వుంది. ర్యాక్‌లో గాజు గ్లాసులు సర్ది వున్నాయి.

'ఓ అద్భుతాన్ని చూస్తున్నట్టు చూడసాగాడు సవ్యసాచి. ఎక్కడా చిన్న ఆధారం కూడా లేకుండా ఎవరో చాలా జాగ్రత్తగా ఆ గదిని సర్దినట్టు అతనికి అర్థమైంది.

అయినా అతను నిరుత్సాహపడలేదు.

కార్పెట్ ఎత్తి చూశాడు.

మొజాయిక్ ఫ్లోరింగ్ మెరుస్తోంది.

విశాలమైన ఆ గదిని ప్రతి అంగుళం అతి జాగ్రత్తగా వెదుకుతున్నాడతను.

దాదాపు గంటపాటు వెదికి- ఎక్కడా ఏమి కనిపించక నిరుత్సాహంగా బయటికొచ్చి- తాళం వేస్తూ పక్కకు చూశాడు. ఆ ఇంటి చుట్టూ ఆరడుగుల మేర సిమెంట్ చేసి వుంది. మధ్య మధ్యలో చెట్ల కోసం పెట్టిన ఖాళీ స్థలంలో- ఓ పాదులో ఎండపడి- ఏదో మెరుస్తూ కనిపించింది.

పాన్ పరాగ్ జర్దా ప్యాకెట్!!

చప్పున వెళ్లి దాన్ని రుమాల్తో అందుకుని- దాన్లోనే చుట్టి భద్రంగా జేబులో పెట్టుకున్నాడు సవ్యసాచి. అక్కడే నిలబడి ఎదురుగా చూశాడు. మూసివున్న గ్లాస్ కిటికీలోంచి- ఆ గది స్పష్టంగా కనిపిస్తోంది. సవ్యసాచికి జరిగిందేమిటో అర్థమైంది. స్వాగత్- పవన్‌లు ఘర్షణపడుతున్న సమయంలో ఆ కిటికీ తెరిచి ఉండి ఉంటుంది. హంతకుడు చాలా నెమ్మదిగా ఆ ఆవరణలోకి ప్రవేశించి- సరిగ్గాకిటికీ దగ్గర నిలబడి- పవన్ తన పేరు చెప్పబోతుండగా సైలెన్సరున్న రివాల్వరుతో కాల్చి చంపి వుంటాడు.

సవ్యసాచి వెనక్కి తిరిగి చూశాడు.

విశాలమైన ఆవరణలోంచి గేటు కనిపిస్తోంది. హత్య చేసిన వెంటనే హంతకుడు తోటలోంచి గేటు ద్వారా బయటకు పారిపోయి వుండే పక్షంలో స్వాగత్‌కు కనిపించి ఉండేవాడు. సవ్యసాచి నెమ్మదిగా ఆ ఇంటి వెనక్కి వెళ్లాడు. అక్కడ ప్రహరి గోడకు ఓ



మూలగా ఖాళీ విస్కీ బాటిల్స్ గుట్టగా పడివున్నాయి. ఆ బాటిల్స్ మీదుగా ఎక్కి- కాంపౌండ్ వాల్ దూకి వెళ్లడం ఏమంత కష్టం కాదని గ్రహించాడు సవ్యసాచి. కొన్ని సీసాలు పెళ్లు ఎదురుగా కిందకి జారి వున్నాయి. అంటే హంతకుడు ఈ సీసాల మీదుగానే గోడెక్కి- గోడ వెనక దాక్కుని వుండొచ్చు. మర్డరవగానే స్వాగత్ దూరంగా వెళ్తున్న అంబాసిడర్ని అనుసరించాడు. కానీ ఇంటి చుట్టూ వెదకలేదు. స్వాగత్ వెళ్లి పోగానే- హంతకుడు శవాన్ని మాయంచేసి- అనుమానం రాకుండా ఇల్లంతా నీట్‌గా- సర్దిపెట్టి వెళ్లిపోయాడు.

తృప్తిగా నిట్టూర్చి- కారు దగ్గరకు నడిచాడు.

మరుక్షణం అతని కారు ముందుకు దూసుకుపోయింది. కారు రింగ్‌రోడ్ దగ్గరకొచ్చినపుడు చూశాడు సవ్యసాచి. రోడ్ మీద లారీకి గుద్దుకున్న తెల్ల మారుతీ గుర్తు పట్టలేనంతగా క్రష్ అయివుంది. రోడ్ మీద యాక్సిడెంట్ స్పాట్ చుట్టూ రాళ్లు పేర్చి వున్నాయి.

కారాపి- కానిస్టేబుల్స్‌ని అడిగాడు సవ్యసాచి.

"ఏమైందీ?"

"కనిపించడంలే- యాక్సిడెంట్" చిరాగ్గా అందామని తలతిప్పిన కానిస్టేబుల్ ఎరుపురంగు డాట్సన్‌ను చూసి వినయంగా చెప్పాడు.

యాక్సిడెంట్ సాబ్- లారీ డ్రైవర్లకి-

లవ్‌గేమ్

పండు తో లేటప్పుడు కళ్లు నెత్తిన వుంటయ్. పాపం ఆడకూతురు- చచ్చిపోయింది-"

★ ★ ★ ★ ★

"నవ్యా"

ఒక్క ఉదుటున వెళ్లి ఆమెను లేపి తన ఒడిలో ఆమె తల పెట్టుకుని ఉన్మాదిలా అరుస్తున్నాడు స్వాగత్-

"నవ్యా- నవ్యా..."

మీనాక్షి- సావిత్రి- భార్గవి ఒక్క పెట్టున ఏడవసాగారు. సుందరమూర్తి ఉత్తరీయంతో కళ్లొత్తుకుంటున్నాడు.

భాగ్యరాజ్ కంగారుగా ఆమె నాడి పట్టుకుని చూసి ఎక్సైటింగా అన్నాడు.

"థాంగాడ్- రేయ్ స్వాగత్- లే- అమ్మాయిని బెడ్ మీదకు తీసుకురా"-

స్వాగత్ ఛివాలున ఆమెను రెండు చేతుల మీద వేసుకుని బెడ్ మీద పడుకోబెట్టాడు. భాగ్యరాజ్ డాక్టర్‌కి ఫోన్ చేశాడు. భార్గవి నీళ్లు తెచ్చి- నవ్య ముఖం మీద చల్లింది. మీనాక్షి గుడ్డతో ఆమె నుదుటిన గాయానికి కట్టు కట్టింది.

కొన్ని క్షణాల తర్వాత- నీరసంగా కళ్లు తెరిచింది నవ్య.

నవ్యా - ఏమయింది - ఏం జరిగింది? ఆత్రుతగా ఉద్విగ్నతతో ఆమెమీదకు వంగి అడిగాడు స్వాగత్.

ఆ క్షణంలో కూడా ఆమె ముఖంలో తనని చూసిన వెంటనే వ్యక్తమైన అసహ్యాన్ని గమనించిన స్వాగత్ హృదయం బాధగా మూలిగింది.

డాక్టర్ వచ్చి పరీక్షచేసి చెప్పాడు.

"డోంట్‌వర్రీ - రెండు మూడు రోజుల్లో గాయం మానిపోతుంది. ఈ టాబ్లెట్స్ వాడండి. ఈమె చాలా నీరసంగా వున్నారు. రెస్ట్ తీసుకోవాలి."

"అసలేం జరిగింది బేబీ"- అడిగాడు భాగ్యరాజ్.

బాత్రూం కెళ్దామని వెళ్తుండగా హఠాత్తుగా విపరీతమైన నీరసంతో కళ్లు తిరిగినట్లనిపించి - తూలి పడ్డాను. అంతే. తర్వాత ఏం జరిగిందో నాకు తెలీదు-"

నీరసంగా చెప్పింది.

"చాలా వీక్‌గా వున్నావమ్మా- పైగా విపరీతమైన టెన్షన్‌తో ఎక్కువగా ఆలోచించడంవల్ల అలా జరిగి వుంటుంది" చెప్పాడు డాక్టర్.

నిద్రపోవడానికి ఇంజెక్షనిచ్చి వెళ్లి పోయాడు డాక్టర్.

ఆమె మంచం దగ్గర కుర్చీ వేసుకుని ఆమెనే చూస్తున్నాడు స్వాగత్. జరిగిన సన్నివేశం కాకతాళీయమైనా తన పరిస్థితిని సులువు చేసినందుకు ఆనందించాడు స్వాగత్.

ఇప్పుడు తను నవ్యను కంటికి రెప్పలా కాపలా కాసే అవకాశం తనకు దక్కింది.

పది నిముషాలు అందరూ అక్కడే కూర్చుని- ఆ తర్వాత వెళ్లిపోయారు.

స్వాగత్ లేచి తలుపు బోల్టు పెట్టాడు.

పగిలిన కిటికీకి అడ్డుగా కర్టెన్ లాగాడు. రిలాక్స్‌డ్‌గా కుర్చీలో కూర్చుని సిగరెట్ వెలిగించిన తర్వాత అప్పుడు మోగింది ఫోన్.

ఓ క్షణం ఆలోచించి అందుకున్నాడు స్వాగత్.

"హలో - స్వాగత్ హియర్"

"నేను గురూ- సవ్యసాచిని."

"చెప్పు- ఏమైంది?" ఆదుర్దాగా అడిగాడు స్వాగత్.

సవ్యసాచి విషయమంతా చెప్పాడు.

"సో- హత్యకు పథకమేసిం దెవరోగానీ జీనియస్ అయుండాలి బాస్. హత్యా నంతరం ఆ గదిలో హంతకుడికి సంబం







సర్ప భక్షకుడు నాగభైరవ చౌదరిని గురించి మనం ఇటీవల చదివాం. అలాంటి వ్యక్తే బొంబాయి వీధుల్లో వున్నాడు. ఆ వ్యక్తి పేరు కృష్ణన్. తమిళనాడుకు చెందిన యితను పాముల్ని మ్రింగే ప్రదర్శనలు యిస్తున్నాడు. అందర్నీ ఆశ్చర్య చకితుల్ని చేసే విధంగా ఒకదాని వెంట ఒకటి పాముల్ని మ్రింగి లోటాడు నీళ్లు త్రాగుతాడట. మరి కాసేపటికే తను మ్రింగిన పాముల్ని ఒక్కొక్కటి బయటకు తీస్తాడు. ఇదంతా యోగం ద్వారానే సాధించానంటున్న కృష్ణన్ ఈ విధంగా ప్రదర్శనలిచ్చి రోజుకు 100 నుంచి 150 రూపాయల వరకు సంపాదిస్తాడు. అందుకే అన్నారు కూటి కోసం కోటి విద్యలని!

ధించిన ఏదో ఒక క్లూ మిగిలి వుంటుందని నా అనుమానం. హత్యానంతరం నువ్వు వెంటనే పోలీస్ రిపోర్ట్ ఇస్తావేమోనని భయపడి మొత్తంగా శవాన్నే మాయంచేసి ఆధారాలు లేకుండా చేయడం సులువనిపించిం దతనికి. బట్ బ్యాడ్‌లక్. హంతకుడికి సంబంధించిన ఒకే ఒక్క ఆధారం నాకు దొరికింది."

"ఏవిటది?" ఆతృతగా అడిగాడు స్వాగత్.

"హంతకుడికి పాన్‌పరాగ్, జర్దా నమిలే అలవాటు వుండి వుండాలి. ఎందుకంటే హత్య చేసిన స్థలంలో నాకా ప్యాకెట్ దొరికింది. రివాల్వర్ తీసేటప్పుడో, లేదా షూట్ చేశాక జేబులో పెట్టుకునేటప్పుడో - ఆ ప్యాకెట్ జారి కింద పడింది. ఆ కంగారులో అతను గమనించివుండడు. పైగా శవాన్ని మాయం చేసి- ఆధారాలేవీ దొరక్కుండా చేయడానికి వచ్చినప్పుడు కూడా వాళ్ళు ఆ ప్యాకెట్‌ని గమనించ లేదు. అన్నట్టు నీకు తెలిసిన వాళ్లలో పాన్‌పరాగ్ నమిలే అలవాటున్న వాళ్లెవరైనా వున్నారా?" అడిగాడు సవ్యసాచి.

ఓ క్షణం ఆలోచించి అన్నాడు స్వాగత్.

"లేరు- ఎవరూ లేరు"

"ఎనీ హౌ మనకో క్లూ దొరికింది. ఇకనుంచి నీకు పరిచయమున్నవాళ్లలో ఆ అలవాటున్న వాళ్ళెవరైనా వున్నారేమో జాగ్రత్తగా అబ్జర్వ్ చేయి..."

"అలాగే"

"నీ విషయం ఎలా వుంది. ఎనీ ఎటెంప్ట్?" అడిగాడు సవ్యసాచి.

నవ్య బాత్రూంలో పడిపోవడం చెప్పాడు స్వాగత్.

రెండు క్షణాల తర్వాత అడిగాడు సవ్యసాచి.

"ఆ డాక్టర్ మీ ఫామిలీ డాక్టరేనా?"

"అవును"

"దెన్- నో ప్రాబ్లెం... ఎందుకైనా మంచిది జాగ్రత్తగా వుండు. పోనీ నన్ను రమ్మంటావా?"

"నో థాంక్స్- ఇప్పటికే చాలా రిస్క్ తీసుకున్నావ్..."

హృదయపూర్వకంగా అన్నాడు స్వాగత్.

"యు ఆర్ వెల్‌కమ్ బాస్- గుడ్‌లక్-"

ఫోన్ పెట్టి కుర్చీలో కూర్చోబోతుండగా-

హఠాత్తుగా కరెంట్ పోయింది. ఫ్యాన్ తిరగడం ఆగిపోయింది.

మామూలుగా కరెంట్ తీసే సమయం కాదది.

అలాంటి దీ సమయంలో కరెంట్ పోవడం- అతని మనస్సేదో కీడుని శంకించింది. ఫోనందుకుని ఎలక్ట్రిసిటీ ఆఫీస్‌కి ఫోన్ చేసి కంప్లెయింటిచ్చాడు.

పక్క ఇంటికి ఫోన్ చేసి కరెంట్‌వుందా అని అడిగాడు.

"వుంది. మీకేదో ఫ్యూజ్ పోయివుంటుంది ఓసారి చెక్ చేసుకోండి" చెప్పారు వాళ్ళు.

ఫోన్ పెట్టి నవ్యను చూశాడు.

అప్పటికే ఆమె నుదుటిమీద చిరు చెమటలు పడుతున్నాయి. కిటికీకి అడ్డంగా వున్న కర్టెన్ తొలగించి కిటికీ తలుపులు తెరిచాడు.

సన్నగాలి తెర నెమ్మదిగా గదిలోకి వచ్చింది.

కుర్చీలో కూర్చుంటూ- ఎదురుగా చూశాడు.

ఘూర్కాతో ఎ ‌రో వ్యక్తి ఘర్షణ

లవ్‌గేమ్

పడుతున్నాడు.

స్వాగత్ ఎలర్ట్ అయ్యాడు.

ఫోనందుకుని ఘూర్ఖాని అడిగాడు.

"ఎవరో వాటర్ వర్క్స్ వాళ్లట సార్. మనం కంప్లెయింట్ ఇస్తే వచ్చారట. పంపించమంటారా?" అడిగాడు.

"ఒక్క నిముషం" అని హాల్లో కొచ్చి అడిగాడు.

"వాటర్ వర్క్స్ వాళ్లకి ఎవరైనా కంప్లెయింటిచ్చారా?"

ఓ క్షణం అంతా నిశ్శబ్దంగా ఆశ్చర్యంగా చూశారతన్ని.

భార్గవి చెప్పింది.

"ఉదయం ఓవర్‌హెడ్ టాంక్‌లోకి నీళ్ళెక్కడం లేదని నవ్యే కంప్లయింట్ ఇచ్చింది."

స్వాగత్ ఫోనందుకుని అన్నాడు-

"అతన్ని పంపించు-"

సిగరెట్ వెలిగించుకుని కిటికీలోంచి చూస్తున్నాడు స్వాగత్.

సన్నగా ఐదున్నర అడుగుల ఎత్తులో కాకీ బట్టల్లో వస్తున్నాడతను.

అతని నడకలో నిర్లక్ష్యాన్ని గమనించాడు స్వాగత్.

మెయిన్ ఎంట్రెన్స్ తలుపు తట్టిన చప్పుడు వినిపించింది స్వాగత్‌కి.

చప్పున లేచి తలుపుతీసి హాల్లో కొచ్చాడు. అప్పటికే భాగ్యరాజ్ తలుపు తీసి అతనితో మాట్లాడుతున్నాడు.

స్వాగత్ అక్కడి కెళ్లాడు.

భాగ్యరాజ్ ఓవర్ హెడ్ టాంక్ ఎక్కడుందో చెప్తున్నాడు.

ఆ వ్యక్తి నిదానంగా విని భాగ్యరాజ్ చెప్పిన వేపు వేగంగా వెళ్లాడు.

భాగ్యరాజ్ తలుపుమూసి- వెనకనే నిల్చున్న స్వాగత్‌ని చూసి అన్నాడు,

"నవ్య కెలా వుంది?"

"నిద్రపోతోంది" అని ఆమె దగ్గర కొచ్చాడు స్వాగత్.

గాలి స్థంభించినట్టు ఆమె చెమటతో తడిసి ముద్దయిపోతోంది.

వాచీ చూసుకున్నాడు.

ఒకటి యాభై అయిదు.

అప్పుడు గుర్తొచ్చిందతనికి ఫ్యూజ్ పోయిన విషయం.

అతనో క్షణం ఆలోచించాడు.

హాల్లో అంతా కూర్చుని వున్నారు. హంతకుడు హాల్లోంచి తప్ప నవ్య వున్న గదిలోకి రాలేడు. సో- తను వెళ్ళి ఫ్యూజ్ వేసుకోవచ్చు.

కిటికీ కర్టెన్ లాగి ఓసారి నవ్యను చూసి హాల్లో కొచ్చాడు.

"ఫ్యూజ్ పోయినట్టుంది. మీ రెవరైనా నవ్య దగ్గర కూర్చోండి. నేను చూసి వస్తాను." అంటూ మెయిన్ డోర్ తీస్తూ క్రీగంట చూశాడు.

"మీనాక్షి, సావిత్రి, భార్గవిలు ఆమె గదిలోకి వెళ్తున్నారు.

తృప్తిగా నిట్టూర్చి - తలుపు తీసి మెయిన్ వేపు నడిచాడు స్వాగత్.

బాక్స్ ఓపెన్ చేసి చూసి-

ఒక్క క్షణం షాక్‌తో అలాగే నిలబడిపోయాడు.

-(ఇంకా వుంది

పాఠకులే సెక్స్ కథలు కావాలంటున్నారా?

తగు మోతాదులో

ఒకనాడు శృంగారరసంతో రసస్ఫోరకంగా సుతిమెత్తగా సెక్స్ విజ్ఞానము సమాజానికి అందించబడేది. కాని ఈ నాడు యువ సమాజాన్ని పట్టి పీడిస్తున్న వ్యాధులలో అగ్రతాంబూలం సెక్స్ విజ్ఞానం పేర వస్తున్న కథలు, నవలలు, నీలిచిత్రాలు, గోడలమీద నగ్నదృశ్యాలు అంటే ఎంత మాత్రము ఆశ్చర్యపడనక్కరలేదు. సెక్స్ కథలు కావాలి అని పాఠకులు ఎక్కువగ కోరుకోవడం అనేది కూడా వీటి ప్రభావమే అనడం కూడ ఆశ్చర్యం కాదు.

అసలు ఎందుచేత యువత సెక్స్ కథలు కోరుతున్నది? ఎందువల్ల యువత ఈ విధంగా దుర్మార్గ గమనం చేస్తున్నది అంటే, సెక్స్ అంటే 'జీవ సృష్టి' కోసం



మాత్రమే. దాని ద్వారా పొందే ధర్మబద్ధమైన ఆనందం శాశ్వతమైనది. దానిపట్ల మన భావం అంతవరకే పరిమితం కావాలి అని యువత తెలుసుకునేలా నేటి సెక్స్ విజ్ఞానం పేర వస్తున్న ఏ సాహిత్యము, సినిమాలలో దృశ్యాలు, గేయాల రచన వంటివి లేవని అర్థమవుతున్నది.

ఇవన్నీ ప్రభావం యువతలో సుతిమెత్తని శృంగార రసంతో ఏర్పరచగలిగిననాడు, సెక్స్ అంటే ఆడదాన్ని తనివితీరా అనుభవించి విసిరివేసే కరివేపాకు వంటిది అనే భావం సమాధికట్టబడిననాడు ఏ యువత సెక్స్ కథలను కోరుకోదని నా అభిప్రాయము.

పి. లక్ష్మణాచార్యులు


పాఠకులు కోరుకుంటున్నారు కాబట్టే....

చతుర్వేద పురుషార్థములలో మూడవదైన కామము తప్పకాదు. జయదేవుడు వంటి భక్తులు తమ కీర్తనలలో (జయదేవుని అష్టపదులు) ఎంతో రమ్యంగా శృంగారంగా ఆ పరమాత్మను కీర్తించారు.

అధిక ప్రాధాన్యం ఇవ్వకూడదు

కాని కాలక్రమేణా శృంగారం స్థానంలో జుగుప్సను, భీతిని కలిగించు కథలు రాసి, ధనార్జనయే తమ జీవిత లక్ష్యముగా రచయితలు, సంపాదకులు మారడంతో ఈ నాడు సెక్స్ అన్న పదము విం టేనే మనకి ఏహ్య భావము కలిగేలా చేసారు.


ఇక సెక్స్ కథలు ప్రచురించే వార పత్రిక మా టొస్తే వాటి సర్క్యులేషన్ తాత్కాలికమే. కొత్తగా, వెరైటీగా ఉందని యువత, కొని చదువుతుంది. కొంతకాలం గడిచేసరికి అందులో నష్టము, దానిపై అసహ్యం కలుగుతాయి. తత్ఫలితము ఎన్నో పత్రికలు మూతపడినట్లు మనకు తెలుసు. సెక్స్ జీవితములో ఒక భాగంగా తీసుకోవాలిగాని దానిపై విస్తృతమైన, నిశితమైన



ఆలోచనలు చేసి యువత కాలాన్నీ, శక్తినీ వృథా చేసుకోకూడదు.

టి. రామకృష్ణ
రాజమండ్రి

పాఠకులు సెక్స్ కథలు కోరుకుంటున్నారా! అని ప్రశ్నిస్తే రచయితకి ఈ అంశంపై సమాధానం చెప్పాలంటే తడబడక తప్పదు. ఎందుకంటారా. ఈ స్పీడు యుగంలో కంప్యూటర్ల కాలంలో ప్రజలు సైతం తమ బుద్ధి కౌశలాన్ని తమ అధీనంలో ఉంచుకోలేక నల్గురితో పాటు నారాయణ అని నొసలు చిట్లించడం విచారకర విషయం. నాటి [గతం] పాఠకులకు నేటి (వర్తమానం) పాఠకులకు బేరీజు వేస్తే నేటి ప్రేక్షకులు సెక్స్ కథలు ఎక్కువగా కోరుకుంటున్నారని నిస్సందేహంగా చెప్పొచ్చు. అందుకు చక్కని ఉదా: నేడు దేశంలో గాని మన రాష్ట్రంలోగాని అగ్ర తాంబూలం అందు



కొంటున్న పత్రికల్లో తొంభై శాతం పత్రికలు సెక్స్ సంబంధిత విషయాలు అనగా సెక్స్ నవలలు, సెక్స్ కథలు, సెక్స్ వ్యాసాలు, సెక్స్ స్పెషలిస్టులతో ప్రశ్న- సమాధానాలు మొ.వి ప్రచురించేవి కావడం గమనింపదగ్గ విషయం. ఈ సెక్స్ విజ్ఞానం సమపాళ్లల్లో ఉండడం మంచిదేగాని శృతిమించితే దేశం విపత్కర పరిణామాలు ఎదుర్కోనక తప్పదు. అంచేత చేతులు కాలకముందు ఆకులు పట్టుకునేటట్లు ఈ విషయమై సెన్సార్ సభ్యులు, మహిళా సంఘాలు సంఘటితంగా పోరాటాలు సల్పాలి.

కె. ఎస్. చక్రవర్తి (సుచక్ర),
విశాఖపట్నం

ఆడమనసు . బేహరా ఉమామహేశ్వరరావు

పొద్దు పొడవకముందే, కుక్కి మంచం మీద నుండి లేచాడు కనకయ్య. వల భుజాన వేసుకుని తిర్రిని చేత పట్టుకుని ఆదరబాదరాగా బయలుదేరాడు.

వెంకటేశ్వరుని కోవెల ఎదురైంది. క్షణం ఆగి దణ్ణంపెట్టాడు. మరికొంత ముందుకుపోయేసరికి ఎలక్ట్రికల్ బల్బుల వెలుతురు నడుమ కోదండరామాలయం అల్లంత దూరాన కనిపించింది. కనకయ్య ఆగాడు. "స్వామీ! నా వలనిండ సేపలు, నా తిర్రి నిండా పరిగెలు పడితే, మా నర్సమ్మ నీ గుడికొచ్చి కొబ్బరికాయ కొడతాది" మనసులో మొక్కుకుంటూ ముందుకు నడిచాడు. సరాసరి వంతెన దగ్గర సుక్కమ్మ టీ కొట్టుకి వచ్చాడు. తోటి జాలర్లు కనిపించలేదు. అప్పటికే ఆలస్యం అయిందని గ్రహించాడు.

"సుక్కమ్మా! టీ కొట్టు, మా సెడ్డ యేడిగుండాలా" అరిచాడు కనకయ్య.

"కనకయ్యా! ఏంది ఈ రోజు లేటైపోనావు." గోముగా అడిగింది సుక్కమ్మ.

"శికాకుళం ఫస్ట్ బండి యెల్లిపోయినాదా?" విసుగ్గా అడిగాడు కనకయ్య.

"సానసేపై యెలిపోయింది గదా!" అంటూ సుక్కమ్మ టీ కలిపింది.

"యియ్యాల లేవడం లేటైంది సుక్కా! దానికితోడు సువ్వొకటి."

"నానేంజేసేది. యిందా టీ" అంటూ విసురుగా టీ అందించింది సుక్కమ్మ.

"టీ సుక్క గూడా సల్లనైపోయినాదే సుక్కా!" చివరి గుటక వేసుకుంటూ విసురుగా టీ గ్లాసు, డబ్బులు పడేసి నాగావళి వైపు పరుగుతీశాడు కనకయ్య.

"రాత్రి పట్టు యిరగనేదా! మరి పావలా కాసు పడేసిపోతన్నావు" కోపంగా కేకేసింది సుక్క.

ఆ మాటలు వింటూనే కనకయ్యకు రోషం వచ్చింది.

"అర్ని డబ్బులు ఎగేసి పారిపోతానసుకుంటున్నావా! నాయాలా!" జవాబిచ్చాడు.

"ఓ రోసం చూస్తే జాస్తి, సర్లే యెల్లు" సర్ది చెప్పింది సుక్క.

శ్రీకాకుళం రెండవ బండి చూసాడు కనకయ్య. ఆకాశం ఎర్రబడుతూంది. "ఏటో మరి యియ్యాల లేటు" తనలో తాను కస్సుమంటూ బస్సువైపు చూసాడు. వంతెన అవలివైపున బస్సు ఆపాడు. జనం గలగలమంటూ దిగారు.

"దిగండిబాబూ! అందరూ దిగండి. వంతెనకు అవతలివైపు ఆగుతుంది దిగండి" అంటూ బస్సు కండక్టరు హుకుం జారీ చేసాడు. జనం అంతా దిగనిచ్చి 'రంగ్, రంగ్' మని బార్‌మీద వాయించాడు. బస్సు కదిలింది. వంద సంవత్సరాల వంతెన. శిథిలావస్థలో వుందని వంతెన ముందు బరువులు దించి అవలి ఒడ్డున మరల లోడ్ చేస్తున్నారు. నిన్న కట్టిన వంతెనలు నేడు కొట్టుకుపోతున్నాయి. మనకు పూర్తి స్వాతంత్ర్యం ఉందని చెప్పకోవడానికి యిదే నిదర్శనం. బానిసతనంలో కట్టిన వంతెనలు నేటికి నిలచి, నిన్నటి మన ఘనతను చాటి చెబుతున్నాయి. బానిసత్వం మంచిదని ఎవ్వరూ చెప్పరు, అయితే బానిసరికంలో కూడా మనం చేసిన మంచి పనులలో యిదొకటి.



నిన్నటి చెడును ఎట్లా చెప్పుకుంటున్నామో, ఆవగింజంత ఒరిగిన మంచిని కూడా కాదనలేం. బస్సు ఈవరి ఒడ్డుకు చేరుకోగానే ప్రయాణికులు బస్సు ఎక్కారు. బస్సు వేగంతో దూసుకుంటూ పోయింది. "బొచ్చు సేపలాగ ఓయమ్మ ఏంది దీని యేగం?" అంటూ గొణుక్కుంటూ ఏటికి చేరాడు కనకయ్య. నదిలో వల విసిరాడు. తోటి జాలర్ల బుట్టలు అప్పటికే చేపలతో నిండిపోయాయి. కనకయ్య విసుక్కుంటూ వల విసిరాడు. ఇంతలో నర్సమ్మ వచ్చి చేరింది. "ఏంది మావా ఇంకా సేపలు సిక్కలే" అడిగింది. కనకయ్య దృష్టి అంతా వలమీద సారించాడు.

భళ్లున తెల్లవారింది. పక్షులు ఆహారంకోసం గూళ్ళనుండి రివ్వున సాగిపోతున్నాయి. రైతులు పొలాల్లో దుక్కులు దున్నుతున్నారు. చమటోడ్చిన సేద్యం బుగతోడింటికి చేరక తప్పదు. ఇన్నేళ్ళు గడిచిన నది నీరు సముద్రంలోనే చేరుతుంది. సముద్రంలా బుగతోళ్ళు నాడు నేడు ఒక్కటే! శ్రమచేసిన కూలీకి పట్టెడు మెతుకులు పరమానందాన్నిస్తున్నాయి. వల తీసి చూసాడు కనకయ్య. ఇంకేం గండుమీనలు పడ్డాయి. తిర్రిలో చిన్నచేపలు అప్పటికే నిండివున్నాయి. వలతో వడ్డుకు చేరాడు కనకయ్య. తిర్రిని వలలో చేపలతో అందుకుంది నర్సమ్మ. అప్పటికే పట్టణం చేపల వ్యాపారులు చుట్టూ చేరారు. కాకుల్లా తన్నుకుపోవాలనే చూస్తున్నారు. నర్సమ్మ భర్తకి ఇరవై అందించింది. నోటు మొలలో దాచుకుని కల్లు కొట్టుకు బంగారు పరిగెలా పరుగుతీసాడు. ఏమరుపాటు పడితే చాలు గడుసుగా బేరంచేసి కొంగల్లా చేపలు తీసుకుపోతారు పట్టణం వ్యాపారులు. నర్సమ్మ చేపలు అమ్మేసి ఇంటిముఖం పట్టింది. తోటపల్లి ఆలయం దగ్గర పప్పులు, ఉప్పులు కొనుక్కుని ఊర్లోకి వచ్చింది.

పొట్టనిండుగా తాగి తూలుతూ కనిపించాడు కనకయ్య. "రా మావా!" ఆబగా పిలిచింది నర్సమ్మ.

"నాయాల్ది నానూ! ..... తాగానే" తొట్రుపడుతూ అన్నాడు కనకయ్య. నర్సమ్మ, కనకయ్యను భుజంమీద ఆన్చి ఇంటికి చేర్చింది. కుక్కి నులక మంచంలో వాలాడు కనకయ్య. వలలోని బొచ్చుచేపలా వున్నాడు కనకయ్య. తాగిన మైకంలో వాగుతున్నాడు.

నరసమ్మ వంటచేసింది. కనకయ్యకు పళ్లెంలో వేసి యింత తినిపించింది. ముద్దలు తింటూనే కనకయ్య ఊగుతూ "తాగుతా! నీయవ్వా తాగుతా" పాడుతున్నాడు.

"కూర నంజుకో మావా" అంటూ కూర అందించింది నర్సమ్మ. పూనకం పట్టినట్లు కనకయ్య ఊగుతూ "తాటిసెట్టు తల్లీగాదు.....తాగినోడు మొగుడూకాదు.... ఓ గువ్వల సెన్నా" రాగాలు తీస్తున్నాడు.

నర్సమ్మ విసుగులేకుండా "ముద్ద బుక్కు మావా, కట్టంచేసినోడివి. యింతైనా తినకపోతే మిట్టపిల్లనాగ సుట్టుకుపోతావు" అంది.

కనకయ్య కూతురు బుల్లెమ్మ వచ్చింది. దానికో ముద్దతీసి ముద్దుగా తినిపించాడు.

"బుల్లీ! బుల్లే!....పిత్తపరిగెనాగ ఎగురుతావేం" ముద్దు పెట్టుకున్నాడు. కుండ మెతుకులు గుండెకెక్కాయి.

కనకయ్య చెట్టునపడిన బొండంలా నులక మంచంలో కూలాడు. గురక నిద్రలో మునిగాడు. నర్సమ్మ గిన్నెలు కడిగి కడుపు నిండా యిన్ని మెతుకులు తింది. రాత్రి ఎనిమిది దాటిన తరువాత కనకయ్యకు రిమ్మ విరిగింది. లేచి సరాసరి సారా కొట్టుకుపోయాడు. కడుపంతా సారాతో నింపాడు. రోడ్డు సర్వే చేసుకుంటూ వలలో పడ్డ బొచ్చు చేపలా నులక మంచం మీద పడ్డాడు. నర్సమ్మ బ్ర[illegible]లినా మెతుకు ముట్టలేదు. సరికదా, తె[illegible]చోలేదు. పన్నెండు వరకు కూనిరా[illegible] తీస్తునే వున్నాడు. నర్సమ్మ కూతురికి గిన్నెలో అన్నం పెట్టి, దగ్గర కూర్చుని తినిపించింది. తాను మాత్రం మెతుకుల వైపు చూడలేదు. నేలపై చాప వేసుకుని నిద్రలోకి పోయింది. ప్రక్కన బుల్లి "అమ్మా!.... అమ్మా!" అని అరచినా సర్ది పడుకోబెట్టింది.

తూర్పుదిక్కు ఎర్రబడింది. కష్టం చేసేవారికి కాలం కాదని నిండాకాశానికి తెలుసు. ఎర్రబడుతునే సూర్యుడు ఉదయించాడు. "ఓలమ్మో! తెల్లారింది" అంటూ నర్సమ్మ లేచింది. బుల్లెమ్మను లేపింది. ఇల్లంతా తుడిసింది. ఇంటి ముందు కళ్ళాపువేసి, ముగ్గుపెట్టింది.

"మావా!" అంటూ నిద్రలేపింది. కనకయ్య కదలలేదు. ఎండుచేపలా నిగిడి పడుకున్నాడు.

"ఇంకా లేవవేటి మావా!" అరిచింది. కనకయ్య మూలుగుతూ అటూ యిటూ కదిలాడు. మెల్లగా కళ్లు తెరిచాడు.

"మావాయ్! లే! లే!.... తెల్లారిపోనాది" భుజం తడుతూ మేల్కొలిపింది నర్సమ్మ.

"ఏందే రొయ్యిలాగ తయ్యి, తయ్యిలాడుతున్నావు" అంటూ మంచంమీద నుంచి శ్రమపడుతూ లేచాడు.

"అది సూస్తే ఆడగుంట, సంసారానికొచ్చి పదేల్లు దాటింది. నువ్వుసూడ యిలాగా యింకా అంతా బగమంతుడి

'ద్రౌపది' రూపా!



టీ. వి. మహా భారత్ ద్వారా ద్రౌపదిగా ప్రేక్షకులకు పరిచయమైన బెంగాలీ అమ్మాయి రూపా గంగూలీ అటు బెంగాలీ చిత్రాల్లోనూ నటించకుండా, యిటు టీ. వి. చిత్రాల్లోనూ నటించకుండా కేవలం ద్రౌపదిగానే మిగిలిపోయింది.

ఆమె అపార్ట్‌మెంటుకి 'జనాల' రాక విపరీతమై పోయిందట. ద్రోణాచార్యుడు (సురేంద్రపాల్), కృష్ణుడు (నితేష్ భరద్వాజ్) ఒకరోజు ఎదురు బదురుపడి సిగ్గు పడ్డారు. సిగ్గు దేనికో? మరి రూపా గంగూలీ ఈ ద్రౌపది వేషాన్ని యిలాగే కొనసాగిస్తుందో, లేక మానుకుంటుందో వేచిచూడాల్సిందే!

దయ" నిష్ఠూరంగా అంది నర్సమ్మ.

"ఎవుడి తోటపిల్లియెంకన్న దయే నంటావా?"

"ఆడుకాదు మావా ఆ శంకరయ్య దయ."

"అంటే ఆ సావుకారోడి దయ. అంతేనా!"

"అవును మావా. నువ్వా కల్లు ముచ్చోడివి. ఆ సావుకారొచ్చి నాలుగు కాసులు రేటు పెంచినాడు. లేదంటే మన బతుకు యారగట్టాం బిడ్డీలాగ కూలిపోను" అంటూ కనులనిండా నీరు నింపింది నర్సమ్మ.

"ఊరుకోయే నాయాలా! తెల్లారికి ఏడుపు ముకమెట్టుకుని ములగమార్చులాగ, తే ఆ తిర్రి, వల పట్రా."

"ఓలమ్మో! ఎంత తెల్లారిపోయి నాది" అంటూ కనకయ్య పరుగుతీసాడు. ఆ పరుగుచూస్తునే కష్టాన్ని మరిచి నర్సమ్మ చెంగు మూతికి అడ్డంగాపెట్టుకుని ముసిముసిగ నవ్వింది.

కనకయ్య ఏటి ఒడ్డుకుచేరాడు. తోటి జాలర్లు వలలతో చేపలు ఒడ్డున వేసారు. పట్టణం సాహుకార్లు కొంగల్లా సులువుగా తన్నుకుపోవడానికి బేరాసారాలు చేస్తున్నారు. హడావుడిగా కనకయ్య మొలబంటి నీటిలో దిగాడు. వల విసిరాడు. గంటలు తరబడిన పెద్దచేపలు వలలో పడలేదు. చికాకుపడుతూ గొనుక్కుంటున్నాడు. చివరి సారిగా వల విసిరాడు. కోపంతో రుసరుసలాడుతున్నాడు. మొలలోని తిర్రిలో చిన్న పరిగెలు వున్నాయి. పట్టుమని ఐదు రూపాయలు విలువలేదు. వల

ఆడమనసు

వైపు తీక్షణంగా చూస్తున్నాడు. బరువుగా వస్తూంది. నెమ్మదిగా పట్టి, వల తీసి చూసాడు. "పెద్దబొచ్చులు.....ఓ నాయాల్ది...." సంతోషంగా ఒడ్డుకు చేరాడు. నర్సమ్మ కనిపించలేదు.

"ఒరేయ్ కనకా!" మెల్లని పిలుపు భార్య రాకకోసం చూస్తున్న కనకయ్య చెవిన పడింది. వెనక్కి తిరిగిచూసాడు.

"ఏందోయ్ సావుకారి! కొర్రమీన లాగ తెగ బలిసినావు. సేపలోల్ల సొమ్ము తెగ అచ్చొచ్చినట్టుంది" నవ్వుతూ అన్నాడు.

"ఏదైనా పెద్దసాహుకారి, పెద్దోడు. నాలాంటోడు...." అంటూ నీల్లు నమిలాడు సాహుకారు తవిటయ్య.

"పెద్ద సేపకీ.... పిత్తపరిగైనా, రొయ్యిపిల్లైనా మింగడానికి ఒకటేకదా."

"ఓర్నీ! సామెతలు తెగ పొడిచేస్తున్నావు. అయినా నాలాటోడికి మీ యావిడ సేపలు అమ్ముతుందిరా కనకా!" వేళాకోళంగా అన్నాడు తవిటయ్య.

"అంటే!!??......." ప్రశ్నార్థకంగా చూసాడు కనకయ్య.

"సూడు కనకా! శంకరయ్యలాగ నాకు తెల్ల తొక్కలేదు. ఎర్రబుర్రగా బంగారు సేపను కాను. అందుకే ఆరు మాసాలై నీ యాలి బేరం నాకు లేదు." గిల్లినట్లు చెప్పాడు తవిటయ్య.

చిన్న గాలి రేగి యిసుక కనకయ్య కంట్లో పడింది. కళ్ళు నులుపుకుంటూ "ఏటోయ్ తవిటయ్యా! నీ మాటలు!....." రోషంగా అడిగాడు కనకయ్య.

సూర్యునిచుట్టూ మబ్బులు కమ్ముతున్నాయి. "ఇంకా చెప్పలా! అయినా వాకెందుకులే ముదర మారుపులా నామీద కెగురుతావు" తవిటయ్య మీసం ఎగరేస్తు అన్నాడు.

"ఆ సెప్పేదేదో సూటిగా సెప్పు" కర్కశంగా అడిగాడు కనకయ్య.

"ఊరంతా పొలుసుకంపులా కొడుతుంది. మరి నేను అచ్చ తెలుగులో చెప్పాను. తోటపిల్లికాదు. పట్నంలో కూడా దండోరా మ్రోగుతుంది" అంటూ దూరంగా వస్తున్న నర్సమ్మను చూసి బొమ్మిడం చేపలా జారుకున్నాడు తవిటయ్య.

కనకయ్య ఒడ్డునపడ్డ చేపలా గిలగిల తన్నుకుంటున్నాడు. మొలలోని బుట్ట నేలకు కొట్టాడు.

"ఏయ్ నాయాలా రా నీ పని పడతా" అంటూ పల్లు పటపట కొరికాడు కనకయ్య.

"ఇందమామా" అంటూ ఇరవై నోటు అందించింది నర్సమ్మ. నోటు చూస్తూనే కనకయ్య నీరుకారిపోయాడు. కల్లుకొట్టు గుర్తుకొచ్చింది. "తే నాయాలా" అంటూ నోటు లాక్కుని "తాగి నీ సంగతి తేలుస్తా" అంటూ రుసరుసలాడుతూ కదిలాడు కనకయ్య.


కనకయ్య గుండె నాగావళి వరదలా పొంగింది. కట్టలు తెంచుకున్న కోపంతో ఊగుతూవస్తున్నాడు. కొలిమిలోని చింతనిప్పుల్లా కళ్లు ఎర్రబడ్డాయి. సెగమంటకు తోడు పొగమంటలా, కల్లుతాగి పళ్ళు పటపట కొరుకుతున్నాడు. చేతిలో చెట్టుకత్తితో మండిపడుతూ ఇంటికి చేరాడు.

"ఏయ్ నరసా! నీకు సరసాలటే ఏదీ....." గట్టిగా అరిచాడు కనకయ్య.

"తలుపు తీయ్! రంకు నాయాలా! ఏడ కులుకుతున్నావటే, నీ సంగతి తేలుస్తా!" గర్జనలా కనకయ్య కంఠం మ్రోగుతూంది. ఇల్లంతా గాలించాడు. నరసమ్మ కనిపించలేదు. నులకమంచం మీద కూలబడ్డాడు.

"ఏయ్ నాయాలా రా! యీ యేల ఎంతయేలవ్వని నీ రంకు తేలుస్తానే" మండిపడుతున్నాడు కనకయ్య.

పొరిగింటి పోలమ్మ వచ్చింది. "ఔనా కనకయ్య నీకు యిట్టాంటి దుర్బుద్ది



ఏంట్రా!" అడిగింది.

"ఆ రంకుదాన్ని యెనకేసుకొస్తావేంటే పోలీ?"

"నిజం సిరులాంటిదిరా. అది వల్లం వైపే ఎల్తాది. మంచిమనసులు వల్లం పోలా ల్లాటివిరా, నరసమ్మ సంగతి నాకు తెలవ దట్రా ! బొంగురు స్వరంతో పోలమ్మ చెప్పింది. ఆ మాటలు వింటూనే ఉవ్వెత్తున లేచిన కెరటంలా " ఏంది ముసలిముండా! నా పెళ్లాం సంగతి నాకు తెలవదా! అది కొవ్వెక్కిన రొయ్యిలా మదమెక్కి శంకర య్యతో కులుకుతుంటే, పోలమ్మా! దాన్ని ఎనకేసుకొస్తావేంటే" అరిచాడు.

"ఒరేయ్ వరిగొచ్చి మార్పుమీద పడినా, మారుపొచ్చి వరిగెమీద పడినా నట్టపోయేది వరిగేన్రా! ఆడదాని బతుకు వరిగెలాంటిద్రా. నీవు సూత్తే, తాగుము చ్చేడివి. ఎంతొచ్చినా నీ కల్లుకే చాల్దు. అదా అడది! తల దూరదంటే తలకొక డోలన్నట్టు, ఆ బుల్లిదొకటి! అయ్యో ఆ బుల్లిది తల్లిలేనిదవుద్ది. అయినా నాకెం దుకులే అంతా దాని కరమం. తల్లిలేని బిడ్డ సెయ్యడానికే బెమ్మదేముడు రాసిపె ట్టైన్డు" వణకిన కంఠంతో వరసపెట్టింది పోలమ్మ.

"ఇంతకీ బుల్లీ!..... ఏదే.... పోలమ్మా?"

"తల్లిని నరకేత్తా నన్న నీకు బుల్లెం దుకురా?...."

"సెప్పే పిక్కురిది ఏదే" సీరుకారి అడిగాడు కనకయ్య.

"నాను నిజం సెప్పినా నీవు యిన వుకదా."

"బుల్లెక్కడే. ఆ పిక్కురిది ఏడదా గుందే?"

"అదేన్రా."

"అదే ఎక్కడ!!??"

"నీవు అనుమానం గొట్టోడివి. నాను సత్తెం సెప్పినా నీకు తలకెక్కదు కదురా!"

"ముందు సెప్పే."

"ఒరేయ్ ఆ శంకరయ్య బేరం సేసి నుండి సేపలు రేటు పెరిగిందిరా. నీవు తాగినా, ఇంట్లో బుల్లికి పాలు, నరసకు గంజినీళ్ళైనా దక్కుతున్నాయి. బుల్లికి ఏమైందో ఏటో" నొచ్చుకుంటూ అంది పోలమ్మ.

"ఓలమ్మో! నా బుల్లికి ఏమయ్యిందేటు కదా! సెప్పు పోలమ్మా సెప్పే !"

"నన్ను సెప్పనిస్తే కదరా. నిదానంగా యింటావా?"

"ఊ.... ఊ...ఏటో సెప్పు....."

"తెల్లారికి నీ బుల్లికి కన్నుతేరని జొరం."

"ఓలమ్మో!!....."

"టీ బుక్కుడిచ్చిన దిగలేద్రా."

"ఓరయ్యో!"

"అదేదో మెదడు జబ్బట. ఒస్తీకి బస్సుమీద తీసుకెళ్లింది నీ బుల్లినీ నరసా" గుండెల్లోని బాధను చెప్పింది. కనకయ్య కత్తి విసిరేసి పరుగుతీసాడు. 'ఎర్రబస్సు ఆపలేదు. గుణుపూరు బండి ఆగింది. కన కయ్య బ్రతిమాలాడు. కండక్టరు కనకయ్య సొదవిని సరే అన్నాడు. అదీ ప్రైవేటు బస్సు మరి!

* * * * * *

"బాబూ! శంకరయ్య నాయన్న లాటోడివి. నాబిడ్డకు....నాను బతక లేను....దాని పేణం కాపాడయ్యా...." అంటూ నరసమ్మ రోదిస్తోంది.

"అదేంటి నరసమ్మా మీ కష్టం తోనే మేము బ్రతుకున్నాం. నీ కష్టం ఒకటి మాదొకటి కాదు. నువ్వేం భయపడకు. డాక్టరుగారు ప్రాణాపాయంలే దని చెప్పారు!" అన్నాడు శంకరయ్య చాటునుండి వింటున్న కనకయ్య భోరుమ న్నాడు. బరువెక్కిన కారుమబ్బులు వర్షం కురవడం ప్రారంభించాయి.

"శంకరయ్యబాబూ! నన్ను సెమిం చుబాబూ! డబ్బుకి గడ్డితిన్న తవిటయ్య మాటలు విని......" ధారాపాతంగా కన్నీరు కారుస్తూ ఏడ్చాడు కనకయ్య.

"ముందు బుల్లిని సూడు మామా!" అంది నర్సమ్మ.

"నరసా!!...."

"అవును మామా!"

"మీ బుల్లికి ఏం ఫరవాలేదు. సకా లంలో మందు ఇవ్వడంవల్ల ప్రాణాపాయం దాటింది." డాక్టరు చెప్పాడు.

* * * * * *

"ఒరేయ్! తవిటయ్యా నా కొంప కూల్చడానికేన్రా! నీ అంతు సూస్తాన్రా" కత్తిపట్టుకొని తవిటయ్య మీదకు ఉరికాడు కనకయ్య.

"ఒరోయ్ కనకా! ఇదేట్రా! బాబోయ్ రక్షించండి" ప్రాణభయంతో తవి టయ్య అరిచాడు.

"గంగనాటి నా నరసకి రంకు అంట కడతావట్రా! నీ రగతం కల్లసూస్తా" అరిచాడు కనకయ్య.

"మామోయ్! అగు మామా! నాకోసం అగు మామా" అంటూ అడ్డు పడింది నరసమ్మ.

"లెగే, అడ్డులెగు. ఈడిలాంటి పీతల్ని ఏరిపారెయ్యాలి. ఈడి ముక్కలు యిరగదన్నాలి" ఎగిరేడు కనకయ్య.

"నాలాంటి ఆడదే ఆడిపెల్లం, ఈడ్ని సంపుతే దాని బతుకు వరదపాలుగాదా మామా, వదిలేమావా. ఆడికి బుద్దొ చ్చివుంటాదిలే. ఇంకెప్పుడు మనజోలికి రాడులే" అంటూ ఓదార్చింది నర్సమ్మ. ఇదే అదునని తవిటయ్య పరుగుతీసాడు.

○

న్యాయచట్టం ప్రశ్నలు-జవాబులు



అడ్వొకేట్: **బి.భాస్కరరావు** ఎం.ఎ., ఎల్.ఎల్.బి.

పి. రవి, ఇంటూరు (గుంటూరు జిల్లా)

ప్రశ్న: నా వయస్సు పంచాయితీ లెక్కల ప్రకారం 25–8–68. కాని బడిలో చేరేటప్పుడు 7–7–65గా పడింది. నేను బడిలో చేరేటప్పుడు నా తండ్రి ఇల్లు విడిచి వెళ్లిపోయాడు. నా తల్లికి చదువు రాదు. నేను ఇప్పుడు బి. ఏ. పరీక్ష వ్రాశాను. నాకు పి. హెచ్. డి. వరకు చదవాలని వుంది. కాని నా వయస్సు గుర్తుకు రాగానే చాలా బాధ అనుభవిస్తున్నాను. మీరు తగిన సలహా ఇస్తారని ఆశిస్తున్నాను.

జవాబు: మీరు పంచాయితీ కార్యాలయము నుండి మీ పుట్టిన తేదీ సర్టిఫికేట్ తీసుకొని మీ పుట్టిన తేదీ మార్చుమని కోర్టులో దావా వెయ్యండి. ఉమేశ్ చంద్రకేసులో 1982లో సుప్రీంకోర్టు గ్రామ పంచాయితీ రికార్డులో పుట్టిన తేదీ వ్రాయబడలేదు గనుక స్కూలు రికార్డు ప్రకారం వయస్సు పరిగణనలోనికి తీసుకొనాలని తీర్పు చెప్పింది. మీ పుట్టిన తేదీ పంచాయితీ రికార్డులో వ్రాయబడినందు వలన మీ పుట్టిన తేదీ మార్చుమని కోర్టులో దావా వెయ్యండి.

తుమ్మల కౌసల్యాదేవి, తిరుపతి.

ప్రశ్న : తిరుపతిలో మేకా కన్సల్టన్సీలో పని చేస్తున్న డి. శ్రీనివాసరావుకు నా వద్ద గల ఆల్ సీజన్ ఫుడ్ 500 షేర్లు యూనిటెల్ కమ్యూనికేషన్స్‌కు కొనుగోలు ఆర్డరు ఇచ్చాను. అతను తన వ్యక్తిగత హోదాలో మద్రాసులో పై వాటిని అమ్మి 100 యూనిటెల్ కమ్యూనికేషన్స్ షేర్లను నాకు పోస్టులో పంపించాడు. మిగిలిన డబ్బు దాదాపు పది వేల రూపాయలు ఇవ్వాలి. 'ఇస్తాను అని లెటర్స్ రాశాడు. ఫోన్‌లో చెప్పాడు. సంవత్సరం అవుతున్నా ఇంతవరకు ఇవ్వటం లేదు. అతని చిరునామా కేరాఫ్ మేకా కన్సల్టెన్సీ. సర్వీసెస్, విజయవాడ, హైదరాబాద్. నా బాకీ రాబట్టుకొనుటకు పోలీసు పరంగా, చట్ట పరంగా ఎటువంటి చర్య తీసుకొనవచ్చునో తెలియజేయగలరని కోరుతున్నాను.

జవాబు : మీరు పోలీసు వారికి కంప్లయింట్ పెట్టండి. వారు తగిన చర్య తీసుకొంటారు. మీరు కోర్టులో దావా కూడా వెయ్యవచ్చును.

టి. సత్యనారాయణ, విజయవాడ.

ప్రశ్న: నేను రైల్వేలో ఉద్యోగం చేస్తున్నాను. నాకు వివాహము అయి 4 సంవత్సరములు అయినది. కాని నేను కాపురము చెయ్యలేకపోతున్నాను. నా భార్య వయస్సు ఎక్కువలేదు అని చెప్పి వివాహము జరిపించారు. ఆమెయొక్క పదో తరగతి సర్టిఫికేట్ చూడగా నాకంటే ఏడు సంవత్సరములు ఎక్కువగా ఉన్నది. ఆమె కాలు చూడగా ఫైలేరి-యాతో ఆమె కాలు చాలా లావుగా ఉన్నది. నా మనస్సు చాలా ఆందోళన చెంది నా తల్లిదండ్రులకు చెప్పగా మౌనము వహించారు. పెండ్లి అయినప్పటినుండి ఆమె పుట్టింటిలోనే యున్నది. నా వయస్సు ఇప్పుడు 32 సంవత్సరములు. నాకు మరియొక వివాహమునకు అనుమతి కోరగా ఆమె ఇవ్వలేదు. మీ సలహా కోరుచున్నాను.

జవాబు: మీ మొదటి భార్య బ్రతికియుండగా మీరు మరియొక వివాహము చేసుకొనడం భారతీయ శిక్షాస్మృతిలోని 494 సెక్షన్ ప్రకారం నేరము అవుతుంది. మీ ఉద్యోగం కూడా ఊడిపోతుంది. అయితే మీభార్య 4 సంవత్సరములనుండి పుట్టింటిలో ఉండిపోవడం కూడా తప్పు. హిందూ వివాహ చట్టము (1955)లోని 13 సెక్షన్ ప్రకారం భర్త లేక భార్య రెండు సంవత్సరముల వరకు విడిచిపెట్టి వెళ్లిపోయినట్లయితే డైవోర్స్‌కు పిటిషన్ పెట్టుకొనవచ్చును. కాబట్టి మీరు డైవోర్స్‌కు ముందుగా పిటిషన్ పెట్టవచ్చును.

ఆలూరు కిశోర్, తెనాలి

ప్రశ్న: నేను డిగ్రీ ప్యాస్ అయ్యాను. నేను పేరు మార్చుకొనుటకు ఎమ్. ఆర్. ఓ. ఆఫీస్ ద్వారా నోటిఫికేషన్‌కు ప్రయత్నిస్తున్నాను. అలా మారిన తర్వాత నా సర్టిఫికేట్లు అన్నింటిలో పేరు మార్చాలా? ఇక నుంచి కొత్త పేరుతో వ్రాయవచ్చునా?

జవాబు: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారు 8-12-1977 తేది గల 819 జి. ఓ. లో పేరు మార్చుకొనడానికి ఉత్తర్వులు జారీ చేశారు. అందులో ఉదహరించిన ప్రకారం ఒక దరఖాస్తును జిల్లా మేజిస్ట్రేట్‌కు (కలెక్టర్) పంపించాలి. కలెక్టర్ దర్యాప్తు జరిపించి రెండవ ఎనెక్సర్‌లో ఇచ్చిన ప్రకారం భారత దేశ పౌరునిగా గుర్తించి ఒక లేఖ పంపిస్తారు. ఆ లేఖను జతచేసి పేరు మార్చుటకు ప్రభుత్వ ప్రింటింగ్ ప్రెస్ డైరెక్టర్‌కు దరఖాస్తు పంపుకొనాలి. ప్రచురణ ఖర్చులు కట్టిన తర్వాత ఆంధ్రప్రదేశ్ గెజిట్‌లో ప్రైవేట్ ప్రకటన ప్రచురిస్తారు. ఆ ప్రకటన కాపీ జతచేసి సెకెండరీ విద్య బోర్డు వారికి మీ పదో తరగతి సర్టిఫికేట్ పంపండి. పేరు మారుస్తారు. యూనివర్సిటీ వారికి మీ డిగ్రీ పంపినట్లయితే వారు కూడా పేరు మారుస్తారు. మీరు కొత్త పేరుతో వ్రాయవచ్చును.

○

ఆంధ్రసచిత్ర వారపత్రిక

న్యాయ చట్టం-ప్రశ్నలు జవాబులు

ప్రశ్న: ....

పేరు: ....

పూర్తి చిరునామా: ....

....

ఆచార్య సుందరరెడ్డికి ఆంధ్ర గౌరవ డి.లిట్.

హిందీ సాహిత్యాల్లో ఉన్నతస్థాయి విద్య నభ్యసించి ఒక ఆదర్శ విద్యావేత్తగా ఎందరినో తీర్చిదిద్దుటయే కాక విమర్శనాపరమైన అనేక గ్రంథాలు రచించిన ఘనత ఆచార్య సుందరరెడ్డిగార్కి దక్కుతుంది.

ఆంధ్ర విశ్వవిద్యాలయంలో హిందీ విభాగ స్థాపనకు, ఆ విభాగము యొక్క అభివృద్ధికి వారు చేసిన అవిరళకృషి వర్ణనాతీతం. హిందీ తెలుగు తులనాత్మక పరిశోధనకు ఆయన ఒక ప్రత్యేక గుర్తింపును, ఒరవడిని ఏర్పరచారు. సుమారు పాతిక మంది పరిశోధకులకు మార్గదర్శకత్వం వహించి జాతీయ స్థాయిలో ఒక ఉన్నతస్థాయి గల హిందీ ప్రొఫెసర్‌గా పేరెన్నికగన్నారు.

హిందీ భాషాసాహిత్యాల్లో వారు చేసిన కృషికి, దక్షిణ భారత దేశంలో హిందీ భాషా ప్రచారానికి వారు పడిన శ్రమకు ప్రతిఫలంగా జాతీయ నిర్మాతలకు లభించిన అరుదైన బిరుదు "సాహిత్యవాచస్పతి"ని హిందీ సాహిత్య సమ్మేళన్, ప్రయాగవారు ప్రొ. సుందరరెడ్డిగార్కి ప్రదానం చేసి గౌరవించారు. ఆచార్య సుందరరెడ్డిగారు సాహిత్య వాచస్పతి బిరుదునలంకరించిన మొట్టమొదటి దక్షిణ దేశీయులు కావటము ఒక్క ఆంధ్రులే కాక దక్షిణ భారత హిందీ అభిమానులు, ప్రచారకులు ఎంతో గర్వించదగ్గ విషయం.

శ్రీ రెడ్డి గారు 1918 సంవత్సరములో నెల్లూరులో ఒక సామాన్య రైతు కుటుంబంలో జన్మించారు. మహాత్మా గాంధీ ప్రేరణతో వీరు బాల్యం నుండే హిందీనభ్యసించారు. పదహారేళ్ల చిన్న ప్రాయంలోనే (1934) ప్రయాగ హిందీ విద్యాపీఠంలో ప్రవేశం పొంది "సాహిత్య రత్న" పరీక్షలో మొదటి తరగతిలో ఉత్తీర్ణులయ్యారు.



1942 సం.లో ఆంధ్ర విశ్వవిద్యాలయములో ఉపాధ్యాయుడుగా చేరి మొట్టమొదటి హిందీ భాషాధ్యయనానికి బీజం వేశారు. హిందీ లెక్చరర్‌గా వుంటూ ఆంధ్ర విశ్వ విద్యాలయపు వివిధ కార్య నిర్వాహక కమిటీలలో సభ్యులుగా ప్రముఖ పాత్ర వహించారు. సెనేటు, సిండికేటు మెంబరుగానే గాక ప్రాచ్యభాషలకు (ఓరియంటల్ లాంగ్వేజెస్) డీన్‌గా కూడా వ్యవహరించారు.

ప్రొఫెసర్ రెడ్డి గారు హిందీ భాషా సాహిత్యాలపై గల మమకారానికి, తులనాత్మక పరిశోధనలో గల అభినివేశానికి దీటుగా ఎన్నో ప్రభుత్వ ప్రభుత్వేతర సంస్థలలో హిందీ సలహాదారుగా నియమితులై హిందీ భాషా ప్రచారానికి గణనీయమైన సేవ చేశారు. భారత ప్రభుత్వము యొక్క గృహ, రైల్వే, ఆర్థిక, విద్య, రేడియో, సమాచారం, తంతి-తపాలా మొదలగు మంత్రిత్వశాఖలలో, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీలో సలహాదారుగా నియమింపబడి ఖ్యాతి గడించారు.

ప్రొ. రెడ్డిగారు సుమారు రెండు వందల పరిశోధన పత్రాలు ప్రముఖ హిందీ, తెలుగు, ఇంగ్లీషు పత్రికలలో వెలువరించారు. వీరి ముఖ్యమైన గ్రంథాలు సాహిత్య ఔర్ సమాజ్ మేరే విచార్, హిందీ ఔర్ తెలుగు కా తులనాత్మక అధ్యయన్, దక్షిణ్‌కీ భాషాయే ఔర్ వున్కా సాహిత్య వైచారిక, శోధ్ ఔర్‌బోధ్, 'హిందీ తథా ద్రవిడ భాషావోంకే సమారూపీ భిన్నార్థశబ్ద', 'హిందీ సాహిత్య కేవికాస్‌మే దక్షిణ్‌కా యోగదాన్', 'అంతర్భారతీ', 'వెలుగు దారులు', 'లాంగ్వేజ్ ప్రాబ్లమ్ ఇన్ ఇండియా' మొదలైనవి.

హిందీ ప్రచారసభ-హైదరాబాద్ వారు 1966లో 'సాహిత్యాచార్య' బిరుదును బనారస్ హిందూ విశ్వవిద్యాలయము వారు 1975లో 'తామ్రపత్ర' ప్రదానం 'శోధ్ ఔర్ బోధ్' పరిశోధనాపరమైన వ్యాస సంకలనానికి ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం 1968లో వీరి మౌలిక రచనలకు ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడమీ వారు బహుమతులనందచేసి సన్మానించాయి.

ప్రయాగ హిందీ సాహిత్య సమ్మేళన్ సంస్థ ఈ సంవత్సరం జూలై నెల రెండవ తేదీన జరిగిన కురుక్షేత్ర సమావేశంలో ప్రొ.రెడ్డి గారితోపాటు ప్రముఖ హిందీ సాహిత్యవేత్త శ్రీ రామేశ్వరశుక్ల అంచల్, ప్రఖ్యాత హిందీ పత్రికా సంపాదకుడు శ్రీ అక్షయకుమార్ జైన్, బహుభాషా కోవిదుడు భారతీయ భాషాపరిషత్ అధ్యక్షులైన డా. ప్రభాకర్ మాచ్‌మే మొదలైన వారికి సాహిత్య వాచస్పతి, గౌరవ డాక్టరేట్ బిరుదులిచ్చి గౌరవించింది.

జాతీయ స్థాయిలో గౌరవం పొంది రచ్చగెలిచిన ఆచార్య సుందరరెడ్డి నేడు ఆంధ్ర విశ్వవిద్యాలయ గౌరవ డాక్టరేటు పొంది ఇంట కూడా గెలిచారు.

డా. యార్లగడ్డ లక్ష్మీప్రసాద్

కంగారు పడకండి!

'కంగారూ' అంటే తెలుసుకదా! "జూ"లేదా బొమ్మల్లోనో చూసుంటారు! ఇది పుట్టినప్పుడు బొటన వ్రేలంతయినా వుండదు. రెండున్నర సెంటిమీటర్ ఉంటే కంగారు పిల్ల గొప్ప కాని చూస్తూండగానే కంగారూ రెండు మీటర్ల ఎత్తుకి ఎదిగిపోతూంది. చాలా విచిత్రమయిన జంతువు అది. దాని పెరుగుదలగూడా అంతే!

సీరియల్

కేరటాలు కేరింతలు



ఎమ్.హర

ఇంతవరకూ సాగిన కథ-6: శౌరి, ధీరల ప్రేమకు పెద్దలు ఒప్పుకోరు. ఇద్దరూ ఉద్యోగాలు సంపాదించుకొని తమ కాళ్లపై తాము నిలబడితేనే తమ ప్రేమ ఫలిస్తుందనే నిర్ణయానికి వస్తారు. ధీర తండ్రి, శౌరి తండ్రి వేరే సంబంధాలు చూస్తుంటారు. ఆవేశంలో అపార్థాలకు లోనై విడిపోయిన శౌరి, ధీరలు పెద్దలు చేసే పెళ్లికి అంగీకరించక ఆత్మహత్య చేసుకుంటున్నట్లు పోలీస్ ఇన్‌స్పెక్టర్‌కు వ్రాసిన ఉత్తరాలు పెద్దలకు అందుతాయి. అవి చూసి వారు హతాశులవుతారు.

జనారణ్యంలో సహజీవనానికేగాక చావడానికి కూడా అవకాశాలు లేవని ఊరిచివరికి చేరాడు శౌరి.

వెలుగుకి వీడ్కోలు చెబుతూ చీకటికి స్వాగతం పలుకుతున్నది ఆకాశం.

మూడంతస్తుల పాడుబడ్డ బంగళాని చూడగానే శౌరికి ప్రాణం లేచి వచ్చింది. దాన్ని ఎక్కి దూకితే ప్రాణాలు పోవడం ఖాయం. మెట్లకోసం బంగళా చుట్టూ తిరుగుతూంటే మెట్లు కనబడలేదుగాని కూన కనబడింది. ఆమెని చూడగానే నొసలు చిట్లించాడు.

కూన మాత్రం అలవోకగా అతని వంక చూస్తూ "మీరూ వచ్చారా" గునిసింది.

"ఏమిటీ నువ్వనేది" చలించాడు. తన కంగారు కప్పిపుచ్చుకోవడానికి బుజానికి తగిలించిన సంచీని సర్దుతున్నట్లు నటించాడు.

ఆ వూరిలో చావడం కుదరకపోతే రైల్లో బెజవాడ వెళ్లి ఆత్మహత్య చేసుకోవాలని తన గుప్త ధనం సంచీతో బయలుదేరాడు శౌరి.

"నా రహస్యం మీకూ తెలిసిందా" కవ్వించింది కూన.

సరిగ్గా అదే సమయంలో చావడానికి కొండలూ, చెరువులు, కనబడక, వూరిచివరి బంగళాకి గురిపెట్టి వస్తున్నది ధీర.

ఆమె కంటబడింది కూనా శౌరల కలియిక.

(గత సంచిక తరువాయి)

సూర్యుడి కౌగిలిలో పడమటి కన్నె ముఖం రాగరంజితం కాగా, అది చూసిన తూర్పు కన్నె ముఖం మాడినల్లబడింది.

శౌరి తెగువకి ధీర అసహ్యాయించుకుంది. వాళ్ళ కళ్లముందు చావడానికి అభిమానపడింది. పౌరుషం పొడుచుకువచ్చింది.

"మేడం... మీరిక్కడున్నారేంటి? సప్తమిగారి మాయలో మళ్లీ పడ్డారా" మందహాసంతో పలకరిస్తూ సైకిల్ దిగాడు అబ్బిగాడు.

"నమ్మినంత కాలం ఎవరైనా మోసం చేయగలరు. ఈసారి మోసపోను" మర్మగర్భంగా అంది ధీర.

"అయితే మీకు విషయమంతా తెలుసన్న మాట-" ఆమెతో మాటలు కలుపుతున్నాడు అబ్బిగాడు.

వాళ్లిద్దరూ కలిసి వస్తూంటే కనువిందుగా చూడక కళ్లల్లో నిప్పులు పోసుకున్నాడు శౌరి. అవాకులు చెవాకులు ప్రేలాడు.

"ఏమిటండీ మీరనేది. ఆ అబ్బిగాడు నాలా కిరాయి మనిషి. మా ఇద్దరి సైడ్ బిజినెస్ ఇది' ' కిసుక్కున నవ్వుతూ విషయం తేల్చింది కూన.

శౌరి మనసు తేలికపడింది. ధీరని అందుకోవాలని గాలిలోకి ఎగిరాడు.

"భలేవారే. కూనా, నేనూ ఒకే కోవలోనివాళ్లం. మీ దృష్టిలో అవినీతి పరులం. ఈ బిజినెస్‌లో ఇద్దరం పార్టనర్లం"

ధీర శంక తీర్చాడు అబ్బిగాడు.

ఆమె మనస్సేగాక శరీరం కూడా ఉయ్యాలలూగి శౌరి కౌగిలికి చేరింది.

అనుమానపు మబ్బులు తేలిపోవడంతో ఆ ప్రేమికుల అంతరంగం విశాల ఆకాశంలా స్వచ్ఛంగా వుంది.

వాళ్ళు అమాయకంగా, ఆనందంగా, కేరింతలు కొడుతూ ప్రేమించుకుంటూంటే, అది కూడని పని అన్నట్లు కాలినడకన, సైకిళ్ళపైనా చాలా మంది పాడు బడ్డ బంగళాకి చేరుకుంటున్నారు.

ఆశ్చర్యంగా ప్రశ్న గుర్తుల్లా మారారు ధీరా, శౌరి. అంతలో ఓ డొక్కు కారు డొంకదారిన సుడులు తిరుగుతూ వచ్చి ఆగింది.

ఆ కారులోంచి పేపర్ల పాకెట్లు అందుకున్నారు కూనా, అబ్బిగాడు.

"టెన్త్‌క్లాసు సైన్స్ వచ్చిందా? బిఎస్సీ మాత్స్ వచ్చిందా? గ్రూప్ టుసీ వచ్చిందా" అంటూ జనం కూనని చుట్టేశారు.

క్వశ్చన్ పేపర్ల చీకటి బజారని కళ్ళు పెద్దవిచేసింది ధీర.

"రేపు జరగబోయే సబ్ జూనియర్ ఆఫీసర్స్ టెస్టు పేపర్లు... రెండు వందలు" అని అరుస్తున్నాడు అబ్బిగాడు.

అంతవరకు ప్రేమ మైకంలో వున్న శౌరికి మత్తు వదిలింది. వర్తమానం గుర్తుకు వచ్చింది. ఆలస్యం అమృతం విషం అని జనంలోకి చొచ్చుకు పోయి క్వశ్చన్ పేపరు కొన్న అతని ఛాతి పెరిగింది.

"ధీరా.... మనం ఇంటికి వెళ్తే ఎడబాటు ఖాయం. హోటల్లో వుందాం. రేపు పరీక్షరాద్దాం. మనకి కాక ఇంకెవరికి వస్తుంది ఉద్యోగం. మన అజ్ఞాతానికి సరి

పడ పెకం నా దగ్గరుంది" భరోసాగా తన ప్లాను వివరించారు శౌరి.

కాసేపు తర్జనభర్జన అనంతరం ఇద్దరూ కలిసి హోటల్ కంట్రీలో రూం తీసుకున్నారు. పరీక్షకి కావలసిన పుస్తకాలు కొన్నారు. తమ దగ్గరున్న క్వశ్చన్ పేపర్‌కి అన్సర్స్ కామాలూ, ఫుల్‌స్టాప్‌లతో సహా అన్నీ బట్టీ వేయసాగారు.

ఎన్ని పరాజయాలెదురైనా ఇంకా ఆశ పడుతూనే వున్నారు. ఎంతటి అమాయకులు.

రేపటి పరీక్షకి హాల్‌టికెట్లు ఎలా అని ధీర సందేహం వెలిబుచ్చగానే ఫోన్ అందుకున్నాడు శౌరి. యోగికి డయల్ చేశాడు.

"నువ్వూ.... సప్తమీ కలిసి మా ఇళ్లకి వెళ్లి హాల్‌టిక్కెట్లు తస్కరించాలి" అంటూ అంతవరకు జరిగినదంతా క్లుప్తంగా చెప్పాడు.

అంతే. అవతలవైపు నుంచి మాటలు వినబడుతున్నాయి గాని శౌరి పెదవి విప్పడంలేదు.

అయిదు నిమిషాల తరువాత ఫోన్ పెట్టేసి చిత్రంగా నవ్వుతూ అన్నాడు శౌరి.

"మన ప్రేమకి పరీక్ష పెట్టి చిత్తుగా ఓడిపోయారు. మన అమాయకత్వమే మనల్ని కలిపింది. తన నవల ఎవరూ ప్రచురించరని, యోగిని ఉద్యోగం మానేసి, బాంక్ లోన్ తీసుకుని ప్రింటింగ్ ప్రెస్ పెట్టమందిట సప్తమి. తన వల్ల కాదని యోగి చెప్పేసరికి ఓ ప్రింటర్ చేత తాళి కట్టించుకోవడానికి సిద్ధపడిందట సప్తమి. యోగి కథ మామూలే. అమ్ముడు పోవడానికి సిద్ధంగా వున్నాడు."

"వాళ్ల ప్రేమలో స్వార్ధం వుంది. లౌక్యం వుంది" ఇంకా ఏదో చెప్పబోయిన ధీరగబుక్కున ఆగింది.

రూంలోకి దూసుకువచ్చిన సప్తగిరి, శ్రీశైలం ఏకకంఠంతో అన్నారు.

"యోగి పుణ్యమాని మీ పత్తా తెలిసింది. మేం విరోధంగా వుండం. సఖ్యతగా వుంటాం. మీకు పెళ్లిచేస్తాం. ఇళ్లకి పోదాం రండి."

కాసేపు పిల్లలు కోపించారు. మారాం చేశారు. మొరాయించారు.

పెద్దలు బ్రతిమాలారు. ఒకరితలపై మరొకరు చేతులు పెట్టి ఒట్టువేశారు. లెంపలేసుకున్నారు బుద్ధి వచ్చిందని.

చివరికెలాగైతేనేం నలుగురూ కలిసి ఇంటి ముఖం పట్టారు. వాళ్లు హోటల్ గడపదాటే సమయంలో కామి కారు పోర్టికోలో ఆగింది.

అతన్ని వాళ్ళు చూడలేదు. వాళ్లని అతను చూశాడు. జేష్టాదేవి ఆ హోటల్లో బసచేసినట్లు వాళ్లకి తెలియదు. ఆ విషయం తెలిసిన కామి ఆమెతో రాజకీయం చేయడానికి వచ్చాడు.

పిల్లలు గూటికి చేరడంతో మంగమ్మా, గంగమ్మల ముఖాలు వెలిగాయి. పూర్వపు బంధురికపు పరిమళం, శ్రీశైలం సప్తగిరి ఇళ్లని చుట్టేసింది.

ఆ రాత్రి నిద్రకి విడాకులిచ్చి సబ్ జూనియర్ ఆఫీసర్ పరీక్ష చదువుతూ శోభించారు శౌరీ, ధీర.

పిల్లల పెళ్ళి దశమినాడు చేయాలని తెల్లారగానే చేయవలసిన పనుల జాబితా తయారు చేయసాగారు శ్రీశైలం, సప్తగిరి.

పెళ్లినాడు వడ్డించే పిండి వడియాల దగ్గరనుంచి ఏ క్షణంలో ఏ చీరె కట్టుకోవాలో వరకు చర్చించసాగారు మంగమ్మ, గంగమ్మ.

తెల్లారింది. పాలవాడు కేకవేశాడు. పేపరు కాపురానికి వచ్చింది. రేడియో గొంతు విప్పింది. టి.వి. కళ్లు తెరిచింది.


"బావా.... చూశావా... యీ ఘోరం." గడబిడ చేస్తూ పేపరుతో వచ్చాడు సప్తగిరి.


అంతవరకు ఫోన్‌లో గుప్త సంభాషణ చేస్తున్న శ్రీశైలం ఏమయిందన్నట్లు దీర్ఘంగా చూశాడు.

"ఏమయిందా" అని గింజుకుని పేపరు చదవసాగాడు సప్తగిరి.

"జేష్టాదేవి పార్టిలోకి శ్రీ కామి కుప్పిగెంతు. కేవలం పదవికోసం రంగు ఫిరాయింపు. ఏ పార్టీలో వున్నా, తమ పార్టీలో చేరిన మాజీ సభ్యులకి మధ్యంతర ఎన్నికల్లో పార్టీ టికెట్ ఖాయమని జేష్టాదేవి అభయం."

"దీంట్లో ఏముంది ఘోరం. మన పార్టీ పవరులోకి రావాలంటే ఆ మాత్రం రాజకీయం చేయాలి. తప్పదు. శౌరి కాళ్లు కడిగి, తన పార్టీ టికెట్ అల్లుడికి బదిలీచేయడానికి సిద్ధంగా వున్నట్లు కామి





'బి' గ్రేడ్ చిత్రాల్లో దీప్తి నావల్

చిత్రాలు కరువైపోయిన దీప్తి నావల్ 'బి' గ్రేడ్ చిత్రాల స్థాయికి దిగిపోతోంది. కమర్షియల్ చిత్రాల్లో అయినా నటించాలని తాపత్రయ పడుతున్నదట దీప్తి. సుభాష్ ఘయ్ నిర్మించే 'సౌదాగర్'కు సంతకం చేసింది. 'చస్మే బాదూర్', వివాదాస్పదమైన కమల్‌కి మౌత్ చిత్రాల్లో దీప్తికి అంతగా గుర్తింపు రాకపోవచ్చు నంటున్నారు. ఇటీవల తన విడాకుల వ్యవహారంపై ఆమె యిచ్చిన ఇంటర్వ్యూలు కూడా వీటికి కొంత దోహదం చేసి వుండవచ్చని కూడా కొంతమంది భావిస్తున్నారట! దీప్తి నావల్ భవిష్యత్తు ఎలా వుంటుందో మరి?

కెరటాలు- కేరింతలు

ఇప్పుడే ఫోన్ చేశాడు. మన పార్టీ ఉన్నతి కోరి కామి అల్లుడిగా మా అబ్బాయిని ఖాయపరిచాను" చావు వార్తలా చల్లగా చెప్పాడు శ్రీశైలం.

"ఇది చాలా దారుణం"
గిలగిల్లాడాడు సప్తగిరి.

"ఇందులో దారుణమేముంది. శౌరి నీ అల్లుడిగా పోటీ చేస్తే కామితో గెలవలేడు. కామి అల్లుడిగా నిల్చుంటే అటుకామి ఓట్లూ, ఇటు నా గ్రూప్ ఓట్లతో సునాయాసంగా గెలుస్తాడు. పైగా మా శౌరికి జేష్ఠాదేవి ఆశిస్సులున్నాయి." నిర్మొహమాటంగా వాదించాడు శ్రీశైలం.

"ఈ మాత్రం రాజకీయం నేనూ చేయగలను. ధీరని కామి కొడుక్కి దానమిస్తాను. నాకట్టు బట్టలు మినహా మిగతా ఆస్తినంతా కట్నం కింద ఇస్తాను. కొడుక్కి కోడలికి గాక పార్టీ టికెట్ అల్లుడికెలా బదిలీచేస్తాడో చూస్తాను" చిటపటలాడాడు సప్తగిరి.

వాళ్లిద్దరి మధ్యా పేచి పెరిగింది. పట్టుదల పెరిగింది. మూర్ఖులైనారు. మాటలతో కాట్లాడుకుంటున్నారు.

వాళ్లేదో రాజకీయంగా గొడవపడుతున్నారని పరీక్షకి వెళ్లే తొందరలో వున్నాడు శౌరి.

రివ్వున వచ్చి అతని పక్కన వాలిన ధీర "ఈ వార్త చదివావా... క్వశ్చన్ పేపరు అవుట్ అవడం వల్ల నిరవధికంగా సబ్ జూనియర్ ఆఫీసర్స్ టెస్టు కాన్సిల్ అయింది" కిసుక్కున నవ్వింది.

"ఇది ఆనందించవలసిన విషయమా"
ఏడ్పుముఖంతో కసిరాడు.

"రోజూ చచ్చేవాడికి ఎవరు ఏడుస్తారు. ఇది మనకి మామూలేగా. ఏ ముహూర్తాన ఉద్యోగ ప్రయత్నాలు ప్రారంభించామోగాని... అంతా అపసవ్యమే. ఈ జన్మకి మనకి ఉద్యోగయోగంలేదు" విరక్తహాసం చేసింది ధీర.

"అరేయ్ శ్రీశైలం.... కామి చేత నీ కొడుకు కాళ్లు కడిగిస్తావా? చూస్తానురా... ఎలా కడిగిస్తావో..... కాసుకో నా దెబ్బ... నీ కొడుక్కి వివాహయోగం లేకుండా చేస్తాను."

లోపల నుంచి వినబడిన సప్తగిరి గాండ్రింపుకి గుటకలు మింగాడు శౌరి.

"ఒరేయ్....సప్తగిరీ.....నీ వల్ల కాదురా కామి కొడుకు కాళ్లు కడగడం. వాళ్ల దగ్గరుంచుకో. నీ కూతురి కళ్యాణగీత చెరిపేస్తాను."

శ్రీశైలం గర్జింపుకి ఇదెక్కడి కర్మరా అని తలకొట్టుకోలేదు ధీర.

తుర్రుమని తన గూటికి పరిగెత్తి బ్రీఫ్ కేసుతో తిరిగి వచ్చింది.

ఈ లోగా తన గుప్త ధనం సూట్ కేసులో సర్ది రెడీగా వున్నాడు శౌరి ముందు చూపుతో.

వెనక వీధిలో కొత్తగా చేయించిన నెక్లెస్ చూడడానికి వెళ్లారు మంగమ్మా, గంగమ్మ. వాళ్లిద్దరికీ తెలియదు తమ భర్తల మధ్య అగ్ని రాజుకుంటున్నదని.

తాగుడూ, వ్యభిచారం, జూదం కన్నా అతి మత్తు దుర్వ్యసనం పదవిపై ప్రాకులాట.

సప్తగిరీ, శ్రీశైలం కలిస్తే తాను గెలవడం కష్టమని వాళ్ళిద్దరి మధ్యా పుల్ల పెట్టాడు కామి.

శ్రీశైలం సప్తగిరుల తగవు పెరిగి చేతులకి పాకింది. పదవులాట పరాకాష్టకి చేరుకుంది.

ఇక అక్కడుంటే తమ ప్రేమకి ఎడబాటు తప్పదని ఎవరికీ చెప్పాచేయకుండా రైలెక్కేశారు ధీరా, శౌరి.

అమాయకంగా, ఆనందంగా, కేరింతలు కొడుతూ కొత్త జీవితానికి శ్రీకారం చుట్టారు. వాంటెడ్ కాలమ్స్ చూడకుండా సన్న సన్నగా వ్యాపారం చేయాలనే ఆలోచనకి వచ్చారు. శుభం. మరి.

(అయిపోయింది)

తాజాకాలమ్ వీరాజీ

పాకిస్తాన్‌లో "చీకటి రోజులు"



1988 డిసెంబర్‌లో ప్రపంచ చరిత్రలో ఒక అపురూప ఘట్టాన్ని ఆవిష్కరిస్తూ ప్రపంచ ముస్లిం దేశాలలోనే మొట్టమొదటి మహిళా ప్రధానిగా పదవీ స్వీకారం చేసిన భుట్టో తనయ శ్రీమతి బేనజీర్ 1990 ఆగస్టు 6న, దేశాధ్యక్షుని బర్తరఫ్ వేటుకి గురిఅయింది. ఆమెనీ ఆమె మంత్రి వర్గాన్ని- పార్లమెంటును శాసనసభలను అన్నింటిని ఒక కలంపోటుతో రద్దు చేసి దేశంలో యమర్జన్సీ విధించిన ప్రెసిడెంట్ గులామ్ ఇషాక్ ఖాన్- సైనికుల చేత గులామైపోయి- దేశ రక్షణను కార్యభారాన్ని వారిచేత పరోక్షంగా పెట్టినట్లే అయింది. ప్రతిపక్షం నాయకుడయిన- మరో "గులాం" (బానిస అని అర్థం యీమాట విడిగా దీస్తే) నామధేయుడైన గులాం ముస్తాఫా జతోయిని- మరో ఏడుగురు కీలుబొమ్మ మంత్రులను ఆపద్ధర్మ ప్రభుత్వాన్ని నడపమని ప్రకటించాడు. అక్టోబర్ 24 నాటికి తిరిగి సార్వత్రిక ఎన్నికలు జరుగుతాయని ప్రెసిడెంట్ ప్రకటిస్తూ వుండగానే- సైన్యం కీలక వ్యవస్థలను, టెలిఫోన్- టెలివిజన్- రేడియో వ్యవస్థలను-స్వాధీనం చేసుకున్నాయి.

పదకొండేళ్ళ ప్రవాసం జైలుశిక్ష, నిర్బంధాలు వగైరాలు అనుభవించి నిర్విరామ కృషి చేసి- అనూహ్యమైన రీతిలో ఎన్నికలు గెలిచి- దేశానికి ప్రధానమంత్రి అయిన శ్రీమతి బేనజీర్ సొంతరాష్ట్ర అల్లర్ల విషయంలో సైనిక జోక్యాన్ని- అధ్యక్షుని సలహాలను పాటించలేదు- ఆమె మీద ఆశ్రిత పక్షపాతం, అవినీతి, అధికార దుర్వినియోగం, రాజ్యాంగ భగ్నం వగైరా ఆరోపణలు మోపబడ్డాయి. భారతదేశం యిప్పుడు పాకిస్తాన్‌తో చర్చలు జరపటానికి అవకాశాలుంటాయా? లేదా? అన్నదటుంచి- కీడెంచి మేలెంచమన్నట్లుగా- జాగరూకతని వహించాల్సి వుంటుంది. సైన్యం చేతిలో కీలుబొమ్మగా తప్ప మరో రకంగా వ్యవహరించలేని గులాం ఇషాక్ ఖాన్ ఏ సమయంలో ఏమి చేస్తాడో?.....

తిరిగి ఎన్నికలు జరిగి- మళ్లీ బేనజీర్ పార్టీ పోటీచేసి మళ్లీ ప్రజాస్వామ్య పంథాలోకి పాకిస్తాన్ వచ్చేలోగా శ్రీమతి బేనజీర్ అన్నట్లు చాలా చీకటి రోజులు గడవాల్సి వుంటుంది. ఉపఖండంలో యిది మరొక జరుగరాని సంఘటనగా అందరూ భావించి అప్రమత్తంగా వుండాల్సిన సమయమిది.-

8-8-90.

శ్రీ సరస్వతీ నిత్యపూజా విధానము

విఘ్నేశ్వర ప్రార్థన

శుక్లాంబరధరం విష్ణుం శశివర్ణం చతుర్భుజం
ప్రసన్నవదనం ధ్యాయేత్ సర్వవిఘ్నోపశాంతయే

సరస్వతీ ప్రార్థన

యాకుందేందు తుషారహారధవళా-యాశుభ్రవస్త్రావృతా
యావీణా వరదండమండితకరా-యాశ్వేత పద్మాసనా
యా బ్రహ్మాచ్యుత శంకర ప్రభృతిభిర్దేవైః స్సదాపూజితా
సా మాంపాతు సరస్వతీ భగవతీ నిశ్శేష జాడ్యాపహా॥

స్వయం శుద్ధి మంత్రం

అపవిత్రం పవిత్రోవా సర్వావస్థాంగతోపివా
యస్మరేత్పుండరీకాక్షం సబాహ్యాంభ్యంతరశ్శుచిః
(తలపై నుదకము చల్లుకోవలెను)

ఆచమనం

ఓం కేశవాయస్వాహా, నారాయణాయస్వాహా, మాధవాయ



స్వాహా, గోవిందాయనమః, విష్ణవేనమః, మధుసూదనాయ నమః, త్రివిక్రమా, వామనా, శ్రీధరా, హృషీకేశా, పద్మనాభా, దామోదరా, సంకర్షణా, వాసుదేవా, ప్రద్యుమ్నా, అనిరుద్ధా, పురుషోత్తమా, అధోక్షజా, నారసింహా, అచ్యుతా, జనార్ధనా, ఉపేంద్రా, హరయే, శ్రీకృష్ణాయనమః (అని కొంచెం నీరు విడవవలెను)

భూ శుద్ధి మంత్రం

ఉత్తిష్టంతు భూతపిశాచాః యే తే భూమి భారకాః
ఏ తేషామ విరోధే న బ్రహ్మకర్మ సమారభే-

ప్రాణాయామం

ఓం భూః- ఓం భువః - ఓ సువః - ఓం తత్ ః - ఓం జనః - ఓం తపః- ఓగం సత్యం- ఓం తత్ సవితుర్వరేణ్యం- భర్గో దేవస్య ధీమహి- దియ్యోయోనః- ప్రచోదయాత్ - ఓమాపోజ్యోతి రసోమృతం బ్రహ్మ- భూర్భువస్సువరోం-

సంకల్పం:అద్యబ్రాహ్మణ ద్వితీయాపరార్ధే, శ్వేతవరాహకల్పే, వైవస్వత మన్వంతరే, కలియుగే, జంబూద్వీపే, భరతవర్షే, భరతఖండే, శ్రీశైలస్య ఋశాన్యప్రదేశే- అస్మిన్ వ్యావహారిక-ప్రభావాది షష్టి వర్షాణాం మధ్యే- సంవత్సరే, - అయనే, ఋతే - మాసే -పక్షే- తిథే - వాసరయుక్తాయాం - యేవం గుణ విశేషవిశిష్టాయాం - శుభ తిధే- శ్రీమాన్ - గోత్రస్య - నామధేయస్య - శ్రీమతః - గోత్రస్య - నామదేయస్య - మమ ధర్మార్థ కామమోక్ష చతుర్విధఫల పురుషార్థ సిద్ధ్యర్థం - సకల విద్యాపారంగ తత్త్వసిద్ధ్యర్థం - శ్రీ సరస్వతీదేవి ముద్దిశ్య - శ్రీ సరస్వతీదేవతా ప్రీత్యర్థం - కల్పోక్త ప్రకారేణ యావచ్ఛక్తి ధ్యానా వాహనాది షోడశోపచార పూజాం కరిష్యే

ధ్యానం

అంకుశంచాక్షసూత్రంచ పాశం వీణాంచధారిణీ
ముక్తాహార సమాయుక్తాం మోదరూపాం మనోహరాం
సితేనదర్పణాభ్యేన వస్త్రేణో పరిభూషితాం
సుస్తనీం వేదవేద్యాంచ చందార్ధ కృతశేఖరాం
జటాకలాప సంయుక్తాం పూర్ణచంద్రనిభావనాం
త్రిలోచనాం మహాదేవీం స్వర్ణనూపురధారిణీం
కటకై స్వర్ణవలయాద్యైర్ముక్తా వలయసుభూషితాం
కంబుకంఠీం నుతామ్రోష్ఠీం - సర్వాభరణ భూషితాం
(ఓం సరస్వత్యై నమః ధ్యానం సమర్పయామి)

ఆవాహనం

అత్రాగచ్ఛ జగద్వంద్యే సర్వలోకైకపూజితే
మయాకృతాని మాంపూజాం గృహాణ జగదీశ్వరీ
(ఓం సర్వాభరణ భూషితాయైనమః ఆవాహనంసమర్పయామి)

ఆసనం

అనేకరత్న సంయుక్తం సువర్ణేన విరాజితం
ముక్తా మణ్యాంచితం చారు సింహాసనంతేదదామ్యహం
(ఓం జగదీశ్వరీయై నమః - సింహాసనం సమర్పయామి)

పాద్యం

గంధపుష్పాక్షతై స్సార్ధం శుద్ధతోయేవ సంయుతం
శుద్ధ స్ఫటిక తుల్యాంగీ పాద్యంతే ప్రతిగృహ్యతాం॥
(ఓం స్ఫటికాభాయై నమః పాద్యం సమర్పయామి)

అర్ఘ్యం

భక్తాభీష్టప్రదేదేవి దేవదేవాది వందితే
ధాతృప్రియే జగద్ధాత్రి దదామ్యర్ఘ్యం గృహాణమే॥
(ఓం ధాతృప్రియాయై నమః అర్ఘ్యం సమర్పయామి)

ఆచమనీయం

పూర్ణచంద్ర సమానాభే కోటి సూర్య సమప్రభే
భక్త్యాం సమర్పితంవాణీ, గృహాణాచమనీయకం
(ఓం వాగ్దైనమః - ఆచమనీయం దదామి)

మధుపర్కం

దధా మధుఘృతయుక్తం క్షీరరంభాఫలాఢ్యం
సురుచిర మధుపర్కం గృహ్యతాం దేవవంద్యే
(ఓం భక్తాభీష్టదాయై నమః మధుపర్కం సమర్పయామి)

పంచామృతం

దధిక్షీరఘృతోపేతం శర్కరా మధుసంయుతం
పంచామృత స్నానమిదం స్వీమరుష్వ మహేశ్వరీ
(ఓం మహేశ్వర్యైనమః పంచామృతస్నానం సమర్పయామి)

స్నానం

శుద్ధోదకైశ్య సు స్నానం కర్తవ్యం విధిపూర్వకం
సువర్ణ కవచా నీతైర్నానా గంధసువాసితైః
(ఓం మవర్ణకవచాయై నమః శుద్ధోకస్నాన సమర్పయామి)

వస్త్రం

శుక్ల వస్త్రద్వయం దేవీ కోమలంకుటి వాలకే
మయిప్రీత్యాత్వయా వాణీ బ్రహ్మణీ ప్రతిగృహ్యతాం
(ఓం బ్రహ్మణీయైనమః వస్త్రయుగ్మం సమర్పయామి)

యజ్ఞోపవీతం

శబ్ద బ్రహ్మతికేదేవీ-శబ్ద శాస్త్రకృతాలయే
బ్రహ్మసూత్రం గృహాణత్వం బ్రహ్మశక్రాది పూజితే
(ఓం - బ్రహ్మశక్రాది పూజితాయైనమః - యజ్ఞోపవీతం సమర్పయామి)

ఆభరణం

కమలదళ విలాసే కామదేవం గృహిష్వ
ప్రకటిత కరుణార్ద్రే భూషితేభూషణాని
(ఓం-కమలదళ విలాసిన్యై నమః-సర్వాభరణాని సమర్పయామి)

గంధం

చందనాగరు కస్తూరీ కర్పూర్యైశ్వరాసంయుతం
గంధం గృహాణ వరదే విధి పత్నినమోస్తుతే
(ఓం విధి పత్న్యైనమః-గంధం సమర్పయామి)

అక్షతలు

అక్షతాన్ ధవళాన్ దివ్యాన్ శాయాలిన్ తండులాన్వితాన్
గృహాణ వరదేదేవి బ్రహ్మపత్ని శుభాత్మకాన్॥
(ఓం గీర్వాణీయై నమః- అక్షతాన్ సమర్పయామి)

పుష్పం

మందారాది సుపుష్పైశ్చతత్కాల తరుసంభవైః
కల్పితానిచ మాల్యానిగృహాణా మరవందితే
(ఓం అమరవందితాయై నమః-పుష్పమాలాన్ సమర్పయామి)

అథాంగ పూజా

పసుపు, కుంకుమ, అక్షతలు, పూవులు చేతబట్టి - సరస్వతిని స్మరిస్తూ- ఆమె సర్వావయవాలనూ పూజించాలి-.

ఓం - బ్రహ్మణ్యై నమః- పాదే పూజయామి। బ్రహ్మణ్య మూర్తయే నమః గుల్ఫే పూజయామి। జగత్స్వరూపిణ్యైనమః జంఘే పూజయామి। జగదాద్యాయై నమః। జానునీపూజయామి। చారువిలాసిన్యై నమః పూరూం పూజయామి। కమలభూమయేనమః। కటింపూజయామి। జన్మహీనాయై నమః। జఘనం పూజయామి। గంభీరనాభయే నమః। నాభిం పూజయామి। హరిపూజ్యాయైనమః ఉదరం పూజయామి। లోకమాత్రేయే నమః స్తనౌ పూజయామి। విశాలవక్షిణేనమః వక్షస్థలం పూజయామి। గానవిక్షిణ్యైనమః కంఠం పూజయామి। స్కంధ పూజ్యాయై నమః। స్కంధే పూజయామి। శ్రోత్రియబంధవే నమః శ్రోత్రం పూజయామి। ఘనబాహవే నమః బాహుం పూజయామి। పుస్తకపాణ్యై నమః పాణేం పూజయామి। వేదస్వరూపాయై నమః వక్త్రం పూజయామి। సునాస్యై నమః నాసికాం పూజయామి। బింబసమానోష్ఠాయై నమః ఓష్ఠౌ పూజయామి। కమలలోచనాయై నమః నేత్రౌపూజయామి తిలకధారిణ్యై నమః ఫాలం పూజయామి। చంద్రమూర్తయే నమః ముఖం పూజయామి। సర్వప్రదాయైనమః సరస్వతీం పూజయామి। బ్రహ్మరూపిణ్యైనమః। సర్వాణ్యంగాని పూజయామి।

ఈ పిదప సరస్వతి అష్టోత్తర శతనామములుగాని - సహస్రనామములుగాని చదువుచూ- యథాశక్తి పూజించవలెను- తదనంతరం-

ధూపం

దశాంగంగుగ్గులోపేతం సుగంధం సుమనోహరం
ధూపం గృహాణ కళ్యాణి భక్తిత్వం ప్రతి గృహ్యతాం
(ఓం విశ్వాయై నమః ధూపమాఘ్రాపయామి)

దీపం

ఘృతావర్తి సమాయుక్తం దీపితం దీపమంచికే
గృహాణ చిత్స్వరూపేత్వం కమలాసనవల్లభే।
(ఓం కమలాసన వల్లభాయై నమః దీపదర్శయామి)

నైవేద్యం

కదళీపన సామ్రాణాం పక్వానిసుఫలానిచ



అన్నం చతుర్విధోపేతం క్షీరాన్నంచ, ఘృతం దధ
శీతలోదకం చ సుస్వాదుకర్పూ హైరాదివాసితం
భక్ష్య భోజ్య సమాయుక్తం నైవేద్యం ప్రతిగృహతాం
ఓం సరస్వత్యై నమః - మహానైవేద్యం సమర్పయామి అని చెప్పుకోవలెను.

తాంబూలం

తాంబూలం చ సకర్పూరం పూగనాగదళైర్యుతం
గృహాణ దేవదేవే శత్తత్వ రూపీనమోస్తుతే-
(ఓం దేవదేవేశతత్వరూపీయై నమః-తాంబూలంసమర్పయామి)

నీరాజనం

నీరాజనం గృహాణత్వం జగదానందదాయిస
జగత్తిమిదమార్తాండమండలేతే నమోనమః
(ఓం జగత్తి మిదమార్తాండ మండలాయ నమః నీరాజనం సమర్పయామి అని కర్పూర నీరాజనం వెలిగించి- ఒక్క చిన్న

సరస్వత్య ష్టోత్తర శతనామావళి



ఓం సరస్వత్యై నమః
మహాభద్రాయై
మహామాయాయై
వరప్రదాయై
శ్రీప్రదాయై
పద్మనిలయాయై
ఓం పద్యాక్ష్యై నమః
పద్మవక్త్రాయై
శివానుజాయై
పుస్తకభృత్యై 100
జ్ఞానముద్రాయై
రమాయై
ఓం పరాయై
కామరూపయై
మహావిద్యాయై
మహాపాతకనాశిన్యై
మహాశ్రయాయై
మాలిన్యై
మహాభోగాయై
మహాభుజాయై 28
మహాభాగాయై
మహోత్సాహాయై
ఓం దివ్యాంగాయై
సురవందితాయై
మహాకాళ్యై
మహాపాశాయై
మహాకారాయై
మహాంకుశాయై
సీతాయై
విమలాయై 30
విశ్వాయై
విద్యున్మాలాయై
ఓం వైష్ణవ్యై నమః

చంద్రికాయై
చంద్రవదనాయై
చంద్రలేఖావిభూషితాయై
సావిత్ర్యై
సురసా
దైవ్యై
దివ్యాలంకారభూషితాయై
వాగ్దేవ్యై
వసుధాయై
తీవ్రాయై
మహాభద్రాయై
ఓం మహాబలాయై నమః
భోగదాయై
భారత్యై
భామాయై
భామాయై
గోవిందాయై
గోమత్యై
శివాయై
జటిలాయై

వింధ్యవాసాయై
వింధ్యాచలవిరాజితాయై
చండికాయై
వైష్ణవ్యై
బ్రాహ్మ్యై
బ్రహ్మజ్ఞానైకసాధనాయై
సౌదామిన్యై
సుధామూర్త్యై 60
సుభద్రాయై
సురపూజితాయై
సువాసిన్యై
సువాసాయై
వినిద్రాయై
పద్మలోచనాయై
విద్యారూపాయై
విశాలక్ష్యై
బ్రహ్మజాయాయై
మహాఫలాయై 70
త్రయీమూర్త్యై
త్రికాలజ్ఞాయై

త్రిగుణాయై
శాస్త్రరూపిణ్యై
శుంభాసుర ప్రమథిన్యై
శుభదాయై
స్వరాత్మికాయై
రక్తబీజనిహంత్ర్యై
చాముండాయై
అంబికాయై 80
ముణ్డకాయ ప్రహరణాయై
ధూమ్రలోచనమర్దనాయై
సర్వదేవస్తుతాయై
సౌమ్యాయై
ఓంసురాసుర నమస్కృతాయైనమః
కాళరాత్ర్యై
కలాధారాయై
రూపసౌభాగ్యదాయిన్యై
వాగ్దేవ్యై
వరారోహాయై 90
వరాహ్యై
వారిజాసనాయై
చిత్రాంబరాయై, చిత్రగంధాయై
చిత్రమాల్యవిభూషితాయై
ఓం కాంతాయై
కామప్రదాయై నమః
వంద్యాయై
విద్యాధరసుపూజితాయై
శ్వేతాననాయై, నీలభుజాయై
చతుర్వర్గఫలప్రదాయై
చతురాననసామ్రాజ్యాయై
రక్తమధ్యాయై
నిరంజనాయై
హంసాసనాయై
నీలజంఘాయై
బ్రహ్మవిష్ణుశివాత్మికాయై 108

సరస్వత్యష్టోత్తర శతనామస్తోత్రమ్ సమాప్తం

తమలపాకుతో నీరుజల్లి- చూపవలెను)

అని నివేదనా పదార్థములపై నీరు విడుచుచు-

ఓం భూర్భువస్సువః తత్సవిదుర్వరేణ్యం భర్గోదేవస్య ధీ మహిధియోయోనః ప్రచోదయాత్! ఓం సత్యంత్వర్తేన పరిం షిచామి. అమృతమ్మ-అమృతోపస్తరణమసి. ఓం ప్రాణాయ స్వాహా- ఓం అపానాయ స్వాహా- ఓం వ్యావాయస్వాహా- ఓం ఉంచాయ స్వాహా- ఓం సమానాయ స్వాహా- మధ్యేమధ్యే పానీయం సమర్పయామి - ఉత్తరాపోశనం సమర్పయామి హస్తే ప్రక్షాళయామి - పాదే ప్రక్షాళయామి- శుద్ధాచమనీయ సమర్పయామి-

* అనంతరం -మంత్రపుష్పం-శ్రీసూక్తం చదువుకోవలెను.

సాష్టాంగ నమస్కారం

ఉదసా-శిరసా-దృష్ట్యా-మనసా వచసా తథా
పద్భ్యాం కరాభ్యాం కర్ణాభ్యాం ప్రణామో ష్టాంగ ఉచ్యతే-

ఓం శ్రీ సరస్వత్యైనమః సాష్టాంగ నమస్కారాన్ సమర్పయామి.

క్షమా ప్రార్థన

పాశాం కుశధరావాణీ వీణా పుస్తకధారిణీ
ఇంద్రృక్త్రేవసేన్నిత్యం దుగ్ధకుందేందు నిర్మలా-

ప్రదక్షిణ నమస్కారం

శ్రీ సరస్వతీదేవికి 14 సార్లు ప్రదక్షిణం చేయాలి. అప్పుడే దిగువ మంత్రం 14 సార్లు జపించాలి.

చతుర్ద శేషు విద్యాసు రమతేయా సరస్వతీ
చతుర్ద శేషు లోకేషు సామే వాచివసే త్సదా!

పూజావసానవేళా పుష్పాంజలి సమర్పణం

దోసిటపూలుంచుకొని-

సరస్వతీ నమస్తుభ్యం వరదే భక్తవత్సలే
ఉపాయనం ప్రదాస్యామి విద్యావృద్ధి కురుష్వమే-
భారతీ ప్రతిగృహాతు- భారతీ వైదదాతిచ
భారతీ తారకోభ్యాభ్యాం - భారత్యైతే నమోనమః

అని పూలు జల్లి - నమస్కరించి-

అనయా -మయాకృత పూజయా భగవతీ సర్వాత్మికా శ్రీ సరస్వతీ సుప్రీతా - సుప్రసన్నా వరదాభవన్తు-. ఏతత్సర్వం సరస్వతీ దేవతార్పణమస్తు-. (అని నీళ్ళ అక్షతలు పళ్ళెములో వదలాలి.)

ఇతి శ్రీ సరస్వతీ నిత్యపూజా విధానం సంపూర్ణం.

o

సీరియల్

హాట్‌లిస్ట్

జి.వి.అమరేశ్వరరావు



(గత సంచిక తరువాయి)

తన కళ్ళ ఎదుటే రివాల్వర్ ప్రేలి కురియన్ చావడంతో ఎర్రతేలు గుండె ఇంకా దడదడా వేగంగా కొట్టుకుంటూనే ఉంది. అతడు జామై ఉస్మానియాలో తనుంటున్న రేకుల షెడ్‌లోకి ప్రవేశించాడు. లోపలకు వెడుతూనే రమ్ము బాటిల్ మూత ఊడదీశాడు. నీళ్ళు కలపకుండానే ఆఫ్ బాటిల్ రమ్ము లాగించేశాడు. చేదుగా, వెచ్చగా లోపలకి జారిన రమ్ము అతడి గొంతును భగ్గున మండించింది.

ఎర్రతేలుకు కిక్కు ఎక్కడం మొదలయ్యింది. అతడి మెదడు చుట్టూ మత్తు పొరలు అలుముకో సాగాయి. మందు పడిన తర్వాత అతడు కాస్తంత స్థిమితపడ్డాడు.

ఈ సారి బాటిల్ లోని మిగిలిన మందు గ్లాసులోకి పోసుకుని నీళ్ళు కలుపుకుని లాగించ సాగాడు.

అరగంటలో బాటిల్ మొత్తం ఖాళీ చేసేశాడు. మామూలుగా క్వార్టర్ బాటిల్ కెపాసిటీ గల ఎర్రతేలు ఒక్కసారిగా ఫుల్ బాటిల్ రమ్ము లాగించాడు.

దాంతో అతడి మెదడు మొద్దు బారింది. కురియన్ చావు గురించి తాత్కాలికంగా మర్చిపోయి క్రమక్రమంగా నిద్రలోకి జారుకో సాగాడు.

★ ★ ★ ★ ★ ★

'డాగ్‌డే' సినిమా బాగుంది.

కాని శివాజీ దృష్టి తెరమీద నిలువడం లేదు. అతడు నల్లముత్తు గురించి ఆలోచిస్తున్నాడు.

మరో కొద్ది సేపట్లో ఎర్రతేలు చావడం ఖాయం. ఆ తర్వాత నల్లముత్తును ఫినిష్ చేయాలి. అందుకు తగిన పథకం ఆలోచించాలి.

శివాజీ ఆ గంటన్నర సేపూ నల్లముత్తును సంహరించడం గురించిన ఆలోచనల్లో గడిపాడు.

ఆరు గంటలకు సినిమా వదిలారు.

శివాజీ రజనీ ఏడున్నర దాకా అటూ ఇటూ తిరుగుతూ గడిపారు.

ఏడున్నరకు చెప్పాడు శివాజీ.

"మనం ఇపుడు సన్‌రైజ్ ఎపార్ట్‌మెంట్స్‌కు వెళ్ళాలి" రజని తల ఊపింది.

★ ★ ★ ★ ★ ★

కాశీప్రసాద్ మార్చురీలో ఉన్న పార్వతి శవాన్ని స్వాధీనం చేసుకున్నాడు.

అతడిని బంధువులు స్నేహితులు ఎంతగానో ఓదార్చారు. కాని అతడి దుఃఖాన్ని మాత్రం రూపు మాపలేక పోయారు.

ఎలక్ట్రిక్ క్రియేషన్ అయిన తర్వాత కాశీప్రసాద్ పార్వతి అస్థికలు మూసీ నదిలో కలిపాడు. అక్కడ్నించి కార్లో నేరుగా మోహిని ఇంటికి వెళ్ళాడు.

రెండు రోజులుగా అతడికోసం తపించి పోతున్న మోహిని అతడిని అల్లుకు పోయింది.

ఇద్దరూ ఒక గంటసేపు స్వేచ్ఛగా సుఖం జుర్రుకున్నారు.

తిరిగి బట్టలు వేసుకుంటున్న కాశీప్రసాద్ చెప్పాడు.

"నేను ఇపుడు ఎక్కడ్నించి వస్తున్నానో తెలుసా?"

"ఇంకెక్కడ్నించి... బొంబే నుంచి నేరుగా ఇక్కడికి వచ్చేశారు అవునా?"

"కాదు! నా భార్య అస్థికలు మూసీ నదిలో కలిపి వస్తున్నా."

ఆ మాటతో మోహిని ముఖంలో నవ్వు ఒక్క క్షణకాలం మాయమయ్యింది. వెంటనే తేరుకుని కాశీప్రసాద్ చెంప మీద ముద్దు పెట్టుకుని చెప్పింది.

"మీ భార్య చనిపోయిన సమయంలో

ఇంతవరకూ సాగిన కథ-13:మూరు వేర్లతో మోసాలకు అలవాటుపడివచ్చిన దాంట్లో సమంగా పంచుకుంటూ కాలం గడుపుతుంటారు శివాజీ-రజని. మోహిని మోజులో పడిన కాశీప్రసాద్ తన భార్య పార్వతిని కురియన్, నల్లముత్తు, ఎర్రతేలుల ద్వారా హత్యచేయిస్తాడు. ఆ హత్యను కళ్లారా చూసిన శివాజీ తల్లిదండ్రులను, చెల్లిని కురియన్ బృందం చంపేస్తారు. ఇది తెలిసిన శివాజీ కురియన్‌ను చితకబాది ఎర్రతేలు వుండే ప్రదేశానికి తీసుకువెళ్తాడు. ఆ తర్వాత కురియన్ యింట్లో శివాజీ ఏర్పాటుచేసిన రివాల్వర్ కురియన్‌ను బలి తీసుకుంటుంది.

ఇక్కడ ఉండడం బాగోదు. కొద్ది రోజుల పాటు మనం నలుగురి కళ్ళలోనూ పడకుండా ఉంటె మంచిది."

"అవును.... నాకూ ఇలాంటి ఐడియానే వచ్చింది. ఇకనుంచీ పగటి వేళ నీ దగ్గరికి రాను. కేవలం రాత్రిళ్ళు మాత్రమే వస్తుంటాను."


కాశీప్రసాద్ మోహినిని బిగియారా కౌగలించుకుని ఆమె పెదాల మీద గాఢంగా చుంబించి బయటకు నడిచాడు

★ ★ ★ ★ ★

శివాజీ కుమార్ థియేటర్నుంచి నేరుగా సన్‌రైజ్ ఎపార్ట్‌మెంటి వయిపు దూసుకు పోయాడు.

కరెక్ట్‌గా ఆరున్నర కల్లా ఎపార్ట్ మెంట్స్ ముందు కారు ఆపాడు. సాయంత్రపు ట్రాఫిక్ మరీ ఎక్కువగా ఉన్నా కూడా సాధ్యమయినంత త్వరగా ఎపార్ట్ మెంట్స్ దగ్గరికి చేరుకున్నాడు.

సాధారణంగా అనేక అంతస్థులున్న ఎపార్ట్ మెంట్స్‌లో నివసించే వాళ్ళు ఒకరి గురించి మరొకరు పట్టించుకోరు. ఒక్కొక్క సందర్భంలో పక్క ఎపార్టు మెంట్‌లో హత్య జరిగినపుడు శవం కుళ్ళిపోయి వాసన వేసే దాకా పొరుగున నివసించే వాళ్ళకు తెలియదు. అలాంటి వార్తలు పేపర్లలో శివాజీ చాలా సార్లు చదివి వున్నాడు. ఎపార్ట్ మెంట్స్‌లో



ఎప్పుడూ నివసించక పోయినా అక్కడి జీవితం అతడికి తెలుసు.

శివాజీ, రజని ఏడో నెంబర్ ఫ్లోర్‌లో ఉన్న సోహన్‌లాల్ ఎపార్ట్ మెంట్ వద్దకు చేరుకున్నారు.

తనతో పాటు లిఫ్ట్‌లో వచ్చిన మనుషులు ఎవరి ఎపార్ట్ మెంట్స్‌కు వాళ్ళు వెళ్ళేంత వరకూ వెయిట్ చేసిన శివాజీ ముందుకు కదిలాడు.

సోహన్‌లాల్ ఎపార్ట్ మెంట్ ముందు వెలుతురున్న ఎలక్ట్రిక్ బల్బ్‌ను కర్చీఫ్‌తో పట్టుకుని హోల్డర్ నుంచి ఊడదీశాడు. బల్బ్ పోవడంతో అక్కడ చీకటి అలుముకుంది.

తను ఊడదీసిన బల్బును ప్రక్కనే ఉన్న డస్ట్‌బిన్‌లో పడేశాడు.

సోహన్‌లాల్ ఎపార్ట్ మెంట్ ఉన్న ఫ్లోర్‌లో మరో మూడు పోర్షన్లు ఉన్నాయి. వాటిల్లో నివసిస్తున్న వాళ్ళంతా టి. వి. ల ముందు సెటిలయి పోయారు.

సన్‌రైజ్ ఎపార్ట్ మెంట్స్ మేనేజిమెంట్ 'కేబుల్ టి. వి.' నడుపుతోంది. ప్రతిరోజూ కనీసం ఉదయం నుంచి రాత్రి దాకా అరడజను సినిమాలు కేబుల్ టి. వి. ద్వారా ప్రసారం అవుతాయి. సాయంత్రం ఆరు గంటలకు మాత్రం ఇంగ్లీషు, హిందీ భాషల్లో సూపర్ హిట్ అయిన ఏదో ఒక సినిమా కేబుల్ టి. వి. ద్వారా ప్రసారం అయి తీరుతుంది.

సోహన్‌లాల్ పక్క పోర్షన్ వాళ్ళు టి. వి. వాల్యూం బాగా పెంచారు. డాన్ సినిమా లోని అమితాబచ్చన్ కంఠం పెద్దగా వినపడుతోంది.

ఇక అక్కడి జనాలు బాంబులు పేలడమో, భూకంపం రావడమో జరిగితే తప్ప టి. వి. ల ముందు నుంచి కదలరని శివాజీకి తెలుసు.

అతడు రజని చేతిలోని హ్యాండ్ బ్యాగ్ నుండి కీ బంచ్ బయటకు తీశాడు. తలుపు తాళం తెరిచేముందు చేతులకు గ్లోజస్ తొడుక్కున్నాడు. రజని కూడా హ్యాండ్ బ్యాగ్ నుండి ఒక జత గ్లోజస్ తీసి తొడుక్కుంది. శివాజీ కీ బంచ్ నుంచి ఒక్కొక్క తాళం చెవితో తలుపుకున్న తాళం తియ్యడానికి ప్రయత్నించ సాగాడు. అయిదారు రకాల తాళం చెవులతో ప్రయత్నించాడు.

ఫలితం శూన్యం.

అయినా అతడిలో సహనం నశించలేదు.

ఆరోసారి అతడి ప్రయత్నం ఫలించింది. తాళం లోపల లీవర్స్ కదులుతున్న చప్పుడు వినపడింది.

శివాజీ మరోకసారి ప్రయత్నించాడు.

క్లిక్ మన్న శబ్దంతో తాళం తెరుచుకుంది.



ఇద్దరూ లోపలకు అడుగు పెట్టారు. వెంటనే శివాజీ తలుపు వేసేశాడు. గుమ్మానికి ప్రక్కనే చేత్తో తడిమాడు. స్విచ్ బోర్డు వేళ్ళకు తగిలింది. శివాజీ వరసగా స్విచ్చులు నొక్కాడు. లైటు వెలిగింది.

"లైటు వెలగడం బయట్నించి ఎవరన్నా చూసి అనుమానిస్తారేమో" సందేహంగా అన్నది రజని.

"చూస్తే చూడనీ. సోహన్‌లాల్ దంపతులు పొరపాటున లైటు వేసి వెళ్ళిపోయారను కుంటారు. నువ్వేం కంగారు పడకు." శివాజీ రజనికి ధైర్యం చెప్పాడు.

తర్వాత తను కొన్న వెయ్యి క్యాండిల్ బల్బ్ చేత్తో తీసుకున్నాడు. కీ బంచ్ నుండి సూదిలా ఉన్న ఒక లావుపాటి నీడిల్ పైకి తీసాడు. దాని సహాయంతో బల్బ్ ఫిలమెంట్ తొలగించడానికి ప్రయత్నించ సాగాడు. ఖచ్చితంగా అయిదు నిమిషాల్లో అతడి ప్రయత్నం ఫలించింది.

ఫిలమెంట్ ఊడి వచ్చింది.

ఇపుడు అతడికి సన్నటి దారం కావాలి. వచ్చే దారిలో సూట్‌కేస్, యాసిడ్ కొన్నాడు. కాని దారం విషయం మర్చి పోయాడు.

"మనకు ఇపుడు అర్జంటుగా ఒక దారం కావాలి ఎలా?" రజనిని అడిగాడు.

"ఇక్కడ ఎక్కడన్నా ఉంటుందేమో వెతికితే." రజని సలహా శివాజీకి నచ్చింది.

అతడు ప్రక్క గదిలోకి నడిచాడు. లైటువేసి వెతకసాగాడు. అక్కడి ఒక నీలం రంగు ప్లాస్టిక్ బాక్స్‌లో రకరకాల రంగుల్లో ఉన్న దారపు ఉండలు, సూదులు కనిపించాయి. వాటిల్లోంచి నలుపురంగు దారపు ఉండ పైకి తీశాడు. దాన్ని రెండు పేటలుగా పేని ఫిలమెంట్ తీసేసిన బల్బ్‌కు కట్టాడు.

తర్వాత మెయిన్ ఆఫ్ చేశాడు.

గదిలో వెలుగుతున్న బల్బ్ ఒక్కసారిగా ఆరిపోయింది. కళ్ళు చీకటికి అలవాటు పడడానికి అయిదు నిమిషాల సమయం పట్టింది. అద్దాల కిటికీ గుండా దూసుకు వస్తున్న వీధి దీపాల కాంతిలో అతడు పని చేయసాగాడు.

ముందుగా స్విచ్ బోర్డుకు నాలుగు వైపులా ఉన్న బోల్టు విప్పదీశాడు. ఈ పని చేయడానికి అతడికి కీ బంచ్‌లో ఉన్న స్క్రూడ్రైవర్ లాంటి పరికరం పనికి వచ్చింది. స్విచ్‌బోర్డు వెనక వైపు గోడలోపల్నించి వచ్చిన వైర్లు అతడి చేతికి తగిలాయి. ఫ్యాను స్విచ్చి వదిలేసి మిగిలిన స్విచ్‌ల కనెక్షన్ తీసేశాడు.

తర్వాత శివాజీ స్విచ్‌బోర్డు గోడకు బిగించాడు.

రజని అనుమానంగా అడిగింది.

"ఆ స్విచ్‌బోర్డు ఎందుకు ఊడదీశావ్?"

హిట్ లిస్ట్

"ఎర్రతేలు ఈ గదిలోకి వస్తాడు. ముందుగా లైటు వేయడానికి ప్రయత్నిస్తాడు. ఆ ప్రయత్నంలో చిట్ట చివరున్న ఫ్యాన్ స్విచ కూడా నొక్కుతాడు. అన్ని స్విచ్‌లు నొక్కడం పూర్తి అవగానే లైటు వెలగక పోవడంతో వాడి దగ్గర ఉండే పెన్ టార్చి తీసి వెలిగిస్తాడు. లేదా ఈ గుడ్డి కాంతిలోనే తడుముకుంటూ టేబుల్ మీద ఉన్న బ్రీఫ్‌కేస్ తీసుకుంటాడు. ఆ పాటికే స్విచ్ వేయడంతో తిరగడం ప్రారంభించిన ఫ్యాను రెక్క పైకప్పు కొక్కెం నుంచి వేలాడుతున్న దారానికి తగుల్తుంది. దారం తెగుతుంది. దాంతో దారం చివరున్న బల్బు ఎర్రతేలు నెత్తిమీద పడి పగుల్తుంది. బల్బు లోపలున్న యాసిడ్ ముఖం నిండా కారి ఎర్రతేలు కుక్కచావు చస్తాడు."

శివాజీ ప్లాను అర్థం అయిన రజని భయంతో కొయ్యబారి పోయింది. శివాజీ ఆమె వీపు మీద నిమురుతూ అన్నాడు.

"అలా ఊర్కే భయపడిపోతే మన ఆశయం దెబ్బ తింటుంది. శత్రు సంహారంలో జాలి, కరుణ, దయ అనే వాటిని దరిచేర నీయకూడదు. ముందుగా ఆ టేబుల్ ఫ్యాన్ కిందగా జరుపుదాం పద."

శివాజీ, రజని చెరో వైపున పట్టుకుని టేబుల్‌ను ఫ్యాను కిందకు జరిపారు.

శివాజీ తను నాంపల్లి స్టేషన్ రోడ్‌లో కొన్న యాసిడ్ బాటిల్ పైకి తీశాడు.

"లైటలకున్న కనెక్షన్ ముందే తీసేశాం. ఇపుడు ఈ చీకట్లో యాసిడ్ బల్బులో పోయడం ఎలా?" రజని అడిగింది.

సమాధానంగా శివాజీ జేబునుండి సిగార్ లైటర్ పైకితీసి రజనికి అందించాడు. రజని దాన్ని వెలిగించింది.

ఆ వెలుగులో శివాజీ సీసాలోని యాసిడ్ ఫిలమెంట్‌లేని బల్బులో ఒక్క చుక్క కూడా కిందపడకుండా, బల్బుకు కట్టిన దారానికి తగలకుండా పోయసాగాడు. యాసిడ్ కనక తగిలితే దారం కాలి తెగిపోయే అవకాశం ఉంది.

బల్బ్ నిండా యాసిడ్ పోయడం పూర్తి అయింది.

శివాజీ టేబుల్ మీద ఎక్కి బల్బుకు కట్టిన దారపు చివరను ఫ్యాను పక్కనే పైకప్పుకు బిగించి ఉన్న కొక్కానికి కట్టి ముడివేశాడు.

కిందికి దిగి తను అంతకు ముందు కొన్న బ్రీఫ్‌కేసు టేబుల్ మీద ఉంచాడు. బ్రీఫ్‌కేస్ కోసం వచ్చిన ఎర్రతేలు కరెక్టుగా యాసిడ్ బల్బ్ కింద నిలబడక తప్పదు.

సీసాలో ఇంకా యాసిడ్ మిగిలి ఉంది. దాన్ని బాత్రూంలో ఫ్లెషవుట్ చేసి సీసా అక్కడే వదిలేశాడు.

తను అంతవరకు చేసిన పని తృప్తిగా ఉంది అనిపించిన తర్వాత అదే గదిలో ఓ మూలగా ఉన్న టీపాయ్ వయిపు నడిచాడు. అతడికి ఎర్రతేలు ఫోన్ నెంబర్ గుర్తుంది.

రజని మరొకసారి సిగార్ లైటర్ వెలిగించింది. ఆ కాంతిలో ఎర్రతేలు నెంబర్‌కి డయల్ చేశాడు.

"శ్రీనివాస మెడికల్స్" అంటూ అవతలి వైపు నుంచి వినపడింది.

"ఎర్రతేల్ని పిలుస్తారా!"

"వన్ మినిట్."

అయిదు నిమిషాల తర్వాత హలో అంటూ ఎర్రతేలు లైన్‌లోకి వచ్చాడు. పూర్తి నిషాలో ఉన్నట్టు అతడి కంఠం బరువుగా ఉంది.

"నేనే కాశీప్రసాద్‌ని."

శివాజీ గొంతు మార్చి మాట్లాడాడు.

"మీరా బాస్.... బాంబే నుంచి ఎప్పుడు వచ్చారు బాస్." ఎర్రతేలు గొంతు నమ్రతగా పలికింది.

"పొద్దున్నే వచ్చాన్రా బద్మాష్... నేను ఇపుడు మోహిని ఇంటి నుంచి మాట్లాడు తున్నాను."

మోహిని పేరు వినగానే 'ఏంటి బాస్ మీ కంఠం కాస్త మారింది' అని అనుమానం వ్యక్తం చేయబోయిన ఎర్రతేలు ఆ ప్రయత్నం విరమించు కున్నాడు.


"మొత్తానికి ఆ శివాజీ గాడిని రజని అనేదాన్ని భలే ఇరికించారు."

"థాంక్యూ బాస్... మరి మా ముగ్గురికీ యాభైవేల చొప్పునఇస్తానన్నారుకదా!"

"ఇస్తా... ముందు నువ్వొక పని చేయాలి.... సోమాజిగూడా దాటిన తర్వాత సన్‌రైజ్ ఎపార్ట్‌మెంట్స్ ఉన్నాయ్ గుర్తుందా"

"ఉంది బాస్."

"ఆ ఎపార్ట్‌మెంట్స్‌లో ఏడో నెంబర్ ఫ్లోర్‌లో ఆరో నెంబర్ ఫ్లాట్‌లోకి వెళ్ళు. ఆ ఫ్లాట్‌కు సంబంధించిన తాళం చెవి తలుపుముందున్న డోర్ మ్యాట్ క్రింద వుంటుంది. నువ్వు ఆ తాళం చెవి సహాయంతో తలుపు తెరిచి లోపలికి వెళ్ళు. అక్కడ గది మధ్యగా ఒక టేబుల్ ఉంటుంది. ఆ టేబుల్ మీద ఒక సూట్‌కేస్ ఉంటుంది. ఆ సూట్‌కేస్‌లో అయిదు లక్షలుంటాయ్. అందులోంచి పార్వతిని చంపితే ఇస్తానని ప్రామిస్ చేసిన యాభైవేలూ తీసేసుకొని మిగిలిన



నాలుగు లక్షల యాభైవేలూ వస్తా. నువ్వు మా ఇంటికి వెళ్ళనవసరం లేదు. నేను మోహిని దగ్గిర ఉంటాను. ఈ అయిదు లక్షలూ మనకు కింగ్‌కోబ్రా ఈ రకంగా అందజేస్తానని ఇంతకు ముందే ఫోన్ చేశాడు. నువ్వు వెంటనే వెళ్ళి నేను చెప్పిన పని చెయ్."

"అలాగే బాస్..." ఫోన్ క్రెడిల్ చేసిన శబ్దం వినపడింది.

ఫోన్ చేయడం పూర్తికాగానే శివాజీ, రజని ఆ గది నుంచి బయటకు నడిచారు. బయటకు వెళ్ళేముందు శివాజీ ఎలక్ట్రిక్ మెయిన్ ఆన్ చేశాడు.

తలుపు వేసి, తాళం తెరవడానికి తను ఉపయోగించిన తాళం చెవి డోర్ మ్యాట్ కింద వుంచాడు. లిఫ్ట్‌లో కిందికి దిగాడు.

సన్‌రైజ్ ఎపార్ట్‌మెంట్ ఎదురుగ్గా రోడ్డుకు అటువైపు పార్క్ చేసి ఉన్న వ్యాన్‌గార్డ్‌లో కూర్చుని కొద్ది నిమిషాల్లో రాబోయే ఎర్రతేలు కోసం ఎదురు చూడసాగాడు.

ఇరవై నిమిషాల తర్వాత ఒక ఆటో సన్‌రైజ్ ఎపార్ట్‌మెంట్స్ ముందు ఆగింది.

ఆ ఆటోలోంచి దిగిన ఎర్రతేలు వేగంగా లిఫ్ట్ వైపు నడిచాడు. ఏడో అంతస్థు చేరుకున్నాడు. ఆ అంతస్థులో ఆరో నెంబర్ ఫ్లాట్ వయిపు నడిచాడు. అక్కడ తలుపు ముందు ఉన్న డోర్ మ్యాట్ పైకెత్తి చూశాడు. తాళం చెవి చేతికి తగిలింది. వెంటనే దాన్ని పైకి తీశాడు.

సరిగ్గా ఆ సమయంలో కరెంట్ ఫెయిల్ అయింది.

సన్‌రైజ్ ఎపార్ట్‌మెంట్స్ ఎదురుగ్గా కార్లో రజని ప్రక్కనే కూర్చుని ఉన్న శివాజీ అకస్మాత్తుగా ఎదురుగ్గా ఎపార్ట్‌మెంట్స్‌లోనూ, పేవ్‌మెంట్ పక్కనున్న షాపుల్లోనూ ఉన్న లైట్లు రోడ్డు ప్రక్కనే ఉన్న వీధి దీపాలు ఆరి పోవడం గమనించాడు.

మరుక్షణం పైకి ఉబికి వచ్చిన కోపంతో పళ్ళు పటపట కొరికి కారు స్టీరింగ్ మీద పిడికిలితో బలంగా ఒక గుద్దు గుద్దాడు.

"ఏంటి ఇపుడు ఏమయ్యింది?" రజని అడిగింది.

"కరెంటు పోయింది" శివాజీ అసహనంగా అన్నాడు.

'జీనత్' సెంటు



సెంట్లు మొదలైన పెర్‌ఫ్యూములను అమ్మేందుకు సెక్స్ సింబల్‌గా జీవితాన్ని ప్రారంభించిన జీనత్ అమన్ హాలీవుడ్ తారల స్థాయికి ఎదిగిపోయిన విషయం తెలిసిందే. ఫ్రెంచి కంపెనీ ఒకటి తన పెర్‌ఫ్యూమ్ ఒకదానికి జీనత్ అనే పేరు పెట్టిందట. అది యూరప్, అమెరికా దేశాల్లో విస్తృతంగా అమ్ముడుపోయింది. ఈ విధంగా జీనత్ ప్రపంచ వ్యాప్తంగా పేరు సంపాదించింది. ఇప్పుడు నెంబర్ వన్ స్థానంలో వున్న శ్రీదేవి, రేఖల కంటే జీనత్‌కు పేరున్నట్లు ఫ్రెంచి నిర్వహించిన పరిశోధనలో వెల్లడయింది. మరి జీనత్ అంటే మాటలనుకున్నారా?

"అయితే ఏంటి?"

"కరెంట్ ఉంటేగాని ఫ్యాన్ తిరగదు... ఫ్యాన్ తిరిగితే కాని ఎర్రతేలు చావడు" కసిగా అన్నాడు శివాజీ.

* * * * *

అనేక అంతస్థులున్న అపార్ట్‌మెంట్స్ నిర్వహణకు సాధారణంగా కొంత మంది సెక్యూరిటీ సిబ్బంది, ఎలక్ట్రీషియన్లు, ప్లంబర్లు వంటి వాళ్ళు ఉంటూంటారు. వాళ్ళతో పాటు అత్యవసర పరిస్థితుల్లో జనరేటర్ కూడా ఉంటుంది. పవర్ ఫెయిల్ అయిన వెంటనే జనరేటర్ రూంలో ఉన్న ఎలక్ట్రీషియన్ ఇంజన్ స్టార్ట్ చేశాడు. ధగధగ మనే శబ్దంతో స్టార్ట్ అయింది జనరేటర్.

సరిగ్గా ఆ సమయంలో ఎర్రతేలు తలుపు తెరుచుకుని లోపలకు ప్రవేశించాడు.

శివాజీ ఊహించిన విధంగానే అతడు మొదట తలుపు ప్రక్కనే ఉన్న స్విచ్‌లు అన్నీ నొక్కాడు. కాని అంతకు ముందే శివాజీ కనెక్షన్ తీసేసి ఉండడం వల్ల లైట్లు వెలగ లేదు. కరెంటు పోవడంతో స్విచ్‌లో కనెక్షన్ ఉన్నా కూడా ఫ్యాను తిరగ లేదు.

లైట్లు వెలగక పోవడంతో ఎర్రతేలు జేబు నుండి పెన్‌టార్చి ఒకటి పైకి తీసి వెలిగించాడు.

దానివెలుగులో అతడికి గది మధ్యగా టేబుల్, ఆ టేబుల్ మీద నల్లటి సూట్‌కేస్ కనపడ్డాయి.

వెంటనే ఎర్రతేలు ముందుకు అడుగు వేశాడు. జనరేటర్ స్టార్ట్ అయిన రెండు క్షణాలకు ఫ్యాన్‌లో కదలిక వచ్చింది. ఎర్రతేలు దగ్గరికి చేరుకుని సూట్‌కేస్ అందుకున్నాడు.

సరిగ్గా ఆ సమయంలో.

వేగంగా ప్రయాణించిన ఫ్యాన్ రెక్క గది పై కప్పు కొక్కానికి వేలాడుతున్న దారానికి తగిలింది.

సన్నగా ఉన్న ఆ దారం తెగిపోయింది.

అంతే–

దాని చివర్న వేలాడుతున్న యాసిడ్ బల్బ్ నేరుగావచ్చి ఎర్రతేలు తలమీద పడి బ్రద్దలయ్యింది.

కాన్సన్ ట్రేటెడ్ సల్ఫ్యూరిక్ యాసిడ్ పొగలు కక్కుతూ ఎర్రతేలు నెత్తి మీద నుంచి ముఖం మీదకు, అక్కడ్నుంచి వీపుమీదకు జారింది.

ఎర్రతేలు భయంకరంగా అరిచాడు.

అతడు వేసిన చావుకేక సన్‌రైజ్ ఎపార్ట్‌మెంట్స్ ముందున్న రోడ్డుకు అవతలిప్రక్క వ్యాన్‌గార్డ్‌లో కూర్చుని ఉన్న రజని, శివాజీలకు వినపడింది.

శివాజీ పెదాలమీద చిన్న హాసరేఖ ప్రత్యక్షం అయ్యింది.

హిట్ లిస్ట్

సల్ఫ్యూరిక్ యాసిడ్ కళ్ళలోకి జారడంతో ఎర్రతేలు కనుగుడ్లు నల్లగా మాడిపోయాయి. క్షణాల్లో కళ్ళు ఉండాల్సిన ప్రదేశంలో రెండు రంధ్రాలు ఏర్పడ్డాయి.

ఎర్రతేలు గుండెలు పగిలేలా అరుస్తూ తన చేతిలోని సూట్‌కేస్ జారవిడిచి ముఖాన్ని చేతుల్లోకి కప్పుకుంటూ ముందుకు పరుగుతీశాడు.

ఎదురుగా ఉంది అతిపెద్ద అద్దాల కిటికీ– వేగంగా వచ్చిన ఎర్రతేలు శరీరం కిటికీ అద్దానికి తగిలింది.

అద్దం భళ్ళున ముక్కలయ్యింది.

పగిలిన అద్దం పెంకులు గీరుకున్న ఎర్రతేలు శరీరం నుండి రక్తం ధారగా కారసాగింది. ఒక అద్దంపెంకు ఎర్రతేలు గొంతులో దిగబడింది.

ఎర్రతేలు శరీరం ఏడో అంతస్తు కిటికీగుండా కిందికి జారి భూమికి గుద్దుకుంది.

అతడి కపాలం రెండు ముక్కలయ్యింది.

ఎర్రటి రక్తం మడుగు కట్టసాగింది.

ఎర్రతేలు కిందపడిన మరుక్షణం సన్‌రైజ్ ఎపార్ట్‌మెంట్స్‌లో పెద్ద కలకలం బయల్దేరింది.

సెక్యూరిటీ మనుషులూ, కేబుల్ టి.వి.లో 'డాన్' సినిమా చూస్తున్న జనం కంగారుగా బయటకు పరిగెత్తుకుంటూ వచ్చారు.

క్షణాల్లో ఎర్రతేలు శవం చుట్టూ జనం గుమిగూడారు.

శివాజీ డ్రైవింగ్‌సీట్ నుండి క్రిందికి దిగాడు.

“నేను కూడా వస్తా” రజని అడిగింది.

“వద్దు అక్కడి దృశ్యం చూసి తట్టుకోలేవు” అని చెప్పి ఆమె సమాధానం కోసం ఎదురు చూడకుండా సన్‌రైజ్ ఎపార్ట్‌మెంట్స్ వైపు నడిచాడు.

గుంపుగా నిలబడిన జనంలో కలిసిపోయి ఎర్రతేలు శవం వైపు చూశాడు.

ఒక్కసారిగా అతడికి కడుపులో దేవినట్టయ్యింది. ఎర్రతేలు అంత భయంకరంగా చనిపోతాడనేది శివాజీ ఊహించని విషయం.

శివాజీ తిరిగి రజని దగ్గరికి వచ్చిన తర్వాత జేబు నుండి ఒక స్లిప్ బయటకు తీశాడు. దాని మీద కాశీప్రసాద్, కురియన్, ఎర్రతేలు, నల్లముత్తుల పేర్లు వ్రాసి ఉన్నాయి. కురియన్ పేరు ఎర్రరంగు స్కెచ్ పెన్‌తో కొట్టేసి ఉంది. ఇపుడు శివాజీ అదే స్కెచ్ పెన్‌తో ఎర్రతేలు పేరు కూడా కొట్టేశాడు. ఇక మిగిలింది నల్లముత్తు.

“నల్లముత్తు విషయం కూడా ఈ నైట్ తేల్చేయాలి. కారు చిలకలగూడా బస్టాప్ వైపు పోనీ” అన్నాడు.

రజని తల ఊపి ఇంజన్ ఆన్ చేసింది.

వ్యాన్‌గార్డ్ మెల్లిగా కదిలి వేగం పుంజుకుని చిలకలగూడా బస్టాప్ వైపు దూసుకు పోయింది.

* * * * *

కురియన్ పెద్ద తిరుగుబోతు ఎర్రతేలు తాగుబోతు, నల్లముత్తుకు ఈ రెండు అలవాట్లూ లేవు. కాకపోతే అతడికి గుర్రపు పందేలూ, బ్రాకెట్లూ మూడు ముక్కలాట మొదలయినవి రోజుల తరబడి ఆడడం అలవాటు.

అతడికి కనక ఒక గుర్రాన్ని చూపిస్తే -

ఆ గుర్రం బరువెంత? అది ఎన్ని రేసుల్లో పాల్గొన్నది? ఎన్ని జాక్‌పాట్లు కొట్టింది? ఎన్నిసార్లు ఓడిపోయింది? దాని తండ్రి ఎవరు? ఆ తండ్రి తండ్రి ఎవరు? ఇలా ఒక గుర్రానికి సంబంధించిన వంశ చరిత్ర గురించి గడగడా చెప్పగలడు.

అదే విధంగా బ్రాకెట్లు ఆడేటపుడు ఆర్నెల్ల క్రితం ఏ నెంబరు ఓపెనింగ్ వచ్చిందో! ఏ నెంబరు క్లోజింగ్ వచ్చిందో తకీమనీ చెప్పేస్తాడు.

ఇక మూడు ముక్కలాట ఆడేటప్పుడు రెండే రెండు క్షణాలు ముక్కల వంక చూసి రాణి ఎక్కడుందో, ఆసు ఎక్కడుందో ఊహించి పందెం కాసేస్తాడు.

ఇపుడు నల్లముత్తు పురానాపూల్ ప్రక్కనే కల్లు కాంపౌండుకు అనుకుని వున్న కాలేషా ఎమ్యూజ్‌మెంట్ పార్క్‌లో మూడు ముక్కలాట జోరుగా ఆడుతున్నాడు.

నల్లముత్తుతో పాటు మరో అరడజను మంది మూడు ముక్కలాట కౌంటర్ దగ్గిర గుమికూడి ఉన్నారు.

ముక్కలు తిప్పుతున్న అన్వర్‌బాషా “కాయ్ రాజా కాయ్... కాయ్ రాజా కాయ్” అని అరుస్తున్నాడు. అన్వర్‌బాషా స్వయానా కాలేషాకు చిన్న తమ్ముడవుతాడు.

అన్వర్‌బాషా చేతుల్ని యమ వేగంగా కలుపుతూ మూడు పేక ముక్కల్ని బోర్లా ఉండేలా అమర్చాడు.

అతడి చేతుల్లో అమోఘమైన శక్తి ఉంది. ఎదుటి మనిషి చూస్తూ ఉండగానే ముక్కల్ని మార్చేయగలడు.

నల్లముత్తు ఒక ఇరవై రూపాయల నోటు మధ్య నున్న పేక ముక్క ముందు ఉంచి 'రాణి' అన్నాడు. అతడి ప్రక్క

నున్నవాళ్ళు మిగిలిన ముక్కల మీద డబ్బులు కాశారు.

అన్వర్‌బాషా ముక్కలు తిప్పాడు.

మధ్యలో ఉన్న ముక్క రాణి.

నల్లముత్తుకు తను పందెం కాసిన ఇరవై రూపాయలూ కాక మరో రెండు వందలు గెల్చుకున్నాడు.

అన్వర్‌బాషా చేతులు మరొకసారి వేగంగా కదిలాయి. ఈసారి నల్లముత్తు మధ్యలో ఉన్న ముక్క వదిలి కుడి చేతి వైపు బోర్లాపడి ఉన్న పేక ముక్క ముందు ఒక యాభై రూపాయల నోటు ఉంచి 'మదాం' అన్నాడు.

యాభై రూపాయల నోటు చూడగానే అన్వర్‌బాషా ముఖం పాలిపోయింది. అతడు ముక్కల్ని తిప్పాడు. కుడి వైపున పేక ముక్క మీద ఉన్న మదాం చూడగానే మిగిలిన వాళ్ళు నల్లముత్తు వంక అసూయగా చూశారు.

అన్వర్‌బాషా గల్లా పెట్టె తెరచి అందులోంచి ఐదు వందలు తీసి నల్లముత్తుకు అందించాడు.

నల్లముత్తు గురించి అన్వర్‌బాషాకు బాగా తెలుసు. అతడు ఎమ్యూజ్‌మెంట్ పార్కుకు రోజూ వస్తాడు. కనీసం పదిహేను వందలు సంపాదించందే బయటకు నడవడు. మామూలుగా అయితే మిగిలిన వాళ్ళు రెండు మూడుసార్లు గెలవగానే మరింత విజృంభించి ఆడి ఓడిపోతుంటారు. కాని నల్లముత్తు అలా కాదు. వెయ్యి నుంచి పదిహేను వందలు సంపాదించగానే ఆడడం మానేస్తాడు.

మరోసారి కూడా అన్వర్‌బాషా వేగంగా చేతులు ఆడించి ముక్కలు పంచాడు. ఎడం వైపు వున్న ముక్క ముందు యాభై రూపాయల నోటు వుంచి 'క్వీన్' అన్నాడు నల్లముత్తు.

అంతకు ముందు నల్లముత్తు రెండుసార్లు గెలిచాడు. దాంతో ఆటలో పాల్గొన్న మిగిలిన జనం కూడా 'క్వీన్' అంటూ ఎడం పక్క నున్న పేక ముక్క ముందు డబ్బులు పెట్టారు. అన్వర్‌బాషా చూస్తుండగానే అక్కడ నోట్ల కట్ట పెరిగిపోయింది. కుప్పగా పడిన నోట్ల వంక అన్వర్‌బాషా భయంగా చూశాడు. అతడి వెన్నులోంచి చలి ప్రారంభం అయ్యింది. అక్కడ ఉన్నది రాణి ముక్క అని అన్వర్‌బాషాకు తెలుసు.

వాళ్ళందరికీ గెలుపు డబ్బులు పంచాలంటే కనీసం యాభై వేల రూపాయలు కావాలి.

ముక్క తిప్పబోతున్న అన్వర్‌బాషా, తల పైకెత్తి కీచుగా భయంగా అరిచాడు.

"బాప్‌రే.... ఇన్‌స్పెక్టర్ లతీఫ్".

ఇన్‌స్పెక్టర్ లతీఫ్ ప్రతి రోజూ మామూలు కోసం ఎమ్యూజ్‌మెంట్ పార్కుకు వస్తుంటాడు.

అన్వర్‌బాషా అరుపు వినగానే మూడు ముక్కలాట ఆడుతున్న జనం అందరూ తలలు తిప్పారు ఒక్క నల్లముత్తు తప్ప. ఎమ్యూజ్‌మెంట్ పార్కులోకి అడుగు పెట్టిన ఇన్‌స్పెక్టర్ లతీఫ్ నుంచి చూపు మరల్చుకోకుండానే చేతులు వేగంగా కదిల్చాడు అన్వర్‌బాషా. ఆసు స్థానంలో ఉన్న ముక్క పైకి లేపి రాణి స్థానం వైపు జరిపాడు. అదే విధంగా రాణి ముక్క ఆసు స్థానంలోకి తోస్తుండగా నల్లముత్తు అతడి చేతిని గట్టిగా పట్టుకుని అరిచాడు.

'దొంగ బాధకవ్... నా దగ్గర నీ నఖరాలు దొబ్బవ్‌రా బద్మాష్".

ఆ అరుపుతో చుట్టూ మూగిన జనం తలలు తిప్పి చూశారు. వాళ్ళకు పరిస్థితి అర్థం అయింది. అన్వర్‌బాషా ముక్కల్ని తారుమారు చేయబోయాడని గ్రహించారు.

వెంటనే వాళ్ళలో ఒకడు అన్వర్‌బాషా ముఖం మీద బలంగా ఒక్క గుద్దు గుద్దాడు. ఆ దెబ్బకు అతడి ముక్కు అదిరి రక్తం కారసాగింది. అన్వర్‌బాషా తను కూర్చున్న కుర్చీతో సహా వెనక్కు పడిపోయాడు.

దాంతో చుట్టూ మూగి ఉన్న జనం గల్లా పెట్టె దోరక పుచ్చుకున్నారు.

మరు క్షణం అక్కడ భయంకరమైన తొక్కిసలాట ప్రారంభం అయ్యింది. క్యాష్ బాక్స్‌లో పాతికవేల పైకం ఉంది.

మూడు ముక్కలాట కౌంటర్ దగ్గిర మొదలయిన గలాటా దృష్టిలో పడగానే లావుగా పొడుగ్గా వున్న ఒక ఇనపరాడ్ పట్టుకుని దూసుకు వచ్చాడు కాలేషా.

ఆరడుగుల అయిదంగుళాల ఎత్తు, ఎత్తుకు తగ్గ లావుతో మెలితిరిగిన కండరాలతో యమకింకరుడిలా కనబడే



ఆ పేరే యా పేరు

సుప్రసిద్ధ తెలుగు-హిందీ చిత్ర కథానాయకి 'జయప్రద' త్వరలో ఓ సంచలన తెలుగు సినీ పత్రికను ప్రారంభిస్తుందట. ఆ పత్రిక పేరేమిటో తెల్సా?.... "జయప్రద".

హిట్ లిస్ట్

కాలేషా గురించి నల్లముత్తుకు బాగా తెలుసు. వాడి చేతికి దొరికిన మనిషి శరీరంలో కనీసం రెండు మూడు చోట్ల ఎముకలు విరగకుండా తప్పించుకోలేడు.

గొర్రెల మంద మీదికి దూకిన చిరుత పులిలా కాలేషా ఇనుపరాడ్‌తో అడ్డు వచ్చిన వాడినల్లా కసిదీరా బాదసాగాడు.

కొందరి ఎముకలు విరిగాయి. మరి కొందరికి పుచ్చెలెగిరి పోయాయి. ఇంకొందరికి కండలు ఊడిపోయాయి.

అక్కడ హాహాకారాలు ప్రతిధ్వనించాయి.

నల్లముత్తు గుంటనక్కలా అక్కడ్నించి మెల్లిగా జారుకుంటున్నాడు.

జరుగుతున్న సంఘటన ఏమాత్రం పట్టించుకోని ఇన్‌స్పెక్టర్ లతీఫ్ తన మామూలు డబ్బులు లెక్కించుకుని రోడ్డు మీద ఉన్న పోలీస్ జీప్‌లోకి జంప్ చేశాడు. మరుక్షణం జీప్ ముందు కదిలి చీకట్లో మాయం అయ్యింది.

మూడు ముక్కల కౌంటర్ ముందు గొడవ మొదలు కావడంతోనే మిగిలిన కౌంటర్ల ముందున్న జనం వేగంగా రియాక్టయ్యారు. మూకుమ్మడిగా మీద పడి గల్లా పెట్టెల్ని చేజిక్కించుకున్నారు.

అక్కడ కలియుగ కురుక్షేత్ర మహా సంగ్రామం ప్రారంభమయ్యింది. కాలేషా మనుషులకూ కష్టమర్లకూ పెద్ద యుద్ధం జరగసాగింది.

మెల్లిగా జారుకుంటున్న నల్లముత్తును చూస్తూ అరిచాడు అన్వర్‌బాషా. "అదుగో... ఆ నా కొడుకు వల్లే ఇదంతా జరిగింది".

అన్వర్‌బాషా వేలు పెట్టి నల్లముత్తు వైపు చూపించగానే లావుపాటి ఇనుపరాడ్ పట్టుకున్న కాలేషా ముందుకు పరుగుతీశాడు. పరుగు తీస్తూనే ఇనపరాడ్ నల్లముత్తు వైపు గురి చూసి విసిరాడు.

ముంచుకు వచ్చిన ప్రమాదాన్ని పసిగడుతూనే పాదరసంలా ప్రక్కకి తప్పుకున్నాడు నల్లముత్తు.

సరిగ్గా ఆ సమయంలో వ్యాన్‌గార్డ్ ఎమ్యూజ్‌మెంట్ పార్క్ ముందు ఆగింది. శివాజీ కిందికి దిగాడు.

చిలకలగూడా వెళ్ళిన శివాజీకి నల్లముత్తు కనపడలేదు. కాని అక్కడి మనుషులు ఇచ్చిన ఆచూకీతో ఎమ్యూజ్‌మెంట్ పార్క్‌కు చేరుకున్నాడు.

కాలేషా విసిరిన ఇనుపరాడ్ శివాజీ మీదికి దూసుకు వచ్చింది.

తన ముఖాన్ని పచ్చడి చేయబోతున్న ఐరన్ రాడ్‌ను చేజిక్కించుకున్నాడు శివాజీ.

పారిపోతున్న నల్లముత్తు అతడిని అపర భీముడిలా వెంబడిస్తున్న కాలేషా శివాజీ దృష్టిని ఆకర్షించారు. అతడికి పరిస్థితి అర్థం అయింది.

నల్లముత్తును తను మాత్రమే వధించాలి. తన హిట్‌లిస్ట్‌లో మిగిలిన ఇద్దర్లో నల్లముత్తు కూడా ఒకడు. నల్లముత్తు మరొకడి చేతుల్లో చావ కూడదు.

ఈ ఆలోచన రాగానే శివాజీ చాలా ఫైర్స్‌గా రియాక్టయ్యాడు. తన మీదికి దూసుకు వచ్చిన ఇనపరాడ్ అతిలాఘవంగా చేజిక్కించుకున్న తర్వాత-

పాశుపతాస్త్రం చేజిక్కించుకున్న అర్జునుడిలా విజృంభించాడు. నేరుగా వెళ్ళి కాలేషాను ఎటాక్ చేశాడు.

ఇనుప కమ్మీ తగిలిన చోట నెత్తి మీద బొప్పి కట్టడంతో కాలేషా వెనక్కు పడిపోయాడు. తల విదిల్చి చూశాడు.

ఎదురుగ్గా శివాజీ అపరకాల భైరవుడిలా నిలబడి ఉన్నాడు.

"నా అడ్డాలోకి వచ్చి నా మీదే ఎటాక్ చేస్తావురా సువ్వర్ కా బచ్చా" అని అరుస్తూ కాలేషా నేలలో పాతి ఉన్న పొడవాటి వెదురుగడ ఊడ పెరికి శివాజీ వైపు పరుగు తీశాడు.

శివాజీ ఏమాత్రం కంగారు పడలేదు.

తన చేతిలోని ఐరన్‌రాడ్ గురి చూసి విసిరాడు.


వజ్రాయుధంలా దూసుకుపోయిన ఐరన్‌రాడ్ కాలేషా కుడి మోకాలి చిప్పకు తగిలింది.

ప్రాణం పోయినంత బాధ. మోకాలి చిప్ప తొలిగిపోయిన కాలేషా వెల్లకిలా విరుచుకుపడి పోయాడు.

అప్పటికే శివాజీని చూడనే చూశాడు నల్లముత్తు. శివాజీ వచ్చింది తన కోసమేనని కూడా గ్రహించాడు.

ఆ తర్వాత అతడు ఒక్కక్షణం కూడా ఆలోచించలేదు. రోడ్డు మీద ఆపి ఉన్న ఎల్జీస్ జీప్ వైపు దూసుకుపోయాడు.

(ఇంకా వుంది)





"హృదయాంజలి"లో సంజయ్ మిత్ర, గిరిజ

బాబూరావు సమర్పించే ఈ తరం ఫిలిమ్స్ "ఎర్రమందారం" చిత్రంలో రాజేంద్రప్రసాద్, యమున, దేవరాజ్, నర్రా, పి. ఎల్. నారాయణ, సంజీవి, ఎం. బి. కోటేశ్వరరావు, ముక్కు రాజు, ఏచూరి, నవ నటుడు నూతలపాటి పాల్గొంటున్నారు. ఎం. వి. ఎస్. హరనాథరావు కథ, మాటలు రాశారు. సీతా రామశాస్త్రి, జాలాది, అదృష్టదీపక్ గీతాలకు చక్రవర్తి స్వరపరిచారు. ఆర్. రామారావు ఛాయ, సోమనాథ్ శిల్పం, శివప్రసాద్- భీమినేని శ్రీనివాసరావు సంయుక్త దర్శకత్వం, బెజవాడ కోటేశ్వర రావు- సి. హెచ్. కోటేశ్వరరావు ప్రొడక్షన్, గౌతంరాజు కూర్పుతో ఈ చిత్రాన్ని నిర్మించే పోకూరి వెంకటేశ్వరరావు "ఆగస్ట్ 15 నుంచి ఒంగోలు పరిసరాలలో ఒకే షెడ్యూల్లో షూటింగ్ పూర్తవుతుంది". అన్నారు.

దర్శకుడుగా జార్జి ప్రసాద్

"ఆగస్ట్ 1 నుంచి విజయవాడ, హైదరాబాదు లలో షూటింగ్, కులభేదాలు విడనాడాలని ప్రబోధించే ఇతివృత్తం. ఈ చిత్రంలో కళా ప్రపూర్ణ దాసరి నారాయణరావు, అల్లు రామ లింగయ్య ఎం. బాలయ్య ప్రభృతులు గౌరవ పాత్రలో దర్శనమిస్తారు", అన్నారు గత 20 ఏళ్ళుగా ప్రొడక్షన్ విభాగంలో వివిధ హోదాలు నిర్వహించిన జార్జి ప్రసాద్. ఈయన కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వంలో ఎస్ ఉస్సేన్ నిర్మించే శ్రామిక చిత్ర "కులమా- గుణమా?" చిత్రంలో రవివర్మ, బబిత, భీమేశ్వరరావు, బాబూమోహన్, సరస్వతి, అనంత్, కల్పనారాయ్, గాదిరాజు సుబ్బారావు, జేబీ కరుణ నటవర్గం. మోహన్‌దాస్ మాటలు, సిరివెన్నెల సీతారామ శాస్త్రి పాటలు, కె. వి. మహదేవన్ సంగీతం, వీర్రాజు ఛాయ, తార నృత్యాలు, జూడో రత్నం సాహసాలు, కపిలవాయి రామమోహనరావు ప్రొడక్షన్, మోహన్‌రాజు కూర్పు తెర వెనుక హంగులు.

-జి. వి. జి

అవీ-ఇవీ-అన్నీ



హైదరాబాద్‌లోని వనస్థలిపురం మమత మల్టీపర్పస్ హెల్త్ వర్కర్ల శిక్షణా సంస్థవారు వారి కేపింగ్ సెర్మని సందర్భంగా నర్సులపై సిస్టర్- సిస్టర్ నవల వ్రాసినందుకుగాను ప్రముఖ రచయిత్రి మన్నెం శారదను ప్రముఖ దర్శకనటి శ్రీమతి విజయనిర్మల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించిన దృశ్యం.



ఇటీవల కాకినాడలో అభ్యుదయ ఆర్ట్స్ ఆధ్వర్యంలో జరిగిన నృత్యోత్సవంలో నాట్యాన్ని ప్రదర్శించిన కుమారి నంబూరి కిరణ్మయిని సత్కరిస్తున్న ఆచార్యపాత్రుడు. చిత్రంలో అభ్యుదయ ఆర్ట్స్ కార్యదర్శి శ్రీ రఘురామనాయుడుని కూడా చూడవచ్చు.




తిరువనంతపురంలో యిటీవల శ్రీ రమణ మహర్షి కేంద్రం ప్రారంభోత్సవ సందర్భంగా ఏర్పాటైన సభలో ప్రసంగిస్తున్న కేంద్ర కార్యదర్శి శ్రీ కస్తూరి భాస్కరరావు. కేంద్రానికి ప్రారంభోత్సవం చేసిన శ్రీ స్వామి శక్రానందను, శ్రీ నోరి శ్రీనాథ సోమయాజులును కూడా చిత్రంలో చూడవచ్చు.




ఇటీవల హైదరాబాద్‌లోని హరిహర కళాభవన్‌లో జరిగిన అత్యుత్తమ రొటేరియన్ అవార్డుల ఉత్సవంలో శ్రీ డి. మురళీకృష్ణ ఐ. ఎ. ఎస్., ప్రముఖ చలన చిత్ర నటి కుమారి శ్రీదేవి నుంచి అవార్డు అందుకుంటున్న దృశ్యం. హైదరాబాద్ రోటరీ క్లబ్ అధ్యక్షుడు శ్రీ జి. ఎ. ఎస్. గిరిని కూడా ఈ చిత్రంలో చూడవచ్చు.

త్రివేంద్రంలోని హిందూస్థాన్ లేటెక్స్ లిమిటెడ్‌వారు మొట్టమొదటిని దేశంలో క్రొత్త రకం గర్భనిరోధక తొడుగులను మార్కెట్లోకి విడుదల



చేశారు. 'న్యూషేర్', 'రక్షక్' అనే పేరుతో ప్రవేశపెట్టబడిన ఈ తొడుగులు ఎయిడ్స్ వంటి వ్యాధులు సోకకుండా రక్షణ కల్పిస్తాయి. వీటిని ప్రస్తుతం అమెరికా, యూరప్ దేశాలలో ఉపయోగిస్తున్నారు. 'న్యూషేర్' ప్యాకెట్ ధర 4 రూపాయలు కాగా, 'రక్షక్' 3 రూపాయలకే అందుబాటులో వుంటుంది.



నీలాల ఆనింగ
నిను నన్ను సూత్తాంది
సుక్కల్లు కళ్లిప్పి
ఎక్కిరిత్తున్నాయి -
నాగార్జున సిమ్మెంటెట్టి
ఇల్లొకటి కట్టి
నీముద్దు ముచ్చట్లు
నాటులో సాగించు
NCL Industries Limited
Raghava Ratna Towers, Hyderabad 500 001, Phones : 230637, 237480
Grams : ENCIELIND Telex : 0425-6887 NCLH IN, Fax : 0091 (842) 236498